C

యుగపీక్ష

STUDENTS LITERARY ASSOCIATION, LIBRARY
H6
262
ఓం
STUDENTS LITERARY ASSOCIATION, LIBRARY
H6

రచయిత

'ఆశ్వవిద్యాలంకార'

కల్లూరి చంద్రమౌళి

యుగసవిూక్ష



రచయిత

ఆర్ష విద్యాలంకార

కల్లూరి చంద్రమౌళి

సౌమ్య ౧౯౭౦ సంక్రాంతి

స్వామ్యములు రచయితవి

ప్రతులు ౧౦౦౦


వెల 10-00

ముద్రణము


భారతీప్రెస్, తెనాలి.



వైదిక భక్తిపరులు-ధార్మిక జీవనుల్
పరమవైష్ణవుల్ ప్రపత్తియుతులు
విమలత్వ్వరతులు వెంకమాంబానుద
ర్శనులు-ఘనులు-నిత్యసత్యధనులు



స్తుతసౌశీల్యకళా విభూషితులు సంశుద్ధాంతరంగుల్ దయా
వ్రతపారీణులు దైవభక్తులు గుణావాలంబు నాఁజాలు సం
తతితోగుల్కైడి తల్లిదండ్రులగు సీతారామచెంచయ్య దం
పతులన్యోన్య మహానురాగభరితుల్ బంధుప్రియుల్ పావనుల్



సరస వచన సరణి సాగించు సుజనుండు
కపట మెఱుగనట్టి కార్యశూరు
డాప్తు డీ కొండాలి అప్పయ్యచౌదరి
మదికి నచ్చినట్టి మంచిహితుడు

సందేశహరి

పండిత శ్రీమాన్ బృందావనం రంగాచార్యులు

అర్షసంస్కృతికి విహార రంగస్థల
మ్మగు నేలపై పొగలెగసినపుడు
ధర్మచ్యుతి పిశాచతత్త్వ ప్రకోపమ్ము
జనగణమ్ములతోడ పెనగునాడు
శీల సంపదకు విశాలభావనకు మ
న్ననలన్ని క్రుంగికూలిన ఋణాన
ప్రతి యుగమ్మున మహోన్నతి నడ్డుకొను స్వార్థ
విలయశక్తులు తాండవించువేళ

పలుకు పలుకున ఋషిచంద్రు లొలికినట్టి
తత్త్వసుధ మానవాళికి తారకముగ
ప్రగతి కారకముగ నిల్చెయుగసమీక్ష
వెల్లివిరియించు సందేశ విభవమిదియె

8

నవనము

తెనుఁగులెంక - కళాప్రపూర్ణ

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

భారతీయధర్మ పరిణామసూచి నాఁ
దగిన రమ్యరచన యుగసమీక్షు;
యెంతనేర్చి డస్సి యిది వ్రాసెనో! శ్రుతుల్
శాస్త్రములు మథించి చంద్రమౌళి.

పదపదమునఁ దాత్త్విక సం
పదయును లోకజ్ఞతయును బండిన ధన్యుం
డిది పల్కె ననుచుఁ దోఁచును
జదువరికిన్ సంప్రదాయ సంవిన్నిధికిన్.

ముసుఁగు తొలఁచి తొలఁచి మూఢవిశ్వాసాల.
కట్టుకథల బ్రదుకు కడిగి కడిగి
మాననీయమైన మానవధర్మమ్ము
చాటె నితఁడు రాచబాట వైచి.

మంత్రితాభరమ్ము మస్తమునం దున్న
నాఁడు లేదినాఁడు వాడులేని
సాహితిని సృజింపఁ జాలితి! కల్లూరి
చంద్రమౌళి! సవ్యసాచి వీవు.

భక్తికంటెను సాహితీరక్తి యలఁతి
పడదు నరు ధన్యఁ గావించుపట్టునందు;
భక్తియు నుదాత్తసాహితీ ప్రవణతయును
గంటి వీవు పున్నెములపనంటి వీవు.

౫

"సంభవామి యుగే యుగే"

కరుణశ్రీ

జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు, గుంటూరు

పండించినది సుధీభావాల, సిరులు రం
గారు ముంగారు బంగారుపంట
ఖండించినది సత్య కౌశేయకము దాల్చి
దంభ వాగ్గుంభ విజృంభణముల
నిండించినది తత్త్వనిష్ఠాపరత్వంబు
ధర్మవిత్తముల చిత్తముల యందు
దండించినది ధూర్త పాండితీ మండిత
చండ చార్వాక వైతండికులను
సమధిక వివేకయుత సదసత్పరీక్ష
సారసముదార సంఘ సంస్కారదీక్ష
మీ "యుగసమీక్ష" మానవధ్యేయమైన
ప్రేమ సామ్రాజ్యమునకు "శ్రీరామరక్ష"
జగతి నంతట నహింసాజ్యోతి వెల్గించు
బుద్ధదేవుని మనశ్శుద్ధి నెన్ని
ప్రాచీన భారత ప్రాభవంబులు చాటు
కాళిదాసుని కళా గరిమ పొగడి
చంద్రగుప్తుని ధర్మసమ్రాట్టుగా దిద్దు
చాణక్య ధీశక్తి సంస్మరించి
ఆంగ్లరాజులకు సింహస్వప్నమైన ఝూ
న్సీ లక్ష్మీ విక్రమ శ్రీస్తుతించి

నట్టనడివీథిలో జుట్టు జుట్టు పట్టి
కొట్టుకొను నాయకుల గుట్టు మట్టులరసి
సాగినది చేత విజయధ్వజంబు నూని
యుగయుగ నిరీక్షు భవదీయ "యుగసమీక్షు"

ఆర్జించినాఁడు గ్రంథార్థముల్ ధర్మ్మవి
త్తమ్మలైన పండితో త్తములచెంత
ప్రవచించినాఁడు సభాసదుల్ పులకింప
ఆమ్నాయధర్మ్మ రహస్యములను
అమరించినాఁడు ధర్మ్మదాయ మంత్రియై
ఆలయమ్ముల త్రికాలార్చనములు
అందించినాఁడు రామాయణ క్షీరాబ్ధి
విహరించి 'రససుధాలహరి' నొకటి
పండువెన్నెల నిండిన గుండె వాఁడు
అమృతమే కాని మచ్చలేనట్టివాఁడు
అతఁడు కల్లూరివంశ పయఃపయోధి
చంద్రుఁడు సుధీంద్ర మౌళి మా చంద్రమౌళి.

ఆయన ధర్మ్మమూర్తి, హృదయజ్ఞుడు, ప్రాజ్ఞుఁడు, బీదసాదకున్ "నాయన"వంటివాఁడు, కరుణామయచిత్తుఁడు, దుదాత్తసాహిత్యస్థాయి, సదాపొగల్ సెగలు చల్లని చల్లని "చంద్ర మౌళి", రామాయణ తత్వవేత్త, పరమార్థవిదుండు, ప్రియంవదుండునున్

"సంస్కృతం బన్న "భారతసంస్కృతి" యన
ప్రాణముగ నెంచు ఆర్షమతానుయాయి
"మంత్రి"యయ్యును ధర్మ్మంబు మఱచిపోని
సరస సౌజన్యశీలి శ్రీ చంద్రమౌళి.

నేతయై జాతీయ కేతనచ్ఛాయల
స్వాతంత్ర్య వీర విఖ్యాతి నంది
మంత్రియై సర్వస్వతంత్ర ప్రజారాజ్య
యంత్రమంత్రాంగాల తంత్ర మెరిగి
వక్తయై ధర్మానురక్త ప్రాక్తన బుుషి
ప్రోక్త సూక్తులకు నిరుక్తి పలికి
మేత్తయై వైదికోదాత్త సంపత్తికి
క్రొత్తగా నేతాను లెత్తియెత్తి
ఉత్తమ విమర్శకుండునై "యుగసమీక్ష"
"భారతీయప్రతిభ" గూర్చు భాగ్యశాలి
అరసి "రామాయణసుధాలహరి" వరించు
సరసవాక్కుల్ కల్గూరి చంద్రమౌళి !
ఆదిలో వేదనినాదాల నడుమ "బ్ర
హ్మావర్త" మనగ ప్రఖ్యాతి వడసి
ఆమోద నుపనిషత్సామాణ్యగరిమ" ఆ
ర్యావర్త" మంచు గౌరవము గాంచి
తర్వాత నితిహాస ధర్మానురక్తి "భా
రతఖండ" మనెడు కీరితి గడించి
పదపడి విమత దుర్మద పదస్పర్శ" హిం
దూదేశ" మనగ మర్యాద నంది
నోరుతిరుగని ఇంగ్లీషువారివలన
"ఇండియా" యంచు నేటికీ మొండి రూపు
దాల్చె మన పుణ్యధాత్రి సుందరసవిత్రి
ఏమి కానున్నదోకదా యింకమీద !!

తొలగు గావుత దూరదూరంబులకు త్రాగి
యూగులాడెడి పిశాచీగణంబు
వెలుగు గావుత విశ్వవిజ్ఞానదీపాలు
కటికి చీకటులు దిక్కటుల కొదుగ
చెలగు గావుత జయశ్రీ కటాక్షద్యుతుల్
స్వాతంత్ర్యవీరుల స్వాంతమందు
కలుగు గావుత "నిత్యకల్యాణములు పచ్చ
తోరణంబులు" నవ్యభారతమున

శ్రీలు చిందునట్టి పాలసంద్రమ్మైన
చంద్రమౌళి కీర్తిచంద్రికలకు
కేంద్రమగుత దేశికేంద్రుల కరుణచే
"యుగసమీక్ష" ధర్మ్మయుగసమీక్ష.

*　　*　　*　　*

దర్శనాచార్య

కొండూరు వీరరాఘవాచార్యులు, తెనాలి.

ఆత్మ సంస్కారముల కనువైన యట్లు
కాలగతి సమీక్షించిన కర్మయోగి!
మీ "యుగ సమీక్ష" విజ్ఞుల మెప్పులంది
వెలయు నా చంద్రసూర్య మీ తెలుఁగు జగతి.
కమ్మనైన బాస, కబ్బమల్లెడి నేర్పు,
చదువువానిలాగు చాతురియును,
న్యాయమీ విమర్శ–పాయని సొమ్ములు
చంద్రమౌళి ! మీ లసత్కృతికిని.

శ్రీ ముఖము

శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీ కేశవతీర్థస్వామివారు
శ్రీరామతీర్థ సేవాశ్రమాధిపతులు, 'రామదర్శన' సంపాదకులు

అనిర్వచనీయమైన పరమేశ్వరలీలావిలాసమునందు కాలచక్రపరిభ్రమణ మొకమహాద్భుతవిషయం. సృష్టియందు షడ్రుతువులవలె చతుర్యుగములుకూడ నిరంతరావృత్తము లవుచున్నవి. ఒక్కొక్కఋతువు ఒక్కొక్కవిలక్షణగుణమును ప్రకటించినట్లు, ఒక్కొక్కయుగం ఒక్కొక్కవిలక్షణగుణ మును ప్రకటిస్తుంటుంది. ఆయాఋతుప్రకృతులను గ్రహించి వానివానికితగినసాధనసంపత్తితో వాని నతిక్రమించి, ఆయా ఋతువులందు మానవుడు సుఖిస్తాడు. అదేరీతి, ఆయాయుగ ప్రభావములను గుర్తించి, సముచితసాధనసంపత్తితో, వాని నతిక్రమించి, ఆయాయుగములందు మానవుడు పరమసుఖాన్ని పొందగలడు.

సముద్రోపరిభాగతరంగసంకులముల నతిక్రమించి, సము ద్రగర్భమున జొరగలవానికే తదంతర్గతరత్నరాశి లభ్యమై నట్లు, బాహిరప్రకృతిసంరంభముల నతిక్రమించి ఆంతరప్రకృతి ప్రవేశము చేయగలవానికే నిత్యసుఖశ్రీ పరిలభ్య మవుతుంది. ప్రకృతిమాతహృదయమందిరంలో ప్రవేశింపగల ప్రజ్ఞానమతికే పరమాత్మసందర్శనభాగ్యం సంప్రాప్తిస్తుంది.

పరాపర ద్రష్టలైన సనాతనభారతమహర్షులు బాహ్య ప్రకృతి నతిక్రమించి,గుహ్య ప్రకృతి కధిగమించి,సచ్చిదానంద రూప మైనస్వస్వరూప బ్రహ్మజ్యోతిని పొందగలసమయోచిత సదుపాయము లెన్నెన్నో ఉపదేశించారు. ఒక్కొక్కబుతువులో ఒక్కొక్కవిధానంలో వర్తించినప్పుడు మనం జీవించగలం. అదేరీతి, ఒక్కొక్కయుగంలో ఒక్కొక్కప్రధానసాధనద్వారా మనం తరించగలం. సమయము ననుసరించి, సాధనల్లో భేదమున్నా, లక్ష్యమొక్కటే! దివ్యశాంతిరూపమైన-పరమసుఖస్వరూపమైన- లక్ష్యమొక్కటే!

పారదర్శనులైన, మనప్రపితామహులైన వేదర్షులు-యుగచతుష్టయ ప్రకృతి ననుసరించి సాధనచతుష్టయమును చూపించారు. కృతయుగమున -ధ్యానం, త్రేతాయుగమున - యజ్ఞం, ద్వాపరయుగమున - పూజ, కలియుగమున - నామ స్మరణ, - మానవసంతరణ ముఖ్య సాధనలుగా నిర్దేశించారు.

కృతయుగమును - చీకటి కనబడని పౌర్ణమినాటి పండు వెన్నెల రాత్రితో మనం పోల్చవచ్చు. త్రేతాయుగమును - పౌర్ణమి వెళ్లినపిదప మామూలు వెన్నెలరాత్రితో మనం పోల్చవచ్చు. ద్వాపరయుగమును గ్రుడ్డివెన్నెలరాత్రితో మనం పోల్చవచ్చు. కలియుగమును వెన్నెల కనబడని అంధకారావృతమైన అమావాస్యనాటి రాత్రితో మనం పోల్చవచ్చు. అంటే - కృతయుగవాతావరణం - సంపూర్ణ ధర్మతేజోమయంగా త్రేతాయుగవాతావరణం - ధర్మతేజం కొంతకొరవడినదానిగా, ద్వాపరయుగ వాతావరణం - ధర్మతేజం మరి

కొంత కొరవడినదానిగా, కలియుగ వాతావరణం – ధర్మతేజం పూర్తిగా కొరవడినదిగా ఉంటుం దని అర్థం. అయితే ఇక్కడ గమనీయ మైన విశేష మొకటున్నది: ప్రతి యుగంలోనూ, మిగతా మూడుయుగముల ఛాయలు గర్భితములై యుంటవి. పౌర్ణమిరాత్రి పండువెన్నెలలో అసలు చీకటే లే దని చెప్పలేము. చెట్లక్రింద క్రీనీడలు, మారుమూలల దట్టమైన నీడలు, గుహాగర్భాలలో కటికిచీకటి, – ఫున్నమనాటి పండువెన్నెలలో గూడా యున్నట్లు, – సంపూర్ణ ధర్మతేజోమయ మైన కృత యుగమందుసైతం, త్రేతాయుగ ద్వాపరయుగ కలియుగ స్వభావచ్ఛాయలు, అటనట దాగియుండడం మనం చూడ గలం. ఇట్లు కృతయుగమందుసైతం అధార్మిక ఛ్ఛాయాలేశం మనకు కనబడినా, దానికి ఏమాత్రం బలం లేదుగనుక, అది లేనట్లే. అందుకే కృతయుగం సత్యయుగంగా అభిరూపితం. మరి, అంధకార బంధుర మైన అమావాస్య రాత్రియందు కూడా తారల మిలమిలలు, దీపికల కళకళలు, ఉన్నట్లు – అధార్మిక తమఃప్రపూర్ణ మైనకలియుగంలోసైతం, కృతయు గాది ధార్మికయుగముల తేజోరేఖ లున్నట్లు మనం కనుగొన గలం. ఇట్లు ఈ ఘోరకలిలోసైతం వెలుగురేకలు కొంచెం కనబడినా, వానికి బలం తక్కువకనుక, మొత్తంమీద వెలుగు లేనట్లే. అందుకే కలియుగం కల్మషయుగంగా అభివర్ణితం.

వెలుగులోనూ చీకటిలోనూ, మనమనుగడకు, వెలుగే అవసరం గనుక సత్యద్రష్టలైన మన ప్రాచీన ఋషి శ్రేష్ఠులు, యుగయుగమందు – నిత్యసత్యమైన–జగదధిష్ఠాన భూతమైన–

ఆ పరంజ్యోతినే సమాశ్రయించి సుఖించవలసినదిగా జీవకోటి నాహ్వానిస్తున్నారు. అంధకారావృతమైన అమావాస్యనాటి రాత్రిని ఉజ్జ్వల దీపికా సహాయంతో శోభామయం చేసినట్లు, కలుషతమఃప్రకీర్ణ మైన కలియుగాన్నికూడా, ఋషిప్రోక్త సముచిత సాధనోపాయములద్వారా దివ్యతేజో మయంగా చేసి, జీవన్ముక్తి సుఖాన్ని అనుభవించగలం. ఇట్లు యుగ ప్రకృతి ననుసరించి, ఏతదనుగుణ సాధసనంపత్తితో వాతా వరణమును ప్రపూతం చేసికొని జీవించగలకౌశలమే – సజీవ జీవితం – జీవనకళ – జీవనయోగం!

భగవన్మయ మైన ప్రపంచమందు "ఆర్షేయ" మని విఖ్యాతిగన్న ఆసియాఖండమునకు – భారతవర్షము హృదయ మైయున్నది. భారతదేశ మనగా అర్థం – భగవద్రతి గలదేశ మని. భారతజీవనవ్యూహ సర్వస్వకేంద్రం మూలకారణ మైన పరమాత్మతో సంయోగమే! చరిత్రలదృష్టి చొఒజాలని అజ్ఞాత కాలములందుకూడా, సత్యాన్వేషణలో తొలివిజయ మును సాధించిన ధీరాత్మ్మల ఉజ్జ్వలముఖజ్యోతులను ప్రాచీన భారతరంగమున మనం సందర్శించగలం. ధర్మమోక్షముల హద్దులలో అర్థకామములను నియమించడమే – భారతీయ జీవనకళ. భారతజీవ సౌధమునకు పునాది–ధర్మము. శిఖరము విముక్తి. తూర్పుదిశనుండి తేజోరేఖలవలె, భారతభూమినుండి బ్రహ్మానందతేజః పుంజములుఅనాదిసిద్ధంగా జగత్తైకి ప్రసార మవుతున్నవి. అందుకే వేదభూమి యైన మహాభారతం జగద్గురుపీఠమై అలరారుచున్నది. సర్వావసరసమయములందు

సర్వేశ్వరుని సనాతన ధర్మసందేశం ఇటనుండి విశ్వమానవ కోటికి వినబడుతుంటుంది. ఈవిశ్వధర్మవేదికపైనిలిచి, బ్రహ్మ సూత్ర వివరణమొనర్చి వెళ్లుచుండే అగణిత మహాభాష్యకార పరంపరల పాదముద్రలు జగదారాధ్యములైనవి. శతశతాబ్దా గతమానవప్రార్థనలు ఈకర్మభూమియందే సఫలములౌచున్నవి. నైశవాపరిణత హృదయాలు, ఈతపోభూమియందే పరిపక్వము లౌచున్నవి. క్లిష్టాతిక్లిష్ట సమస్య లీజ్ఞానఖండమునందే పరిష్కృతము లౌచున్నవి. ప్రజ్ఞాన నవోషఃకాంతులు ఈస్వర్గ సీమనుండే నలుదిశలకు ప్రసరింపబడుచున్నవి. ధర్మసముద్ధరణార్థము అధర్మ నిగ్రహార్థము జగన్నాథు డీపుణ్యధాత్రిపై ననే తన్ను తాను ప్రకటించుకొంటుంటాడు.

పరివర్తనశీల మైన ఈప్రపంచంలో సంస్కరణావశ్యకత కలిగినప్పుడు, ఒకానొక కఠిన సమస్యాపరిష్కృతికి మానవ హృదయములనుండి ప్రబల ప్రార్థనము సముద్భూత మైనప్పుడు, సర్వవ్యాపక విశ్వశక్తి సాగరము (శ్రీ మహా విష్ణువు) నుండి, మహాపురుష మహాతరంగములు ప్రాదుర్భవించి, జగత్కలుష ప్రక్షాళనజేసి, సమయోచితరీతి లోక సంగ్రహం చేసి, అంతర్ధానమవడం ప్రకృతిసిద్ధవిషయం - ఇట్టి జగదుద్ధారకులైన మహాత్ములకు-అవతారపురుషులకు-బ్రహ్మావర్త మని ఖ్యాతి గన్న భారతవర్షం జన్మభూమి!

కాలపుతెరల పై కెత్తి పరికించినప్పుడు, విశ్వకల్యాణ ఖండ మైన ఆర్యావర్తమున ఈశ్వరసందేశ ప్రవక్త లైన దివ్యమూర్తులు, అన్నిరంగాలలో మనకు సాక్షాత్కరిస్తారు.

దేవర్షులు ! బ్రహ్మర్షులు ! రాజర్షులు ! అందరిలో వెలుగొందు చున్నది ఏకైక బ్రహ్మరసానుభూతియే ! అందరి జీవితాల్లో ప్రదర్శింపబడినది – ఏకైక బ్రహ్మతేజోవిలాసమే !

ఈశ్వరకార్యార్థులై ప్రపంచమున సాక్షాత్కరించిన అవతారమూర్తులను–మహాపురుషులను – రెండు విధములుగా మనం పరిగణించవచ్చు : అంశావతారము లని. పూర్ణావతారము లని. ఒక ప్రత్యేక సంప్రదాయ సముద్ధరణమునకు, ఒకానొక ధర్మశాఖాపరిరక్షణమునకు, ఒకానొక పాక్షిక ప్రయోజనమునకు, ఉదయించిన దివ్యపురుషులే – అంశావతారములు. పరశురామాదులను ఇట్టి అంశావతారమూర్తులుగా గ్రహించవలసియున్నది. విశాల విశ్వోద్ధరణానికి, సంపూర్ణ సనాతన ధర్మోద్ధరణానికి, సమస్త జీవకల్యాణమున కావిర్భవించిన మహాత్ములే సంపూర్ణావతారములు. శ్రీరామ కృష్ణాద్యవతారములను ఇట్టి సంపూర్ణావతారమూర్తులుగా గ్రహించవలసియున్నది. సంపూర్ణావతారమూర్తుల జీవనసందేశములచే ప్రతిజీవికి, ప్రతిమానవునకు, ప్రతిజాతికి, ప్రతిదేశమునకు, ప్రతిమతానికి, ప్రపంచమంతటికీ – పరమప్రయోజనం సిద్ధిస్తుంది. సమస్త విశ్వోద్ధరణం జరుగుతుంది. సకల జగజ్జాగృతి కలుగుతుంది.

ఇట్టి పూర్ణావతారము లనే అంశావతారములనే–నిరంతర నిర్నిద్రోత్తుంగ మహాతరంగో పతరంగములను, మనం సర్వ కాలాలలో సందర్శించగలం. పృథ్వీరంగమున, ఆయాయుగములందు, ఆయావాతావరణములందు, తమతమ విభ్యక్తపాత్రల

సముచితరీతి నిర్వహించిన ఆయాప్రాచీన అధునాతన దివ్య పురుషులయొక్క – అవతారమూర్తులయొక్క సౌశీల్యసందేశ సౌందర్యములను సంస్కృతహృదయులే సందర్శించగలరు. సంకుచిత చారిత్రకదృష్టి కవి అందవు

యుగానుగుణ్య సాధన క్రమంలో – 'కలౌసంకీర్త్య కేశవమ్' – అని – కలిలో భగవన్నామస్మరణమే ప్రముఖ సాధనంగా సనాతన ఋషులు నిర్దేశించా రన్నప్పుడు–కలిలో భగవన్నామసంకీర్తనతప్ప మరొక సాధన పనికిరాదా? – ధ్యానం అవసరం లేదా? – పూజాదులతో పనేలేదా? – సేవాదు లనవసరమా? – అని ఎవరికైనా సంశయం కలుగ వచ్చు. మహర్షుల మహాప్రబోధములను గ్రహించడానికి విశాలబుద్ధి అవసరం. సావధానత అవసరం. కలిలో నామ సంకీర్తన ముఖ్యసాధన మన్నప్పుడు, తదితరసాధనలు వద్దని కాదు. అన్నం తినవలె నన్నప్పుడు, కూరలతో పనిలేదని కాదు. నామసాధనను ప్రధానంగా తీసికొని ఉపసాధనలుగా తదితరసాధనలు తీసికోవలెనని మనం గ్రహించడం సముచితం. యుగధర్మసమన్వయం మన కిప్పు డవసరం.

ఈ సృష్టిచక్రం నిరంతర పునరావృత్తి శీలం. ఇందలి విషయాలు చర్విత చర్వణములే. ఈసృష్టిలోని అణువణువునా ఏకైకసత్యం ఇమిడీకృత మైయున్నది. ఈసృష్టిని ఉల్లిగడ్డగా పోల్చవచ్చు. ఒకపొర తీస్తే అలాంటిపొరే మరొకటి వస్తుంది. ఆ పొర వలుస్తే మరొకపొరవస్తుంది. అన్నీ ఒకేరకమైనపొరలే. సృష్టి గత విషయాలుకూడా యింతే! ఒకచిన్న సంఘటనలో–

యావద్బ్రహ్మాండ చరిత్రను మనం పఠించవచ్చు. ఇదే ఈశ్వర ప్రభావం! భగవల్లీల! షడ్రుతువులను ఒకేదినమందు మనం దర్శించవచ్చు. హిమబిందువులు రాలేరాత్రికాలమున వర్షర్తువును, బ్రహ్మముహూర్త కాలమందు శరద్రుతువును; ఉషఃకాలమున హేమంతఋతువును, ఉదయకాలమున శరద్రుతువును, అపరాహ్ణోత్పూర్వకాలమున వసంతఋతువును, అపరాహ్ణకాలమున గ్రీష్మఋతువును మనం సందర్శించగలం. అట్లే ప్రతియుగమందు, మిగతా యుగములనీడలను మనం చూడగలం. అట్లే ఒక్కదినమందే చతుర్యుగచ్ఛాయలను మనం కనుకొనగలం. మానవుడు తనదైనందిన జీవితంలో అనుదినమూ, అఖిలయుగ ప్రభావములనూ, అనుభవిస్తున్నాడు. ఒక్కదినంలో అన్నిఋతువులూ ఉన్నట్లు, ఒక్కయుగములో అన్నియుగములూ ఉన్నట్లు, మానవజీవనయాత్రలోని ప్రతిదినమున, యుగచతుష్టయానుభూతులు సాగిపోతున్నవి. మనస్సు అంతర్ముఖమై ఆత్మసంస్థితమై, కేవలనివృత్తి దశలో నున్న క్షణములను కృతయుగంగా, మనం ఎంచవలసియున్నది. మనస్సు నివృత్తిగర్భితమైన ప్రవృత్తిలో నున్న సమయమును, త్రేతాయుగంగా మనం ఎంచవలసియున్నది. మనస్సు ప్రవృత్తి నివృత్తులతో కలిసియున్నవేళను, ద్వాపరయుగంగా మనం ఎంచవలసియున్నది. మనస్సు కేవల ప్రవృత్తిలోనున్న కాలమును, కలియుగంగా మనం ఎంచవలసియున్నది.

స్థూలయుగ విధానములోనూ, దైనం దిన జీవితమందలి సూక్ష్మవిధానములలోనూ, యుగలక్షణములన్నీ ఒకటే!

విషయవైకల్యరహితమైన ప్రశాంతసమయం – క్షణ మాత్రమైనా – లభించినది జీవితంలో ఉంటుంది. ఈ మనో నైశ్చల్యసమయ మనే కృతయుగమందు – అనువైన సాధన ధ్యానం. ఈసునిశ్చలమానసికస్థితిలో మనం ధ్యానంచేసికో వడం సముచితం. సత్ఫలప్రదం. లభించినది జీవితంలో దివ్యో త్సాహ సమయ ముంటుంది. ఈ దివ్యోత్సాహ సమయ మనే త్రేతాయుగమందు – అనువైన సాధన–యజ్ఞం. ఈ సము త్సాహామయ మానసికస్థితియందు మనం సత్కర్మానుష్ఠాన రూప మైన యజ్ఞమును సమాచరించడం సముచితం. సత్ఫల ప్రదం. లభించినజీవితంలో సముత్సాహ నిరుత్సాహామిళిత సమయ ముంటుంది. ఈ సముత్సాహనిరుత్సాహ మిళితసమయ మనే ద్వాపరయుగమందు – అనువైన సాధన–భగవత్పూజ. ఈ అర్ధోత్సాహమానసికస్థితియందు, భగవత్పూజార్చనాదు లొనర్చడం – సముచితం. సత్ఫలప్రదం. లభించినది జీవితంలో కేవల విషయ కల్లోల సమయం ఎక్కువగా ఉంటుంది. ఈ విషయ కల్లోల సమయమనే కలియుగమందు – అనువైన సాధన – నామస్మరణ. ఈ మానసికమైన సంపూర్ణవైకల్య స్థితియందు–నామస్మరణ – నామజపం – నామసంకీర్తన సము చితం – సత్ఫలప్రదం.

లభైనం దిన జీవిత మందలి యుగ చతుష్టయమును గుర్తించి – ఆయాయుగోచిత సాధనములను చేస్తే – మనం తరించితీరుతాము. ఇదే యుగదర్శనసారం! ఇది నిజానికి కలియుగం. ఏపని చేస్తున్నా ఎక్కడున్నాసరే – ప్రశ్వా దాములవలె–ఉచ్ఛ్వాసనిశ్వాసలలో భగవన్నామమును మిళితం

చేపికొని మనం కృతార్థులం కావలసియున్నది. మన్వా
దులుమొదలు మహాత్మాగాంధీ ప్రభృతులవరకు గనకాదులు
మొదలు స్వామిరామతీర్థ భగవత్పాదులవరకు భగవన్నామ
స్మరణలోని మహామహిమను ఉద్ఘోషించనివారులేరు. ఆధునిక
ప్రవక్త యైన మహాత్మాగాంధీజీ రామనామ సంకీర్తనతోటే
తన మహోన్నాద్యమ విజయాన్ని సాధించినవిషయం లోక
విదితం! కర్మనిష్ఠ నిలవాలన్నా, భక్తిసిద్ధి కలగాలన్నా, జ్ఞానం
ప్రకాశించాలన్నా - మంత్రనిష్ఠ - నామవ్రతము-కలియుగ
మానవకోటికి అత్యవసరం.

రాజర్షి - శ్రీ కల్లూరి చంద్రమౌళిమహోన్నాదయులు
చేసిన ఈ "యుగసమీక్ష" - ప్రగతికాములైన నవయుగ
మానవులందరు సమీక్షింపదగినసద్గ్రంథరాజం. ఈరమ్యరచన
వారి "ఆర్షవిద్యాలంకార" బిరుదమును సార్థకంచేస్తున్నది. ఈ
సమయోచితసత్కృతి, వారి నిత్యసచివత్వమునునిరూపిస్తున్నది.

పవిత్రభారతవర్ష స్వభావప్రభావములు సనాతనధర్మ
వైభవవిశేషములు, వేదవిజ్ఞాన విశాలతలు, చతుర్యోగ
స్వరూప ప్రతాపములు, ఏతద్యుగపురుష సౌశీల్య సందేశ
సౌందర్యములు, ప్రాచీన నవీన జీవన సమాలోకన సమన్వయ
ములు, మత సాంఘిక రాజకీయ వికాసోచిత ప్రబోధములు-
సురసరిత్సుందర సుమధుర శైలిలో-ఈ విశిష్ట ప్రకృష్టకృతి
యందు మనోజ్ఞంగా ప్రకటింపబడినవి.

ఈ మహాకృతి, భారతజాతిలో - మానవజాతిలో -
జాగృతిని కలిగించి, కలియుగమున కృతయుగమును
సృష్టిస్తుందిగాక! ఓం తత్సత్

పూలదోసిళ్ళు

శ్రీమాన్ పండిత బృందావనం రంగాచార్యులుగారు,
పర్యాచారు.

సిరికి నిలయముగ మాత్రమేకాక – చిరంతనమైన ఆధ్యాత్మిక శక్తిసంపదలకుగూడ – పవిత్రభారత ధరాతలము పురాతనకాలమునుండియు పేరెన్నికగన్న పుణ్యసీమ. జీవితము కొందరికి చిద్విలాసాలు వెల్లివిరియించెడి పూలమాల. మరి కొందరికి సెగలు పొగలెగ జిమ్మెడి భయంకరాగ్నికీల. అది ఉత్తాలతరంగసంక్షుభితసాగరము. మందపవన నంచలిత మధుర మోహన గమనసౌందర్య సంఫుల్లగంగాతీరము. కఠినశిలలకు నిలయము. కమనీయరత్న గణములకాలయము. జీవితమును తీర్చిదిద్దుకొనవలసిశిల్పి, వ్యక్తియే. మానవుని మధురోహా బలమున మనుగడ మంజులమగుట కవకాశముగలదు. నిరంతర సంస్ఫూర్తిలసదనముగ నరుడు దానిని-వివేకశూన్యుడై-మలచు కొనినతఱి; ఫలితము నతడనుభవింపక తప్పదు. వగచిన ప్రయోజనము శూన్యము. పరుల నీ విషయమున నిందించుట పాతకమేకాగలదు. యోగ్యతగల యే ప్రబోధకుని మహోపదేశసుధయో మరలనాతని మనుగడపై చైతన్యసుధను వర్షింప వలయును. నాటివరకంతియే. రెండభిప్రాయములకు తావులేని విషయమిది. పరిమితములగు సరిహద్దులుగల జీవితవిషయమో ఇట్లుండ-అనంతముగ విస్తృతినంది కాలగర్భపు సుడులబడుచు లేచుచున్న జాతివిషయము నేమనుకొనవలయును ? అదియు నంతియే. ఒకజాతియొక్కమహోజ్వలస్థాయికి మహిమాన్విత

మైన రతికి - మాననీయమైన వ్యవహారసరళికి - మహత్తర గౌరవాపాదకమైన ప్రగతిశీలమునకు - జాతీయుల నిత్యసమారాధ్యనిస్తుల నియమ నిబంధనావళియే మూలము. ఆ నియమావళి జాతిని గణనీయముగ చరిత్రలోనిలుపగలదు. విస్మరణీయము గావింపగలదుగూడ. జాతీయుల నిశ్చలభావపరంపరయే జాతియొక్క నిరుపమాన గౌరవ ప్రతిపత్తికినికషోపలము. సంఘమున ధర్మచింతన-సత్యానురక్తి - అసత్క్రియాకలాప పరాఙ్ముఖత-శాంతి ప్రియత్వము; కారుణ్యదృష్టి; సహజీవన ప్రేమత్వము; సాధుభావన - పొంగులువారు నాడు దేశ సౌభాగ్య మొకతీరుగ నుండును. తద్భిన్నవైఖరి సమాజమున దలయెత్తిన తటి లౌకికలీల మరియొక పగిదిగ నుండును. ఈ వెలుగునీడలను దర్పణమువలె ప్రతిబింబించునదియే చరిత్ర. వీని ప్రచారమునకు కేంద్రముగనిల్చునదియేకాలము.తమస్సు విజృంభించుట - తేజస్సు పొరలుట కాలమహిమ యనెడివాదు సత్యమునకు సన్నిహితమా! బుద్ధులలోవచ్చిన వక్రత-మానవునిమోద; సమాజముమోద, జాతిమోద ప్రభావమును జూపి చరిత్రగతిని మార్చుననుటలో వాస్తవమెంత ? తృష్ణ - భోగలాలసత - వెఱ్ఱితలలు వేసినపుడు బహుముఖవిచిత్ర పరిస్థితు లేర్పడుట సహజము. వీనికిగల యాకర్షణ ప్రభావము మిక్కిలి గొప్పది. సంయమీంద్రులకు సైతము చక్కిలిగింతలు పెట్టజాలినశక్తి వీనికిగలదు. ఇనుపకచ్చడాలు కట్టుకొన్నమునిమ్రుచ్చులనుగూడ నివి రెచ్చగొట్టి మచ్చుజల్లి మాయజేసి కచ్చెబట్టి కాటువేయగలవు. వీని యుద్ధతివలన నేర్పడిన సంకుల సంఘర్షణయే జాతిచరిత్రలో ముఖ్యభాగము.అధికారవ్యామో

హాము-స్వార్థపరత సంకుచితభావన-అహంకారదృష్టి-మొదలై నవి దోహదప్రాయములై నిల్చి తృష్ణకు-భోగలాలసతకు మంచి బలిమిని ఘటించుట మరొక విశేషము. ఇవి నరునిధర్మోల్లంఘనకు బురికొల్పును. సత్యపథమునుండి మరొకవంకకు మరలించును. జాతిలోసమున్నతులయ్యెడి వికృత వైపరీత్యముల కదినాంది గీతాలాపన—దీనివలన లోకమునందేర్పడిన సంక్షోభమును నిర్మూలించుటకే-సుప్రశాంత స్థితిని నెలకొల్పుటకే-మహాత్ములమహోదయము. "సంభవామి యుగే యుగే"-అనిన గీతాచార్యుని ప్రబోధమునందలి యాంతర్యముగూడ నియ్యదియే. ధర్మగ్లాని యేర్పడినపుడు - ధర్మమును సమున్నతముగావించు నిమిత్తము భగవానుడీవిశ్వమునందవతరించును. లోక కళ్యాణమే ధ్యేయముగా సర్వేశ్వరుడీ పుణ్యభూమిపై నవతరించిన విషయము సకలలోక విదితమే. దైవాంశములో సంభవించిన మహనీయుల యవతరణవలన లోకమున నేర్పడిన విషమ పరిస్థితులెట్లు విచ్చిపోయినవో వెలుగు వెల్లువలెట్లు పొరలినవో, మనకు యుగచరిత్ర సువ్యక్త మొనర్చును. ఎన్నియో యెుడిదొడుకులు, ఏవేవియో! అవచనీయ దారుణ మారణ హింసాకాండలు; దురాక్రమణలు;దుశ్చర్యలు; దుష్ట శక్తి ప్రకోపములు; చరిత్రయందంతట నిండియుండి గుండెల నవియజేయుచుండును. కాని! ఒకదరహాసరేఖ-ఒకమధురసూక్తి ఒక దివ్యప్రయత్నము - ఒకపావనభావన - ఒకరమణీయసంకల్పము ఒక సముజ్జ్వలసందేశము - మరలనీపాశవిక ప్రకృతినుండిప్రపంచమును భద్రముగ పరిరక్షించి ధర్మమార్గమున-

ప్రగతిశీలసంపన్ననుగా - పవిత్ర మహర్షి సంస్కృతీ ప్రభావితనుగా సలుపుట గమనించి విస్తుపోవుదుము.

అహహా! ఎట్టి ప్రచండాత్మబలము! ఎట్టి దివ్యజీవన విధానము! ఎట్టి సంకల్ప ద్రఢిమ! ఎట్టి నిరూఢప్రతిభ!-

ఈ ప్రత్యేకతయే భారతికి ప్రపంచదేశాలలో ప్రథమ గౌరవపీఠమును సంపాదించిపెట్టగలిగినది. దైవాంశసంభూతుల ఉనికికి-మనికికి ప్రధానకేంద్రముగ రాణింపగలిగిన మహాభాగ్య మీనేలకే దక్కినది. నయశీల సంపద - నైష్ఠికబలము - సంయమనదృష్టి - పుష్కలముగగల తపస్వికులతిలకు లీగడ్డి మీదనే తమ తమ మహోద్భతదీక్షా గరిమను వెలార్చుట విశేషాంశము. సౌశీల్యసౌజన్య జలధులుగా పేరెన్నికగన్న సాధ్వీశిరోమణులు చరిత్ర ప్రసిద్ధమైన పాతివ్రత్యమహిమను ప్రదర్శించి ప్రకృతిశక్తులనే తల్లక్రిందులు గావించుటకీ ధరణీతలమే రంగస్థలమైనది. వయస్సుతో నిమిత్తములేని పగిది మహత్తరమైన దివ్యతేజస్సును దెసల ముసరజేసిన పుణ్యమూర్తులు పలువురీపుడమి నవతరించి మాన్యతను ధన్యతను గడించిరి. మానసిక నిర్మలతను ప్రసాదించి, హృదయాహ్లాదము ననుసంధించి, చిత్తశాంతిని సిద్ధింపజేయజాలిన పావన పుణ్యతీర్థములు - పవిత్రక్షేత్రరాజములు సర్వజనసంసేవ్యములై యీ దేశమున కలంకారప్రాయములుగా శోభిల్లుచున్నవి. మంచి యెంత మహోన్నతముగ పరివర్ధమాన దశయందున్నను-చెడుగులవలేశమేని రొక వంక చేరిన జాలును. సర్వము జెడిదీరును. యోగ్యత - అయోగ్యతతో స్పర్ధపడిన సందర్భమున - అయోగ్యతవలెనువ్వెత్తుగ నొక్కమాఱే

యోగ్యతశిఖరాధి రోహణ సలుపజాలదు. మంచి క్రమముగ గాని, విస్తరింపదు. సత్ప్రవృత్తి నిదానముగగాని మన్నన లందదు. ఉచిత్తైఖరి క్రమముగగాని గుర్తింపునకురాదు. అది నైజము. కావుననే ధర్మమార్గావలంబకులు కంటకపథ ప్రయాణమునకు సర్వదా సంసిద్ధులై యుందురు. నీతికి నిలువ బడిన నిర్దుష్టవర్తనులు సహనసంపదను పెంపొందించుకొని సర్వవిధసంఘర్షణలకు స్వాగతగీతికలను సంతోషముగ నాల పింతురు. పరిపూర్ణమైన యాత్మవిశ్వాసముతో, న్యాయబల ముతో సత్యదృష్టితో సాధుపురుషులు విక్రమించిన తఱిసాధ్య ముగాని దేమున్నది ?

సత్వర పరిష్కారములు వారి కసాధ్యములుకావచ్చును. కాని! శాశ్వతఫలప్రదమార్గములుమాత్రము వారిదృక్పథము నుండి తప్పిపోవనేరవు. కావుననే, ప్రతిక్షణమునం దహం కారము అవమానమునకు పాత్రమగుటయే జరిగినది. స్వార్థ పైశాచిక శక్తి జయమును సాధింపలేక పలాయనమునే చిత్త గించినది. దురభిమానము దూదిపింజలవలె తేలిపోయినది. దౌర్జన్యము సౌజన్యాన్ని కడవరకుసాధింపలేక చదికిలబడినది. పాశవికభావన బహిరంగ విజయసాధనచేయలేక బలహీనస్థితికి దిగజారినది. న్యాయము నెగ్గినది. సత్యము వర్ధిల్లినది. సహ నము నుతుల నందుకొనగలిగినది. శాంతి జనగణముల కారాధ్యమైనది. సాధుశీలము జయభేరి మ్రోగింపజాలినది.

గతకాలమునం దట్లయినది. వర్తమానమునందదియే పునరావృత్తమగుచున్నది. భవిష్యము భిన్నముగనుండుటకు వీలులేదు. ఈపూర్వాపరవాదసమీచీనసమీక్షాత్మక సమన్వయ

దృష్టితో సంగ్రథింపబడిన సముచిత సాంస్కృతిక గ్రంథము యుగసమీక్ష. తార్కిక బలసముపేతములయిన సిద్ధాంతములు మానవుని వ్యక్తిత్వమును మహత్తరస్థాయికి నడిపింపగలవు. జాఱుచున్న జవసత్త్వములకు సముజ్జ్వల చైతన్యమునుఘటింప గలవు. మఱుగువడుచున్న మానవతను వికసింపజేయగలవు.

సుప్తాంతరంగముల జాగరితమొనరింపగలవు. సకాల మున సాహిత్యోత్కర్షించిన యిట్టిగ్రంథములే జాతికి సంజీవనివలె నుపకరించును. కాని ! వీనిని రచించుట సర్వసామాన్య విష యముగానేరదు. బహుముఖ ప్రతిభ-సమగ్రపరిశీలనాదక్షత-అసందిగ్ధముగ విషయమును నిర్వచింపగల ధీశక్తి-సత్య కథన సాహసము-వీనివెనుక మనోజ్ఞముగ మధురభావముల సంపు టీకరించి సారస్వతరూపమున జిత్రింపగల కవితాహృదయము కావలయును.

లౌకిక రాజకీయ చారిత్రక వైజ్ఞానిక పరిజ్ఞానము పరి పూర్ణముగనున్నవారే యిట్టి ప్రణాళికలనుజేపట్టి ఫలవంతము లొనర్పగలరు. యుగసమీక్షను సల్పిన శ్రీకల్లూరిచంద్రమౌళి గారు బిరుదమువలనగాక నైజముగనే "ఆర్షవిద్యాలంకారులు"

వారి ఆర్షసంస్కృతీ ప్రియత్వమును నేను ప్రత్యేకించి వివరింపబూనుకొనవలసిన యవసరములేదు. సర్వజన విదిత పూర్వాంశమది. శ్రీచంద్రమౌళిగారి జీవితమే వాస్తవముగ నొక మహోర్వ మధురసాంస్కృతికగీతి. ఆయన సత్యముగ సహృదయ కవిపండిత పక్షపాతి.

అకళంక దేశభక్తుడు. అనుపమదైవ సేవానురక్తుడు. ఖచ్చకములు నచ్చనివాడు. సచ్చరితను మెచ్చువాడు. కుల

ముల రగడల జోలికేగు పెరుగనివాడు. గుణముల గొడవలో కోరి తలదూర్చువాడు. ఒక్కమాటలో ఆర్షధర్మాన్ని పుణికి పుచ్చుకొన్న నవీనుడు. కాలముపోయిన వింతపోకిళ్ళను నిష్పక్ష పాతముగ త్రాసునందిడి తూచి వెలగట్టిన షరాబు.

ఆర్షసంస్కృతిపట్లనే ఆయనకుగల సంపూర్ణాభిమానము కేంద్రీకరింపబడినది. తద్రక్షణయు, తదభివృద్ధియువిశ్వమును విలయముల బారినుండి యుద్ధరించు ననెడి ప్రగాఢ విశ్వాస మాయనకుగలదు.

సనాతనధర్మరేఖలు వెలుగులు వెల్లివిరియించిన చరిత్ర ఘట్టముల నన్నింటిని సవ్యవిధానమున నీగ్రంథమునందాయన సమీక్షించినాడు. ఆసమీక్షించిన తీరొక మహావేశభావసంభరి తము. సత్యసంబద్ధము. సముజ్జ్వలము. కావుననే భావస్రవంతి-తళతళలతో మిలమిలలతో పరుగులెత్తినది.

ఆర్షధర్మ ధ్వంసము నభివర్ణించుపట్ల రచయిత ప్రదర్శించిన మనోవేదన-ఆర్షసంస్కృతవికాసాభివృద్ధుల వివరించుపట్ల వెల్లడించిన దివ్యానందము మహోదాత్తము. మధురము.

అనుభూతిగల హృదయమునుండి వెలువడిన మహోజ్జ్వల వాఙ్మయఖండ మీగ్రంథము. సనాతన భారతసంస్కృతి జగత్తున కాశాజ్యోతియై చిరంతన వాంఛలను పండించుననియు కలియుగాంతమున కృతయుగ ధర్మములుద్దీప్తములై మరల విశ్వమును ముగ్ధమొనర్చుననియు-సంధిసమయమున - సంఘర్షణాత్మకజీవితమును సాగించినను - సత్యయుగమునకు స్వాగత గీతికలనాలపించు మహాభాగ్యము మనకే దక్కనున్నదనియు-మన మీ సదవకాశమును సద్వినియోగపరచుకొని సార్థకజీవ

నులము కావలెననియు-సుదూరదృష్టితో రచయిత అందించు చున్న స్వర్ణసందేశము నందరు శిరములం దాల్తురుగాక.

శ్రీ చంద్రమౌళిగారు బహు గ్రంథరచయితలు. వారి రచనలన్నియు నొక యెత్తు. రామాయణ సుధాలహరి యుగ సమీక్షలు రెండు నొక యెత్తు. రామాయణ సుధాలహరి వీరి హృదయము. యుగసమీక్ష వీరి మేధస్సు.

సంస్కారము, సభ్యత తొణికిసలాడుచున్న ఆత్మశక్తి వీరి గ్రంథములన్నింటనంతర్వాహినిగా ప్రవహించుచునేయుండును.

ఇట్టి యమూల్యగ్రంథమును సృజించిన వీరినిజాతిసర్వ విధముల సంభావింపగలదు. ఈ గ్రంథము తెలుగు లోగిళ్లలో పూలదోసిళ్ళను విరజిమ్మ గలదనియు బంగారు వరవళ్ళను దిద్ద గలదనియు నేనాకాంక్షించుచున్నాను.

శుభం భూయాత్

*　　*　　*　　*

కులపతి శ్రీ తి. గు వరదాచార్యులు

చిట్టిగూడూరు

నా పరమమిత్రులగు శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు రచించిన 'యుగ సమీక్ష' యను గ్రంథమును ఆమూలాగ్రముగ జదివితిని. ఇట్టి యుత్తమగ్రంథమును రచించుట 'శ్రీ రామాయణ సుధాలహరిని పూర్వము రచించిన వీరలకొక వింతకాదు. ఇందు శబ్దసౌష్ఠవము, అర్థగాంభీర్యము ప్రతిపుటయందును ప్రస్ఫుటముగ గోచరించుచున్నవి. కృతాదియుగక్రమముగ ధర్మమున కిట్లు గ్లానిసంభవించి ప్రకృత కలియందది ఎట్లు తాండవించుచున్నదో ఈగ్రంథమున యుక్తియుక్తముగను, హృదయంగమముగను, ప్రతిపాదింపబడెను. ప్రస్తుతము కలియుగమున మనదేశమునకు సంప్రాప్తిం

చిన ధర్మక్షయము నరికట్టుటకు బుగ్గుని మొదలు గాంధివరకు పలువురు మహానుభావు లెట్లు ప్రయత్నించిరో అదియును ఇందు విపులముగ చిత్రింప బడెను. కాని సృష్టి నియమముల ననుసరించి సంభవించుదానిని నివారించుట ఎవ్వరికైనను సాధ్యమా యనునదియే ప్రశ్న. చతుర్యుగ సముదాయములగు కల్పములు 'యః కల్పః సకల్పపూర్వ్యః' అను న్యాయమునుబట్టి యనాదులు-ప్రతి కల్పాన్తమందును ప్రలయము సంభవించి పునస్సృష్టి వచ్చును. అప్పుడే కృతయుగారంభము. మనుష్యులకువలెనే సృష్టికికూడ శైశవ యౌవన వార్ధకాన్తములను నాలుగవస్థలును కలవు. తత్తదవసాను సారముగ వాటి లక్షణములు కల్గును. వీటిని నివారించుట ఎవరికిని సాధ్యముకాదు. జరాగ్రస్తునకు ఔషధసేవచే యౌవనము రానటుల మహానుభావుల యుపదేశములచే ఈ కలియుగమున తాండవించుచున్న ధర్మక్షీయము నరికట్టుట ఎవరికిని సాధ్యముకాదు. ఔషధములవలె నివియు తాత్కాలికోపశాంతిని మాత్రము కలుగచేయవచ్చును. ధర్మక్షీయము పరిపూర్ణతను చెందినపుడే తిరిగి పూర్వమువలె కృతయుగ మారంభింపగలదు.

శబ్దార్థరామణీయకోపేతమగు నీ గ్రంథము ముఖ్యముగా విద్యార్థులకు చాల యుపకరించగలదు.

*　　*　　*　　*

పండిత గోపదేవ్‌శాస్త్రి

కూచిపూడి

శ్రీ చంద్రమౌళిగారిచే రచియింపబడిన యుగసమీక్ష ఓపికతో ఆమూలాగ్రము చదివితిని. ఒక్కొక్క పుటలోను గ్రంథకర్తయొక్క యార్షదృష్టి గోచరమగుచున్నది. భారతదేశమువీద గ్రంథరచయితకు గల భక్తిశ్రద్ధలు అడుగడుగున దృగ్గోచరము లగుచున్నవి. పుస్తకమును పఠించు ప్రతి చదువరియు నీ గ్రంథకర్తను ఆర్షసంప్రదాయమునకు చెందినవాడని గుర్తింపకపోడు.

వేదములు ఈశ్వరీయములు. వేదధర్మములు మానవులకు కల్యాణదాయకములు. గ్రంథకర్త కియ్యవి యభీష్టములని పాఠకులకు బోధ

పడును. "అగ్నేర్ ఋగ్వేదో, వాయోర్వ్యుర్వేదః, సూర్యాత్ సామ వేదః, అథర్వాంగిరసః" అను శతపథవాక్యము ననుసరించి వేదములను భూమండలమున అగ్ని, వాయువు, రవి, అంగిరసుడు నను మహర్షుల శుద్ధాంతఃకరణములందు పరమేశ్వరుడు ప్రతిభాసింపజేసినట్లు గ్రంథకర్త గుర్తించినందున వేదము లీశ్వరీయములుగా నంగీకరించుచున్నారు. సర్గారంభమున మానవులందు వేదప్రచారము జరుగుటవలన మానవ జీవిత విధానమున నెట్టి వైశిష్ట్య ముండెడిదో గ్రంథకర్త బాగుగ వివరించియున్నారు.

క్రమముగ కృతయుగాదులలో వేదవిద్యాప్రచారమున నేర్పడిన మార్పులవలన మానవజీవితమున గలిగిన మార్పుల నీ పుస్తకమున వివరించి, ఆ యా యుగములందు మహాపురుషుల రూపమున నీశ్వరు డవతరించి మానవ కల్యాణమునకు తోడ్పడిన విధానమును గ్రంథకర్త వివరించి యున్నారు. ఈశ్వరు డవతరించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేయునని శ్రీ చంద్రమౌళిగారికి విశ్వాసమున్నట్లు రచననుబట్టి స్పష్టమగును. కాని పరశు రామావతారమున నతడు కొండొక రాజుచేసిన అపరాధమునకు మారుగ భూమియందుగల రాజుల నెల్లరను, అందునను క్షత్రియ రాజులను మాత్రము 21 సార్లు వెదకి వెదకి తన పరశువునకు గురిచేసి వధించుటను గ్రంథకర్త నిష్పాక్షికముగ విమర్శించినారు. అట్లైందుల కవతారపురుషుడు వర్తించెనో కారణమూహింపజాలనని వెల్లడించుట వారి యథార్థ వాదమునకు నిరూపణమనక తప్పదు.

విశేషముగ కలియుగమున భారతదేశమునం దేర్పడిన మార్పులను, వానికి గల కారణములను అధికముగ చర్చించి గ్రంథకర్త తన చైతిహాసిక విజ్ఞతను ప్రదర్శించియున్నారు. ప్రతి యుగమునందును జనులు వేదములను, వేదార్థములను విస్మరించినందువలన గలిగిన యనర్థములను వివరించి యున్నారు. యుగ సమీక్షలో నా యా భాగములను జదువునపుడు పాఠకులకు గ్రంథకర్త యొక్క ఆస్తిక్యము మిక్కిలిగ బోధపడును. అంతేకాక పరమేశ్వరు డప్పు డప్పుడు శరీరధారణ మొనరించి దుష్ట

శిక్షణచేయునను వాదముకూడ గ్రంథకర్తకు అభిమతమనియు బోధపడును. ఆ యవతారపురుషులందు దివ్యత్వము-దేవాంశ మెక్కుడుగ నుండుననియు నీ రచయిత యంగీకరింతురని స్పష్టమగును. ద్వాపరాంతమున నవతరించిన కృష్ణభగవానుని గూర్చి వర్ణించిన విధానము ఇందులకు తార్కాణము. కాని, వేదార్థములను బాగుగ పరిశీలించిన వారికి సృష్టికర్త యవతరించి కష్టనష్టములకు గురియగు ననుట యెంతతర్కసహమో విచారింపదగిన విషయము.

కలియుగమున వేదప్రచారము సన్నగిల్లినదనియు, అందువలన విద్వాంసులుకూడ వేదములకు, బ్రాహ్మణ గ్రంథములకు మధ్యనున్న యంతరమును - భేదమును గుర్తింపజాలక అజ్ఞులయిరనియు గ్రంథకర్త బాగుగ వివరించియున్నారు. అందువలన గలిగిన యనర్థములు కూడ కన్నులకు గట్టినట్లు ప్రదర్శించినారు.

కలియుగ విద్వాంసులు వైదికయజ్ఞముల స్వరూపమును గుర్తింపక యజ్ఞములందు పశువిశసనము చేయుచు యజ్ఞములను పాపభూయిష్ఠ మొనర్చినారని గ్రంథకర్త యభిప్రాయపడుటయే కాక యట్టివారిని బాగుగ గర్హించినారు. యజ్ఞ, యాగ, అధ్వర శబ్దములు హింసార్థకములు కావని ధాత్వర్థనిర్దేశపూర్వకముగ వివరించియున్నారు.

ముఖ్యముగ నీ యుగమునందు భారతమున జనించి, దేశము నుద్ధరించిన మహాపురుషులయెడ గ్రంథకర్తచూపిన భక్తిశ్రద్ధలు అనితర సాధారణములు. ధార్మిక, సాంఘిక, నైతికక్షేత్రములందును, దేశవిముక్తి విషయమునను రామమోహనరాయ్, దయానందసరస్వతి, వివేకానందస్వామి మున్నగు మహానుభావు లొనర్చిన ఘనకార్యములను శ్రీ చంద్రమౌళిగారు చక్కగా వర్ణించియున్నారు. మహాత్మగాంధి యనంతరమున దేశభక్తులలో వచ్చిన మార్పులను, వారియం దేర్పడిన దోషములను గూర్చియు గ్రంథకర్త తమ విచారమును వెల్లడించియున్నారు. గ్రంథకర్త స్వయముగ దేశభక్తి ప్రపూరితహృదయుడగుటవలన ప్రస్తుత దేశపరిస్థితులు వారి హృదయమును మిక్కిలి కలతపఱచినట్లు పాఠకులు గుర్తింతురు.

ఇట్టిదీ యుగసమీక్ష బహువిషయములను పాఠకులకు స్మరింప జేయుచు గ్రంథకర్త సహృదయతను వెల్లడించుచున్నది. తెలుగుచదువరులు పుస్తకమునందలి గుణగణములను గ్రహించి దాని యుపయోగితను గూర్తింతురని భావించుచున్నాడ.

* * * *

'ఆర్షవిద్యాభూషణ'
శ్రీ జటావల్లభుల పురుషోత్తం
కాకినాడ

"యుగసమీక్ష" కర్తలైన "ఆర్షవిద్యాలంకార" శ్రీ కల్లూరి చంద్రమౌళిగారి భారతీయ సంస్కృతిపరాయణత సువిదము. దివ్యవిజ్ఞాన సేవధియగు శ్రుతిమాతగర్భమునుండి యీ సంస్కృతి యావిర్భవించినదనియు, తల్లికెంత దగ్గఱగా నడచుచున్న యీ సంస్కృతియంత శోభాయమానముగా నుండుననియు వీరి విశ్వాసము. వేదమొకనాటి పరిస్థితులనుగాని ధర్మమునుగాని తెలుపునది కాదనియు, అది కృతత్రేతాద్వాపర కలియుగములలో సమానానుసరణీయ మనియు వీరి యభిప్రాయము. సత్యము, అహింస, త్యాగము, పరమేశ్వరభక్తి మున్నగు లక్షణములు కృతయుగములో పూర్ణముగ నుండెననియు, వీనికి పాద పాదశః క్షీణ్యమూ త్రేతా ద్వాపర కలియుగములలో జరిగెననియు, సోదాహరణముగా నిరూపించుచు చంద్రమౌళిగారు నిరాశకు తావీయక త్వరలో కృతయుగ మారంభమగునను ఆశను వెలిబుచ్చిరి.

ఆదిమానవుడు పశుప్రాయముగా నుండెననియు క్రమముగా నాతడు వేలుగులోనికి వచ్చుచున్నాడనియు పాశ్చాత్యులు వ్యాపింపచేసిన సిద్ధాంతమునకు ఈ సిద్ధాంతము కేవలము వ్యతిరిక్తము. చాలకాలము భారతీయ చారిత్రకులు కూడ పాశ్చాత్యభోరణినే యనుసరించుచుండిరి. కాని శ్రీ అరవింద వేదములలోని విజ్ఞానమును పోలునట్టి కాని, మించునట్టి కాని విజ్ఞానము తర్వాతికాలములో నెచ్చటను బయలుదేరలేదని స్పష్టముగా

నుడివియున్నారు. వేదవిజ్ఞానము అతీంద్రియమనియు, అది మానవబుద్ధి నిర్మితముకాదనియు కూడ ఆయన చెప్పియుండిరి.

"The veda is not the product of human intellect"

వేదము మానవవిజ్ఞాన ప్రారంభమును ప్రతిబింబించుచున్నదని చెప్పిననారుకూడ అందలి విజ్ఞానముయొక్క ఘనతను అంగీకరింపకుండిరి. ఇప్పుడిప్పుడీ విషయమై మార్పు కన్పట్టుచున్నది. ప్రసిద్ధచారిత్రకులలో శ్రీ రాధా కుముదముఖర్జీ యీ విషయమై ముందంజవేసినారు. వేదములో మన నాగరతయొక్క ప్రారంభమేకాక పరమావధికూడ నున్నదని యాయన నుడివియున్నారు.

"The Vedas contain not only the genisis but also the zenith of human civilisation."

మనభూత్వాలు వేదమున కిచ్చిన స్థానము అద్వితీయము, మహోన్నతము. మంత్ర బ్రాహ్మణారణ్యకోపనిషదాత్మకమైనది. వేదమను నిర్వచనము నంగీకరింపక శ్రీదయానందులు, శ్రీఅరవింద మంత్రభాగమే వేదమని నిర్వచించిరి. శ్రీ చంద్రమౌళిగారి నిర్వచనమునిద్దియే-వీరిగ్రంథములో ప్రస్తుతించిన భారతీయ సంస్కృతి వేదములనేకాక రామాయణ మహాభారతములు, రామకృష్ణాద్యవతారములు, దేవాలయ వైభవములు.

ఆచార్య ప్రస్థానత్రయ భాష్యములు మున్నగువాని సమష్టి ఫలితముగా నేర్పడిన హిందూ సంస్కృతియే కాని సంకుచితమైనదికాదు. ఈ సంస్కృతియొక్క పరిణామమును యుగక్రమముగ వర్ణించుచు దీనిపై గొప్ప యాఘాతముగా మహమ్మదీయ దండయాత్రను గ్రంథకర్త పేర్కొన్నారు. ముస్లిముల రాజ్యవ్యాప్తి నరికట్టుటకు శ్రీవిద్యారణ్యులు హరిహర బుక్కరాయల నాధారముగా చేసికొని గావించినకృషిని, ముస్లింపాలకుల ముష్కరత నణచుటకు శివాజీ గావించినకృషిని చంద్రమౌళిగారు తాము తన్మయత్వమును పొంది పాఠకులకు తన్మయత్వమును గలిగించునట్లు చిత్రించిరి. వాస్తవముచేత విద్యారణ్య శివాజీ లిరువురును లేనిచో నీసరికి భారత దేశము ముస్లిముదేశమై యుండెడిదనుట కెట్టి సందేహమును లేదు. ఏ

రిరువురును భారతీయతా రక్షకులు. వీరికి సముచిత స్థానమును జాతీయ సంస్కృతి పరిణామవర్ణనాత్మకమైన యీ గ్రంథములో నిచ్చినందులకు గ్రంథకర్త యభినందనీయులు.

వేదము, సంస్కృతభాష సర్వహిందువులలోను వ్యాపించుటయే హిందుత్వవ్యాప్తియని శ్రీచంద్రమౌళిగారి సందేశము. తిరుపతిలోజరిగిన సంస్కృత విశ్వపరిషత్తుకు ఆహ్వానసంఘాధ్యక్షులుగా భాషించుచు వీరు "సంస్కృతములేకుండ భారతదేశము భారతదేశముగా బ్రదుకజాలదు" అని వజ్రమువంటిమాట చెప్పియున్నారు. డెబ్బది సంవత్సరముల క్రిందట స్వామివివేకానంద మద్రాసులో ఉపన్యసించుచు "సంస్కృతమును నేర్చుకొనుడు, మీరు బ్రాహ్మణులగుదురు"—

"Learn Sanskrit and you will become Brahminns"

అని చెప్పియుండెను. హిందుత్వరక్షణములో సంస్కృత భాష పాత్ర అద్వితీయము. కొందరు పూర్వాచారపరాయణులు వేదాధ్యయనాధికార మెల్లరికిని లేదనుటకు కారణము వారి దురహంకారము కాదనియు, అది శాస్త్రవిరుద్ధమని వారు విశ్వసించుటయే కారణమనియు నా యభిప్రాయము. సనాతనవర్ణమని నేడు వ్యవహరింపపడు వర్ణములో అట్టి విశ్వాసములెన్నియో కలవు. ఇట్టి అభ్యంతరము చెప్పువాఁడుకూడ వేదోచ్చారణమునకే కాని వేదార్థజ్ఞానమున కభ్యంతరము చెప్పుటలేదు. ఇట్టి వర్ణమువారికిని శ్రీ చంద్రమౌళిగారి వంటివారికిని సంపూర్ణ సామరస్యము కలుగవలెనని నేను చాలకాలమునుండి భగవంతుని ప్రార్థించుచున్నాను. హిందూత్వరక్షణ వికాసములకది యత్యంతము ముఖ్యము.

కడచిన రెండువేల సంవత్సరములలోని మన సాంస్కృతిక చరిత్రను చంద్రమౌళిగారు మరింత విపులముగావర్ణించినారు. కబీర్, నానక్, చైతన్య, మీరాబాయి, తులసిదాసు, సూరదాసు, పోతన, త్యాగయ్య, మొల్ల, బసవేశ్వరుడు, హరిహరరాయబుక్కరాయలు, దయానంద, రామకృష్ణపరమహంస, వివేకానంద, రామతీర్థ, అరవింద, గాంధి, బిసెంటు, రమణమహర్షి మున్నగువారు భారతీయ సంస్కృతికి గావించిన దోహదమును గ్రంథకర్త చక్కగా వర్ణించిరి. శ్రీ జవహరలాల్ ప్రధాన మంత్రి

త్వము భారతీయ సంస్కృతికి దోహదముచేయజాలక పోయెననియు, మద్యపానానుమతి, సంతాననిరోధక కృత్రిమోపాయములు, సెక్యులరిజం మున్నగునవి దేశపరిపాలనమునకు గౌరవమును చేకూర్పవనియు వీరి యభిప్రాయము. తాము నమ్మిన దానిని నిస్సంకోచముగ చెప్పుట గ్రంథకర్త కుండవలసిన ముఖ్యలక్షణములలో నొకటి. శ్రీ చంద్రమౌళిగారికిది మిక్కుటముగా కలదు.

భారతదేశభక్తియు భారతీయ సంస్కృతిరక్తియు నీరచనలో మేళవింపబడినవి. ఇవి అవిభాజ్యములనుటకు చంద్రమౌళిగారి జీవిత మొక నిదర్శనము. ఈ స్వాతంత్ర్యసమరయోధునివంటివారే మిగిలిన భారతీయ నాయకులైయున్నచో స్వతంత్రభారతమీసరికి సాంస్కృతిక రంగమున ప్రపంచనేతృత్వ మార్గమున చాలదూరము పయనించి యుండెడిది.

ఈ యుగసమీక్షలోనిభాష, శైలి సరళసుందరములై, ఉదాత్తములై, సాహిత్యపరిమళోపేతములై చదివినకొలది చదువవలయునను కుతూహలమును పాఠకునకు గల్గించుచున్నవి. ఇది భారతీయ ధర్మసంస్కృత్యమృతస్రవన్తీ ప్రవాహ విలాసముల నెఱుగగోరు వారికెల్లరకు అవశ్య పఠనీయము.

*　　*　　*　　*

సత్యవీక్షణ

శ్రీ కొల్లా సుబ్బారావు, M. A.

ప్రాచీనులు-ఆ యా కాలములలో నడచిన ధర్మమునుబట్టికాలమును కృత త్రేతా ద్వాపర కలియుగము లనుపేర నాలుగు భాగములుగ విభజించిరి.

ధర్మము కృతయుగమున నాల్గుపాదముల - త్రేతలో మూడు పాదముల - ద్వాపరమున రెండు పాదముల కలియుగమున, ఒక్కపాదమున నడుచునందురు.

"ఆర్షవిద్యాలంకార" శ్రీ కల్లూరిచంద్రమౌళిగారు - ఈ గ్రంథమున ఆ యా యుగములలోగల ధర్మపుతీరుతెన్నులను సమగ్రముగ సమీక్షించిరి.

నేటి యుగము కలియుగము. అందువలననే కాబోలు నేడు నైతికశక్తులు క్షీణించుచున్నవి. అధికారతృష్ణ, ధనవాంఛ, భోగదృష్టి అధికమగుచున్నవి. లక్ష్యశుద్ధి కొఱతబడినది. స్వలాభసిద్ధికే మనసు పరుగులు దీయుచున్నది. ధర్మాధర్మములవిచక్షణ లోపించినది. దేశముకొఱకు దేహమనెడి విశాలభావము జాతీయనాయకులలో లోపించి - తమ కొఱకు దేహమనెడి స్వార్థభావము ప్రబలిపోయినది. (చూడు 298 పేజీ)

మానవుడు గగనంలో పక్షిలాగా విహరించడం నేర్చాడు. అగాధమైన జలధిగర్భంలో, అనంతమైన భూగర్భంలోగూడా అన్వేషణలు సాగించి జయించాడు. గ్రహాంతరయానానికి తొలిమెట్టుగా చంద్రునిపై కాలూని - అన్యగ్రహమండలాల యాత్రకు బాటలు తీర్చిదిద్దుకొన్నాడు.

అయినా యీ నేలమీద శాంతియుతంగా జీవించడం మాత్రం నేర్వలేకపోతున్నాడు. ఏవేవో వెట్టి ఆశలుపెట్టుకొని భయంకర మారణాస్త్రాలను సృష్టించి, తనఉనికికే భద్రతలేకుండా చేసుకొన్నాడు.

శాస్త్రీయ విజ్ఞానం ఎంతత్వరితంగా వృద్ధిపొందుతున్నదో-అంత శీఘ్రకాలంలో మానవుడు నైతికంగా పతనమౌతున్నాడు.

బుద్ధుడు మొదలు గాంధీమహాత్మునివరకుగల ఎందరోమహనీయులు నైతికవిలువల ప్రాముఖ్యాన్నిగూర్చి మొక్కి తక్కాణించారు. శీల సంపదయే జీవితధ్యేయం కావాలని ప్రబోధించారు. అయినా, యుగధర్మముకాబోలు! ఫలితం శూన్యం. అయినా నిరుత్సాహపడవలసిన పనిలేదు "కలియుగమున మూడుకాళ్ళులేని ధర్మదేవత - యెంతో కాలమిక నిలువజాలదు' (చూ. 311 పే)

ఇది శాంతికాముకులందరికీ ఆశను పురిగొల్పేమాట. 'యుగసమీక్ష' రచయితలగు శ్రీ చంద్రమౌళిగారు స్వాతంత్ర్యోద్యమములో కాకలుదీరిన మహావ్యక్తి. ప్రజాసమస్యలను బాగా ఆకళించుకొని ప్రజానురంజకంగా- ఎన్నోయేండ్లురాష్ట్రపరిపాలనగావించిన అనుభవజ్ఞులు. విదేశాలలో విద్యనార్జించి పట్టభద్రులయినప్పటికీ సంస్కృతభాషపట్ల మన

సంస్కృతిపట్ల భక్తిశ్రద్ధలతో వ్యవహరించెడి ఆర్ష విద్యాప్రియుడు. త్రికరణశుద్ధిగల స్వచ్ఛమైన గాంధేయవాదిగా తనజీవితాన్ని మలచుకొన్న జాలిన మనీషి. అందువలనే నేటికుళ్ళురాజకీయాలునారిహృదయాన్ని ఎంత గానో దహింపజేశాయి. ఎంతో ఆవేదనతో-ఇట్టిరాజకీయ సాంస్కృతిక భ్రష్టసమాజాన్ని గాంచి సముచిత సూచనలు చేశారు.

కలియుగ సమాజంలో బుద్ధుడు, త్రిమతాచార్యులు, జ్ఞానేశ్వరుడు, కబీరు, చైతన్యుడు, బసవేశ్వరుడు, రాజారామమోహనరాయలు, దయానందుడు, రామకృష్ణపరమహంస, వివేకానంద, రామతీర్థస్వామి, అరవిందుడు, మహాత్మగాంధి, మొదలయిన దాదాపు ముప్పదిమంది మహనీయుల జీవితాలను - సందేశాలను - మనోహరమైన మధురశైలిలో హృద్యంగా చిత్రించారు. ఈ గ్రంథరచనలో వారేర్పరచుకొన్న విషయవిభాగపద్ధతి-ఉదాత్తంగావున్నది. అది ఆదర్శప్రాయముగూడ.

సంశుద్ధహృదయంతో సాహసాత్మకంగా సత్యాన్ని నిర్వచించి సమగ్రసమీక్షసలిపిన రచయిత భావన సమాజంలో పెద్దలుగా చెలామణి అవుతున్న వారి కందరికీ కినుపిప్పు కాగలదు.

సత్యవీక్షణతత్పరత జాతికి నేడెంతో అవసరం. "భారతక్ష్మాతల మున, నవ్య, దివ్య, భవ్య జీవనవిధానము సుస్థిరముగ పాదుకొన" [చూ 312 పే] వలెనని ఆశించే ప్రతివారు చదువదగిన మంచిపుస్తకమిది.

* * * *

శ్రీ నీలంరాజు వెంకట శేషయ్య

సుప్రసిద్ధ పత్రికారచయిత, విజయవాడ.

నేడు మన దేశంలో గాంధిశతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నాము. అయినా, భారతదేశములో గాంధియుగమేనాడో అంతరించినదని భావించేవారిలో నేనొకణ్ణి. ముఖ్యంగా, కాంగ్రెసు వాదులపై గాంధీజీ ప్రభావముద్ర చెరగిపోయినమాట ముమ్మాటికినిజం. నేటిదేశ పరిస్థితులే అందుకు ప్రబలసాక్ష్యం.

రాజకీయంగా భారత ప్రజలకు స్వాతంత్ర్యాన్ని సముపార్జించి గాంధిజీ భారతజాతిపితగా పిలవబడుతున్నాడు. కాని, సత్యాహింసలను

రాజకీయాలతో జోడించి, ఆత్మబలంతో, ఆధ్యాత్మికతత్వంతో స్వాతంత్ర్య సంరంభాన్ని కొనసాగించడంచేతనే ఆయనమహాత్ముడుగా కొనియాడ బడినాడు. 'ఈశ్వరసాక్షాత్కారమే నాజీవితాశయం. వివిధరంగాలలో నేనుచేసే సర్వప్రయత్నాలూ, సమస్త సాధనలూ ఆలక్ష్యసంసిద్ధికే.'అని మహాత్ముడు ముక్తకంఠంతో చాటాడు. గాంధిజీ సిద్ధాంతాలను గాఢంగా విశ్వసించి,అమహనీయుని అడుగుజాడలలోనే నడచిన అనాటి కాంగ్రెసు వాదులకు నేటిస్వతంత్రభారత పరిస్థితిహృదయవిదారకంగా తోచడంవింత గాదు. గతరెండుశతాబ్దాలలో భారతదేశం పారిశ్రామిక వైజ్ఞానిక రంగాలలో కొద్దిపాటి అభివృద్ధిని సాధించి ఉండవచ్చు. కాని. స్వతంత్రభారత జాతి మనుగడకు ప్రధానమైన జాతిసమైక్యతనుగూర్చి తలపోసినా, ప్రజాస్వామిక లక్ష్యాలనుబట్టి చూచినా, విశేషించి నైతిక ప్రమాణాల దృష్టితో పరికించినా, ఇదిగాంధిజీ కలలుగన్న భారతవర్షం ఎంత మాత్రం కాదని రూఢిగా చెప్పవచ్చు.

భౌతికాభ్యుదయంతో బాటు నైతికంగా, ఆధ్యాత్మికంగాకూడా సుసంపన్నమైన ఆదర్శభారతవర్షాన్ని నిర్మించవలెనని మనస్ఫూర్తిగా ఆశించి, దేశంకొరకు పాటుబడిన గాంధిజీముఖ్యానుచరులలో శ్రీ కల్లూరి చంద్రమౌళిగారొకరు. విద్యాధికులై ప్రభుతోద్యోగ మాశింపక స్వాతంత్ర్యోద్యమంలోచేరి త్యాగములుసల్పినప్పుడేమి,రాష్ట్రప్రభుత్వంలో అమాత్య పదవులను నిర్వహించినప్పుడేమి, తిరుపతి దేవస్థాన పరిపాలనాబాధ్యతను చేపట్టినప్పుడేమి శ్రీ చంద్రమౌళి గాంధిమహాత్ముని మహోపదేశాలను విస్మరింపక, తమబుజువర్తనతోబాటు, తమసంస్కృతీ ప్రియత్వాన్నీ, ఆధ్యాత్మిక ధర్మతత్పరతనూ అనేకవిధాల ప్రకటిస్తూవచ్చారు. ప్రత్యేకించి దేవాదాయశాఖామాత్యులుగా శ్రీ చంద్రమౌళిగారు మనరాష్ట్రప్రజలలో రేకెత్తించిన ఆధ్యాత్మిక చైతన్యం చిరస్మరణీయమనడానికిసందేహంలేదు.

సుప్రసిద్ధ దేశభక్తులుగా, వినిర్మల రాజకీయవేత్తలుగనేగాక, 'రామాయణసుధాలహరి' 'భారతీయప్రతిభ' మున్నగు అత్యుత్తమ రచనల ద్వారా ప్రఖ్యాత గ్రంథకర్తలుగా, సాహితీవేత్తలుగా లోకానికిదివరకే సుపరిచితులైన శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు సరికొత్తగా రచించిన 'యుగసమీక్ష' అనేపుస్తకాన్ని, వారునాకిచ్చిన అల్పావకాశంలో

స్థాలీపులాక న్యాయంగా చదివి, స్థూలంగా మాత్రమే ఇక్కడ నా అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నాను.

అక్రమరీతులలో కొనసాగుతున్న అన్యమతావలంబనంవల్ల దేశంలో ఒకవైపున హిందువులసంఖ్య క్రమంగా క్షీణిస్తున్నది. వేరొకవైపున 'హేతువాదం' పేరుతో ఆహిందువులలోనే నాస్తిక శక్తులు విజృంభించి మతంపై విశ్వాసాన్ని సడలజేయడానికి చూస్తున్నవి. 'సెక్యులరిజం' ముసుగుక్రింద పాలకవర్గంవారవలంబిస్తున్న మతరాహిత్య విధానాలు ప్రచ్ఛన్నంగా ఇందుకు దోహదమిస్తున్నవి. ఇట్టితరుణంలో ఆర్ష సంస్కృతికి ఉత్తేజం కల్పించి, ఆస్తికతను ప్రోత్సహించి, నైతిక విలువలను పునరుద్ధరించి, స్వధర్మాభిమానాన్నిపెంచి, మాతృదేశంపట్ల భక్తివిశ్వాసాలను పురికొల్పగల ఉత్తమగ్రంథ రచనకు ఆర్షవిద్యాలంకృతులైన శ్రీ చంద్ర మౌళిగారు పూనుకొనడం సముచితమని వేరే చెప్ప బనిలేదు.

ఈ పుస్తక రచనలో శ్రీ చంద్రమౌళిగారు తత్త్వదర్శిగా, దివ్య భావోత్తేజితులుగా, ప్రాచ్యపాశ్చాత్య విజ్ఞాన పరిజ్ఞాతలుగా, భక్తిభావ బంధురులుగా, వేదశాస్త్ర పురాణేతిహాస సంవేత్తలుగా, వివిధ విషయ విమర్శన కుశలులుగా, మాతృదేశ సేవాసక్తులుగా, మహదాశయ ప్రేరితులుగా భాసిస్తున్నారు.

ఈయన మనస్సు మాధుర్యమగ్నమనీ, ఈయన హృదయం సదయమనీ, ఇతడు లోకహితుడనీ ఈ పుస్తకం చాటుతున్నది. ఈగ్రంథంలో ఎక్కడ ఏభాగాన్ని చదివినా వైదుష్యం కొట్టవచ్చినట్లు కన్పిస్తున్నది. ధర్మజిజ్ఞాస, దివ్యావేశం, ప్రజారాధన ప్రవణతలు పండువారిన ఈయన హృదయంలో పెల్లుబుకుతున్నట్లు పొడగట్టుతున్నవి.

మృదుమధురమూ, ప్రతిపదసుందరమునైన ఈయన శైలి చూచినప్పుడు వీరిది సహజ పాండిత్యమేమోఅన్న అనుమానం కలుగక మానదు. మాటమాటనూ సానపట్టి, పలుకు పలుకుకూ మెరుగుపెట్టినాడీ రచయిత.

భారత వసుంధరనూ, భారత సంస్కృతిని గురించి తలపోసేటప్పుడు ఎంతగా ఈయన ఎద-విచ్చి, పొంగులు వారుతుందో చూడండి:

"భారతవసుంధర సనాతనధర్మ స్రవంతితో పులకరించిన పుణ్యకేదారము. ఆధ్యాత్మిక భారత్నగర్భ. చరిత్రకందని పురాతన కాలమునుండి భగవదనుభూతి సుధలమధురిమల కొరకే పాటుబడుచున్న దివ్యక్షేత్రము.

దివ్యతేజః పుంజలహరితో సకల ప్రపంచమునకు కాంతిని, శాంతిని ప్రసాదించిన పవిత్రసీమ. భారతీయులకు వేదములే పరమ ప్రమాణములు. అగ్ని సూక్తులే తారకమంత్రములు. పాడిపంటలు, నీతి శీలములు, దాన ధర్మములు, కొల్లలుగ వర్ధిల్లిన దిచ్చటనే. ఈ దివ్యత్వస్ఫోరక నిత్యజీవిత వ్యవహార లీలకే హిందూమతమనెడి వ్యాప్తివచ్చినది..."

"కుబ్జను, కుర చక్రవర్తిని...శ్రీకృష్ణపరమాత్ముడు" (చూ రం పుట)

దేశానికి స్వాతంత్ర్య మేర్పడినా, తరతరాలుగా ప్రజలలో పేరుకు పోయిన భావదాస్యం చేతనేమి, ఆంగ్లవిద్యాధికుల నాశ్రయించిన పరానుకరణ పాండిత్యంవల్లనేమి సంఘములో సదాచార ధర్మాలు లోపించి, సభ్యతాసంస్కృతులకు శైథిల్యం వాటిల్లుతున్న ఈసందిగ్ధస్థితిలో స్వీయ సంస్కృతియందు అభిమాన అభినివేశాలను, సంశయాత్మలైన విద్యావంతులలో ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మోన్నతిని బలపరచగల ఇట్టి సద్గ్రంథం వెలువడడం అత్యంత ముదావహం.

సంస్కారప్రియులైన శ్రీచంద్రమౌళిగారిందు వెల్లడించిన కొన్ని అభిప్రాయాలతో సంప్రదాయబద్ధులైన సనాతనధర్మ పరాయణులు కొందరు ఏకీభవించకపోవడంలో ఆశ్చర్యంలేదు. అందందు వీరి విమర్శలు కూడా కొందరికి కటువుగాతోచవచ్చు. అయిననేమాయె! వేదబాహ్యులైన యితరమతస్థులమాట అటుంచి, వేదప్రామాణ్యాన్ని అంగీకరించిన వారిలోనే భిన్నభిన్నాభిప్రాయాలు కలవారు సంప్రదాయాలను పాటించిన వారు వేదకాలంనుండికూడా ఎందరోవున్నారు. ఇట్టిభిన్నాభిప్రాయాలను భిన్నసిద్ధాంతాలన్నిటినీ జీర్ణించుకొని, తనలో ఇముడ్చుకొనగల జీవశక్తిని, వైపుల్యాన్ని కలిగినది ఆద్యంతములులేని మనఆర్ష సంస్కృతి, ఇట్టిసిద్ధాంత రాద్ధాంతాల నెన్నిటినైనా తట్టుకొని మనగల మహిమోపేతము మన సనాతన మతము.

ఈదృష్టితో చూచినప్పుడు శ్రీ చంద్రమౌళిగారి గ్రంథములో ప్రకటించిన అభిప్రాయాలుగాని, విమర్శలుగానీ సర్వజనాంగీకారాన్ని పొందకపోవచ్చుగాక, నింద్యములు కావనిమాత్రం చెప్పకతప్పదు.

సమయానుకూలంగా ఇట్టి ఉత్తమగ్రంథాన్ని రచించి లోకానికి సమర్పించినందుకు ఆర్ష సంస్కృతీ ప్రియులైన మహాజనులందరూ శ్రీ చంద్రమౌళిగారి కృషిని ప్రశంసింపకమానరు.

A

B



జాతిపితపిలుపు విని తన
చేతమ్ములరన్ స్వదేశసేవాపరుడై
నీతికి నిలిచిన కవి మా
సీతారామయ్య! తత్త్వచింతాపరుఁడున్

శ్రీ వెలుఓలు సీతారామయ్య

తెనాలి.

ప్రజానీకము సర్వయుగపరిస్థితులను ఆకళింపుజేసికొన గలుగునట్లు - సరళశైలిలో ఈ సమీక్ష నందించిన చంద్రమౌళిగారు చరితార్థులు. ఈ సమీక్ష వారి బహుముఖ పరిజ్ఞానమును ప్రకటింపజేయుచున్నది. ఇది చదువరులకు ప్రాచీన విజ్ఞాన సాంస్కృతికోన్నతులు స్ఫురింపజేయుటలో అద్వితీయము. భోగలాలసకు గుటీయై సదాచారములకు స్వస్తిచెప్పి - ఆత్మవిశ్వాస శూన్యులై-ఆడంబరజీవితమున కలవాటుపడిన వారి కీ రచన ఓజ్జబంతివంటిది. ధర్మాధర్మ విచక్షణా రహిత జీవితపథమున పయనించు నేటి యువతీ యువకుల కీ గ్రంథము కనువిప్పు కలిగించి సుగమమార్గమును సూచింప గలదనుటలో నత్యుక్తికిలేదు.

కలుష భూయిష్టమై - కపట ప్రచారపూరితమైన నేటి రాజకీయ కార్యకలాపము దెసకుంజనక - తిమ విరామకాలమును ఇట్టి యుత్తమ రచనకు వెచ్చించి - ఆంధ్రపాఠకుల కమూల్యమైన సందేశము నందించిన శ్రీ చంద్రమౌళిగారు సంస్తవనీయులు. పరాత్పరుడు వీరికి ఇతోధిక రచనా పాటవమును, బహుముఖ మానవసేవావకాశమును ప్రసాదించు గాక! ఆంధ్రు లీ గ్రంథమును లెస్సగా నవగాహన మొనర్చుకొని తరింతురుగాక!!

D

పండిత – పెన్మెత్స సత్యనారాయణరాజుగారు


తణుకు

రామాయణ సుధాలహరిలో యావదాంధ్ర ప్రజానీకమును ఓల లాడించి ఆర్ష విద్యాలంకారుఁడై సారస్వతరంగములో అఖండఖ్యాతి గాంచిన శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు నూతనముగా వ్రాసి వెలయించిన యుగసమీక్షనుగూర్చి ప్రశంసింపవలయునన్నచో నన్నయమాటలతో "ధర్మతత్త్వజ్ఞులు ... బహుపురాణ సముచ్చయంబని మహిఁగొనియాడుచుండ"

'వివిధ వేదతత్త్వవేది' శ్రీ కల్లూరి
చంద్రమౌళి వినుత చంద్రమౌళి
విశ్వచరితవిదుఁడు విశ్వజనీనమై
యొప్పుచుండఁ జేసె యుగసమీక్ష

అనుటచాలు. శ్రీ చంద్రమౌళిగారి గద్యరచన పద్యగతితో పరుగులు వాఱుచుండును. శబ్దసంస్కారము జాఱని శయ్యాపాటవముతో ఒయ్యారములొలికించుచుండును. ప్రతివాక్యము సప్రమాణమై వెలయుచుండును. సృష్ట్యాదినుండి నేఁటి వఱకు జరిగిన భారతవర్షములోని పరివర్తనములు, విప్లవములు కనులకుఁగట్టినట్లు సమీక్ష చేయఁబడినదే యీ యుగసమీక్ష, బ్రహ్మావర్తముతో నారంభమైన యీసమీక్ష నాలుగుయుగములసమీక్షతో ముగిసినది. దేవాసురయుద్ధములు ఆర్యానార్య విభేదములు బ్రహ్మక్షత్రియ విద్వేషములు కురుక్షేత్ర సంగ్రామము, బ్రాహ్మణశాఖాంతర విభేదములు, సార్వభౌమాధికారమునకై క్షత్రియులలో రేకెత్తిన పరస్పర ద్వేషములు వైదిక బౌద్ధమతముల పోరాటములు వాల్మీకివ్యాస కాళిదాసాదులకవితా మాధుర్యములు మత్రయ ప్రవక్తల భావములు, వల్లభాచార్య చైతన్యాదుల ఉపదేశములు, వివేకానందాదుల ఉజ్జ్వలోపన్యాససారములు అళ్వారాదుల భక్తిభావములు, మహాత్మాగాంధి మొదలుకొని నేఁటి రాజకీయపు ముఠాల వఱకు జరిగిన జరుగుచున్న నానావిధ రాజకీయభావవైరుధ్యములు కూలంకషముగా మనోహరముగా భావావేశముతో ఇందు సమీక్షింపఁబడెను. ఆదికాలమునుండి యీనాఁటిదాఁక భారతదేశచరిత్ర ఇందు ఆధ్యాత్మిక ఆధిభౌతిక, సారస్వత మత రాజకీయార్థిక పరివర్తనలతోఁ దిలకించి పులకింపవచ్చును.

F



విబుధ రత్నాకరమ్మగు విమలవంశ
విభవమును జూటి యాచార్య వినుతులంది
శ్రీనివాసాఖ్యకే క్రొత్తచెలువు గూర్చి
నాడు నెచ్చెలికాడు వినమ్రు డితడు.

ప్రేమాంకము

‘వైద్యరత్న’

శ్రీమాన్ రత్నాకరం శ్రీనివాసాచార్య సుహృద్వర్యులకు

మీ వంశము ఉద్దండ పండిత రత్నములకు-నైష్ఠికశిరోమణులకు కుదురు. ఆ స్నిగ్ధ పరంపరకు ప్రతీక మీరు. వైద్యవృత్తిని చేపట్టితిరి. అందారితేరితిరి. అనుభవజ్ఞులుగ - అమృతహస్తులుగ కీర్తిని గడించితిరి. ఉచిత సేవలనందించి- నిరుపేదలవ్యాధి నివారణమొనర్చు- సదారోగ్యమును సౌఖ్యమును సమకూర్చుచున్న మీ త్యాగము గణనీయము. హద్దు పద్దులులేక స్వేచ్ఛగ పరుగులిడుచున్న ఆధునికమానవుని పోకడను సంస్కరించుటకు- నియమ నిగ్రహములతోగూడిన క్రమశిక్షణను పెంచుటకు- ఆర్షసంస్కృతిపూర్ణ జీవితపథమున నరుని నడిపించుటకు - కృతయుగ ధార్మిక లక్షణ సంపత్తికి కేంద్రముగ కీలకస్థానముగ మనుగడను దిద్దుటకు- సార్థకమొనరించుటకు సహకరించుననెడితలంపుతో నేనీ గ్రంథమును రచియించితిని. నీవు సన్మిత్రుడవు. సహజీవనపథగామివి. ఈ గ్రంథ రచనకు - ఉత్సాహప్రోత్సాహముల నందించి - మీ స్వగృహమున మీ ఆతిథ్యముతో మీ సహకారబలముతో నీ గ్రంథమును పూర్తిగావింపజేసితిరి. కాబట్టి ఈ గ్రంథరచనలో మీరును భాగస్వాములే. సర్వత్ర మనకు సమతగలదు. చిరకాలమునుండి మీపై నాకును నాపై మీకును మధురమైన మమతగలదు. సహజ సఖ్యభావముతో పరిశీలింపనాబిడ్డయగు “యుగసమీక్ష” మీకును ముద్దులబిడ్డయే కాగలదు. ఆ దృష్టితో మీ కీ గ్రంథమును దత్తపుత్రికగ నర్పించుచున్నాను. హృదయపూర్వకమగు ప్రేమతో మిత్రునకు మిత్రుడందించు కానుక యిది. ఈ కానుకను మీరు మనఃపూర్వకముగ స్వీకరించి నన్ను కృతార్థుని గావింతురుగాక!!

సౌమ్య-సంక్రాంతి

కల్లూరి చంద్రమౌళి

ఆనందలహరి

వైద్యరత్న శ్రీమాన్ రత్నాకరం శ్రీనివాసాచార్యులు

పండిత వంశంలో జన్మించాను. నిజమే. పాండిత్యం అబ్బలేదు. వైద్యవృత్తిచేపట్టాను. నిష్ణాతత్వం సిద్ధించలేదు. అయినా! అదృష్ట వంతుణ్ణో, సకలవిధ సద్గుణసంపత్తి - సౌజన్యం - సమగ్రంగాగల మిత్ర వర్గంనాకున్నది. ఆమాలలో నాయక మణివంటివారు-శ్రీ చంద్రమౌళిగారు. ఏపుణ్యక్షణాన వారి అనురాగపూర్ణమిత్రనేత్రం నావైపు వీక్షణప్రసారం గావించిందో! అది నా జీవితంలో సుముహూర్తమే. నిష్కలుషమైన మా స్నేహంలో - ఇచ్చి పుచ్చుకొనడం యెన్నడూ యెరుగము. ఏక భావనతో; ఏకకార్యవ్యగ్రులమై మీకంగా జీవించాము. జీవితంలో హఠాత్తుగా తొంగిచూచి మాయమయ్యే నిమ్నోన్నతడశలు మా యిరువురి మధ్య హెచ్చు లొచ్చు స్థితులను సృజింపలేక వోడి పోయాయి. ఆయన గ్రంథరచయిత. అది సైజమైన విషయమే. మరినేను కృతిస్వీకార భాగ్య శాలిని గావడం - అయితీరాల్సిరావడం వింతలలో వింత. నే నేనాడు కూడ వూహించని రీతిలో - అనకొనకుండావచ్చి తలుపు దట్టిన అదృష్టమిది.

ఆప్తమిత్రమా! నీ మధురమైత్రీ ధర్మానికి నేను ఋణపడ్డాను. కృతిస్వీకరణార్హత నాలో యే కోణంలోనుండి చూచినా కన్పించదే! నీ యీ ప్రయత్నమున కర్థమేమి? అయినా తగుదునమ్మా! యని నేను తయారౌతున్నాను. దీని కంతరార్థమేమి? రెంటికీ సమాధానమొక్కటే.

ప్రతికృతినీయగా కవితరాదు - భవత్కృతి ప్రస్తుతింప బం
డితుడనుగాను-నిత్యము పఠింతును త్వత్కృతులందు దోచు నీ
వితరణ, కార్యదక్షత, పవిత్రత, నీతినిజాయితీల సం
తతిగని లోభమండితిని, దత్తుగ కావ్యసుతన్ గ్రహించితిన్.



చల్లని మనస్సుగల తల్లి చంద్రమౌళి
కన్నివిధముల ననుకూలయైన వెలఁది
యెల్ల సుగుణమ్ములకు నిల్లు బుల్లెమాంబ
అతిథుల సతమ్ము నలరించు నన్నపూర్ణ.

ఇది నిజంగా సాహసమే. అయినా పూనుకొన్నాను. కారణం లేకపోలేదు.

దత్తతగా పుత్రిక గొను
సత్తువ యిసుమంతలేదు - సత్యసమీక్షల్
చిత్తమున హత్తగని నా
కిత్తుననన్ సఖుడు సాహసించితిఁ బెంచన్.

నే నందుకొంటున్న గ్రంథము సామాన్యమైన దేమికాదు. వేద స్వరూపవివరణ - తన్మహిమ - తనలో గర్భితంగావించుకొన్న గ్రంథము. వేదాలు చదవడం ముఖ్యంగాదు. నేడు వేదసారం ప్రజలలో బాగా వ్యాప్తంగావాలి.

వేదములువలె వేయుట
గా దందలి భావమెఱుగగావలె నటుపై
సోదరమానవసుగతికి
వైదిక విజ్ఞానమిట్లె వ్యయపరచవలెన్

ఆ దృష్టితో నిర్మితమైన యజ్ఞ్వల భావప్రవాహ మీ గ్రంథము. దీని పేరు యుగసమీక్షగా వుండడం మరొక విశేషము. కాని !

యుగముల సమీక్షయైనన్
సిగపూవ్వగ నిలువజాలు సిద్ధాంతముతో
నిగమ ప్రభావ పరివృత
మగు నూతన కావ్యమిద్ధియై యలరారున్.

ఇట్టిమహోజ్జ్వల కృతిని దత్తు బిడ్డగా స్వీకరించడం సుకృతఫలముగనే భావిస్తున్నాను.

మిత్రజ్ఞాన రసోద్భవ
పుత్రిక-సౌవర్ణ వర్ణ పూర్ణ - అదేమో !
చిత్రింపబడియె బిడ్డగ
చిత్రమ్ముగ నాకు స్నేహశీల ఫలముగన్.

అంతకన్న నేను మిన్నగ చెప్పకొనదగినది కనిపించడంలేదు. సకల బుధ లోక సంస్తుతి పాత్రమైన యీ దివ్యగ్రంథంతోపాటు నాకు గూడా ఒకప్రత్యేకత నామిత్రమహిమకతన ఘటింపబడింది. నాకృతజ్ఞత యెలా తెలుపగలనుఁ హృదయం ఆనందలహరిలో తేలియాడుతున్న యీ తరుణాన కృతిని స్వీకరిస్తూ-నామిత్రుని భావన భూతవర్తమాన భవిష్యత్తులలో-ఏకసూత్రసంబద్ధ సుగుణసౌరభ బంధురమైన మాలతీమాలగానే సర్వదా వుండాలని - భగవంతు డావిధంగా అనుగ్రహించాలని ఆకాంక్షిస్తున్నాను.

శుభం తథాస్తు !

మ న వి

యుగయుగములనుండి - భారతభూమికి చైతన్యమును, తేజస్సును, మహాత్ములే సమకూర్చుచున్నారు. పవిత్రమైన భావపుష్టిని-పటుతరమైన ఆరోగ్యసంపత్తిని అందించుచు - మహోన్నతములుగా వెలుగొందుచున్న ఆధ్యాత్మిక మూలబంధముల బలబరచిన మహనీయులువీరే. ఇహసుఖముల పరమార్థమును గమనింపగల ఆత్మశక్తిని సాధింపగల మనోబలమును విస్పష్టముగ వినిర్మలముగ వీరుజాతికి నిరూపింపజాలిరి. పవిత్రపథముల బయనింపుడని యీకర్మయోగులే ముక్తకంఠముతో తమసోదరులకు ప్రబోధించిరి.

పరధర్మము భయావహమైనదని యుద్ఘోషించి - స్వధర్మసాధనకు సర్వశక్తులు కేంద్రీకరించుకొని జతనము సాగింపవలయునని హెచ్చరించిరి. పరానుకరణమును గర్హించి అది భారతజాతిని రక్షింపజాలదని గట్టిగ నిరూపించిరి. పరంపరగావచ్చుచున్న యీ పావన భారత ధర్మసిద్ధాంతరేఖల వెలుగులో దారితప్పక పయనించి ఆధ్యాత్మికదివ్యశక్తితో దేశభక్తిని సమన్వయించి సత్యాహింసలను శ్రద్ధాభక్తులతో నుపాసించి పరతంత్ర భారతము నుద్ధరించి స్వరాజ్యమును స్థాపించిన పూజ్యబాపూజీ మనసనాతన సంస్కృతి స్రవంతికి ప్రతిబింబము. మనపురాతన యోగి చంద్రుల మహత్తర ధీశక్తికి ప్రత్యక్షసాక్ష్యము.

ప్రతి తరములో మహనీయు లుద్భవించి ప్రతియుగములో అవతార పురుషు లావిర్భవించి పెద్దయెత్తున జాతి భవిష్యమును బాగుపరచు నిమిత్తము మహోద్యమములు సాగించినప్పటికిని వారి కృషి లెస్సగా ఫలింపలేదు.

ఇది చక్రభ్రమణ వైఖరి. జాతిచరిత్రయు ఈలీలనే యనుకరించి సాగుచున్నది. ఇది సజీవముగా సాగెడి ప్రతి చరిత్రకును ఎదురగు పరీక్షు

క్లిష్టసమస్యా పరిష్కారమునకు జాతి చేసిన తపస్సులో- భౌతికశక్తులేవిధముగ నాధ్యాత్మికశక్తిచే పరాజితములైనవో విస్పష్టముగ వివరించు నిమిత్తమే ఈ 'యుగసమీక్ష' రచింపబడినది.

ప్రతిజాతియు వంశక్రమాగతముగ సంక్రమించిన యాచారపరంపరను, జీర్ణించుకొన్న యనుభవములను, జీవితాభివృద్ధి వికాసములకు ప్రాతిపదికగ నిడుకొనుట-అనుభవమునందున్న విషయమే. ఆ సత్సంప్రదాయములే జాతిప్రతిభను ప్రదీపింపజేసి ప్రగతిని ఘటించును. భరతవంశమునకు మూలపురుషుడు ఋషి. మనది ఆర్ష సంస్కృతి. అనాదికాలమునుండియు మహర్షిపుంగవుల మనోబలమునచే భారతజాతి శక్తిసంపన్నమై యలరారుచున్నది. ఈ జాతిని ఆర్ష వాణియే చైతన్యపూర్ణము గావించి సర్వదా రక్షించుచున్నది. ఆర్ష సంస్కృతికి భిన్నమైన ధోరణికి ఈ గడ్డమీద ఏనాడును విలువలేదు. భయంకర ప్రతీఘాతముల నెన్నింటినో అధిగమించి కాలప్రభావమునకు లొంగక అనంత తేజమును నలుదెసల వెల్లివిరియింపగల్గినది మహిమాన్వితమైన ఆర్ష సంస్కృతియే.

నేడు మనము యంత్రయుగమునందున్నాము. మనల నెన్నియో వ్యామోహము లుక్కిరిబిక్కిరిచేయుచున్నవి. పరపాలన మనకు విజాతీయ ప్రకృతిని ప్రసాదించిపోయినది. ఆ యూబినుండి బయటపడజాలక మనము కొట్టుమిట్టాడుచున్నాము. మిథ్యాగౌరవపు ముసుగులో మనము స్వధర్మమునకు దూరులమై నీతినియమల నేటగలిపి, జాతికి గౌరవాపాదకముగాని ప్రవృత్తిలో మునిగితిమి. నేడు సాంఘిక రాజకీయరంగములలో తాండవించుచున్న యీకుహనావ్యాపారము జాతి క్షేమమునకు చీడపురుగువంటిది. ధర్మమూర్తి - సత్యస్వరూపుడు - న్యాయశీలుడు - శాంతస్వభావుడు - బ్రహ్మతేజస్వి-అగుబుషి కన్నులెదుటచునంతవరకే దీనియాట. యుగయుగమున బహురూపముల ప్రత్యక్షమయ్యెడి యీ సత్య సనాతన భావసుమముల నొకమాలగా సంగ్రహించుటకు సాగించిన జతనమే 'యుగసమీక్ష'.

నేను రాజకీయములకు సుదూరముగనుండి భారతసంస్కృతి ప్రభలకు ప్రతిబింబములవదగు గ్రంథములను పఠించు తఱి నా హృదయమున గొన్ని యాలోచనలపుడపుడు మెఱిసినవి. ఆ మెఱిపులవెలుగులో పూర్వా పరసమన్వయసూత్రరేఖలు నాకు ప్రత్యక్షమైనవి. యుగధర్మచక్రపరిభ్రమణము నా కనులముందు భిన్నత్వమునందేకత్వమును సాక్షాత్కరింపజేసినది. చరమస్థాయికిజేరిన యీనాటి నైతికపతనమును తిలకించిన వారికి మరల నూతనయుగారంభవేళ సమీపించినదని తోచితీరును. ఆధ్యాత్మరహస్యమును బాగుగా నవగతము కావించుకొనవలెననెడి ప్రగాఢవాంఛ నాలో పెంపొందసాగినది. ఆ జిజ్ఞాసనన్నుపూర్తిగ వశపరచుకొనెననుట తథ్యము. ఒకటి రెండుమార్లు రాజకీయ ప్రలోభములుచేతులు సాచి నన్నాకర్షింపయత్నించినవి. అప్పటికే నా మనస్సు గట్టిపడుటచే నేనావంకకు ద్రొబ్బ జాలనయితిని. అదియునుగాక యేఅంతఃకరణశక్తియో నన్నీ బాటనుండి మరల్చుటకై యడ్డునిల్చినట్లు నేను భావించితిని. నా యూహలు ప్రాకసాగినవి. కాలమిట్లు గడచుచుండ నా భావములన్నింటిని కాగితముల కెక్కింప బూనితిని. క్రమక్రమముగా నది నా నిత్యకృత్యమాయెను.

ఆయుర్వేదవైద్యనిపుణులు - అమృతహస్తులు- పండితులు - నాకు ప్రాణమిత్రులు నగు శ్రీమాన్ రత్నాకరం శ్రీనివాసాచార్యులుగారి (సత్తెనపల్లి) ముందు నా భావములు వెల్లడించితిని. వా రా యంశములను శ్రద్ధగా విని నిశితముగ పరిశీలించి ఈ యంశముల కొక గ్రంథరూపము కొసగుడని నన్ను ప్రోత్సహించిరి. వెంటనే నేను కలము పట్టితిని. శ్రీమాన్ బృందావనం రంగాచార్యులుగారు నాచే రచింపబడిన ఆ యా భాగములను పరిశీలించి వానికి మెఱుగుపెట్టి యీ రచనకు మిగుల తోడ్పడిరి. మేము మువ్వురము పలుమారులు సమావేశమై కావించినకృషి యీ రూపమున ఫలించి నాకు మిక్కిలి సమ్మోదమును గూర్చినది. శ్రీమాన్ శ్రీనివాసాచార్యులుగారి ప్రేమపూర్వకమైన ప్రోత్సాహమునకు శ్రీమాన్ రంగాచార్యులుగారి సహకారమునకు నేనెంతయు కృతజ్ఞుడను.

ఈ గ్రంథమును పాఠకలోకమున కందజేయు సందర్భమున చంద్ర మౌళి నగర (గుంటూరు) గృహనిర్మాణ సహకార సంఘాధ్యక్షులు - ఆప్తమిత్రులు - శీలసంపన్నులు - కార్యశూరులు- నిరంతరము నా శ్రేయ మును గాంక్షించు మిత్రులు శ్రీ కొడాలి అప్పయ్యచౌదరిగారొసంగిన చేయూత మఱువరానిది.

ఈ రచనయందలి విశేషములను వివరించుచు కూలంకషముగు పీఠిక వ్రాసిన పూజ్యులు శ్రీశ్రీశ్రీ కేశవతీర్థయతీంద్రులకు సర్వదా కృతజ్ఞుడను. యుగసమీక్షలోగల గమనార్హావిషయములను ప్రస్తావించుచు వారి వారి యమూల్యాభిప్రాయములను సకాలములో నందించిన శ్రీయుతులు శ్రీ మత్ తిరమల గుడిమెళ్ళ వరదాచార్యులు; పండిత గోపదేవ్ శాస్త్రి; జటావల్లభుల పురషోత్తం; కొల్లా సుబ్బారావు; నీలంరాజు వెంకట శేషయ్య; పెస్మెత్స సత్యనారాయణరాజు; వెలువోలు సీతారామయ్య; జంధ్యాల పాపయ్యశాస్త్రి; తుమ్మల సీతారామమూర్తి; కొండూరు వీర రాఘవాచార్యులుగారల అపారప్రేమకు ధన్యవాదములను సమర్పించు చున్నాను.

నా యీ గ్రంథపు సాధారణప్రతిని ముద్రణానుకూలముగ వ్రాసి యిచ్చిన శ్రీమాన్ ధనకుధరం వరదాచార్యులుగారికి ధన్యవాదములు. ఈ గ్రంథము నచ్చొత్తించు సందర్భమున ముద్రణ దోషములను సవరింప సర్వవిధముల సహకరించిన పండిత ముక్కామల రాఘవయ్యగారికి, ఆప్తమిత్రులు వెలువోలు సీతారామయ్యగారికి కృతజ్ఞతను తెల్పుచున్నాను. పాఠకులీ గ్రంథమును పరిశీలించి యిందలి మంచిని గుర్తించి, ఆదరించి, అనుష్ఠించుచో నా కృషి సఫలమైనట్లు భావింతును.

సర్వాంగసుందరముగ సకాలములో గ్రంథమును ముద్రించి యిచ్చిన భారతీప్రెస్ (తెనాలి) వారి శ్రద్ధయు నిచ్చట ప్రశంసనీయము.

సౌమ్య-సంక్రాంతి
14—1—70

రచయిత

ఓమ్

యుగసవిూక్ష

ప్రస్తావన

నమోస్త్వనన్తాయ సహస్రమూర్తయే
సహస్రపాదాక్షి శిరోరుబాహవే
సహస్రనామ్నే పురుషాయశాశ్వతే
సహస్రకోటీయుగధారిణే నమః

బ్రహ్మవర్తము

భగవానుని చిదచిద్విలాసపరంపరను వివరింపఁబూనుట మానవశక్తి కతీతమైన యంశము. ఆ పరమేశ్వరుఁడు-సర్వజ్ఞుఁడు; సర్వశక్తిమంతుడు; సర్వవ్యాపకుఁడు; అఖండసచ్చిదానందస్వరూపుఁడు; సృష్టికర్త; తన దివ్యసంకల్పమాత్రమునఁనే సకల లోకములను సృజింపఁ గల్గిన పరబ్రహ్మ.

సృష్టియనఁగా – భిన్నత్వమున కాలవాలమైన వైచిత్ర్యము. నానాత్వమునందును, తదతీతముగను భగవంతుఁడొక జ్యోతిగ దివ్యుఁడై ప్రకాశించుచునే యుండును. జ్ఞానసంపన్నులీ సత్యము నేనాఁడో గుర్తింపఁ గలిగిరి. గుర్తించుటే కాదు – వేనోళ్ళ చాటి, విశ్వస్వరూపుని మహామహిమలను సర్వజన గ్రాహ్యములగునట్లు వివరించుటయు గావించిరి.

మనము భగవంతుని సంతానము. మనలో దివ్యత్వము సహజముగనే పరిపూర్ణముగనున్నది. ప్రతిజీవియు-పరమేశ్వరుని యంశమగుటచే, దివ్యత్వమును తనలో గర్భితమొనర్చుకొని యుండుటను మాట-వాదములకు తావులేనిది.

"బాహ్యాంతర ప్రకృతినంతయు నిరోధించి, యంతర్గతమగు నీ దివ్యత్వమును వ్యక్తముచేయుటయే జీవితమునకు పరమావధి. ఇందులకై కర్మ-ఉపాసన(భక్తి)-యోగ-జ్ఞానమార్గములలో నొక్కటిగాని, కొన్నిటినిగాని, యన్నింటినిగాని యవలంబించి ముక్తులరగుఁడు. మతమున కంతకు నిదియే సారాంశము. వాదములు, సిద్ధాంతములు, కర్మకలాపములు, గ్రంథములు, దేవాలయములు, విధులు మొదలైనవన్నియు నప్రధానవిషయములు."

—(వివేకానందస్వామి)

ఇట్టి యోగిచంద్రుల నుడులవలన, మనము దివ్యుల మనియు - దివ్యశక్తి మనలో నణగి మణగి యున్నదనియు గ్రహింపవచ్చును. దివ్యులమైన మనము నివసించు భూభాగమును దివ్యత్వస్ఫోరకమగు భగవన్నామముతో - 'బ్రహ్మావర్తము' అని పిలుచుకొంటిమి.

భగవంతుఁడు తన జ్ఞానమును పవిత్రాత్ములగు నలుగురు మహర్షులలో-ఋగ్యజుస్సామాథర్వణములను-నాలుగు వేదముల నావిష్కరింపఁజేసెను. భగవత్సంబంధమైన అట్టి వేద విజ్ఞానమును మనము నిత్యసత్యముగ సంభావించుచుంటిమి. 'విద్' అనఁగా-'ఎఱుక' సర్వమునెఱుగఁజేయునది గావున, భగవద్విజ్ఞానమును 'వేదము' అని యంటిమి.

వేదము లపౌరుషేయములు. అవి భగవంతుని విజ్ఞానము కావున, వేద సముదాయమును పరమప్రమాణముగ నామోదించితిమి. వేదధర్మమే మనకు సనాతన ధర్మము. 'సత్యంవద' 'ధర్మంచర' అనునవి పావనవేదనినాదములు. సత్యప్రవచనమును, ధర్మానుష్ఠానమును జీవితధ్యేయములుగ సంభావించితిమి. మనుగడలెొక్క- పరమార్థసాధనకు చరమ లక్ష్యములుగ నిడుకొంటిమి. విశ్వశ్రేయంకరములని విశ్వసించి, యాచరణమునం దిడుకొని, యనుభూతులను బడయు కృషికి గడంగితిమి.

జీవితలీలలను మంగళప్రద మొనర్చుకొనుటకు వేద ధర్మములు మనకుదివ్యజ్యోతులవలె నుపకరించును. స్వపర తారతమ్యముల సంఘర్షణకు తావులేనివిధముగ నిస్తులములైన నిర్ణయములను వేదములు నిష్కర్షగ నొనర్చినవి. భగవంతుని సంతానమగు ప్రజాకోటియంతయు-నిరంతర సంతోషపరంపరల దేలుటయే భగవంతుని యభిమతముగదా!

సర్వమానవ సంక్షేమమును వేదములు లక్షించు చుండును. మానవుని యంతరాంతరములలో గుప్తముగ దాగి యున్న దానవత్వమును దగ్ధమొనర్చుటకు దారిజూపును. పశుత్వమును సమూలముగ నిర్మూలించుటకు ప్రతిపదికల దెలుపును. మానవత్వమును పెంపొందించి, మంజులము గావించుటకు మంచిమార్గములను సూచించును. దేవత్వము వంకకు మానవుడు పురోగమించెడి దీక్షను రేకెత్తించును.

నరునినుండి నారాయణుఁ డావిర్భవించుటకు నాందిగీతములు నాలాపించును.

మానవుఁడు మాధవుఁడగుటయే వేదమంత్రముల సందేశము. ప్రతిమనుజుఁడు పరబ్రహ్మస్వరూపుఁడై, దివ్యత్వమున తేజరిల్లుటే వేదముల యాంతర్యము. తాదృశములైన పవిత్రమహిమలకు నిలయములైన వేదములను మానవ జీవితపు విలువలను సరిదిద్ది, వెలుగొందఁజేసెడి జీవనప్రణాళికలనుగ భావింపవచ్చును. అట్టి వేదసరస్వతీ సమారాధనకు సంసిద్ధమైన బ్రహ్మావర్తప్రజానీకము – నిత్యసుఖపరతంత్రమై, నిత్యానందమై, నిరుపమానమై, పరమేశ్వరచరణ సరసీరుహ పరాయణమై, దివ్యము కాగలుగుటలో నతిశయోక్తి యిసు మంతయు గన్పట్టదు. అట్టి పావన సనాతన వైదికధర్మము మనసొత్తు. మనమెల్లరము సనాతనధర్మపరులము. మనదేశము దివ్యత్వమునకు మూర్తికనుక దేశమును మనము మాతృదేవిగ భావించి, భక్తిప్రపత్తులతో నారాధించుచుందుము. సనాతన ధర్మబద్ధులమై, మనదేశమును మాతృదేవివలె నారాధించు చున్న మనము – వేదవిజ్ఞాన సంరక్షితులమైన మనము అమృత పుత్రులము.

"శ్రుణ్వం తు విశ్వే అమృతస్యపుత్రాఃa
అయే ధామాని దివ్యాని తస్థుఃa
వేదాహమేతం పురుషం మహాంతం
ఆదిత్యవర్ణం తమసఃa పరస్తాత్
నాన్యఃపన్థా విద్యతేఽయనాయ."(శ్వేతాశ్వతోపనిషత్తు: 3-8)

అను ఉపనిషదాజ్ఞ మీ సత్యమునే నిరూపించుచున్నది. సనాతనధర్మము నిత్యసత్యమైనది. అవతారములమీదనో, దేవతలమీదనో, వ్యక్తులమీదనో యాధారపడియుండు ధర్మముకాదిది. సిద్ధాంతరాద్ధాంతములకు, వాదోపవాదములకు చర్చావేదికగనిలువదు. సర్వశాస్త్రములు, సర్వవిజ్ఞానము వేదములలోబీజరూపమునందిమిడియే యున్నవి. అట్టి యీ సనాతనధర్మము-అవాఙ్మానసగోచరము. భగవంతుని ప్రత్యక్షముగ గాంచుచు, నిత్యానందమున నోలలాడుటయే ధ్యేయముగాగల మనము - మనలో నణగియున్న దివ్యత్వమును ఆవిష్కరించుకొనుటకు, జీవితమును సఫలమొనర్చుకొనుటకు సనాతనధర్మమునకన్న మిన్నయగు శరణ్యము మనకు వేరొకటిలేదు. దేవాదిదేవుని బిడ్డలమై, దివ్యదేశవాసులమై, దివ్యజ్ఞానసాధకులమగు మనము నిజముగ నమృతపుత్రులమే. కావుననే మనము దేశమును మాతృదేవిగ నారాధించుచున్నాము.

బ్రహ్మావర్తము మన మాతృభూమి. ఇందలి ప్రతియణువు పరమపావనము. ఇందు ప్రతిధ్వనించెడి దివ్యవాణి-నరుల నమములుగ పరివర్తనమొందింపగల్గినట్టిది. ఇందలి హిమాలయోన్నత శిఖరములు - మానవుఁడధిష్ఠింప వలసిన పావన బ్రహ్మపదమునకు సూచకము లనిపించును. ఈ గడ్డపై పరుగులెత్తెడి గంగా యమునా సరస్వతీ జలబిందుసందోహము-నిఖిల పాపధ్వంసకమై, ప్రజల పవిత్రులను గావించుచుండును. అగాధజలధులు సనాతనధర్మపులోతులకు చక్కని

యుపమానమునై- తరించి, దివ్యత్వము నధిగమించు పథము లను వెదకుకొనుమని మానవుని సవాలుచేయుచుండును. మొలకలెత్తుచున్న బీజములు, మొగ్గదొడగుచున్న కొమ్మలు. కుసుమించుచున్న రెమ్మలు, ఫలించుచున్న వృక్షములు, పండి రాలుచున్న పత్రములు, మరల పకపకలాడుచు క్రొత్తరూప మున చిత్తములపై సంతోషమును హత్తుకొనజేయుచున్న లేజివురాకులు, వార్ధక్యమున నూడలుబారి, పథిక లోకశ్రమ నపనయించుచున్న వటవృక్షములు, క్షీరధారల బితుకు ధేను సంతతులు, కలకలధ్వను లొనర్చు పక్షిగణములు, పండి రొరిగి - సకలప్రజానళిగుండెలలో సంతోషమును నిండింప జేయు పంటచేలు, వేయేల? సర్వమొక మధురమోహన దృశ్యమై కన్పించును. భగవంతుని చిద్విలాసచిహ్నముగ దోచును. పరమేశ్వరాంశతో తృప్తిపఱచెడి దేశమును మాతృ దేవతవలె ప్రూజించుకొనెడి-సేవించుకొనెడి సంప్రదాయమును సనాతన ధర్మానురక్తమైన బ్రహ్మావర్తప్రజానీకము భక్తితో పాటించినది. కావుననే మనకు దేశము మాతృదేవతయైనది.

మనము దివ్యాంశసంభూతులమైన విధముననే, మనము దివ్యదేశవాసులమైన రీతిగనే, మనము దివ్యజ్ఞానమునకు వార సులమైన పగిదిగనే, మనము దివ్యులమైన చందముగనే, మన భాషయు-దేవభాషయైనది. మనవిజ్ఞానమంతయు దేవభాషలో నుండుటయు - దేవనాగరలిపిలో వ్రాయఁబడుటయు గమ నార్హములైన విషయములు. విశేషించి చెప్పనేల? సర్వతో

ముఖముగ తొణికిసలాడుచున్న దివ్యత్వమే యుగయుగముల నుండియు మనలను తీర్చిదిద్దుచువచ్చుచున్నది. చిత్తశుద్ధితో - నిండుభక్తితో - పూర్ణవిశ్వాసముతో - పవిత్రహృదయముతో మనమీ దివ్యత్వమును శిరసావహించి, గమనమును సాగించుచు వచ్చితిమి. భగవంతుని బిడ్డలమగు మనలో మనకు వైషమ్యములులేవు. సోదరభావముతో - సమదృష్టితో - పరస్పరానురాగభావనతో - సహాయసఖ్యములతో నొకరినొకరము ప్రేమించుకొనుచు, శాంతిమయ సుఖజీవితమును సర్వదా నిర్వహించుచుండుటయే మన విధి.

"సంగచ్ఛధ్వమ్ సంవదధ్వమ్ సంవోమనాంసి జానతామ్
దేవాభాగం యథాపూర్వేసంజానానా ఉపాసతే
సమానోమంత్ర స్సమితిస్సమానీ
సమానం మనః సహచిత్తమేషామ్
సమానం మంత్రమభిమంత్రయేవః
సమానేన వో హవిషా జుహోమి
సమానీవ ఆకూతిః సమానాహృదయానివః
సమానం అస్తు మే మనో యథావః సుసహాసతి."

(ఋగ్వేదము : 10-191-2)

అనెడివేదసూక్తి మన మనోమందిరములలో నిరంతరము వెలుగొందుగాక! పరమేశ్వర స్వరూపమగు మన దేశమాతను కర్మభూమియనియు-పుణ్యభూమియనియు-రత్నగర్భయనియు-అన్నపూర్ణయనియు-దివ్యమాతయనియు- పలు నామముల మనము కీర్తించుకొనుచున్నాము. భగవన్నామము

తోడనే పిలుచుకొనుచున్నాము. భౌగోళికముగగాని, ప్రాంతీయముగ గాని దేశమును సరిహద్దులుగీచుకొని నివసించెడి తలంపు మనకులేదు. భగవంతుని పరిపూర్ణస్వరూపసందర్శనానందమే మనకు వాంఛనీయమైనట్లు, సర్వాంగసుందరమగు సమస్తదేశస్వరూప సమష్టిసౌభాగ్యమే మనకు కాంక్షణీయము.

మనదేశమాత దివ్యశక్తిప్రదీప్తిని. సర్వార్థఫలదాయిని. సకల పుత్రీపుత్రమానస సంతోషసంధాయిని. దివ్యజనని. మనయాత్మ. కావుననే – **'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'** యనుకొంటిమి. **'మాతృదేవోభవ'** యని యారాధించితిమి. ఆమెను తాదృశ పవిత్రభావముతో సర్వదా సంసేవించెడి యాత్మబలము మనకు లభ్యమగుగాక !

"వేదాహమేతం పురుషం మహాంతం
ఆదిత్యవర్ణం తమసఃపరస్తాత్."

అని పురుషసూక్తములో విరాట్పురుషుని వర్ణన మున్నట్లే – మేదినీసూక్తములో–

"మేదినీదేవీ వసుంధరాస్యాద్వసుధాదేవీ వాసవీ
బ్రహ్మవర్చసః పితృణాగుశ్రోత్రంచక్షుర్మనః
దేవీహిరణ్యగర్భిణీదేవీప్రసోదరీ సదనేసత్యాయనే సీద
సముద్రవతీ సావిత్రీ అకోదేవీ మహ్యంగీ మహోదరణీమహోధ్యతిష్ఠతు."

అని దేశ మాతృవర్ణనయు రమణీయముగనున్నది. ఊహ కతీతముగనున్న యీ దివ్యస్వరూపమును భావించి, సంభావించుటయే మనకు శ్రేయస్కరము.

"బ్రాహ్మణోఽస్యముఖమాసీత్
బాహూరాజన్యఃకృతః
ఊరూతదస్య యద్వైశ్యః
పద్భ్యాగ్ం శూద్రోఅజాయత
చంద్రమా మనసోజాతః
చక్షోస్సూర్యో అజాయత."

అని పురుషసూక్తమున విరాట్పురుషుఁడు వర్ణింపఁబడినాఁడు. ఇందు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకుగల ప్రత్యేక స్థానములెట్లు నిరూపింపఁబడినవో-వానివానికిఁగల ప్రాధాన్య మెట్లు వ్యక్తీకరింపబడినదో-అట్లే దేశమునందలి ప్రతివిభాగమునకుగూడ ప్రాధాన్యము ప్రత్యేకప్రత్యేకముగనే వివరింపఁబడినది. వానివాని సమష్టి స్వరూపమే దేశమైనపుడు, పరిపూర్ణ భగవదాకారమైనపుడు, వానియందలి హెచ్చులొచ్చులను పరిగణింపఁబూనుట - వివేకవంతమైన కార్యము కాఁజాలదు. కాని, ప్రత్యేక ప్రత్యేక కృత్యముల నిర్వహణకు పాదాద్యవయవముల విభాగమనసరమైనట్లు, పాలనాసౌకర్యమునకు- వ్యవహారనిర్వహణకు ప్రత్యేకప్రత్యేక విభాగముల యవసరమేర్పడినది. ఈ విభాగము సమష్టిభావనకు, సౌజన్యదృష్టికి, సమరసత్వమునకు, పరస్పరప్రేమభావానుభూతులకు బాధకము కాఁగూడదు. సకలజనసంశ్రేయఃఫలప్రాప్తికి సాధకముగ రాణింపవలయును. శరీరావయవములలో నేరొకక్కదానికేని యాధిక్యము లేనట్లు- దేశాంతర్భాగములందుగూడ నేరొకక్కదానికేని ప్రత్యేకాధిక్యము లేదు. సమష్టిక్షేమమును

సర్వదా వాంఛించెడి మన సనాతనధర్మ శంఖనినాదము ప్రతిధ్వనించెడి పావన సందేశమిదియే. దేశము నఖండ మాతృస్వరూపిణిగ నారాధించుమని సంబోధించిన హితోక్తులయందలి యంతరార్థమిదియే. ఇట్టి పూర్ణభావనతో మాతృదేశ సమారాధన, పరమేశ్వరపూజాకలాపముగ భావించి సాగించిన మనవారు-జీవితవిధాన నిర్వహణ సౌకర్యముకొఱకు మనుగడ లీలను నాలుగు తెఱగుల విభజించిరి. వీనినే యాశ్రమము లందురు.

బ్రహ్మచర్య, గృహస్థ వానప్రస్థ సన్న్యాసము లనెడి నాలుగు ఆశ్రమములలో - గృహస్థాశ్రమము తదితరాశ్రమముల కన్నింటికిని పోషకస్థానమై, రెండొక ప్రత్యేక విశిష్టతను గడింప గలిగినది. గృహస్థాశ్రమమందున్నవారును తదితరాశ్రమవాసులవలె భగవదనుగ్రహము నక్లేశముగనే సాధింపఁగలుగుదురు. నిజమాలోచించినచో - వీరికే మోక్షమతిసులభముగ లభ్యపడగలదేమో! పేరున కీయాశ్రమములు నాలుగయినను, ధ్యేయము మాత్రము వీనికన్నింటి కొక్కటియే. భిన్నదృక్పథగాములగు ప్రజల నడవడికల ననుసరించి, సాధనరంగమునం దేర్పడిన విధాన విశేషములే యీ నాలుగాశ్రమములు. అవసరముకొలది-యీ విభాగ మాశ్రమములవఱకే పరిమితమై యుండలేదు. సర్వజన సామాన్య వ్యవహారసరళి నిర్దుష్టముగ, నిరుపద్రవముగ గొనసాగుటకై, మానవాళిలో సైతమేర్పఱచుకొనవలసిన యవసర మత్యున్నతమైనది.

సనాతనధర్మానుసారముగ జీవయాత్ర నడుపుకొన
నుద్యుక్తులమైన మనము విధి నియమాదుల ననురక్తితో
బాటించుచు, విధ్యుక్తధర్మములను నిర్వహించుటకై, విశాల
దృక్పథముతో వర్ణవ్యవస్థ నేర్పఱచుకొనినాము. వర్ణాశ్రమ
వ్యవహారము లవిభక్తాంశములు. వర్ణవైషమ్యముల కతీతముగ
వ్యవహరించుటే మన సుదృఢాశయము. విరాట్పురుషుని
యవయవములతో నుపమింపఁబడిన యీ వర్ణములు – పర
స్పరాసహన భావపరిపూర్ణములుగాక, చెలిమి కలిమితో ప్రవ
ర్తించుట నలవరచుకొనినవి. ఈ విభాగము కేవలము నిమిత్త
మాత్రమనుకొంటిమి. మహాజనమండలి నిత్యజీవిత సుగమ
పద్ధతి నుద్దేశించిన యీ వర్ణవ్యవస్థావిధానము – తొలుత
నుండియు సర్వజనాదరణపాత్రమై, సాంఘికసంక్షేమమునే
సంఘుంటిచుచు వచ్చినది.

"చాతుర్వర్ణ్యం మయా సృష్టం
గుణకర్మవిభాగశః."

అనెడి గీతాచార్యుల వాక్కులలో వర్ణములు గుణకర్మలపై
నాధారపడి విభజింపఁబడినట్లు సుస్పష్టమగుచుండ – జన్మము
చేతనే వర్ణము లేర్పడినవనియు – మానవకోటిలో తారతమ్య
పరిగణనకొఱకవి కల్పింపబడినట్లు సాగెడి ప్రచారమేకాలమం
దైనను విసర్జనీయమే కాఁగలదు. భిన్నపథములలో గమనము
సాగించిన ముముక్షువుల దృక్పథముల ననుసరించి యాశ్రమము

లేర్పడినట్లు - స్వగుణసంపత్తిని, స్వకర్మ ప్రవృత్తినిబట్టి, మానవులమధ్య వర్ణము లేర్పడెననుట నిర్వివాదాంశము.

ఈ విధముగ బ్రహ్మావర్తమున ప్రజాజీవిత వ్యవహార వైఖరికి వర్ణాశ్రమవ్యవస్థ మూలస్తంభమై నిలిచినది. ఈరీతియే ప్రజానీక భావపరంపరల నవమ సంఘర్షణాలను చెలరేగ నీయక, ప్రశాంత పరిస్థితుల నెప్పటికప్పుడుప్పతిల్ల జేయుచు వచ్చినది. ఇది మనసమీచీన సాంప్రదాయిక స్వచ్ఛంద వర్తనకు ప్రతీకగ నిలిచి, పరమార్థమును సాధింప నేర్చినది.

ఆశ్రమచతుష్టయమున మన పెద్దలన్వేషించిన బ్రహ్మ పదార్థానుభూతి నిరుపమానమైనది. అట్లు, చాతుర్వర్ణ్య సంబద్ధమైన మన జీవితప్రగతియు శ్రేయోదాయకమైనదే. సనాతన ధర్మపరిరక్షణకు సాధనభూతమైనట్టిదే. వీనితో మన వారు సాధింపనెంచిన పవిత్రాశయ పరంపరలను గమనించి నపుడు - మనము విస్మితులముగాక తప్పదు.

ధర్మార్థకామమోక్షములనెడి చతుర్విధపురుషార్థముల సాధనకే బ్రహ్మావర్తప్రజల తహతహ. తత్సిద్ధివలన గలిగెడి పరమానందమే వారి యుద్దిష్టఫలము. వేదములు నాలుగా ? వర్ణములు నాలుగా ? ఆశ్రమములు నాలుగా ? జీవితపర మార్థములుగ భావించి మానవుడు సాధింపవలసిన పురుషా ర్థములు నాలుగా? ఏమి యీ క్రమపరంపర ! ఇందంతరార్థ మేదియో దివ్యత్వమును దీపింపజేయుచున్నది. ఇట్లుంతయు దివ్య

మయమైన వ్యవహారమునకు చెందియుండునట్లు మన సంప్ర
దాయము తీర్చిదిద్దబడుట మన సుకృతవిశేషము.

ఒక భూభాగముగనో-పదార్థముగనో-ప్రదేశముగనో
భావింపక, జన్మభూమిని మాతృదేవతగ సంభావించెడి పవిత్ర
నిర్ణయమునకు కట్టుబడిన మనము తదితరాంశములలో నైత
మేల వెనుకబడియుందుము? జీవితమునకు పరమాత్మ చింత
నయే లక్ష్యముగ నిడికొంటిమి. మన యాత్మలను పరిశుద్ధ
ములు గావించుకొని, పరంజ్యోతిస్వరూపుని సందర్శనార్థము
పరిశ్రమించుటే మనుగడకు ధ్యేయమని యెంచితిమి. భగవ
ద్దత్తమగు వేదవిజ్ఞానకాంతులతో-మన భావనల నలముకొని
యున్న తమస్సును నిర్మూలించి, తేజస్సును సాధింపనుంకించి
తిమి. మనలో నంతర్గర్భితమైయున్న దివ్యత్వ చిహ్నముల
నావిష్కరింపజేసికొని, దేవదేవుని యనుగ్రహమునకు పాత్రుల
మగుటయే కర్తవ్యమని గుర్తించితిమి. ఇందులకు దేవభాషను-
దేవనాగరలిపిని సాధనములుగ నిడుకొంటిమి. ఇట్టి దివ్య పథ
ముల తన సంతానము పయనింపవలెననియు, తరింపవలెననియు
సంకల్పించిన సర్వేశ్వరుని యపార కరుణావిశేషము నెట్లు
స్తుతించిన జెల్లునో!

అనంతకాలము నుండియు దిగ్దిగంతములందీ దివ్య పురుష
స్తోత్రపరంపరలు ప్రతిధ్వనించుచునేయున్నవి. అందుకొఅకై,
మనమేర్పఱచుకొనిన వివిధ సౌకర్యసాధనాదులే వర్ణాశ్రమా
దులు; చతుర్విధపురుషార్థవిశేషములు. సనాతనధర్మ నిర్వ

హీనమున కీ సాధనసంపత్తి బలవత్తర సహకారము నందించు ననిమనసార విశ్వసించిన మనము - తదనుష్ఠానపరులమై, తదేక దీక్షితులమై చిత్తశుద్ధితో వ్యవహరించుచుంటిమి. వాని సక్రమ నిర్వహణమే జీవితధర్మ నిర్వహణముగ దలంచెడి యాత్మస్థైర్యమును పెద్దలు మన కందించుచు వచ్చిరి. యతి చంద్రు లుద్ఘోషించిరి. సిద్ధపురుషులు సాక్షీభూతులై నిల్చి, యనుక్షణము హెచ్చరికలు గావించిరి. ధర్మపథమునుండి మనలను జారిపోనీయక, వేదవాణి నిరంతరము మనలను సంరక్షించుచు వచ్చినది. కన్నులుండి కాంచగలిగిన, కాదను టకు వీలులేని పరమ సత్యమిది.

సర్వవేళల జనగణముల సంరక్షించెడి వేదసరస్వతీ సమారాధనకు సర్వులును సమానార్హులే. ఎల్ల వర్ణముల వారికి గూడ నాచల్లనితల్లి నర్చించెడి సమానాధికారము గలదనుట కో విప్రతిపత్తిలేదు. అందరము భగవంతుని బిడ్డల మనుకొంటిమి. అయినపుడు సర్వజనసముద్ధరణకు వేదవిజ్ఞాన సంపత్తి వినియోగపడవలయునుగదా! కొందఱు కామాత డెందముల దెఱచిమమతలందించి, మఱికొందఱి కామె సందర్శన సంసేవన భాగ్యములను బంచకుండిన - సర్వమానవ పంక్తేమమెట్లు సాధ్యమగును? భగవంతుడు సకలప్రజలకు సమారాధనీయుడైన పగిది - పరంధాముని జ్ఞానమునైతము తారతమ్యరహితముగ నెల్లరకు నధ్యయనయోగ్యమే కాం గలదు. విశాల సమరసదృష్టితో దిలకించిన విదితపడు విషయ

మియ్యదియే. మిగిలినవన్నియు వితండవాదములే కాగలవు. తాదృశ సకలలోక సముద్ధరణ దక్షమగు వేదము - మంత్రగణ పరివృతమైవిరాజిల్లుచున్నది. ఆ పవిత్రమంత్రములను బాహ్య మునకు ప్రకటనమొనర్ప సాధనమైనదే దేవభాష. ఆ భావ ప్రవాహము-దేవనాగరిలిపియందే యక్షరాత్మకమై వెలయు చున్నది. విచిత్రమేమన, భగవంతునివలెనే, భగవద్విజ్ఞానము వలెనే యీ భాషయు, లిపియు సర్వకాలములలో నెట్టి మార్పులకు గురిగాక, నిత్య నూతనకాంతులతో నిలిచి యున్నవి. కాలప్రవాహపుటురవడి కవి కగ్గక, కాంతి తగ్గక, నిగ్గు లీనుచున్నవి. ఇదియే సర్వేశ్వరుని లీలావిలాసవిశేషము. ఇట్టి మహిమాన్వితమైన విజ్ఞాన ధనమునకును - భాషా లిపులవైభవమునకును మనము వారసులమై, ధన్యులమగు చున్నాము. పావనులముగ, పరివర్తనమును బడయుచున్నాము.

విశ్వమునం గల సర్వమానవాళికిని భగవద్విజ్ఞానము సమష్టి సంపదయే కాగలదు. కాని, దానిని విశ్వసించి - ఆమోదించి అనుభూతికి దెచ్చుకొనువారికే తత్ఫలప్రాప్తి. ఈ నైష్ఠికదృష్టిలేని వారికి-వేదవిజ్ఞానము సకల శ్రేయముల నెట్లు సంఘటింపగలదు? మన మహోదృష్టముకతన - మనము మాత్రమే నాటినుండి నేటినరకును వేదధర్మానుష్ఠాతలమై, వైదికసంప్రదాయములనే పరమప్రమాణములుగ భావించి, శిరసావహించుచున్నాము. దివ్యావేశపూర్ణహృదయులమై,

వేదశారదా కృపాబలమహామహిమలను మధురకంఠములతో
గానమొనర్చుచున్నాము.

వేద నిర్ణయముల కనుగుణముగ మన జీవితములను
మలచుకొని, దివ్యత్వము సముద్దీప్తమగునటుల దిద్దుకొంటిమి.
మన మాతృభూమికిగల ప్రత్యేకవిశిష్టత ఇదియే. 'త్రికరణ
శుద్ధిగ విశ్వసించిన విధానమును సకలవేళల నొడలదాచ్చి
సంచరింపవలయును. స్వార్థాసూయల కతీతమగు స్థాయిలో
సంకల్పములు సఫలము లగుటకు సముచిత కృషి సాగింప
వలయును. సత్యధర్మబద్ధముగ జతనము కొనసాగింపఁబడి
నచో నయ్యది రతనమై భాసింపఁగలదు. వైదికధర్మపరత -
యేనాటికైన మానవులలో దివ్యత్వమును నెలకొల్పగల
సాధనము. విశ్వప్రజల యూహల కన్నిటికన్న మిన్నగ -
భిన్నముగ - మనవారి యాలోచనలిట్లు సాగినవి. నిశ్చయ
ముగనిట్టి యద్భుతాశయవాహినియందే మనవారోలలాడిరి.
నిస్సందేహముగ నీ సంప్రదాయమునే మనవారభినందించి
యాచరించిరి. ఇదియే మనకు లోకోన్నత స్థితిని సంప్రాప్తింపఁ
జేసిన విధానము. ఇదియే విస్మయముగొలుపు తెఱగున విశ్వ
విశ్వాంతరాళములకు మనము వినిపించిన విశిష్టసందేశము.

కాలప్రభావమనంతమైనది. సృష్ట్యాదినుండి పరిగణన
కొఱకై, కాలమునకు కొలబద్దలను మన మేర్పఱచుకొని
నాము. బలీయమై, పావనమై ప్రకాశించెడి సంస్కృతి
యొక్క గట్లను మాత్రము కాలప్రవాహమేనాడును శిథిలము

గావింపఁజాలకపోయినది. ఆ యురవడికి దట్టుకొనలేక, రొయిరిగి పడిన యొస్కులెన్నియో యుండవచ్చును; కొట్టుకొనిపోయిన గట్టులుండవచ్చును. తాదృశస్థితి-వాని వాని బలహీనతలకు ప్రబల సాక్ష్యమై, చరిత్రలో నిల్చుట మన మెఱుగుదుము. అతి ప్రాచీనకాలపు కొనలకు మన జ్ఞానక్షేత్రమును ప్రసరింపఁ జేసి తిలకించినచో- కాలపురుషుని కరాళకర్కశచ్ఛాయలకు కగ్గక, కాంతితగ్గక నిగ్గులీనుచు, నిరుపమానగిరి శిఖరముపగిది శిరమెత్తి నిలిచియున్న మన వైదిక సంస్కృతీగరిమ-మనకు దర్శనమిచ్చును.

కోటిసూర్యప్రభాభాసమానముగ నిత్య నవీనకాంతులు వెలయించెడి మన భారతీయ సాంస్కృతిక లక్ష్మీవైభవాభ్యుదయరహస్యము – భావనల కందనిది; పరిగణనకుతేలనిది. కారణము వేరొక్కటి కాదు. మన సంస్కృతికి సంబంధించిన పునాదు లట్టివి. వానిని ద్రక్షిష్ఠములు గావింప నహరహము శ్రమించినవారి మనోబలమట్టిది. పరమేశ్వర దివ్యదయారస ప్లావితములై, భగవదనుగ్రహ పరిరక్షితములై, సర్వేశ్వర ముఖోద్గత దివ్యవాణీసంరంభసముపలాలితములైన భారతీయ సాంస్కృతిక భవనపు పునాదులు యుగములు గడచినను, తరములుదాటినను చెక్కుచెదరక, మొక్కవోవక దిక్కులన్నింట దీప్తులను విరజిమ్ముటలో వింతయేమున్నది ?

కాలాతీత మహత్తర దివ్యశక్తిపరివర్ధిత ప్రభావనిలయములైన భారతీయ సదాచార సంస్కృతులు – తృణతృణ

జాజ్వల్యమాన సత్క్రాంతిపూర్ణములై, నేటికిని మనల ననురక్తితో ప్రగతిపథమున నడిపించి, రక్షించుచున్నవి. రేపుగూడ నడిపింపఁగలవు; రక్షింపఁగలవు. కాని యీ కాలమహిమ వర్ణనాతీత మైనదగుటచే, నే యే వేళల నెట్టి పరివర్తనము లిట పురోగతి సూచకములై తాండవించెనో – తిరోగమన శక్తుల తలదన్ని యణచెనో – సౌజన్యదీధితుల వెల్లివిరియించెనో – పాశవిక భావోద్ధతిని గ్రుంగదీసెనో – సౌభ్రాతృత్వమును పంచించెనో– కాలుష్యమును గడగివైచెనో – మానవతను వెలార్చెనో – దానవతను గూల్చెనో– మాధవతను వెలయించెనో– సంస్కార ముల బ్రోదిచేసెనో– సామాజిక ద్రోహవ్యూహముల జేల్చెనో– సర్వేశ్వరచరణసేవ వంకకు నరుల మరలించెనో – నరునినుండి నారాయణుని ప్రాదుర్భవింపఁ జేసెనో సమీక్షించుకొనుట మిక్కిలి యవసరము. ఈ సమీక్షాత్మక ప్రాచీన వ్యవహార పర్యవేక్షణ – జాత్యభ్యుదయమునకు సర్వవిధ సంరక్షణయై విరాజిల్లగలదు. ఈ జిజ్ఞాసారూపక దీక్ష – భావితరముల మానవాళి మనుగడకు శ్రీరామరక్ష. ఈ వివేచనాత్మక పరిశీలనలో – కాలతత్త్వమే ప్రధానస్థానమును వహించిన దనుట నిర్వివాదము.

కాలము నిట్లు విభాగము గావించి, యొక్కొక్క సమయమున మెఱసిన మేలిమెఱుపుల వెలుగుజిలుగులతో – తదనంతరకాలమున చీఁకటితెఱలు దిగనీతి శ్రద్ధవహించుట కును, దురదృష్టవశమున – మనోదౌర్బల్యముల యుద్ధతి

కతన నీలినీడలు ముసరుకొనినచో తొలగించివైచి, వెలుగు వెన్నెలలు పంపించుకొనుటకును భారతీయులనాదినుండియు పరిశ్రమించుచునే యున్నారు. ఈయాత్మ పరిశీలనాదృష్టి - ఈ దివ్యసింహావలోకన తత్త్వము ఈ సర్వసమన్వయ జ్ఞాన వివేచన - ఈ సంస్కార వైభవోన్నతి - మనపురోగతికి రాచ బాటలు దిద్దినదనవచ్చును. ఏదియొనర్చినను - మంచిని మన్నించి, చెడుగును చెండాడుటకే. ఆదర్శమున వక్రత విక్రమించుట భారతీయులదృష్టిలో క్షమార్హముగాని నేరము. దేవదేవునిపట్ల విశ్వాసము సన్నగిలుట జరుగరాదు. వేదధర్మముల యెడ సాదర భక్తిప్రపత్తులు సర్వదా నర్పిల్లుచుండవలెను. ఈ భావములతో మనవారు కాల సంతరణమును గావించి సాధించిన చరిత్ర - మన కారాధనీయము.

బ్రహ్మాండమైన లక్ష్యముల నిడుకొని, భగవచ్చింతనమే-భగవదారాధనమే మానవ జన్మకు మహత్తరాదర్శము లని భావించి, దివ్యత్వమును సర్వత్ర యుద్దీపింపఁజేసికొనుచు, జీవితయాత్రను సాగించిన తపస్సంపన్నులగు మహర్షులకు వారసులమైన మనము - వారి సంకల్పములను వికల్పములు గావించు దుశ్చర్యలకు గడంగరాదు. వేదప్రతిపాదితధర్మ సూత్రగణమునకు విపరీతార్థముల గల్పింపరాదు. సంయమీంద్రుల శాసన సంపదను తృణప్రాయముగ గణించుట వివేకుల లక్షణము గాదు. పురాణేతిహాస ప్రవచనముల ఘోష నరణ్యరోదనముగ మార్చుట మన విజ్ఞతకు

సాక్ష్యము కాగలదా? ఉపనిషత్సూక్తుల నుల్లంఘించిన మాత్రమున సంస్కర్తలై సంస్తుతింపఁబడుదురా? మన జీవిత విధానములకే పూర్ణముగ విరుద్ధమైన పాశ్చాత్య సంస్కృతి నంధముగ ననుకరించి, మన మహాగ్రంథములు పుక్కిటి పురాణములనియు - మన ప్రవక్తలు వెట్టివెంగళప్పలనియు - మనము వివేకశూన్యమైన జాతిలో దౌర్భాగ్యవశమున నుద్భవించితిమనియు నిరీహా నిస్పృహల నొలుకఁ బోయుచు, భావించుట నిజమున కాత్మద్రోహమే కాఁగలదు. మఱియొక విధముగఁ జెప్పవలయుననినచో నిది యాత్మహత్యాసదృశ మహాపాపమనినను దోసముగానేరదు. ఏల మనకీ నిరాశా వాదము? ఏల మనకీ యాత్మవంచన? ఏల మనకీ స్వాత్మ ప్రత్యయ రహిత మనోవైకల్యము? అన్నియునంగడినుండియు నల్లునినోట శని యనినట్లున్నది పరిస్థితి. మహోజ్జ్వల, మహాద్భుత, మహోత్తర వేద సంస్కృతికి జ్ఞాతిత్వమును వహించి, తద్వైభవమును విశ్వవ్యాప్తము గావింప దీక్షా కంకణధారణ గావించిన మన మహర్షులేమనుచుండిరో యొకింత వీనులొగ్గి వినుఁడు:-

"మనము దుర్బలులము గాము. దీనులము గాము. మనము దివ్యులము. అమృతపుత్రులము. పుట్టు పాపులము గాము. మన లక్ష్యము భగవంతుని జేరుట. ఆ స్వామిని ప్రత్యక్షముగ గాంచుట. మనుగడను సఫలమొనర్చు కొనుట."

ఈమధుర స్వప్నమును సత్యముగావించుటకే మన యోగిగణము వేదసుధల మధురిమలను లోకములకు పలు

తెఱగుల నందించినది-పలు భంగుల నుద్బోధించినది. పర మార్థమును గుర్తింపఁజాలక, ప్రజ్ఞారహితులైనవారు - మన మునికుల తిలకుల దివ్యభావనల నవహేళన సల్పి, యది రొక ఘనతగ దలంచి, తమ యవివేకమును, అజ్ఞతను వెల్లడించు కొనుచుండుట కడుంగడు విచారకరమైన విషయము. వీరి జోరుస్వారి - వెట్టివాని నృత్యకళానైపుణ్యమునకు దుల్యమై నట్టిది. కావున, ఇట్టివారి నేత్రములకు జ్ఞానాంజన ప్రయోగ మావశ్యకము.

మన మహర్షులసామాన్యులు; తపోబలమున వేద మంత్రముల దివ్యశక్తిని ప్రత్యక్షముగ గాంచగలిగిన మహా నీయులు. యమ నియమాదులతో తన్మంత్రఫలమును లోక క్షేమముకొఱకు వెచ్చింప సమర్థతగలవారు. ఋషియన మంత్రద్రష్ట. యుగయుగములనుండియు-తరతరములనుండియు మన వంశమునకు ఋషియే మూలపురుషుఁడు. ఋషి తనలో గల దివ్యశక్తి నుద్దీపింపఁజేసికొన నేర్చిన మహామనీషి. విశ్వ మానవకోటికి శాంతిని, కల్యాణమును ప్రసాదింపఁజాలిన మహనీయుఁడు. ఋషిసంకల్పము దివ్యము. ఒక్కమాటలోఁ జెప్పవలెనన్నచో - భారతజాతియనఁగా ఋషియే. ఇట్టి సత్సంప్రదాయములచే నడిపింపఁ బడుచున్న జాతికి జెందిన వారము మనము. తరుణ తరుణ తపస్సంపన్నులైన మహర్షు లచే భారత జాతీయ జీవిత విధానము నిర్ణయింపఁబడి యుండుట మన మహా భాగ్యము.

ఇతర దేశీయులకు, ముఖ్యముగ పాశ్చాత్యులకు నిట్టి యదృష్టము ముమ్మాటికిని లేదని నొక్కి వక్కాణింప వచ్చును. కొన్ని శతాబ్దములకు పూర్వము - పాశ్చాత్యులకు భగవచ్చిం తనాస్తిమే లేదు. భగవద్విశ్వాసమే లేదు. వీరి జీవిత మతి విచిత్రమైనది. వీరు వేదములను నిరాకరించిరి. సదాచారము లను నిరసించిరి. దేవభాషను తిరస్కరించిరి. దివ్యత్వమును గర్హించిరి. తమ్ము పుట్టుపాపులనుగ తలంచుకొనిరి. సామాన్య భాషలను శరణుజొచ్చిరి.

వీరి తొలి జీవితము మరింతవింతగ నుండెడిది. సంస్కార హీనమైన వీరి సామాజిక జీవిత ప్రథమదశను దలంచిన, నోడలు జలదరించును. అజ్ఞానులై తిరిగిరి. ఆకులలములు గప్పు కొనిరి. అనాగరికులై వ్యవహరించిరి. పచ్చిమాంసమును భక్షించిరి. భౌతిక వాదులై, ఇంద్రియలోలురై, పశుప్రాయులై మెలంగిరి. యుద్ధములు నడిపిరి. దోపిడీలు సాగించిరి. క్రూర మృగములుగ సంచరించిరి. వీరి మూలపురుషులు బ్యారన్ను (Barons), వైకౌంట్ను (Viscounts), లార్డ్ను (Lords), మొదలగువారు. పాశ్చాత్యులకు మూల పురుషులనఁబడెడి యీ పెద్దలు - కత్తులతో, కఠారులతో పరహింస గావిం చుచు - క్రూరముగ ప్రవర్తించెడివారు. మఱియును వీరు - దోపిడి దొంగలుగ సంచరించుచు, కొండగుహాలలో దాగియుండి, బందిపోటునకు సన్నద్ధులై, పరులను హింసించు చుండెడివారు. ఇట్టి దుష్ట ప్రవృత్తిగల మూలపురుషు

లతో బెరిగిన జాతి భావనలెట్లుండునో వివరింపవలయునా? కావుననే పాశ్చాత్యజాతి - దురభ్యాసములకు, దుశ్చర్యలకు తావలముగ మారుచు వచ్చినది. వీరు సైతానును గొల్చిరి. సర్వేశ్వరుని త్రోసిరాజనిరి. ఆధ్యాత్మికశక్తిని విశ్వసింపక, భౌతిక భోగములకొఱకు ప్రాకులాడిరి. ధర్మమును మూలకు నెట్టిరి. త్యాగమును, సన్న్యాసమును నిరసించిరి. భోగమును, స్వార్థమును వృద్ధిచెొనర్చుకొనిరి. పాశ్చాత్యులందరిట్టివారు గాకున్నను- అధికసంఖ్యలోనిట్టివారు గలరనుట వాస్తవము. భారతీయులకన్న మిన్నగ - సత్సంప్రదాయములకు గట్టువడి యుండెడి పాశ్చాత్యులు కొందరీనాడు లేకపోలేదు.

ముఖ్యముగ, మనకును - పాశ్చాత్యులకును ఆదర్శము లలో - జీవితపు విలువలలో - జీవనవిధానములలో - ఆచారము లలో - విచారములలోగల తారతమ్యమును తులయందిడి చూపుటకే యీ పరిగణన. సద్గుణసంపత్తిలో నిన్నివిధముల కొఱవడియున్న పాశ్చాత్యులు - మనలను పాలించుటవలన, మనజాతికిసైతము సహజ సౌజన్య సదాచారాదులు లోపించిన వనుట సత్యము. అందువలననే, నవీనకాలమున పాశ్చాత్య ప్రభావము మనపై కొట్టవచ్చినట్లు గన్పించుచున్నది. వారికి ప్రతిబింబములవలె మనము ప్రవర్తించుచు, మనలను మనమే విస్మరించి, మన వ్యక్తిత్వమును కోల్పోవుచున్నాము. కావున మన యాత్మ సమీక్షను మనము గావించుకొనవలసిన సమయమిది. మన సంప్రదాయములను మనము సరిదిద్దుకొన

వలసిన తరుణమిది. చికిత్స సకాలమున జరుగనిచో వ్యాధి వికృతాకృతిని దాల్చగలదు. ఇంట నిండుగ నౌషధము లుండియు సమయము మించినతదుపరి నుపయోగించినచో నవి నిరుపయోగములే కాగలవు! సంజీవియైనను సత్ఫలి తముల నొసంగజాలదు. కనుక, ఒక్కపరి వెనుకకు దిరిగి చూచి, యుగ సమీక్ష గావించుకొని, మన స్థితిగతులను మనమే చక్కదిద్దుకొనవలసి యున్నది. మనకు మహర్షు లందించినకాలపు కొలబద్దతో నేడు జీవిత ప్రమాణము లను, జీవితపువిలువలను కొలిచి విలువగట్టవలసి యున్నది.

నయనములు విస్ఫార-నవచైతన్యముదయింప నూత్న దీప్తిరగులొక్కొన -- నందనోద్యాన సౌందర్య సంపిలసితమైన కృతయుగ లావణ్యమును దిలకింపుడు. భువనమోహన తేజ మును వర్షించెడి తొలియుగపు లలితభావసంపదను దర్శిం పుడు. చరితార్థమొనరింపఁ జాలిన సంయమిచంద్రుల సంకల్ప మహిమల పరికింపుడు.

కృతయుగము

అది తొలియుగము. అది కృతయుగము. అది సత్య యుగము. అది సాధు యుగము. కాలచక్రపరిభ్రమణ సంజనిత కాంతిపుంజములు మనలనెట్లులరించునో- అది మన యనుభూతి కందును. అతిలోకస్తుత చరిత్రుల కాలవాలమైన యాకృతయుగ ధర్మములు మనకు దిగ్భ్రాంతి గూర్చును. ద్వేషరోషములకు - మదమత్సరములకు- మోహపాశములకు జాతిని వశము గానీయక, ప్రేమసౌజన్య సౌభ్రాత్రసౌహార్ద వృష్టిలో నెట్లు ముంచితేల్చెనో మనకర్థమగును. నిర్మలదర్పణమున గాంచినంతస్పష్టముగ, మనకా కృతయుగకాలము-ప్రాచీన భావ సమ్మోహబలమున, మన మనఃఫలకమున గానవచ్చును. స్వర్ణస్వప్నమువలె మన హృదయభవనముల పులకరింత లెత్తించును. రంగస్థల దివ్యదృశ్యసమవలోకనానందసముత్పన్న సమర్థ మహానట స్వరూపసాక్షాత్కారము పగిది మనలను మరి యొక లోకమునకు గొనిపోవును. మధురమధురముగ మురిపించును. మనోజ్ఞముగ లాలించును. మంజులతను చిందించును.

అహాహా! ఏమా తేజఃపరంపర! అవియే కనులను జిగేలుమనిపింపగల కృతయుగపు తళతళలు! సత్యయుగపు మిలమిలలు. ఆ దివ్యతేజోలీలాలహరులలో నోలలాడగల నింపునిబ్బరము మన గుండెలకుండవలదా? అగ్నికణముల వెలుగును, వేడిని పుక్కిలించుచున్న యా తరుణారుణప్రభల

దర్శింపగల దకృత మన చక్షువుల కమరవలదా ? కనులు మూసికొని సంభావించినప్రతు – పునఃపునరాలోచనల నడుమ పూర్తిగ గాకున్నను, కొంతవఱకేని మీ కా ప్రాచీన మహాసామాజ్యాల సంస్కృతీ సంప్రదాయజ్ఞాల సాక్షాత్కరింపఁ గలదు. సమీక్షించుకొన నవ్యమైన శక్తిని సారస్వతాంజన సహాకారమున సంపాదించుకొనుఁడు. చరితార్థులు కాఁగల్గుదురు.

ఇట్టి భవ్యదివ్య ప్రాక్తన సంస్కృతికి వారసుఁడనా ? యని, ప్రలకించెడి పుణ్యక్షణము – ప్రతిభారతీయుని జీవిత మునం దొక్కమారేని తొంగిచూడగలదు. అందుకొఱకే సమీక్ష. తత్ఫలసిద్ధికే మననిరీక్ష. అట్టివాస్తవమును గుర్తించి, యోగ్యతను గడించి, సహజగౌరవమును సంరక్షించుటే నేఁడు మనల నెదుర్కొనిన పరీక్ష.

అహహా! నాటిసామాజిక జీవితవైఖరి యెంత రమణీయము! ప్రజల పరస్పర ప్రేమభావమెంత నిర్దుష్టమైనట్టిది! వారి యన్యోన్య సహకార తత్త్వమెట్టి వినిర్మలమైనట్టిది! ఒకరి కరముల నొకరు కరము ప్రేమభావమునఁ గలిపి యెయ్యార ములు నొలుకవోసికొనుచున్నారు. వారికన్నులలో కాలుష్యము కంచుకాగడాలు పెట్టి వెదకినను గనిపించుటలేదు. వారి హృద యములుగూడ, వారి కరములవలెనే యొక దానితో నొకటి సమ్మిళితములైనట్లున్నవి. పట్టుసడలని యీ సమైక్యత – మచ్చ లేని మమతకు తార్కాణము గాఁబోలు ?

ఓహహా! ఎవరేవర్ణమువారో! ఎవరు చెప్పఁగలరు ? చెప్పుటకేమున్నది ? ఎల్లరొకే వినిర్మల ధర్మప్రేమసూత్ర

బద్ధులై యున్నపుడొకరు 'హెచ్చు, మతొకొకరు లొచ్చు'అని యెట్లు నిర్ణయింపఁగలము? అందఱును సత్యవ్రతులే. అందఱును వైదికధర్మ కర్మదీక్షాపరతంత్రులే. అందఱును సత్సంప్రదాయ సదాచార సంసక్తచిత్తులే. అందఱును సర్వేశ్వర చరణసరసిజ స్మరణ నిరతులే. అందఱును పరోపకార పరాయణులే. అందఱును త్యాగధనులే. అందఱును మహోదార తత్త్వసంలగ్న సంకల్పులే. అందఱును బ్రహ్మతేజోవిరాజమానవదనమందిరులే. అందఱును పావనాధ్యాత్మిక సుధారస ధారాపరిప్లుతమాన సులే. అందఱును హంసలే. అందఱును అందఱే.

అహహా! ఎట్టిసన్నివేశము! ఎట్టి మహోద్భవంతులా కృతయుగప్రజలు! బ్రహ్మజ్ఞానజలధి పొంగిపొరలిన పుణ్య దినము లవి. వేదసరస్వతి కాలియందెలరవళికి ప్రాణికోటి పులకించి, పూర్ణానందమున మునిగి తేలినకాలమది. నిగమశాఖలు విస్తృతముగ వ్యాపించి, ధర్మఫలములు విరియింపనహమహమికతో – విచక్షణలేక, యెల్లరందుకొని, జ్ఞానదాహమును – పరమార్థ తృష్ణను జల్లార్చుకొని, యిచ్చమెయి వేదామృతమును జుఱ్ఱుకొనిన బంగారు యుగమది. నాడు వైషమ్యములకు తా వెక్కడ? నాడు కుట్ర లెచట కాపురముపెట్టెనో! నాడు కుయుక్తి లెచట దాగుకొనినవో! నాడు కిరాతక ప్రవృత్తి యెచటికి పరుగులు దీసినదో! నాడు స్వార్థచింతన యెచట నుపిరి నిలుపుకొనినదో! నాడు పాశవిక కాంక్షలకు నిలయమెచట లభ్యపడెనో! నాడు సోమరిపోతుతన మెచట

తలదాచుకొనినదో ! నాడు దురాశ యెచట దూరినదో! నాడు దుష్టసంకల్పము లేమారుమూలల మ్రగ్గినవో! నాడు చంచల ప్రవృత్తి యే సానువుల చరించెనో! తలంచిన-చో యెడద ప్రులకరించును. మనసము గావించిన మానస ముప్పొంగును. రెూచించిన లోచనముల నానందబాష్ప సందోహాములు జాలువాఱును. భావించిన ప్రబలామోద సమ్మోదములు పట్టపగ్గములు లేని తెఱగున బరువులెత్తును.

నేటిపరిస్థితి స్పృహకు వచ్చిన, నిలువెల్ల నీరగును. నిర్విణ్ణత నెలకొనును. కావుననే నాడు సర్వులును బ్రాహ్మణులే కాగల్గిరి. కావుననే నాడెల్లరు హంసలుగ మనగలిగిరి. హంసపదము భాషావిషయమున శ్రేష్ఠవాచకము. వేదాంతమున జ్ఞానపరిపూర్ణ వ్యక్తిత్వమునకు సూచకము. కృతయుగమున శ్రేష్ఠులు-జ్ఞానపరిపూర్ణులేయుండిరనుటకింతకన్న మిన్నయగు సాక్ష్యమేమికావలయును ? శ్రేష్ఠులనఁగా-సదాచార సంస్కృతీ శ్రేష్ఠులు. చరిత్ర శ్రేష్ఠులు. ధర్మకర్మాచరణ శ్రేష్ఠులు. వేయేల! సర్వశ్రేష్ఠులు. జ్ఞాన పరిపూర్ణులన, లౌకికజ్ఞాన పరిపూర్ణులు. వైదికజ్ఞాన పరిపూర్ణులు. వేదాంతజ్ఞాన పరిపూర్ణులు. బ్రహ్మజ్ఞాన పరిపూర్ణులు. జీవితధ్యేయ జ్ఞానపరిపూర్ణులు. పరమేశ్వర జ్ఞానపరిపూర్ణులు. వేయేల! సర్వజ్ఞానపరిపూర్ణులు. అట్టివారున్నయుగము బంగారుయుగము గదా ? సత్యయుగమని ప్రశస్తినందదా? కృతయుగనామమున యుగపరిగణనలో ప్రథమశ్రేణి నలంకరింపదా ?

సత్యసంధులై, ధర్మాత్ములై, సాధుపూజాతత్పరులై సంసారనౌకను జీవితసాగరమున స్వచ్ఛందముగ పరిభ్రమింపఁ జేయజాలిన వారితీరు – సర్వకాలములలో సకల విశ్వమున గలవారికి నాదర్శపాత్రమనుటలో రెండభిప్రాయములుండుటకు వీలులేదు.

పవిత్రప్రవర్తనకు గీటురాళ్లుగ నిల్చినవారు–పాతివ్రత్య మహిమచే పదునాలుగుభువనములను గడగడలాడించినవారు– సాధుశీలములచే జగతిని చక్కఁదిద్దినవారు – సత్యవ్రతదీక్షతో విజయపతాక లెగురవైచినవారు – ధర్మపథప్రయాణమున నెదురైన క్లిష్టసమస్యల పరిష్కారముకొఱకై, కాలచక్రపు టిరుసున నలిగి, కండలుపిండి, నెత్తుర్కోడ్చి, కళకళలాడినవారు– బాధలకు స్వాగతమొసంగి, వ్యథలను చిఱునగవుతోస్వీకరించి– చెదరని – బెదరని గుండెబలముతో ధర్మజ్యోతిని కొడిగట్ట నీయక, నిరుపమానకాంతులతో నిలుపగలిగినవారు – ధర్మ న్యాయసత్యసంరక్షణార్థమై, ఘోరకాంతారవాసక్లేశములమధ్య సుకుమారతనూలతనుమాడ్చుటకును–వాడ్చుటకును వెనుకంజ వేయనివారు – సర్వసర్వంసహా సంపదలను తృణప్రాయముగ ధారవోసి, దాతృత్వవైభవమునకు పసిడిపతాకలై భాసిల్లు వారు – కఠోరధర్మవ్రతాచరణలో అనుంగుభార్యను కఱకు కత్తులతో నఱికుటకు జంకనివారు–నైతికదీక్షతో ముద్దుబిడ్డలపై గల మోహావల్లరిని నిర్దాక్షిణ్యముగ ఛేదించుటకు సిద్ధపడిన వారు– కండలుచెండి యిచ్చినవారు– కనకపుగుట్టలు కైవస

మైనను కాలదన్నినవారు-భండనమున ప్రాణము లర్పించుటకు పయనమైనవారు-త్యాగశీలములకు రూప రేఖలు దిద్దినవారు-సత్యసంకల్పముల కాకృతులుగ నిల్పజాలినవారు-ధర్మగుణమునకు వినిర్మల స్వరూపులో యను విశ్వాసమును గల్గించువారు కృతయుగమున ప్రత్యంగుళమున ప్రత్యక్షమగుదురు. జ్ఞానమున్నవారు కాదనుటకు వీలుగాని వాదమిది. రండు. తిలకింపుడు. ధన్యతగనుడు.

ధర్మసామ్రాజ్యమున సత్యపీఠముపై శాంతిదేవతకు పట్టాభిషేకము సలుప ప్రతియొక్కరు భటుడై నిల్చిననాడు - ప్రబోధములతోపనియేమి? ప్రవక్తలయవసరమేలకలుగును? భగవదవతార సమావిర్భూతికి వసతియెక్కడ? కావుననే, కృతయుగమున నవతారప్రసక్తిరాదు. భగవంతుడవతార మెత్తవలసిన పరిస్థితు లుప్పతిల్లని సాధుయుగమది. అగాధ జలధిలో కుంభవృష్టి గురియవలసిన యవసరమేమి ? ప్రతివారును ప్రవక్తలే. ప్రతివారును ప్రబోధకులే; ప్రతివారును పవిత్రానుష్ఠాన పరాయణులే. ప్రతివారును ధర్మమర్మకోవిదులే. అహహా! మీకు కనిపించుటలేదా ? కృతయుగధర్మ విస్ఫూర్తి; సత్యయుగ సాధుభావసందీప్తి.

ఆ మేలిభావముల మేడలనీడలలో-చింత, వంత, పగ, వగ, కుళ్లు, కుట్రయనునవి యెఱుంగని పరిధులలో జీవితరథమును నడపి, జగజ్జేగీయమానమైన సనాతన భారతీయసంస్కృతి ద్వారా-సర్వేశ్వరుని సాక్షాత్కరింపజేసికొని, చరితార్థమైన,

కృతయుగ ప్రజావళి మనుగడ మాన్యమును, ధన్యమునై విరాజిల్లెను.

ఆ యుగమున నాదమును బ్రహ్మముగ, ఓంకార ముతో నారాధించుట గమనార్హము. గాయత్రీమంత్రము జ్ఞానమునకు చిహ్నము. విశ్వామిత్రుడేతన్మంత్రమునకు ఋషి.

ఆయుగమున నాహార విహారము లన్నియు నొక క్రమ మున సాగినవి. కృత్రిమాహారములను నాటివా రెఱుంగరు. కందమూలాదులను, మధురఫలములను ఆహారముగ గ్రహిం చెడివారు. క్షీరధారలను గ్రోలెడివారు. సహజము – సర ళము నైన యిట్టి సాత్త్వికాహారము శరీరమునకు పుష్టిని, మంచి యారోగ్యమును ప్రసాదించెడిది. మేధస్సును బాగుగ వికసింపఁజేసెడిది. విహారాదులలో లవలేశమేని యక్రమము దోషకమయ్యెడిదికాదు. సాత్త్వికగుణమును, సౌశీల్యమును పెంపొందించెడి యాహార విహారాదులవలన నాటి ప్రజాజీవిత మొక క్రమపద్ధతితో ప్రశాంతముగ సాగినది. దివ్యతేజ స్సుతో నుద్దీపించినది. మహిమాన్వితముగ వెలుగొందినది.

సర్వవిధముల సహకారదృష్టియే నాటివారిలోసర్వత్ర వ్యక్తమగుచుండెడిది. ఈ ప్రసన్నత భావములో, నడతలో, మాటలో విస్పష్టముగ గన్పించుటే కృతయుగమహిమ. ఆ యుగమున హెచ్చులొచ్చుల–తారతమ్యముల జోలికేగక ప్రతివాడును సముత్సాహముగ విధ్యుక్తధర్మమును నిర్వహిం చుచుండెడివారు. బాహ్యమునకు నాటి వారికిక్రియాకలాపము

లలో నేదేని కొంత భిన్నతయున్నట్లుగన్పించినను, తారతమ్య మున్నట్లు స్పష్టపడినను వాస్తవమునకు నాటి సామాజికుల సంకల్పస్రవంతి . యేవిధమైన యెడుదుడుకులు లేని యొకే యొక పథమున ప్రవహించెననియే చెప్పనగును. లక్ష్య మొక్కటియే యగుటవలన నీ విలక్షణవైఖరి నాటి మాన వావళిలో సుస్పష్టముగ గన్పట్టుచుండెడిది.

భగవంతుని గమ్యముగ నిడుకొని జ్ఞాన-రాజ-కర్మ-భక్తియోగముల మూలమున జీవితాదర్శసాధనకు నాటి వా రందఱును నడుము గట్టి, పయనము సాగించిరి. వ్యవసాయ పశుపోషణాదుల యెడ శ్రద్ధవహించి, మెండుగ పంటలు పండించి, పుష్కలముగ పాడిని పెంపొందించి, యెల్లర కుచిత ముగ నందించిరి. గృహపరిశ్రమలను గట్టిగ - దిట్టముగ - నిర్వహించి నిత్యజీవితావసరములను కొల్లలుగ జేకూర్చిరి. గ్రామీణజీవితమునకు శోభగూర్చిరి. ప్రత్తినిపండించి, వస్త్ర ములను తయారు గావించుకొనసాగిరి. స్వశక్తిపై నాధార పడుటయే-స్వధర్మము ననుష్ఠించుటయే జీవితపరమార్థముగ భావించిరి. హక్కుల తలంపే వారికి లేదయ్యెను.

ధర్మము, సత్యము, న్యాయము, శీలము వారిజీవితము నకు వెలుగుబాటల జూపిన దివ్వెలు. వీనిని జీవితమున నతి ముఖ్యమైన వానినిగ భావించిన కృతయుగ ప్రజలు - వీనిని పరిరక్షించుట కగ్నిపరీక్షల నెదుర్కొనిరి. ఈపరీక్షాధికారులుగ ఋషులేయుండి, ఫలితాంశములు సిద్ధించినంతనే యుత్తీర్ణులను

సంతోషాంతరంగములతో నాశీర్వదించుచుండెడివారు. ఇది హృదయమును స్పందింపఁజేయు సన్నివేశవిశేషము.

సత్యవ్రతదీక్షితుఁడైన చక్రవర్తిహరిశ్చంద్రుఁడు. సత్య వాక్పాలనార్థము సామ్రాజ్యమును, సాధ్వియగు సతిని, సత్పుత్రుని నిర్బాధముగ విడనాడుటకా జేసి వెనుకాడలేదు. ధర్మవిరుద్ధముగ మరియొక వివాహమాడుటకు సమ్మతింపలేదు. తానమ్మ్రొదువఁబడుటకేని శంకింపలేదు. కులకాంతను గుర్తించియు కర్తవ్యపరాయణుఁడై హతమొనర్పనాయత్తపడెడి గుండెనిబ్బర మాయనకుఁగలదు. ఇట్టి సత్యవ్రతదీక్షితు లేయుగమున మనకు సాక్షాత్కరింతురు? ఈ పరీక్ష సల్పినది – మహర్షిపుంగవుఁడగు విశ్వామిత్రుఁడే. ఫలితముగ, సత్య న్యాయ ధర్మములు గెల్చి నవి. పుటము పెట్టబడిన పదునాఱు వన్నె బంగారము పగిది – హరిశ్చంద్రుని గాథ ధరాతలమున శాశ్వతముగనిల్చినది. సత్య హరిశ్చంద్రుఁడని సార్థకనామము స్థాపితమైనది.

అల్పాయుష్కుఁడని తెలిసియు, సావిత్రి సత్యవంతునే తన మనోనాథునిగ నిశ్చయించుకొనినది. మనోధవునిపై లగ్న మైన మనస్సు నన్యాయత్తము గావింపనొల్లని యిల్లా లాసాధ్వీ మణి. సంకల్పమున సత్యవంతుని భర్తగ నిర్ణయించుకొనుటలో – పరిణయము మానసికముగ జరిగిన్నే యనెడి ధర్మమునకు గట్టు వడిన పతివ్రతాతిలకము. నాయనగారి పరుషవాక్యములకు, నారదుని మందలింపులకు, జంకి, మనసు మార్చుకొనని మానినీయ. పతితోడనే సతికి గతి గలదనియెంచి, సాధ్వీత్వ

బలమువ శక్తినిశక్తిని తలక్రిందొనర్చి, పతిప్రాణముల సాధించి నారీలోక విజయదుందుభిని విశ్వవిశ్రాంతరాళములకు వినిపించిన మగువ సావిత్రి. ఆమె నిట్టి పరీక్షకు గురిజేసి, యామెలో నంతర్గర్భితమైన సౌశీల్యసంపదకు రాణింపుగలుగజేసి, యామె యఖండ పాతివ్రత్య మహిమకు పరేతపతి దద్దరిల్లినపుడు-బ్రహ్మానందమున ప్రశంసల నందఁజేసినదెవరు? దేవమూని యగు నారదమహర్షియే. మహితమైనా మహాసతియశోగీతికల నాలపించి, వియన్మార్గమున ఖేచరులకుగూడ మోదమును గలుగఁజేసిన దా మహర్షియే. ఇట్లాచరింప-మహర్షులా యుగ మున మానవాళిలో-సత్య న్యాయ ధర్మ దీక్షను బెంపొందింపఁ జేసిరనుట యథార్థము.

బ్రహ్మచర్యవ్రతపాలన – నాటివారిచే నియమ నిష్ఠ లతో పాటింపఁబడినది. స్త్రీ పురుష విభేదములేక, యెల్లరును వేదాధ్యయన మొనర్చుచు, విజ్ఞానసంపదను సముపార్జించిరి. నియమబద్ధముగ నుభయసంధ్యలలో నుపాసనలు సాగించుట-సలక్షణముగ, సాంగోపాంగముగ, సమగ్రముగ పవిత్ర యజ్ఞ ముల నిర్వహించుట నాటివారికి నిత్యవిధులైనవి. ప్రజలంద ఱును ధర్మానుష్ఠానపరులై, ధర్మమును వారే స్థాపించుకొని, పోషించుకొనిరి. ఎవరిని వారే నియమించుకొనిరి; నిగ్రహించు కొనిరి. సత్య న్యాయ ధార్మికోద్యమములను జనులు ముందు నకు సాగించుతరి-భగవంతుఁడే రూపమునఁనో యవతరింపవల సిన యవసర మేమియుండును ? బ్రహ్మమే సదారాధ్యము.

వేదమే జీవిత నిర్వహణ ప్రణాళిక. యాస్కుడు మున్నగు మహర్షులే ధర్మప్రబోధకులు. జ్ఞానఫలమేచరమలక్ష్యము. కాల మట్లుగడచినది. కాని, కాలక్రమముగ బ్రహ్మజ్ఞానుల నియమ నిష్ఠలలో కొంత పాటవము తగ్గినది. దర్పమువంకకు కొంతగ మనస్సు మ్రొగ్గినది. అధికారపిపాసతో నహంభావము చేతులు గలిపి, పైశాచికకృత్యమునకు దలపడినది.

తపస్సు ననుష్ఠానర్హాదనియు - యజ్ఞనిర్వహణాధి కారము తమ రొక్కరిదేయనియు - విజ్ఞులీగెడి తత్త్వమగ్ర జన్మలనబడెడివారిలో ప్రేళ్ళుదన్నుకొని, వెట్టితలలు వేయ సాగినది. జపతపాదులు - నైష్ఠిక కార్యకలాపములు, యజ్ఞ సంరంభములు, పరమేశ్వరానుగ్రహసిద్ధికి భారతీయ మునికుల తిలకులేర్పరచినభవ్యపథములనెడి భావము విస్మృతిపథమున బడిపోయినది.

యాగఫలము ననుభవింపవలెననెడి యాకాంక్ష సామా జికులలోమొలకెత్తినది. ఇంద్రియసుఖములపరాకాష్ఠకు స్వర్గమే తావలమనియు - స్వర్గగమనమునకు యజ్ఞములే మార్గము లనియు నాటి కోవిదులు తలంచిరి. ఈ తలంపు వారిలో నానాటికి మితిమీరిపోయినది. తదనుభూతికై తహతహపడెడి సామాజికుల స్వైరవిహారములతో సాంఘిక ధర్మము గతి ప్రగతులదప్పినది. సర్వధర్మములకు క్షీణదశ సమారంభమైనది. మెల్లగ నధర్మదేవత → యదనెడిగి, పదునైన తన యుక్కు పాదము నొక్కదానితో భూతలప్రజల శిరముల ద్రొక్క

నుంకించుచున్నది. ప్రజలలో స్వార్థపరత్వము దాపురించినది. అనేకులు పరార్థమును విస్మరించి, పశుప్రవృత్తితో సంచరింప సాగిరి. సాంఘికజీవితమున నొక సంఘర్షణ సముత్పన్నమైనది. ప్రజలలో పరస్పరాసూయాద్వేషములు విచ్చలవిడిగ విహరింప సాగినవి. వర్గవైషమ్య తత్త్వము రేకెత్తినది. మాటలలో - చేతలలో - చూపులలో - వేయేల? మనోపీఠులలో చీలిక లేర్పడి, గమ్యమును అగమ్యముగ గావించివైచినవి. మత్సరము నాలుకలు గ్రోయుచు, నాట్యమాడసాగినది. సాహచర్యము కాలూనినచోటనే సంకుల సంఘర్షణ సంఘటిల్లినది. ప్రేమ సహనములు వెల్లివిరిసిన గడ్డమీదనే కార్పణ్య కల్లోలములు పెల్లుబుకదొడంగినవి. శిష్టాచారము లనురక్తితో-నాసక్తితో శిరసావహింపఁబడి, నిర్వహింపఁబడిన ప్రాంతముననే - దుష్టా చారములను శ్రద్ధాబద్ధబుద్ధితో బాటింపవలెననెడి దుర్బుద్ధి యుద్భవించినది. సాధుభావనలకు - పాశవికశక్తులకు పోరాట మారంభమైనది. ధర్మముపై నధర్మము దండయాత్ర ప్రకటిం చినది. ప్రేమను ద్వేషము సవాలుచేసినది.

కృతయుగముపై నీలినీడలు ముసురుటారంభమైనవి. అయినప్పటికి నది సత్యయుగమునకు, వ్యతిరేకశక్తులయాటను గట్టివైచి యెట్టులో గట్టిగనే నెట్టుకొనివచ్చుట తటస్థించెను. ద్వంద్వయుద్ధమున వ్యతిరేకశక్తుల ప్రాభవము జయమునంద జాలకున్నను - సామాజికజీవితమున కొంతగనైన కశ్మలత

స్పష్టముగనే కనిపించుచుండుట - నాఁడు శోచనీయమైన విషయము.

ఎవరికివారు విడివడిపోయిరి. దుష్టులు వేరయిరి. శిష్టులొకవంకకు జేరిరి. పునాదులు బలీయములగుటచే - ధర్మము మాత్రమున్నతస్థానమునుండి కదలుటారంభముగాలేదు. ధర్మపీఠమును సంచలింపఁజేయు ప్రయత్నములు మాత్రము సాగుచునేయుండెను.

ఉన్నతస్థానము నందున్న ధర్మము నారాధించువారిని ఆర్యులనియు - ధర్మవ్యతిరేకుల ననార్యులనియు పిలువ సాగిరి. ఆర్యుఁడనగా - పెద్దయని యర్థము. ధర్మాత్ముఁడే యార్యుఁడు. అనార్యుఁడనఁగా నల్పుఁడు. ధర్మవ్యతిరేకి. ఇట్టి వ్యతిరేక భావములుగల ప్రజల వ్యవహారసరళి - దేశప్రగతికి ప్రతిబంధక మాయెను. భారతీయ జీవితము పతనోన్ముఖ మాయెను. ధర్మచ్యుతి-దేశాభ్యుదయ నిరోధకముగదా!

అధర్మాత్ములైన యనార్యలొకవంక యల్పకార్యములతో దుర్జనులై వ్యవహరించుచున్నను - ధర్మపరులైన యార్యులదే సాంఘికజీవితమున పైచేయిగ నుండెను. ఆధ్యాత్మికశక్తుల వికాసమున కంతరాయములు గలిగింపఁబడుచున్నను, ధర్మబలముతో దొలగింపఁబడుట పరిపాటియయ్యెను. తమ జతనములు నిరర్థకములైన కొలది యనార్యులలో నార్యులపట్ల విద్వేషాగ్ని రగులొఁకొనసాగెను. పట్టుదలలు గట్టిపడెను. పాషండభావములు ప్రబలెను. ఉదారత సన్నగిల్లెను. క్రౌర్యము

విజృంభించెను. సామాజిక జీవితమగ్నిగుండ సదృశమాయెను. ఆర్యానార్యవిభేదములు చరమస్థాయికిఁజేరి, ప్రచండదావానల మలముకొన్న తెఱగున సంఘజీవితము కల్లోలపూర్ణమాయెను. కాని, ధర్మముదే యంతిమనిర్ణయమై, ధర్మపరుల పెత్తనమే కొనసాగక తప్పని పరిస్థితి యేర్పడుటచే, ఆత్మబలముగల యార్యులపేరుతో – మన భూభాగమున కార్యావర్తమనెడి క్రొత్తనామము వ్యవహారమునకు వచ్చెను. బ్రహ్మావర్త మిట్లార్యావర్తమాయెను.

ఆర్యావర్తము

అవాంఛనీయ పరిస్థితులేర్పడి, పతనోన్ముఖదశ ప్రత్యక్ష మైనప్పటికిని – మొత్తముమీద సత్యయుగ మనఁదగిన కృత యుగము – శ్రేయోదాయకముగనే, సకలప్రజా సంక్షేమ సంధాయకముగనే, కొనసాగెనని భావించి తీరవలయును.

కృతయుగమున ధర్మదేవత – బహుముఖములుగ విరా జిల్లెను. కాని, ఆ యుగాంతమున ప్రజలు క్రమక్రమముగ ధర్మదేవతను దూరదూరముగ బారద్రోలి, లక్ష్యశుద్ధిని కోల్పోయి, కేవలము స్వప్రయోజనములకే ప్రాకులాడసాగిరి. మహోద్ధురదశతో బ్రహ్మావర్తమనుపేర, ప్రచండస్ఫూర్తితో ప్రారంభింపఁబడిన కృతయుగ మిరీతి రెండవపాదము ధార్మిక రంగమున గుంటువడి, యార్యావర్తముగ పరివర్తనజెందెను.

త్రేతాయుగము

త్రేతాయుగము ప్రారంభమైనది. ధర్మదేవత రెండు పాదము గోల్పోయినది. మూడుకాళ్ల నడక మొదలుపెట్టెను. తత్ప్రభావము దేశమున ప్రతిఫలించుట సహజముగదా! సహజీవన సౌకర్యము కొఱ కేర్పఱుపఁబడిన చాతుర్వర్ణ్య విభాగమునకు విపరీతార్థములు బయలుదేరెను. దృష్టిలో మార్పువచ్చినది. నడకలో వక్రత యేర్పడినది.

వేదవిజ్ఞాన నిలయులై - త్యాగనిరతులై సర్వమానవులను - జీవులను - సమదృష్టితో గాంచుచు జీవన పథమున బయనించిన జ్ఞానసంపన్నులైన బ్రాహ్మణులయందే 'అగ్రవర్ణలము - అధికులము' అనెడి యహంకృతియు, సర్వసంపదలు తమ సొత్తే యనెడి హద్దులు మీఱిన మమతయు వ్యక్తము గాసాగినవి. బాధ్యతవహించి, జాతిక్షేమమును పెంపొందింప వలసినవారిలో - స్వార్థచింతన మెండగుటయు, తక్కినవారిని చిన్నచూపుజూచి కించపఱచెడి తత్త్వము ప్రబలుటయు శోచనీయ విషయము.

ఎట్లయిననేమి? అధర్మమొక పాదమును గట్టిగ నిట నిలువ బెట్టుకొనగలిగినది. విశ్వకల్యాణకాంక్షతో యజ్ఞకర్మలు నిర్వహించినవారు-'స్వర్గకామోయజేత' యనెడి పెడదారిద్రొక్కుటతో, పతనరేఖలు ప్రకటీకృతములైనవి. వేదధర్మములకు తు.చ. దప్పని వ్యాఖ్యానములుగ వర్ధిల్లిన సాంఘిక జీవిత

నియమములలోఁగూడ మసక యేర్పడినది. అన్యోన్యసహకార భావనతో తేజరిల్లిన పరస్పర ప్రేమ - ద్వేషాసూయల నడుమ వాడిపోవసాగెను. పారలౌకికజిజ్ఞాస - పరమేశ్వరచింతనాభిరుచి - క్రమముగ సన్నగిల్లుచుండెను. పాలక పాలిత వర్గములలో - వైషమ్యభావనల కంకురారోపణ జరిగినది.

వేదములకుగల ప్రాధాన్యము నెఱింగియు - అగ్రజన్ములు కొందఱు, బ్రాహ్మణములకే ప్రాముఖ్యము నొసంగిరి. ధాత్వర్థములనుగ్రహింపక, పదములభావమును తమయూహల కనుకూలముగ దీసికొనెడి వైఖరికి అగ్రజన్ములమని యనుకొనెడివారే యలవాటుపడిరి. యజ్ఞపదమునకు చిత్రవిచిత్రార్థము లుత్పన్నములాయెను. అశ్వమేధాది యాగములలో - గుఱ్ఱము మొదలగువానిని బలియిడుట - కొన్నింట నరబలి నిచ్చుట వ్యాప్తికివచ్చెను. కందమూలాదులతో కాంతారము లందు కృతయుగమున ప్రశాంతముగ మౌనులు నిర్వహించిన పవిత్రయజ్ఞములే - రక్తమాంసములతో జనబాహుళ్యము నడుమ నట్టహాసముగ త్రేతలో అగ్రవర్ణములకుజెందినవారిచే నిర్వహింపఁబడసాగెను. ప్రతియొక్కరును తమ ప్రత్యేకతను నిల్పుకొనుటకే, తమ యాధిక్యమును జాటుకొనుటకే జతనములు సాగించుచుండిరి. పెద్దల హస్తగతమైన వేదవిజ్ఞానము దుర్వినియోగమగుటారంభమైనది. స్త్రీలుగాని, పురుషులలో నైతము కొన్ని వర్ణములవారుగాని వేదాధ్యయనము గావింప రాదనెడి వితండ వాదము ప్రబలి, యమలునకు వచ్చెను.

మొత్తముమీద జ్ఞానకాండకు ప్రాధాన్యము తరిగి, కర్మకాండకు ప్రాధాన్యము పెరిగినది. ఐహికభోగలాలసులైన కొందఱు – యజ్ఞవిధిని, స్వర్గలోక సుఖభోగసంపదను భద్రపఱచు ప్రబల సాధనముగభావించి, ప్రచురప్రచారమునకు దెచ్చిరి.

ఋషులలోసైతము విద్వేషములు పెచ్చు పెరిగెను. విశ్వామిత్ర వసిష్ఠులు కలహించుకొనిరి. అందఱును బ్రహ్మజ్ఞానులుగ బ్రహ్మర్షులుగనున్న కృతయుగము మారినది. రాజర్షులు, రాజయోగులనెడి బిరుదు కొందఱకు లభించినది. వీరికి బ్రహ్మపదాక్రమణ తపన విపరీత మాయెను. దానితో – యోగిలోకమున సైతము, సంకుల సంఘర్షణమొదలైనది. దుర హంకారము–స్వార్థశక్తులు ప్రకోపించుటతో నిట్టి యవాంఛనీయమైన వాతావరణ మేర్పడెననుట నిర్వివాదము. కాని, దీనిని బట్టించుకొను వారెవ్వరు? ధ్యేయమును గుర్తించు వారెవ్వరు? ఎల్ల రందుకొరకే యేకాగ్రతతో బరిశ్రమించుచున్న పగిది కానవత్తురు. కాని, తత్ఫలముమాత్రము వెల్లడిగాదు. కృతయుగపు చందన సదృశ శీత వాత పోతముల ప్రసారము గన్పట్టదు. ప్రసన్నజన జీవన లీలావైఖరి ద్యోతకముగాదు. నిత్య సంతృప్త మానవ మనఃఫలకముల రుచిరరోచులు సాక్షాత్కరింపవు. ఏదోరొక తీరని యసంతృప్తి; ఏదోరొక యూరని యసూయాగ్నిజ్వాల; ఏదోరొక భద్రత కొఱవడిన మనుగడ తీరు; ఎవ్వరిని గదలించినను–'నిష్కలుషముగ నీతడు భాసించుచుండెనా?' యను సందేహము; ఎవనిచర్య దిలకించినను–

ఇతఁ డాచరించు కర్మ వేదవిహితమే యగునా? యనెడి శంక త్రేతలో గన్పట్టసాగెను.

ప్రతివారు వేదవాక్కులను చిలకపలుకులవలె వల్లె వేయుదురు. స్వరము భంగమైనను-అర్థస్ఫూర్తి లోపించినను వారు గమనింపరు. వారిలో - వేదపాఠకుల మనిపించుకొన వలయునన్నెడి వాంఛయొక్కటి మాత్రమే దోషకమగును. ఎదుటనున్నవాఁడు తనకన్న నల్పుఁడనియు-తమకు సేవలాచరించుటకే యతఁడర్హుఁడనియు నొకేవిధమైన దురాలోచన పెద్దల చిత్తములలో జివురించెను. వేదమంత్రార్థత-దివ్యత్వము - ప్రతిభ-మాహాత్మ్యము వీరి కెట్లనుభూతికి వచ్చును? మనస్సు నేకాగ్రతతో లగ్నమొనర్చి, జ్ఞానభిక్షార్థము తపించుచు-పరమేశ్వరానుగ్రహ ఫలప్రాప్తియే జీవితమున కేక లక్ష్యమని సుదృఢ నిర్ణయమును గైకొని, వేదాధ్యయనము గావించు వారికే వేద శారదా లలిత లావణ్య తారుణ్య విపుల కాంతి పుంజ వైభవము కన్నులకు గట్టును. ఇంద్రియలోలులై రంభా ద్యప్సరసల యొడలు తా మారాధించు దైవమండెడి గుడులని యెంచువారికి-పరమేశ్వర దత్తమైన వేదవాణియొక్క నుడుల యంతరార్థ మెట్లువగత మగును? వా రేనాటికేని మనుగడ ముడుల నెట్లు విప్పదీయగలుగుదురు? అట్టివారు సంసారజలధి లోగల సుడులబడి మునుగుచు దేలుచుండుటకంటెను గత్యం తరము కనఁజాలరు.

భౌతిక భోగముల పరమావధి దరచిచూడ స్రాకులాడుటయా? యజ్ఞములపేర పశుబలిగావించి, వాని వపను యజ్ఞపురుషున కర్పించుట ఫలప్రదమని భావించి, పావనాగ్నిలో ప్రేల్చి, ప్రేల్చి, దానిని యజ్ఞేశ్వర ప్రసాదముగ విశ్వసించి భక్షించుటా? స్వర్గలోకమున రంభలతోగూడి భోగించుటా! తాము పతనోన్ముఖులగుచు, పలువుర నా పాపకూపమున బడలాగుటా? భూతార్థములను గప్పిపెట్టి, రూఢ్యర్థములను వాడుకకుదెచ్చి, యాడదలచిన నాటకముల విశృంఖలముగ నాడుటా? స్వైర విహార మొనర్చుటా? కన్నులు మూసికొనిపోవ గాఱులు ప్రేలుటా? అహాహా! కాలమెట్టి మాయావి? ఎంతలో నెంత మార్పు? ఎంతలో నెంతవైచిత్రి? ఇంద్రజాలమనగ నింతకంటె భిన్నముగ నుండునా?

యజ్ఞమననేమి? దేవతాప్రీత్యర్థము, పరమేశ్వరకారుణ్యసిద్ధ్యర్థము మనము గావించు పవిత్రకార్యము. ఆత్మార్పణయనియు – సృష్టియనియు యజ్ఞ శబ్దమునకు మఱి రెండర్థములున్నవి. 'యజదేవ పూజాసంగతికరణదానేషు' అనెడి ధాతువు నుండి యీ యజ్ఞపదము వచ్చినది. 'న ధ్వరతీతి అధ్వరః' అనఁగా– హింసలేనిదే యధ్వరమని యర్థము. 'యజ్ఞో వైశ్రేష్ఠతమం కర్మ' యజ్ఞ మనఁగా–మిక్కిలి శ్రేష్ఠమైనపని. విషయమిట్లుండ, పశుబలులతో–హింసాకాండలతో–పాశవికకృత్యములతో యజ్ఞపదమున కపార్థమును గల్పించి, యాశయమును భగ్న మొనర్చిన పెద్దలనేమనవలెను? కాలమహిమ యట్టివిప

రీత పరివర్తనమునకు కారణభూత మాయెనని మిన్నకుండు టొక్కటియే గత్యంతరము. కాకున్న నేమిటీ విచిత్రము ?

వేదమంత్రములకు యాస్కమహర్షి సముచితవిధాన మున సహజసుందరములైన నిర్వచనములను 'నిరుక్తము'అను తన గ్రంథమున విస్పష్టముగ వివరించియుండెనుగదా? ఇట్టిచో నీక విపరీతార్థములతో పనియేమి? వేదార్థము లీ రీతి వక్ర భాష్యములుగ వెలయుటవలననే యీ యుగలక్షణము లిట్లు భ్రష్టములైనవి. కావున, ఈ వేదమంత్రములను గుఱించి యింతగ వివరింపవలసివచ్చినది. వేదమాత కపకృతి జరుగుట– విశ్వవినాశనమునకే హేతువుగదా!

యాస్కమహర్షి వెలువరించిన యౌగికార్థములను విస్మరించిన స్వార్థపరులుకొందఱు – త్రేతకు జ్ఞానరంగమునం దపఖ్యాతిని జేకూర్చిపెట్టిరి. సంకుచితములు – సాధుజనాభిమానహీనములు– వక్రములు నగు భాష్యములు పల్క, వేదమాత నపహాస్యము పాలొనర్చిరి. వేదస్వరూపమునకు గళంకము నాపాదించిరి. యజ్ఞము నిక్కముగ స్వర్గభోగానుభూతికేయని వక్కాణించిరి. సోమరసమనఁగా – మత్తుగల్గించెడి పానీయమని యపార్థమును గల్పించి, దానిని కుత్తుకబంటిగ గ్రోలినవారు – సోమయాజులు కాగలరని ప్రచారముజేసిరి. భోగము, త్రాగుడు అను పదములు– వినువారిని బలముగ నాకర్షింపఁగలవుగదా? దానితో వారి_యనుయాయుల సంఖ్యయు నానాటికి పెరిగిపోయెను.

యజ్ఞములుచేసి,మత్తుగ-మస్తుగ సోమరసపానమొనర్చి, నిండుగ పచ్చిమాంసము నారగించి, రంభాద్యప్సరసలకడ, కాలమును లీలగ గడుపు తమితో - పలువురీ పాశవిక కార్య నిర్వాహణ కెగబడిరి. యజ్ఞములిట్లు పాడయినవి. సాంఘికధర్మ మీ పగిది సర్వనాశనమునకు బాత్రమైనది.

యజ్ఞప్రయోక్తలు-యజ్ఞకర్తలుగూడ, ఘోరపాపముల నాచరించినవారగుటచే నిహపరములు రెండింటికిం జెడినవా రగుచుండిరి. దురాచారములు బహుజనామోదమునంది విచ్చల విడిగ ప్రతియింటను పీఠము వేయసాగినవి. త్రేతలో ధర్మ దేవత రెండవ పాదముగూడ మొరికిబడ సాగినది. ఒకనాఁ డనార్యుఁడనియు - దురాత్ముఁ డనియు వేరుచేయఁబడిన - దూరముగ నుంచబడిన యనార్యుఁడు నేఁడు యజ్ఞములపేరుతో నార్యుఁడు గావించుచున్న దుష్కృత్యములనుగాంచి, వాని పాఠము తిరిగి వానికే యప్పగింపదలంచెను.

ఆర్యులలో కొందఱు యజ్ఞవేదికలకడ దారుణముగ రక్తపాతమునుగావించుచు, పశుబలులను సాగించుచు నిరాటంక ముగ తమ విలయ తాండవమును భోగదృష్టిని పెంపొందించు కొనుటగాంచి, యనార్యుఁడు సహింపఁజాలకపోయెను. ఇట్టి ఆర్యుల యాటగట్టింప ననార్యులు కంకణములు గట్టిరి. ప్రథమ ప్రయత్నముగ నార్యులు తలపెట్టిన యజ్ఞముల నన్నింటిని విఘ్నమొనర్పసాగిరి. తిరుగులేని నిర్ణయమునుగైకొని దీక్ష

వహించిరి. ఆర్యులపై నిదివెుక విధముగ ననార్యులు సల్పిన సముచితమగు తిరుగుబాటుగ వేర్కొనవచ్చును.

ఆర్యులలో కొందఱు వేదమంత్రములతో బ్రాహ్మణము లను గలిపి, వేదస్వరూపమును కలుషీకృతమొనర్చిరి. నిజమైన వేదమిదియేయని యెలుగెత్తి, నిర్భీతిగ బ్రచారము సేయసా గిరి. తపస్సును దుర్వినియోగమొనర్చి, స్వశక్తులను బెంపొం దించుకొనుటకు-స్వశత్రువులహతమొనర్చుటకు దానిని సాధ నముగ తీర్చిదిద్దుకొనిరి. తపశ్శక్తి సంపన్నులగు తాపసులు వరములను ప్రసాదించుటకు మాఱుగ శాపముల బెట్టనారం భించిరి. ఇట్టి బ్రహ్మాండమైన వర్గసమరమునకు నాఁడు భూభాగ మంతయు కేంద్రమాయెను. వీరిలో నెవరి యోగ్యత నెట్లు మెచ్చగలము ? ద్వంద్వశక్తులు తారసిల్లి, ధరణికి బరువును గూర్చినమాట వాస్తవము.

పరమపావనమును-భగవద్దత్తమునైన వేదమంత్రము లకు విపరీతార్థములుచెప్పి, నిజమనోరథసిద్ధిసాధన ప్రాయ ములు గావించుకొనినవారు కొందఱు వేదమంత్రములెవ్వియో, కానివెవ్వియో గ్రహించుటకు వీలుగలుగనంత కట్టుదిట్టముగ కలగాపులగమొనర్చి, వేదస్వరూపమునే మార్చివైచి, వేద సర్వస్వ మిదియే యని దబాయించుటకు సిద్ధపడినవారు కొందఱు. ఎవ్వరు ప్రాక్తనసంస్కృతి కుపకారులో ! ఎవ్వ రపకారులో !

దుష్టాత్ములనియు, నల్పాత్ములనియు ద్రోసివేయఁబడిన వారు కొందఱు. దుష్టాత్ములనియు, నల్పాత్ములనియు నితరుల నిందించుచు, దుష్టములైన-యల్పములైన నీచక్రియల నాచరించుటకు సంసిద్ధమైనవారుకొందఱు. పలికిన పలుకును నిలుపుకొనలేక, ఆడితప్పి, సత్యదూరులై, తా మొనర్చిన దోషము లనెడివానినే పరులొనర్పగ జూచి, యొప్పుకొనలేక, యెదిరింప-విఘ్నముగావింప నిశ్చయించుకొనినవారు కొందఱు. వీరిలో నెవరుయోగ్యులో! ఎవరయోగ్యులో! లోకమునకు గన్పించున దొకటే. చరిత్రకందెడి సత్యమొకటే. మొత్తముమీద, సామాజిక జీవితపు విలువలు సమూలముగ నిర్మూలింపఁబడు టారంభమాయెను. కారకులెవ్వరైననేమి? ఏ తొయిలైననేమి పంటినూడగొట్టుటకు?

ఆర్యానార్యభేదములు తారస్థాయికిఁజేరినవి. ఋషులలో నైతమీ తారతమ్యపరిగణన మేర్పడెననుకొంటిమి. విజ్ఞులలో నైతమిట్టివైషమ్యములుప్పతిల్లుట విచారింపదగిన విషయము. కాని, యేమిచేయగలము? యుగప్రభావము. కాకున్న, ఋషులలో - బ్రహ్మర్షులనియు, రాజర్షులనియు తెగలేర్పడుట చిచ్చిపి కలహమువలెలేదా? జ్ఞానఫలము నందుకొని, మోక్షార్హతను గడింప తపించెడి నిష్కాములలో తెగలేమిటి? బ్రహ్మర్షికన్న రాజర్షి యల్పుఁడనెడి భావమేర్పడుటేమి? బ్రహ్మర్షి పదము మిక్కిలి గొప్పదనెడి యూహయేలనుప్పతిల్ల వలయును? రాజర్షి శబ్దము శ్రేష్ఠవాచకముకాదా? ఆర్యులలో

గాని, యనార్యులలోగాని యందఱిట్టి సంకుచితస్వభావులనియే యనఁజాలము. కాని కొందఱేని యుండినఁజాలదా వైరుధ్యము ప్రబలుటకు! కడివెడు పాలను కలుషిత మొనర్చుటకొక్క చుక్క విషముచాలదా? అట్లయినదిస్థితి. విశ్వామిత్రునకు వసిష్ఠునిపైగల ద్వేషమున కర్థమేమున్నది? తాను రాజర్షియట! వసిష్ఠుడు బ్రహ్మర్షియట! తనకన్ననతడు మిన్నగనుండరాదట! తానతనితో సమానుఁడుగనైన నుండవలెనట! అయిన బ్రహ్మర్షినేయని యనుకొనరాదా! తనవారు పలుపురిచే ననిపించుకొనరాదా! కాదట! వసిష్ఠుఁడే యనవలెనఁట! అందుకొక బ్రహ్మాండమైన పథకము. కఠోరతపస్సు- పట్టుదల- తపోభంగము. పట్టుదలలమధ్య కేవలము నిరపరాధులు లేగలవలె నలుగుట. సంక్షోభము, సంఘర్షణ, కల్లోలములతో లోకమల్లాడుట. తాదృశస్థితి నేమని చెప్పవలెను?

కొంతకాలమట్లేగడచినది. ధర్మదేవత రెండవ పాదమునకు క్రమముగ పటుత్వము సన్నగిల్లుచున్నది. ఈ యగ్గి మరియొకరూపమున భగ్గుమనినది. రాజర్షి బ్రహ్మర్షి భేదము బ్రాహ్మణ క్షత్రియభేదముగ ప్రళయరూపమునుదాల్చినది. తాల్చక తప్పదు. తాల్చకున్న, దాల్చుటకు వీలైన పథకములు పన్నువారా బాధ్యతను తలదాల్చుదురు. వైషమ్యము లుదయింపకయే యుండవలయును. పొడమినచో నడుగంటు ద్రొక్కజాలిన గడుసరులు పుడమిపై నవతరించువఱకవి మిడిసి మిడిసి పడుచునే, పడుచుదనమున బకపకలాడుచునే యుండును.

యోచించిన నిది యెంత వింతగదోచును? ఎంత విషాదవంతముగ గన్పట్టును ?

స్వార్థము పెఱిగి, భోగలాలసత హెచ్చి, ఆర్యానార్య భేదము లుప్పతిల్లుటా ? అవి రాజర్షి బ్రహ్మర్షి భేదావతార ముల దాల్చుటా ? కడకవి బ్రాహ్మణ క్షత్రియ జాతుల యంతర్యుద్ధములుగ జిత్రితములై, విచిత్రాకృతులతో బ్రత్యక్ష మగుటా ? విజ్ఞానము వెట్టితలలువేయుటన్న నిస్ప్రేయుండును గదా ?

మానవుల మనోదౌర్బల్యములను - ప్రకోపశక్తిని - ఉద్రేకపరిస్థితిని అండగఁ జూచుకొని, వాతావరణమును కశ్మల మొనర్చు ఋనులు సర్వకాలములలో నుందురు. వారే పులి యందురు; వారే తోకయందురు. మన కనులకేదియో భ్రాంతిని గూర్తురు. మనలను మత్తులో ముంచెత్తుదురు. మహోన్మాద్యము మునకు నాంది గీతముల నాలపింతురు. రగులుకొనుచున్న యగ్నిలో - సామాజికుల నొక్కరొక్కరిని యింధనములుగ వైచి మసిచేయుదురు. తమపబ్బమును గడుపుకొనుచుందురు. వారి వృత్తి యదియే. పరిస్థితులు విషమముగ నున్నగాని, సమాజమున నట్టివారికి నిదురపట్టదు. వారి యుద్యమము కాలము గడచినకొలది గట్టిపడును. క్రమముగ నది యెవ్వరి సహాయ సంపదలతో నిమిత్తములేక, విషవృక్షమువలె నెదుగు చుండును.

అతిథిగవచ్చిన కార్తవీర్యార్జునునకు, జమదగ్నిమహర్షి తనచెంతనున్న సురభిసాయమున గొప్పవిందొనర్చెను. కార్త వీర్యుడా గోమాత మహిమ కచ్చెరువందెను. ప్రలోభదృష్టితో తా నా ధేనువును వాంఛించెను. తన యభిమతమున కడ్డుగ నున్న జమదగ్ని నహంకారావేశములతో దారుణముగ వధిం చెను. నిజమునకిది ఘోరమైన యకృత్యమే. కాదని వాదించుట కెవ్వారును గడంగరు. కాని జమదగ్నిపుత్రుడైన పరశురాముడు పితృహత్యాప్రకోపమానసుడై కావించిన ప్రతీకారము దారు ణాతి దారుణముగ పరిణమించుటయే విచారణీయాంశము. తండ్రి పట్ల ఘోరమైన నేరమొనరించిన కార్తవీర్యునిపై కచ్చెబూని కఠోరప్రవృత్తితో జరించుట రొకవిధముగ సమర్థనీయమే కాగలదు. కాని హద్దుల నతిక్రమించిన యాకచ్చె చిచ్చువలె వ్యాపించి నరపాలకోటినెల్ల నిరువదిరొక్కమారు బూది పాలు గావింప సమకట్టుట సబబా? మహాతపశ్శక్తిసంపన్నుడు-సహనమూర్తి – సంయమియైన వ్యక్తి యిట్టి రక్తపాతమును గావించి, యిలాతలమును క్షోభపాల్సేయుట ఘోరవ్యవహా రముగనే గోచరించును. జనకునియెడగల యనన్యభక్తిప్రేమలు మనోనిగ్రహమును లొంగదీసి, తనయునిచే నమానుషచర్యల జేయించెనని, నది కార్తవీర్యనివరకే పరిమితమై యుండవల యునుగదా! నిరపరాధులగు క్షత్రియులెందరో పరశురాముని యనివార్య క్రోధాగ్నిజ్వాలలకేల యాహుతిగావలెను? మరియు పరశురాముఁడు విప్రకులసంజాతుఁడుగదా! వరుసబెట్టి యిరువది

రొక్కమాఱు క్షత్రియపరంపరను వెదకి వెదకి, నరుకు టేమిటికి? ఎంతకష్ట? బ్రాహ్మణులకు, క్షత్రియులకు తత్ఫలితముగ వర్గ యుద్ధము సమారంభమైనది. ఆ సంరంభమున నెవ్వరికున్న బలమును వారు చూపుకొనిరి. త్రాసునందలి యొకభాగ మొక పరి మ్రొగ్గుగ నుండెను. మఱియొకపరి మఱియొక భాగము మ్రొగ్గుగనుండెను. జరిగినదేమిటి? జనవినాశము. సాంఘికముగ శక్తి సన్నగిల్లుట. బలాబలములను సమీకరించుకొని, యిరు తెగలవారును తరుణముకొఱకు నిరీక్షించుచుండుట. అట్టి పరిస్థితులలో-యజ్ఞకాండపేర జరుగుచున్న పాపకార్యములఁజూచి యోర్వలేకపోవుటయనెడిది తటస్థించెను. క్షత్రియులు బ్రాహ్మణులపై తిరుగుబాటు సాగింపసమకట్టిరి. వైరములు ప్రబల స్థాయికిఁజేరినవి. పతనము మెట్టుపై మెట్టునకు మెల్లమెల్లగనెగబ్రాకసాగినది.

స్వధర్మమునకు విరుద్ధమైన దారుణ మారణకాండకు పరశురాముఁడు పూనుకొనుటలో – సాహసించుటలో నొక యాంతర్యము గూడ మనకు గన్పట్టును. నాఁడు కొన్ని సమయములలో బ్రాహ్మణులనఁబడెడివారిపై, క్షత్రియుల యుద్ధతి సైతము జోరుగనుండెడిది. పితృవధతో మిక్కిలి వ్యధజెంది, విసిగి, గత్యంతరము గానక, యుద్ధిక్తుడైన పరశురాముఁడు-చిన్ననెపము నాధారముగ గొని, కుఠారమును చేతబూని, భీకర పరిస్థితులను సృష్టించి, క్షత్రియలోకమునే గడగడ లాడించెనని, పగబట్టి యిరువదియొక్కమా ఱకుంఠిత

పరాక్రమమును బ్రహ్మతేజఃప్రభలతో విశ్వమును దిగ్భ్రాంత మొనరించెననియు నందురు. కావచ్చును. కాని పరశురాముడు తీవ్రతపస్సునుండి వెలువడి వికృతములు - బీభత్సములునగు దాడులతో అవిచ్ఛిన్న మారణహోమము నారంభించుట-సత్కర్మకాదనియేయనవలయును. పరిస్థితుల ప్రాబల్యము లట్లు కాలమును కఠోరవాతావరణమునఁ బెట్టినవి. ప్రతియొక రును పరిస్థితులకు వారసులుగమారి, వారి వారి స్వధర్మము లనే-కనీసపు మానవధర్మములనే మరచిరి. పలువురు విజ్ఞులే బహుభంగుల పెక్కు-రంగములం దిట్లు పతనము కాజొచ్చిరి.

ఈ విద్రోహచర్య లిట్లే విశ్వము నుడికించునా? ఈ పాశవిక సంఘటనలకు పరిష్కారమార్గమే లేదా? ధర్మ చ్యుతి యిట్లే యున్నతోన్నత శిఖరముల కెగబ్రాకవలెనా? కృతయుగ లక్షణములలో నేర్పడిన వికృతస్థితి ప్రయోగమింపక తప్పదా? మానవకోటి యంతరాత్మల నలముకొనుచున్న మాలిన్యమును తొలగించెడిశక్తి యెద్దియేని సముద్భవింపదా? లోకధర్మమును సముద్ధరింపదా?

ఇట్టియూహలతో చరిత్ర నిండిపోయిన తరుణమది. తరణోపాయము కొఱకు జాతి యెదురుతెన్నులుజూచుచున్న సమయమది. శాంతరసధారలతో ధరిత్రి ప్లావితమై, సు భిక్షముగనుండి, దయా సత్య శౌచములు పండవలసియున్న కాలమది. స్వార్థాసూయాగ్నిజ్వాలలతోనెండి, బీటలువారి యున్న నేల - సమతా సౌహార్దవృష్టితో తడిసి, పదునగు

'ఎన్నడు? ఒక నవోదయము చరిత్రలో కావలయును. ఒక మహోదయము మానవాళిలో నాశారేఖల జిత్రింప వలయును. నాడేగదా జగతికి శుభోదయము! అమహో దయమే భగవదవతారము. కృతయుగమున నెవరికివారే ధర్మమును సంరక్షించుబాధ్యత వహించిరి. నాడవతారముల యవసరములేకపోయినది. సత్యసంధతయే నాటియారాధనా దైవము. సత్యానుభూతియే నాటి జాతి జీవిత లక్ష్యము. సత్యమే నాటిసమాజమున భగవంతుడు. భగవంతుని సదా స్మరించుచు ప్రత్యక్షముగగాంచుకాలమున భగవదవతారముల యావశ్యకమేల? త్రేతవచ్చుసరికి ధర్మోద్ధరణార్థమొక మహా శక్తి రూపుదాల్చవలసివచ్చెను. దుష్టశిక్షణగావించి శిష్టరక్షణ గావించి కూలిపోనున్నధర్మదేవత కాలూని, నేలపై నిలువగల స్థితిని సంఘటింపవలసి వచ్చినది.

భగవానుడు ప్రజావళిమొఱవినినాడు. అయోధ్యా నగరమున దశరథునియింట యజ్ఞపురుష వర ప్రసాదముగ మహాసాధ్వియైన కౌసల్య ముద్దులబిడ్డగ నొకసుముహూర్త మున నవతరించినాడు.

"వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే
వేద: ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా"

వేదవేద్యుడైన భగవానుడు దశరథాత్మజుడైయవత రింప, వేదము రామాయణరూపమున వాల్మీకినోట- భూలోక

మున నవతరించెనఁట! అహాహా! పుణ్యభారత వసుంధరా! నీభాగ్యమే భాగ్యము. నీవు సర్వవిధముల పూతచరిత్రవు. కాలము నీపై కచ్చెబట్టి, మచ్చవేయఁబూనిననుఁనీపవిత్రత చెక్కుచెడదు. వేదవాణి చెడనీయదు. చెక్కుచెదరనీయదు. పొంగులు, పొలికేకలు, కలకలములు, కల్లోలములు నిన్నేమి సలుప గలవు? మహాభారత చరిత్రయనెడి విశాలమైన మైదానమున నటనటగల నిమ్నోన్నత ప్రదేశములవలెనవి యున్నట్లుగ, లేనట్లుగ బరిశీలకులకు దోచుచుండును. రామచంద్ర ప్రభువువంటి లోకోత్తర చరిత్రుని యేలుబడిలో - మేలిమి పంటలను బండించిన, నీకేమిలోటు వాటిల్లును?

"రామో విగ్రహవాన్ ధర్మః"

ఇది, ఒడలు పులకరింపజేసెడి పలుకు. ధర్మజ్ఞుఁడు- సత్యవాక్య పాలకుఁడు - దృఢవ్రతుఁడు- ప్రజానురంజకుఁడునగు ప్రభువు లభ్యపడుట - భూమాత సుకృతము.

"కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్
ఆరుహ్యకవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్"

ధరణీమాతా! నీ కబ్బిన మరొక మహాదృష్టమిది. తపోనిధియై, మహాజ్ఞానియై, మధుర మధురముగ రామాయణ గాథాసుధలను బిండి, విశ్వమానవ కల్యాణార్థము దత్తము గావించి, ఆదికావ్యస్రష్టయైన వాల్మీకిమహాకవియీ యుగమునకు వెలుగు జిలుగులను వెలయించుట నీ భాగ్యముగాక మరేమగును!

"ఆదికవీ చతురాస్యో కమలజ వల్మీకజో వందే
లోక శ్లోక విధాత్రోఃయయోర్భిదా లేశమాత్రేణ."

పరమేష్ఠి కమలజుఁడు. ఆదికవి వల్మీకజుఁడు. ఆయన లోకవిధాత. ఈయన శ్లోకవిధాత. వీరిరువురికిని భేదములేశమాత్రము. శకారమొక్కటి వాల్మీకికే యెక్కువ.' ఇట్లని యెల్లరిచే నమస్కరింపఁబడుచు, పరమేష్ఠి తుల్యతను గడించిన వాల్మీకి - యీ యుగసంస్కరణకు శ్రీరామచంద్రునివలె సంపూర్ణ సహకారము నందఁజేసిన మహానుభావుఁడు.

"యావత్ స్థాస్యంతి గిరయఃసరితశ్చ మహీతలే
తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి."

అట్టి మహాశక్తి సంపన్నమైన దివ్యకావ్యమది. అట్టి బలీయమైన భావభాండారమునుండి యూహా లందింపఁబడినఁగాని, నాటి సమాజిక వికృతస్థితియొక్క యుద్ధతి తగ్గలేదు. అట్టి భావములకు మహాకావ్యరూపకల్పనగావింప సర్వవిధ సమర్థత గల మహాముని వాల్మీకి కవిగానుండుట-తాదృశమహాకవి శేఖరుని వాగ్వైలాసమునకు వన్నెలు చిన్నెలు దిద్దగలయాదర్శమూర్తి శ్రీరాముఁడు కథానాయకుఁడుగ లభ్యపడుట పదపద సేవానురక్తచిత్తయు సౌశీల్య సౌభాగ్య సంపద్విరాజితయు-అయోనిజయు మహాసాధ్వీ శిరోమణియు నగు సీత కథానాయికగ దక్కుటయు వరుస వరుసగ నాకాలమున కలిసి

వచ్చిన మహోదృష్టములు. నవోదయమైనది. మహోదయము మహిమలను వెలయింపసాగినది. ఇక త్రేతాయుగోదయము గాకుండ నడ్డుకొనుశక్తి యెవరికిగలదు? భవభూతి - యుత్తరరామచరితములో రామునిచే నిట్లనిపించినాడు.

"స్నేహం దయాంచసౌఖ్యంచ యదివా జానకీమపి
ఆరాధనాయ లోకస్య ముంచతో నాస్తిమేవ్యథా"

నా స్నేహమును-దయాస్వభావమును-సౌఖ్య సర్వస్వమును-వేయేల! నా జానకినైనను లోకసేవలో నవసరమైనపుడు పరిత్యజింప వెనుకాడను.' ఇవి-రఘువీరుని భావనలు. జన్మించినది భగవదంశలో. ఉనికి-పరమపావన త్యాగదయాపూర్ణభావబలోపేతమైన యిక్ష్వాకువంశమున. తీర్చిదిద్దినది బ్రహ్మర్షులు. సహజ సురభిళసుమము కలసివచ్చిన యనేకావకాశములతో- విశ్వమునే మురియించిన పగిది, శ్రీరామచంద్రమూర్తి సర్వకళాప్రపూర్ణుడై, సకల సద్గుణసంపన్నుడై, దయావీరమునకు బెట్టినదిపేరై, ధర్మరక్షణకు గంకణము గట్టి, రంగమున కాలిడినాడు. కొదువయేమి? కువలయానందకరుడు భువనపాలన భారమును వహించినతరి-కోరికలు కొనసాగవా? గుట్టములై, పరుగులుదీయవా?

ధర్మాకృతితో వచ్చిన శ్రీరామచంద్రమూర్తి-ధర్మోద్ధరణకు బూనుకొని, త్రేతను గాపాడ నారంభించెను. శ్రీరాముడు రాజుగ ధర్మమును నిర్మలదృష్టితో పాటించెను. ధర్మో

త్తర కార్యములయెడ నా దివ్యుని చిత్తము ప్రసరించెడిదికాదు. ధర్మమూర్తిగ కీర్తిగడించుటందలకు సాధ్యముగాని యంశము.

స్వధర్మ విరుద్ధ కృత్యముల నాచరించుచున్న పరశు రాముని పై, శ్రీరాముఁడు తొలుత ధర్మవిజయమును సాధించెను. శ్రీరామ ధర్మోద్ధతికి, ధర్మవీరమునకు దట్టుకొనలేని పరశురాముఁడు తొలుత నహంకరించినను – తుదకు తన యోటమి నొప్పుకొని, యడవులకు జనెను. బ్రాహ్మణుల విక్రమాటోపము పై క్షత్రియులు కొట్టిన గట్టిదెబ్బ యిది. స్వధర్మమును పాటింపక, యహంకరించినవారి పై ధర్మపరులు సాధించిన ఘనవిజయముగ నీ ఘట్టము నభివర్ణించుటలో దోసము లేదు.

బ్రాహ్మణధర్మ సమారాధకులెల్లరు – రాముని సుగుణ సంపత్తిని, ప్రచండ ధర్మరక్షాభినివేశమును, కోదండ పాండిత్యమును వీనులారవిని, కనులారగాంచి, రాముని శరణుజొచ్చిరి. రాక్షసుల బారినుండి తమ్ము గాపాడు మని యభ్యర్థించిరి. శ్రీరామునకు ధర్మాధర్మవిచక్షణ యొక్కటియే మనమున సర్వదా నర్తించుచుండును. ధర్మగ్లాని గలుగుట సహింపజాలని వాఁడై, తాపసుల కభయమొసంగి, రాక్షసుల పై పోరాడి, ధర్మసంరక్షణ గావింతునని వాగ్దాన మొనర్చినాఁడు. దుష్ట శిక్షణయే నా ప్రథమకర్తవ్యమని తన నిశ్చితాభిప్రాయమును ప్రకటించినాఁడు. ధర్మవిరోధి యెవ్వఁడో – వాఁడే నాకు ప్రబల విరోధియని స్పష్టీకరించినాఁడు. అధర్మశక్తుల హత

మొనర్చుటకు కోదండము సర్వదా మోపెట్టబడి యుండునని గట్టిగ దెలియఁ బల్కినాఁడు. దీనితో మునులకు – బ్రాహ్మణులకు ప్రాణము లేచివచ్చినది. క్షత్రియుల సహకారముతో బాటుగ – మునీంద్రుల, బ్రాహ్మణుల, ధర్మారాధకుల సంపూర్ణ సహకార ప్రేమాభిమానములుగూడ రామునకు వెనుక నిలిచినవి. ఈ కాలమున బ్రాహ్మణులలో కొంతగ బ్రహ్మతేజస్సు కుంటువడుటచే క్షాత్రవర్చస్సుతో బ్రహ్మతేజస్సు ననుసంధింప జాలిన కొందఱుక్షత్రియులే బ్రాహ్మణులకు – తాపసులకు నాడు రక్షకులయిరి.

మఱల వేడకోవిదులైన బ్రాహ్మణోత్తముల మాటకే విలువపెరిగినది. శ్రీరామునియండన ఋషులు ధర్మప్రవక్తలై, పరోక్షశాసకులై, పాలనాచక్రమును గేల దాల్చిరి. నిర్విఘ్న ముగ జప తపాదులు జరుగసాగినవి. రాక్షససంహారవిషయమున శ్రీరామునుపమాన బాహుబలమును ప్రదర్శించుచుండెను. కారణాంతరము లెన్నియో యడుగడుగున ప్రత్యక్షమై, బలీయమైన పరిస్థితులేర్పడి, అయోధ్యనుండి రాముని కార్యరంగము కాననములకు మారెను. ఆశ్రమధర్మసంరక్షణ, వేదధర్మపరిపోషణ భారతీయ సంస్కృతికి తొలినాఁటినుండియు ప్రధాన ధ్యేయములు గదా! అదియే శ్రీరాముని కాలమున మహోన్నత స్వరూపమున సాక్షాత్కరించినది. ధర్మమునున్నతోన్నత స్థానమునకు గొనిపోవ సంకల్పించి, ప్రత్యంశమును ధర్మ దృష్టితో దిలకించుచు, పరోపకార పారాయణాదులుగల్గి, భవ్య

గుణ గణములతో విరాజిల్లెడి శ్రీరాముని, ఋషులెల్లరు ధర్మ స్వరూపునిగ - దైవస్వరూపునిగ సమారాధింపసాగిరి. శ్రీరామావతారము మునిజన సన్నుతమై, సర్వుల కాదర్శపాత్రమాయెను. క్షత్రియుని కగ్రపీఠమాయఁబడెను. వైరమూని, సమరములకు సమాయత్తులైన బ్రాహ్మణులే మఱల క్షత్రియ జాతి సంభవుఁడైన శ్రీరాముని-పరంధామునిగ ప్రస్తుతించిరి. విచిత్ర మేమన, ఇరువదిరెండొక్కమారులు పరశురాముని చే వధింపఁబడిన క్షత్రియజాతికిఁ జెందిన శ్రీరాముఁడే - ప్రబల శత్రుకూటమికిఁ జెందిన బ్రాహ్మణులకు శరణ్యుఁడాయెను. తప స్సంపన్నులకు రక్షకుఁడై తన యేలుబడిలో ఘనగౌరవము నొసగెను.

వర్ణవిభేదములు నామమాత్రావశిష్టము లైపోయినవి. సామాజిక జీవితమున మఱల సమరసభావము - సమతాదృష్టి పెంపొందసాగినది. ప్రజానురాగమును జూఱఁగొని, ప్రజా కళ్యాణముకొఱకు శ్రమించెడి ప్రభువులపాలనలో-వైషమ్యములకు తావెక్కడ? శ్రీరాముని దివ్యత్వమును గుర్తించి, పలువురకు తద్విశేషమును దెలుపుటకై, మఱల ఋషులే సమాయత్తచిత్తులగుట - మహాశ్చర్యకరాంశము.

"అహంవేద్మి మహాత్మానం
రామం సత్యపరాక్రమమ్"

అని బాల్యదశయందే దశరథరాముని మహామహిమలను గుర్తించి, వానిని లోకమునకుజాటిన మహాత్ముడు విశ్వా

మిత్రమహర్షియే. ఆ శ్రీరామచంద్రుని యభ్యుదయమును గాంక్షించుచు, మహాశీర్వచనముల నందఁజేసినది భరద్వాజాది మహర్షులే. భువనమోహనాభిరాముని గ - నయనాభిరాముని గ గీర్తించుచు, రఘుకులసోముఁడైన శ్రీరాముని దర్శనార్థము కన్నులు కాయలుగాయ నెదురుతెన్నులు జూచినది ఘోరకాంతారవాసులైన మునిచంద్రులే.అట్లుల్లస యభినందనల నందుకొనఁజాలిన దివ్యాకర్షణ - శ్రీరామచంద్రుని యందు నిండియుండెడిది. ఆజానుబాహుఁడు-అరవిందదళాయతాక్షుఁడు - రఘుకులాలంకారుఁడు - అప్రమేయుడు-నిశాచర వినాశకరుఁడు నగు శ్రీరాముని పుంసాంమోహనరూపునిగ భావించి, నాఁడెల్లరానందించిరి.

శ్రీరాముని యాదర్శగుణ సంపత్తియేగాక, యాదర్శ దాంపత్యశక్తియు లోకమోహనముగ వర్ధిల్లెను. సహధర్మచారిణియైన మహాపతివ్రత సీత. ప్రపంచ మహిళాలోకమున కాయితి మేలుబంతి. రాముని హృదయముతో జానకి హృదయమెట్లు సమ్మేళనముజెందెనో- యట్లే, రాముని నామముతో 'సీత' నామముగూడ విడదీయవీలుపడని విధమున సమ్మేళనము పొందినది. "అనన్యారాఘవేణాహం భాస్కరేణ ప్రభాయథా"-అని జానకీసతియే వాక్రుచ్చిన విషయమిట స్మరణీయము. సీతారాములనునది యాదర్శదాంపత్యమునకు మారుపేరుగ పేరుమ్రోగినది.

సకల దుష్టరాక్షస తత్త్వనిర్మూలనకు - సర్వసాధుభావ సంపత్సంరక్షణకు సీతయు హేతుభూత యగుట విశేషము. వారి వనవాస మొక ధర్మసంరక్షణ మహోద్యమమై, చరిత్రలో నిల్చినది. భక్తాభీష్టవర ప్రదాత యనెడి కీర్తిని శ్రీరాముఁడు విశేషముగ నార్జించుట కీ కాంతార సంచారమే కారణమైనది.

పితృవాక్య పరిపాలన శ్రీరాముని యరణ్యవాసమున కొక ప్రత్యక్షకారణము. కాని పరోక్షకారణము లెన్నియో యిందిమిడియున్నవి. ముఖ్యముగ క్రూరరాక్షస సందోహ సంహార మీ వ్యాజముననే రాము డొనరింపజాలెను. పర దారాపహరణాది పాపకృత్యములను బాహాటముగ సాగించుచు నీతికి దూరుడై, జాతికివేఱుపురుగై సంచరించుచున్న రావణుడు, జగన్మాతయు, సౌశీల్యసముపేతయు, పతివ్రతాతిలకమునగు సీత నపహరించుటతో శ్రీరామచంద్రుని ధర్మసముద్ధరణ కార్యరంగము విస్తృతరూపమును దాల్చినది. జటాయుసము పలాలన-సుగ్రీవ మైత్రి-వాలి వధ మున్నగునవి సందర్భాను సారముగ గలిసివచ్చినవి.

వానరజాతిని మొత్తము ధర్మదీక్షితులగావించి, లంకను ముట్టడించి, దుష్టరాక్షససమూల నిర్మూలనమొనర్చి, రావణ సంహారముతో విశ్వమున శాంతిని నెలకొల్పిన పుణ్యమూర్తి శ్రీరామచంద్రుడు. ఆ మహోద్భుత సంఘటనతో దౌర్జన్యము తలవంచినది. హింసజీవచ్ఛవమైనది. దురహంకారము, పశు

బలము గుండెలు కృంగకూలబడినవి. సత్యన్యాయధర్మములకు పట్టాభిషేకము జరిగినది. అహింసకు బలము పెరిగినది.

"నాభ్యహింసన్ పరస్పరం" అనువేదసూక్తి పునరా చరణమునకు వచ్చినది.

ధర్మసముద్ధారకుడై, ప్రజానురంజకముగ పరిపాలన సాగించి దివ్యావతారమహిమలను ధరాతలమున వెదజల్లిన దైవము శ్రీరాముఁడు. అసమాన కీర్తిగల శ్రీరామచంద్ర చక్రవర్తి-

"నా విష్ణుః పృథివీపతిః"యనెడి సత్యమునకు మూర్తిగ యశోవిస్ఫూర్తితో దీపించెను.

ధర్మమునకు ప్రత్యక్షస్వరూపములుగ - దాంపత్య వైభవమునకు చెరగని చిహ్నములుగ-దేవదేవులుగ సర్వకాల సర్వావస్థలలో సీతారాములు ప్రజలచే స్తుతింపఁబడుచుండిరి. త్రేతాయుగ మిూరీతిగ నవతారబలమున, శ్రీరామ మహిమ వలన నుద్ధరింపఁబడి, సంరక్షింపఁబడినది. రామరాజ్యము రామ రాజ్యముగ రాణకెక్కినది. ఈ యుగమున మహాప్రవక్తయై, మహాకవియై, మహాజ్ఞానియై, మహర్షియై సార్వకాలిక సత్య సముద్ఘాటన గావించెడి యాదికావ్యముగ శ్రీరామకథను రచించిన వాల్మీకి మునికులతిలకుఁ డందఱికిను వందనీయుఁడు. వేదము కృతయుగమును తీర్చిదిద్ద, శ్రీమద్రామాయణము త్రేతలో పండిన ధర్మముల పంటయై, లౌకికసాహిత్యమున కాదికావ్యమై నిల్చినది.

కొంతకాలము గడచినది. శ్రీరాముని కాలమున సంఘటింపఁబడిన బ్రాహ్మణ క్షత్రియమైత్రి యీ కాలమున సత్ఫలములనే పండించినది. సాధుభావములనే నిండించినది. కాని, రామావతారము పూర్తియగుటలో నీ బ్రాహ్మణ క్షత్రియమైత్రి కొంత యపమార్గముల బట్టదొడగెను. బ్రాహ్మణులు క్షత్రియులతో చేతులుకలిపి, మఱల తమ యాధిక్యమును జాటుకొనుచు, తదితరుల నణగద్రొక్కనుద్యమించిరి. ఈమైత్రి నాడొక సత్ప్రయోజన సాధనకుమూలము కాగా – మఱల కొంతకాలము గడచిన పిమ్మట నామైత్రియే మఱొక దుష్కార్యమునకు వినియోగింపఁబడుటారంభమాయెను. కాలప్రభావము మఱల విజృంభించి, జడలు విరబోసికొని, తాండవమాడుట సాగించెనన్నమాట. కాకున్న, కొందఱు వ్యక్తులు మఱికొందఱు వ్యక్తులపై స్వారిసలుప నుంకించుట కర్థమేమి? కృతయుగమున సర్వులు సమానులే. న్యూనాధిక భేదములులేవు. కృతయుగాంతమున బ్రాహ్మణుల యాధిక్యము ప్రకటింపబడినది. దానితో క్షత్రియులెదురుతిరిగిరి. జాతి మొత్తమార్యులుగ, ననార్యులుగ చీలిపోయెను. అపుడొక మహాపురుషోదయముతో మెల్లగ నా రెండుదుమ్ములు సర్దుమణగినవి. ముదావహమైన విషయమే. కాని, కొలది కాలము గడచుచు సరికే మఱల బ్రాహ్మణ క్షత్రియులేకమై, తదితరుల నణగద్రొక్కయత్నించుట శోచనీయాంశముగదా?

లోకమున సంఘర్షణమెపుడు సంభవించును? పీడితులున్నపుడు సంభవించును. దౌర్జన్యమెపుడు హెచ్చును? పీడకులున్నపుడు హెచ్చును. కావున పీడితవర్గ విజృంభణమే ప్రపంచ చరిత్ర యనవచ్చును. తమ ప్రత్యేకతను సర్వదా సంరక్షించుకొను టకై, స్వార్థదృష్టితో కొందరెప్పుడు కొరడా విసరుదురో - యప్పుడే కలహాముల కంకురారోపణము జరుగును.

బ్రాహ్మణ క్షత్రియుల యుద్ధతి యధికమైనది. వీరిలో నే యొకఱు పీడకులైనను - లోకమునకు మహోపకారమే. అట్టితరి, యిరువురేకమై, పీడకులుగ-తాడకులుగ-శాసకులుగ దాష్ట్యకారకులుగ తయారైనపుడు, సంఘమెట్లు నిలువరించు కొనఁగలదు? బ్రాహ్మణులలో గొందఱు-కావలయునని క్షత్రియ ధర్మము నవలంబించి, జోరుస్వారి సలుపసాగిరి. మొత్తము మీద, సాంఘికపరిస్థితి మఱల నస్తవ్యస్తముగ మారిపోవ నారంభమైనది. అతఃకలహ కల్లోలములు రగులుకొనసాగెను. ఉప్పెన వచ్చెడి సూచనలు గనిపించెను. విచక్షణారహితముగ బ్రాహ్మణక్షత్రియులు తమవాక్కునే వేదవాక్కుగ సాగింప నుంకించుటతో - పెనుతుపాను వీచెడి చిహ్నములు పొడగట్ట దొడగెను. బ్రాహ్మణక్షత్రియుల మైత్రివలననేర్పడిన వికృత పరిస్థితులనెడి కఱుకు కత్తితో ధర్మదేవత రెండవ పాదము నిర్దాక్షిణ్యముగ నరికివేయబడెను.

ద్వాపరయుగము

ధర్మదేవత - పాదద్వయముతో బ్రాకుచు, ద్వాపర యుగమున నడుగిడెను. నల్లని తెరలు దిగుచున్నవి. మల్లెమొగ్గలపై నెవ్వరో మలినరాసులను దొర్లించుచున్నారు. నిమీలిత నేత్రములతో ప్రతియొక్కరనుమానపాత్రులవలె సంచరించుచున్నారు. ఏ పాత్రకుగల ప్రత్యేకత యెట్టిదో యవగాహన మగుటలేదు. విశ్వసనీయులశ్రేణి యెద్దియో గోచరింపకున్నది. పదార్థచింతకు లెవ్వరైనది వ్యక్తముగా కుండెను. పొగమంచు దట్టముగ గ్రమ్మికొనుటారంభమైనది. మసకమసకగ మొగములుమాటువరచుకొనెడివారి సంఖ్యయే మెండుగనుండెను. దయాధర్మతేజము కాంతినిగోల్పోయినది. పలుకులలో వాడిమి, వేడిమి దోస్తకము గాసాగెను. దైవభీతి నశించినట్లుండెను. వేదనాదముల సందడియే వినిపించుటలేదు. గురుభక్తికి బ్రాధాన్యమునిచ్చువారు గన్పట్టకుండిరి. విశాలభావనలు హుళక్కియైనవి. సంకుచిత పరిధులలో నాలోచనల క్రమ్మిలాట లధిక మయ్యెను. పారమార్థిక విశ్వాసము క్రుంగెను. పాశవిక భౌతిక సుఖానుభూతిలోలత పొంగెను. మంగళ గీతికల మంజులాలాపముల సవ్వడియే వినిపింపదు. భావిభారత మహానాటక ప్రదర్శనము ప్రార్థనతో నిమిత్తము లేకయే ప్రారంభింపఁబడునా? ఏమో!

ఆ గజ్జెలమ్రోతలు వినుఁడు. అవి ధర్మదేవత కాలి యందెల రవళులవలె నుండలేదే! ఇనుపగజ్జెల కరాళనృత్యమే దేని యారబ్ధము గా నుండెనా? శ్రవణపేయములైన సాధు స్వరములు వినిపింపవా? సాధుజనసంరక్షణైక దీక్షాసంపన్నులు తొలుదొలుత రంగస్థలముపై దర్శనమొసంగరా? అక్షీల నాశింపవలెను? ధర్మదేవత _ పాదద్వయమును గోల్పోయి, తల్లడిల్లుచున్నతరుణమున మనకు రుచిరగానామృతాస్వాదన భాగ్యమెట్లబ్బును?

ప్రచండముగ స్వార్థవాతూలము వీచుచున్నవేళ, ధర్మాంకురములెట్లు మొలకలెత్తగలవు? కనిపించినవారికెల్ల మత్తుమందు పెట్టబడినపుడు _ కమనీయ రూపములు కనిపింప లేదని వేదన జెంద బనియేమి? నిబ్బరముగ నిరీక్షింపుఁడు. రానున్న వేసములన్నియు రాక్షసత్వమునకు ప్రాతినిధ్యము వహించు నవియే. రక్తస్పర్శనేని మన్నింపక, రాజ్యాధికార పిపాసతో నూగునవియే. గురువృద్ధశాస్త్ర ప్రమాణముల గొనగోట మీటునవియే. కోరికలనెడి గుట్టిముల కళ్ళెములు తొలగించి, కన్నులుమూసికొని, గాడిదప్పి, స్వారిజేయునవియే. భారత స్త్రీ సౌశీల్యసంపదపట్లగౌరవమునుగాలఁ బాయనుంకించునవియే. ఏప్పటికెయ్యది ప్రస్తుతమో - యప్పటి కంతవఱకే యట్లే మీటూషి, యనంతవిలయాగ్నుల కాద్యధార లందించుటకు ముందునిల్చునవియే. కావలెనని కాలుద్రవ్వి, కారణరహిత ముగ పరుల పరాభవింప పట్టుదలతో బ్రాకులాడునవియే.

మంచిచెడ్డలారయక, మూఢ విశ్వాసములతో వంచనకు దలవంచి, సంచరించునవియే. మొండిపట్టుబట్టి, నెగ్గించుకొను టొక్కటే చరమలక్ష్యముగనెంచి, ధర్మాధర్మవివేకశూన్య తత్త్వముతో తప్పద్రాగిన వానివలె తందనాలాడునవియే.

వేదశాసనమునకు విలువలేదు. శాస్త్రప్రమాణ మంగీకరింపబడదు. గురువుల పెద్దరికమును శిరసావహింపరు. విచక్షణాత్మక పరిశీలనాదృష్టిసున్న. ఏమియగునో! ఎట్టి బ్రహ్మాండ నాయకుడీయుగమును సంస్కరించునో! ఎప్పటికీ వికృతస్వరూపమున విమలశోభ వెల్లివిరియునో! సంకుల పాప పంకిలమునజిక్కి, దారితెన్నుగానక కొట్టుమిట్టాడెడి వీరందరి కెవరు కనులుదెఱచి, తరణోపాయముపదేశింతురో! నిరీక్షిం తము! తిలకింతము! "పరిశీలింతము!" తెరలు కదలుచున్నవి. అట్టహాసములు గన్పట్టుచున్నవి. గర్జనలు మార్మ్రోగు చున్నవి. ద్వాపరమారంభమైనది. అధర్మము ధర్మము నెదిరించి, నీవా: నేనా? యనుటకు దగిన సమస్థాయిని సంపా దించెను. రెండుపాళ్ళ ధర్మము క్షీణించుటతో - ధర్మదేవత నడకలో తడబాటు పెరిగినది. ఆమె వాణిలో ప్రకంపన ప్రారంభమాయెను.

వేదాధ్యయనము పట్ల శ్రద్ధాసక్తులు మాయమైనవి. బ్రాహ్మణులుహింసాపూరిత యజ్ఞయాగాదుల యూర్ధాటములో మునిగితేలుచుండ, క్షత్రియులు రాజ్యభారనిర్వహణ మొన

ర్చుచు, తపశ్శక్తినిసైతము పెంపొందించుకొనుచు, తమ తమ యనుభూతులనే యనుభవఫలితములనే యుపనిషత్తులను పేర బ్రకటింపసాగిరి. బ్రాహ్మణులు బ్రాహ్మణముల కగ్రస్థానము నిచ్చి, వీనిని కర్మకాండకు పరమప్రమాణములుగ నిడుకొని, క్రమముగ బ్రాహ్మణములనే వేదములని ప్రచారముగావించు చుండ, క్షత్రియులు తమ యనుభూతుల ఫలములుగ నారణ్యకములనుండి వెలువడిన యుపనిషత్తులే వేదవిజ్ఞానమునకు మూలస్తంభములనియు, నవియే జ్ఞానకాండ భాగములనియు బ్రబోధింపసాగిరి. ఇరువురును వారి వారి యభిమతానుసారముగ వేదస్వరూప నిర్ధారణమొనర్చి, వివరింపసాగిరి. జరిగిన దేమి? బ్రాహ్మణ క్షత్రియు లిరువురును వేదముల నొకమూలకు నెట్టివేయుటలో వెనుకాడలేదన్నమాట. కాకున్న, నొకరు బ్రాహ్మణములనే వేదములనిరి. మఱియొక రుపనిషత్తులనే వేదములుగ ప్రచారమొనర్చిరి. కర్మకాండకొకఱు, జ్ఞానకాండ కొకఱు తమ ప్రచారములలో ప్రాధాన్యమునిచ్చిరి. వేదమునకు నిజమైన నిర్వచనమిూయరైరి. కాని, యొక మహావిప్లవ సమయమున నాధ్యాత్మిక శక్తిని చైతన్యవంతముగ నిల్పుటకై, పరిపూర్ణముగ సంరక్షించుటకై, సమభివృద్ధిసల్పుటకై, బ్రహ్మర్షులై-రాజర్షులై బ్రాహ్మణక్షత్రియులు సల్పిన కృషిమాత్రము స్తవనీయమై, చరిత్రలో నిలువగలదనుట నిస్సంశయము. మన సనాతన ధర్మమును – సంస్కృతిని – సంరక్షించుచు, దేశ స్వాతంత్ర్యమును వర్ధిల్లజేయుచు, పవిత్రులుగ ప్రఖ్యాతి

గాంచుచు, ప్రజావళిని ధర్మపథముల నడపుటకు వారే కంక ణము గట్టుకున్నచో-ఛాయామాత్రముగనేని భారతధర్మనిధి శేషించియుండెడిదిగాదేమో! కాలమహిమవలన క్రమక్రమ ముగ భావనలలో మార్పులువచ్చి, బ్రాహ్మణక్షత్రియులు వేద స్వరూపమున కిట్టి పూతల బూసినప్పటికిని, యొకనాటి వారి కృషిని చరిత్రకారులు సమీక్షించునపు డభినందింపక తప్పదు.

ధర్మాధర్మములు రెండును సమస్థాయిలో - పరస్పర వైరుధ్యదృష్టితో ద్వాపరమున దారసిల్లినవి. నాడది విచిత్ర సంధి సమయము. కాలమపుడాడినయాట మహోశ్చర్యజనకము. కడుంగడు భీతావహము. బ్రాహ్మణులలో-నియమనిష్ఠలు, పార మార్థికదృష్టి లుప్తములై, యింద్రియభోగానుభవ కాంక్ష హెచ్చి, యజ్ఞయాగాదుల నందుకొఱకే నిర్వహింపసాగిరి. స్వర్గపదవియశాశ్వతమనియు-భగవంతుని చరణసన్నిధి పరమ పదమనియు-నది లభ్యమైన, జననమరణరోగక్లేశరాహిత్య మబ్బుననియు- 'క్షీణేపుణ్యేమర్త్యలోకం విశంతి' యనియు వారేలనో భావింపరైరి. కాలమహిమ!

ఇక క్షత్రియులన్ననో - అపార రాజ్యభోగ కాంక్షా పరివ్యాప్తమానసులై, దృష్టినంతయు రాజ్యవిస్తృతియొనర్చు పథకములయందే నిల్పిరి. స్వపరతారతమ్య విచక్షణకుఁ దావీ యక, మంచిచెడ్డల యోచింపక, సాధు క్రూరభావ పరిగణనకు జంకక, యథేచ్ఛగ, నిర్దాక్షిణ్యముగ రాజ్యపు పెల్లలను బెంచుటకే యత్నించుచుండిరి.

కొందఱు యోగ్యులైనవారానాఁడును లేరని యనజాలము. వారి రెొద్దికను గనుల కద్దుకొనువారేరి? వారి పెద్దరికమునకోఁ దమ యుద్యమశీలమును దిద్దుకొనదలచువారేరి? మొత్తముమీఁద నధికసంఖ్యాకుల స్థితి యిట్లుండెను. బ్రాహ్మణ క్షత్రియు లిరువురును ద్వాపరమున కొంతగ స్వార్థచింతాపరాయణులై, జాతనములు సాగించిరనుట తథ్యము.

ఈ వికృతస్థితిని కన్నులకు గట్టినట్లద్దమునఁ జూపినట్లు విశదీకరించునది యే కురుపాండవయుద్ధయు-అన్నదమ్ముల బిడ్డలలో నంతర్యుద్ధములేర్పడినవి. బాల్యమునుండియే పాండవులపై కారణరహితద్వేషము కౌరవుల గుండెలలో గూడు కట్టుకొనుట కాలమహిమగాక యేమందుము?

ఈ కాలమునసే యోగవిద్య ప్రముఖస్థానము నాక్రమించెను. క్షత్రియులు కర్మయోగమును, బ్రాహ్మణులు జ్ఞానయోగమును జేపట్టిరి. ఆ యా యోగముల యాంతర్యమును వా రాచరణయందుంచిరా? లేదా? యనునది వేఱు విషయము. కర్మయోగము స్వార్థకర్మయోగముగ – జ్ఞానయోగము స్వర్గ జ్ఞానయోగముగ మాత్రమే పరిమిత పరిధులలో వర్ధిల్లినట్లు మనకు చరిత్ర విశదీకరించును. బ్రాహ్మణ క్షత్రియవర్గముల మధ్యగూడ వైరములు పొడసూపినవి. కొందఱు బ్రాహ్మణ ధర్మమును బూర్తిగ బరిత్యజించి, రాజధర్మమునేసమాశ్రయించిరి. కొందఱుబ్రాహ్మణులు,

కొందఱు క్షత్రియులవంశజేర, మఱికొందఱు బ్రాహ్మణులు వేరొక కొందఱు క్షత్రియులతోఁ జేతులు గలిపిరి. సారాంశమేమి? ధర్మప్రవర్తకు లనఁబడెడువారిని, అధర్మపరులనఁబడెడువారిని సమర్థించు ఇరుతెగలవారిలో బ్రాహ్మణులుండిరన్నమాట. మఱియొక విచిత్రమేమన, అధర్మనిరతు లనఁబడెడువారిని విధిలేక సమర్థించి, సేవింపవలసివచ్చిన బ్రాహ్మణుల యభిమానము గూడ, ధర్మానురక్తులైన క్షత్రియుల కనుకూలముగ నుండుట.

భిన్న భిన్న రీతులలో – విచిత్ర పరిస్థితులలో – విప్లవ ఘర్షణలమధ్య, ద్వాపరయుగ మారంభమైనది. ఊహాలకందని యెట్టి వికృత సన్నివేశములు సంఘటింపఁబడునో! తలచుటకేని సిగ్గు గల్గించెడి యెట్టి విపరిణామములుత్పన్నములు కానున్నవో!

రాజ్యాధికారదాహ మతిశయించిన క్షత్రియులతో – దేవతా భోగవైభవ ప్రలోభచిత్తులైన బ్రాహ్మణులతో తదితరులకందఱకు సంబంధములు దూరముగాసాగెను. వీరెవరికి వారే – మేమందరికన్న మిన్నలమని యెంచనారంభించిరి. తదితరుల నిర్దాక్షిణ్యముగ గించపఱచుట సాగించిరి; దూరముగనుంచిరి. దురహంకారమును బ్రదర్శించిరి. ఈసడింపుల తోనొప్పించిరి. ద్వేషజ్వాలలను వెళ్ళగ్రక్కిరి. మహోన్నతస్థాన మేనాటికిని మాదేయని నిక్కిరి. కాదనఁగల గావుగుండెగల వారినెల్లఁ, గాళ్ళక్రిందవైచి రాచివేసిరి.

సాంఘిక బీభత్సమునకిది యొక ప్రధాన కారణమైయుండ వచ్చును. అంతర్గతముగ నావేశజ్వాలలు రేగుటకిది యొక ముఖ్యహేతువై నిలిచియుండవచ్చును. సమతాదృష్టి లోపించి నప్పుడే సంఘమున విప్లవమునకు నాందివాచకము పలుకఁబడు చున్నట్లు చరిత్ర మనకు సాక్ష్యమిచ్చుచున్నది.

హస్తినాపురము భారతదేశ చరిత్ర తిరిగిన క్రొత్త మలుపులన్నింటికి కేంద్రము. కురుక్షేత్ర సంగ్రామరంగమున కచటనే బీజారోపణ జరిగినది. కురుపాండవు లిరువురును కూరిమితో – నేరిమితో నేల నేలవలసినవారయ్యు – విధిలేక ప్రధనమునకు పాల్పడవలసిన పరిస్థితులేర్పడినవి. విశాల సామ్రాజ్య దాహమే యీ విషయమున ప్రధానపాత్ర వహించెను. ఓర్పులు, నేర్పులు, కూర్పులు, తీర్పులు ప్రళయపరిస్థితులలో – మార్పులను గొనివచ్చుటకశక్తములు కాగా – కురుక్షేత్రసమర ద్వారమున లక్షలాది కుత్తుకల నుత్తరించి, హారములుగఁగూర్ప వలసివచ్చినది.

ధర్మహాని గలుగనీయనని ప్రతినబట్టి, దారాసహోదరులతో ఘోరకాంతారవాసభూరి కష్టపరంపరల ననుభవించిన ధర్మజుని కలలు కలలుగనే నిల్చెను. సహోదర సంబంధమును స్మరించి, చెలిమి బలిమితో మన నిచ్చగింతు రేమోయని సలిపిన సంధికార్యములన్నియు సర్వవిధముల వ్యర్థములైనవి. వారిని, వీరి నదలించి, నోరుజేసికొని, భారతరాజ్యలక్ష్మిగౌరవ

ప్రశస్తి కవిచ్ఛిన్నముగ కర్ణాపరపు టారతి బట్టకపోవునా యని, ధృతరాష్ట్రునిపై నిడుకొనిన యాస లన్నియు - వాని పుత్ర వ్యామోహ వల్లరిలో జిక్కుకొని, మోసమునకు గురి యైనవి. నరనారాయణుల తరుణ సమైక్యమును, తత్ప్రీతిభను గుర్తించి, కరములు సాచి, పరమ మైత్రికి ప్రాకులాడుట యంత్యమునసేని యభిలషింపరా యని కౌరవనేతలపై నిలుపు కొనిన విశ్వాసము కన్నుమిన్నెఱుగని కాంక్షల ప్రాబల్యము వలన వమ్మయిపోయినది.

వీరభారత మహారణరంగము దాపైనది. జయాపజయములమాట యెట్లున్నను- సకలజనసంక్షోభమువూత్రము సంభవించినది. పాండవ కౌరవ స్కంధావారములలో- బాకుల తళతళలు, బల్లెముల మిలమిలలు మెండయినవి. కురుక్షేత్రము భారతమాతృ హృదయక్షేత్రముతోబాటుగ నట్టుడికినట్లుడికి పోయినది. నిజమైన ధర్మపక్షపాతులుండకుండిరా ? నిర్భీతిగ శాంతి నభిలషించి, కఠోర కల్మషకనద్దావానలమును జల్లార్చు వారు కరవయిరా ? వారి గుండెలలో నగ్గికొండలు పెరిల్లున ప్రేలినవి. 'విధిర్బలీయసీ'. ఎవ్వరాపగలరా మహోత్తుంగ తరంగ సంక్షుభిత భీకరోద్యమ సాగర ప్రవాహవేగోద్ధతిని ?

రాజులలో నంతకుముందే, యొకరిపై నొకరికిగల కచ్చెలకు బ్రతిఫలముల బుచ్చుకొనవలెననిడి ముచ్చట యుండుటచే, వారు చల్లచల్లగ నిరుపక్షములజేరి, సమరవహ్నిని జల్లారనీయక ఊదరబెట్టసాగిరి. సర్వ వినాశమునకు వలయు సన్నాహము

లన్నియు సంసిద్ధమైనవి. ద్రోణుఁడు కురుపాండవుల కిరువుర కును గురువే. తనకన్నివిధముల నచ్చిన శిష్యుఁడనుకొన్న యర్జునునివఁదలి, ద్రోణాచార్యుఁడీరణమున దుర్యోధనుని కండగనిలిచెను; ఉప్పు, పులుసు దినినఁేరమున కట్టుండవలసి వచ్చెనఁట! మనసుమాత్రము పాపము పాండవఁజేమ పరామర్శ యొనర్చుచునేయుండును. ఈ ద్వంద్వప్రవృత్తికి సమన్వయ మెట్లుసాధింపనలయునో!

ద్రోణుఁడు స్వచ్ఛంద బ్రాహ్మణ కులీనుడు. గురు పీఠము నధిష్ఠించి, కురుపాండవులను దిద్దినవాఁడు. స్వధర్మ విస్మరణమొనర్చి, సమరసీమల విహరింప నిచ్చగించుట్లు పొసగెనో! తనువొకవంక-మనసొకవంక యెట్లు నిలుపగలిగెనో! దానికా యాచార్యవర్యుని అంతరాత్మ యెట్లు సమ్మతించెనో! జనియింపఁగూడని శంకలు. సమాధానమురాని ప్రశ్నలు. కాలమెంతటిపనినేని లీలగనొనరించి, యేమియు నెఱుఁగనట్లు చల్లగ జారుకొనుచుండును. తరువాత సమీక్షకులెవ్వరే మనుకొనిన దానికేమి? వారే భావబలమున తర్కించి, చర్చించి, మథించి యొకనిర్ణయమునకు వత్తురు. కాకున్న, కాలమహిమయని మిన్నకుందురు. నిజమునకట్లే జరిగినది. నైష్ఠిక శిఖామణియైన యశ్వత్థామయును తండ్రితోబాటుగ నీ వ్యవహారమున గౌరవుల పక్షముననే యచంచల దీక్షతో దుర్యోధనుని కుడిభుజముగ నిలిచి పోరాడినాడు. మఱి బ్రాహ్మణ ధర్మమేమైనదో! దొంగవలెవచ్చి, రాక్షసునివలె

గుండె తడిలేని కరోఁకటకుఁడై, యే పాపమెరుగని యమాయి కుల – నిద్రాసత్తుల – భద్రాకారుల – పసిపాపల – నుపపాండవుల చిత్రవధ గావించినాఁడు. దీని నేమనవలెను ? అధర్మపక్షము వహించి, ధర్మనిరతులపై దండయాత్రసలుప సాహసించినవారి కొకధర్మమేల ? ఒక న్యాయమేల ? క్షాత్రముతోబాటుగ దాతృత్వమునకు సైతము ధరామండలము నందంతట నఖండ కీర్తినార్జించిన రాధేయుఁ డొనర్చినదేమి ? పితృమనోరథసిద్ధి కొఱకై జీవితసుఖవల్లరినే స్వహస్తములతో ఛేదించుకొనిన గాంగేయుని కథయేమి ? వీరెల్లరు కౌరవపక్షమున నిల్చుటా ? ధర్మవేత్తలే ! న్యాయకోవిదులే ! నైష్ఠికులే ! నైతిక శక్తిని గీటురాళ్ళుగ మనవలసినవారే ! పలువురొక్క యభిమన్యుని మూచకోత గోయ, పద్మవ్యూహమును బన్నుటా ! విరథుని గావించి వంచించుటా ! నిరాయుధుని గావించి పరాభవించుటా ! ఎక్కడి రక్కసి రాజ్యకాంక్ష ! మూఁకుతలల నాగుబాములైన నిట్లొనర్చునా ? మూఁకుగుఱన్నదమ్ములిట్లొనర్ప నుంతురిరి.

ధర్మమిట్లు క్రుంగినది. అధర్మమిట్లు పొంగినది. న్యాయదేవత నడుము విరిగినది. అన్యాయదేవత–అత్యంతబలోపేతయై, తల విరియబోసికొని వికారముగ తాండవమాడినది. ఇది యిట్లే సాగునా ? ఈ దుష్క్రియాకలాపమున కంతములేదా ? ఈ రాక్షసత్వ మిట్లే రాజ్యమేలునా ? అట్లయిన నిక సృష్టి కర్థమేమున్నది ? యుగధర్మరక్షణకు వసతి యెక్కడ ? ప్రశ

క్తియై మహా తపశ్శక్తిసంపన్నుడై, కథాభాగమునందొకడై, ధర్మసూచకుడై నిలిచిన వ్యాసభగవానుడీ యుగధర్మ సముద్ధరణకొక సాధనమైనాడు.

ఋషుల వాక్కులకు విలువతగ్గింపబడిన యుగమది. జనకుని యనుజ్ఞలకే దిక్కులేని సమయమది. కావుననే, వ్యాసమహర్షి యిటనొకముఖ్యపాత్ర వహించి, తన ధర్మమును నిర్వర్తించుటమాత్రమే యొనర్చినాడు. వేదవిభాగమొనర్చినాడు. వేదస్వరూపమును విశదీకరించినాడు. ధర్మప్రబోధము సలుపుట ధ్యేయముగ నిడుకొని, యష్టాదశపురాణములను గ్రథించినాడు. పంచమవేద ప్రఖ్యాతినిగాంచు తెఱ గున కౌరవపాండవ గాథకు పూర్ణాయుర్దాయమునుబోయ, తన కమనీయ లేఖినిని గదలించినాడు. భారతమును లిఖించినాడు.

మఱియొకవంక, ద్వారకనుండి యొక మహాశక్తిదిన దిన ప్రవర్ధమానముగ తేజరిల్లుచు, కురుక్షేత్రమునకు రాసాగినది. తుదకా నీల నీరద సమ దివ్యతేజమే నలుదెసల నిండిన యజ్ఞానాంధకారమును బటాపంచలొనర్చి, ధర్మమునకే పట్టాభిషేకమొనర్చి, విజయబలమును ప్రసాదించినది. ఆ మహాశక్తియే వాసుదేవుడు. శ్రీకృష్ణపరమాత్మగ నిఖిల మాన వాళిచే సకల కాలములలో సంస్తుతింపబడెడి దైవస్వరూపుడు కృష్ణావతారమెత్తి, ద్వాపర సముద్ధరణకొఱకు కారాగారమున

జన్మించి, వ్రేపల్లెలో బెరిగినను-వాసుదేవునకు హస్తినాపుర మే ప్రధాన కార్యస్థానమైనది.

"యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"

అని, విస్పష్టముగ కురుక్షేత్రమున యర్జునుని యెదుట నెల్లెత్తి చాటిన భగవంతుఁడు ధర్మము నశించి, యధర్మము శిర మెత్తినచోట - తనను తాఁనే సృజించుకొనునఁట. అధర్మ హాననము, ధర్మరక్షణము ధ్యేయములఁట.

ఈ రీతిగఁ జెప్పి, చేసిచూపగల యొక మహా తేజస్స్వ రూపుఁడు ద్వాపర యుగ సముద్ధరణ కవసరమాయెను. తాదృశ మహాప్రజ్ఞాసమన్విత దివ్యశక్తిపరిపూర్ణ భగవదవ తారమే శ్రీకృష్ణుఁడు. ధర్మసంరక్షణ పట్ల స్వపర తార తమ్యము లేదు. స్త్రీ పురుష విభేదములేదు. శ్రీకృష్ణ జీవిత మొక మహోజ్జ్వల మహాశ్చర్య రసవద్ధర్మ ఘట్టము. స్త్రీ యని శంకింపక, దుష్టభావనలతో వచ్చిన పూతన నవలీల హతమొనర్చెను. మేనమామయనెడి మమతనుజూపక, ధర్మ విరోధియై, నియంతగ వర్తించుచున్న కంసుని యంతమొందిం చెను. మేనత్తసుతుఁడని జాలి వహింపక, గురువృద్ధులయెడ గౌరవము లేనివాఁడై, ప్రల్లదుఁడై, భయంకరుఁడై వర్తించు శిశుపాలుని - చిరునగవులఁ జిందించుచునే వధించెను. లక్ష్య మొక్కటియే ధర్మసముద్ధరణ. ఆ దృష్టితోడనే పాండవులతో చెలిమినిఁ గూర్చుకొనెను. ఆ సంకల్పముతోడనే కౌరవుల

భావసరళిని పరివర్తన మొనర్ప బరిశ్రమించెను. ఆ యాశ
యము తోడనే సర్వవిధముల పాండవ సంక్షేమ భారమును
వహించి, వారిని సమాదరించెను; సురక్షించెను. ఆ భావన
తోడనే పాండవుల పక్షమున నుభయశ్రేయోసంధాయకుఁడుగ
కౌరవ సభకు రాయబారిగ నేగెను. పండ్లుబిగబట్టుకొని,
పాండవులకైదుగుర కైదూళ్ళనిచ్చినంజాలునని యాచకునివలె
బతిమాలెను. పరువునిల్పుకొని, భారతరాజ్యలక్ష్మి కేర్పడిన
విపత్తును దొలగించుమని ధృతరాష్ట్రునకు మాహాపదేశమొన
ర్చెను. కలిసియుంటు టొల్లనిచో-పాండవులు బలహీనులై
పడియుండరనియు, ప్రబల పౌరుషమూర్తులై విజృంభింతు
రనియు, పాండవ భావ దావానలము కౌరవాటవీసంచయమును
భస్మముగావించుననియు, తదభస్మరాశిపై ధర్మసింహాసనము
నేర్పఱచుటకు నేనుంటిననియు, దుర్యోధనాదులకు వాస్తవ
మును కనులకు గట్టినట్లు విప్పిచెప్పెను. ఆగ్రహించి, యవి
వేకులై త్రాళ్ళతో బంధింపనెంచిన వారిని గని, భక్తిపాశము
లచే బంధింపఁబడు పరమాత్మనునేనే. చేతనయినచో బంధింపు
డని హెచ్చరించెను. ధృతరాష్ట్రునకు దివ్యదృష్టిని బ్రసా
దించి, విశ్వరూపమునుఁ జూపించి, కౌరవులనెల్లర విభ్రాంతిలో
ముంచెను.

పరిస్థితులను జక్కదిద్దుటకై, ధర్మప్రాబల్యమును నిల్పు
టకై, వలచి వలచి పార్థసారథియాయెను. కోరికలుదీర, ధర్మ

జుఁడు న్యాయపీఠమునఁజేర, విప్లవాగ్నులు జల్లార, విపులా
నందమున విశ్వవైభవము విస్ఫార, విజయసారథియై నిల్చెను.

ధర్మాధర్మములు రెంటను సమబలములతో సంఘర్షణ
పడిన సమయము ద్వాపరము. ఎచట నేక్రియ సంస్కార బీజ
ముల యారోపణగావింపవలెనో గుర్తించి, సముచిత విధాన
మున జక్కదిద్దుట కెంతయో శక్తియవసరము. కావుననే
యీ యుగమున నవతార పురుషుఁడుగ నావిర్భవించిన
శ్రీకృష్ణపరమాత్మ - లీలామానుషవిగ్రహుఁడై - యతి
మానుషశక్తులను బ్రదర్శించుచు, ధర్మరక్షణమొనర్పవలసి
వచ్చినది. ఎచ్చటికచ్చటనేరొకొక మహోజ్జ్వల మహిమను
బ్రదర్శించుచు సర్వత్ర తానైయుండి, సర్వలోకాశ్చర్య
జనక నిత్యలీలా విలాసములతో సామాన్యునివలె సంచరించు
చునే యసామాన్య కార్యనిర్వహణదక్షతజూపి, భారతీయ
సనాతన ధర్మ సముద్ధరణార్థ మవతరించితి నని స్పష్టముగ
జాటుచు, సమూలముగ ధర్మవిరుద్ధ శక్తులను దుదముట్టించెను.
యజ్ఞములపేర సాగుచున్న హింసాకాండను నివారించి, యజ్ఞ
పయథార్థ పరమార్థమును విశదీకరించి, పవిత్రభావములను
వ్యాపింపఁజేసి, ధర్మమును జీవితరంగమున బ్రధానస్థానమున
నిల్పి, విరాజమానమగునట్లు గావింప దొడంగెను. పూర్ణా
వతారపురుషుఁడుగ నెల్లరచేగీర్తింపఁబడెను. వ్యాసమహర్షి
కృపవలన వెలుగునకు వచ్చిన వేదధర్మములను ప్రజలు
శిరసావహించునట్లొనర్ప శ్రద్ధగైకొనెను. మహాభాగవతమున

వివరింపఁబడినట్లు – 'గోవువెంట దగులు లేగవలె' నమ్మినవారిని గాపాడ, నిర్మలులకు ప్రశాంతస్థితి గలిగింప, ఆశ్రితులయెడ ననుపమాన కారుణ్యసుధ జిలికింప, ప్రతిక్షణ పర్యవేక్షణ గావించుచు, బ్రహ్మాండమైన సముద్యమమును శ్రీకృష్ణుఁడీ యుగమున నడపెను.

"వరగోవింద కథాసుధారస మహా వర్షోరుధారాపరం
పరలన్గాక, బుధేంద్రచంద్ర! యితరోపాయానురక్తిం బ్రవి
స్తర దుర్దాంత దురంత దుస్సహ జనుస్సంభావితానేకదు
స్తర గంభీర కఠోర కల్మష కనద్దావాలనం బారునే!"

అనెడి ప్రగాఢ ప్రత్యయము సర్వవిధప్రజావళీ హృదయ కుహరములలో ప్రగాఢముగ నాటుకొనెను. తాను యాదవాన్వయాలంకారుఁడయ్యును సకలరాజన్యుల సాదర గౌరవాభిమాన సంపదల జూరగొనెను. చక్రవర్తులతోఁగలిసి, సరస సల్లాపములాడిన నోటనే, యాదవడింభకులతోఁజేరి, పరిహాసవాక్యములతో ప్రసంగములు సలుపనేర్చెను. మహామునులతో మంతనములాడ దొడంగెను. ఇట్టిమహాశక్తి యపూర్వము. వర్ణభేదములేదు. స్థానభేదములేదు. ఎచట నెట్లెవ్వరిని సమూపలాలించి, యవతార లక్ష్యసాధనకు సాధన ప్రాయులనుగ వారినెల్లర మార్చుకొనవలెనో, యచట నట్లెల్ల బ్రవర్తించెను.

కుబ్జను, కురుచక్రవర్తిని యొకతీరుననే తిలకింపఁగల సమదృష్టి యామహాత్మునికొక్కనికే చెల్లునేమో ! విదురుని

యుద్ధవుని యొక్క త్రాసునందే తూచకల్గినాఁడా పూజ్యుఁడు. బృందావన వ్రజబృందము, హస్తినాపుర ప్రజాసందోహము శ్రీకృష్ణుని దృష్టిలో ఆత్మవిశుద్ధినిబట్టి యొకస్థాయియందే యుండును. సమున్నత సౌధశిఖరపరివృతమైన హస్తినా పురమన్నను, విశాల విపుల శ్యామల కోమల తృణపల్ల వాంకుర పరివృతమైన యమునానదీతీరస్థ బృందావన పరిసర ములన్నను గోవిందుఁడొకరీతిగనే సందర్శింపగల్గెను. ఈ మహోజ్జ్వల వైఖరికెల్లవారును విస్మయచకితులయిరి. ప్రతి వారును శ్రీకృష్ణుని తమకాత్మీయునిగ – సన్నిహితునిగ లెక్క వైచుకొనిరి. మక్కువతో మ్రొక్కిరి. మమతతోనారా ధించిరి. నోటవెలువడిన మాటనెల్ల ముత్యములమూటగ – బంగారుబాటగ భావించిరి. శ్రీకృష్ణమోహనరూప సందర్శన లాలస మానసులై యలసిరి. పారవశ్యమున బరితపించిరి. అట్టి యమోఘాభిమానము నార్జించిన దివ్యతేజోమూర్తి లెందరుందురు! సకలజనహృదయ సామ్రాజ్య చక్రవర్తియై, దివ్య మురళీరవములతో మురియించిన ముగ్ధమోహనావతా రుఁడు శ్రీకృష్ణపరమాత్ముఁడు.

"ఏకోదేవో దేవకీపుత్ర ఏవ."

సమైక్యకంఠమున ద్వాపరయుగము వినిపించిన వాక్య మిదియైయుండవచ్చును. కావుననే శ్రీకృష్ణవాణి నాడు వేదవాణియై, నరుల నుద్ధరించినది.

బాల్యదశనుండియే దుష్టసంహారముగావించుట – మునిజనాభిమానపాత్రతగనుట – వేదధర్మసంరక్షణకు దీక్షవహించుట మహోద్భత రాజకీయశక్తికి, నాధ్యాత్మికదివ్యశక్తికి సమన్వయమును సంఘటించి, చతురతతో సాహసాత్మక కార్యములు సాగించుట – విపులమేధాబల విశేషప్రదర్శనాత్మకముగ రాయబారములు నడపి, తిమ్మినిబమ్మినిగ బమ్మినితిమ్మినిగ మార్చుట – క్షణకాలమున నధర్మపరుల యెత్తులన్నింటిని గమ్మత్తుగ చిత్తుగావించుట – ఏదియెట్లుజరుగునో! యేమగునో! యెవ్వరికెరుకపడనిరీతి చక్రమునుద్రిప్పి, సర్వము సాధించుట యనెడి వివిధ ప్రముఖాంశములన్నియు నొకయెత్తు;

గుండెలుక్రుంగి, కూలి, గాండివమును దిగజార్చి, ప్రధనవిముఖుడై స్వపక్షనిర్వహణమునకన్న సన్న్యాసమేమిన్నయన్న సిద్ధాంతమున మునుగబోవుచున్న పార్థునిలోవిక్రమజ్వాల రగుల్చుటకై వీరరసజలధిపొంగించుటకై, విజయలక్షణము వెల్లివిరియించుటకై, విశ్వాసముద్ధరణ మొనర్చుటకై శ్రీకృష్ణపరమాత్మ గీతాప్రబోధముగావించుటొక్కటే యొక్కయెత్తు.

ద్వాపరమున నదియొక సంధిసమయము. పైశాచిక శక్తులుప్రబలి, భారతనారి పైటచెఱగును బట్టి లాగినపాపపు దినములు. భ్రాతృభావమున కించుకేని ప్రాధాన్యము నీయక, పాశవిక రాజ్యాధికార దురాక్రమణకాంక్ష విచ్చలవిడిగ విహరించుచున్న వినాశకాలము. తమ్ముని బిడ్డలపై నన్నబిడ్డలు కరవాలములు విసరుటకుకాలు ద్రవ్వుచున్న కఠోర

కరాళ ముహూర్తము. మహోమహులెల్లరుభయ పక్షములజేరిరి. కావలసిన కర్మకాండయంతయు జరిగినది. నడుపఁబడవలసిన తతంగమంతయు నడచినది. సర్వము విఫలమై, సమరము సన్నద్ధమైనది. ప్రచండ భండనమున పాపిష్ఠశక్తుల సర్వ వినాశమొనర్ప, పాశుపతమునకు ఫలముజేకూర్ప, భారతరాజ్యలక్ష్మీ లలాట ఫలకమున గ్రొత్త కుంకుమబొట్టును దీర్చిదిద్ద, కొండంతయండగ నుండగలఁడనుకొన్న సవ్యసాచియే నిజమైన బృహన్నలగ మారిన విపన్నుల నిక నెవ్వఁడుద్ధరింపఁగలఁడు? ధర్మదేవతను హృదయమర్మ భేదకములగు తాడనముల బారినుండి యెవఁడు రక్షింపఁగలడు?

చక్రి విక్రమించినాఁడు. పార్థసారథి మహోహూదోద్యోగ పరమార్థమును విప్పిచెప్పబూనినాఁడు.

"క్లైబ్యం మాస్మగమః పార్థ!
నైతత్త్వయ్యుపపద్యతే"

అని, గంభీరగర్జనమొకటి గావింపబూనినాఁడు. కరములు మోడ్చి, నతమస్తకుఁడై విజయుఁడు వినసాగినాఁడు. శ్రీకృష్ణుని గీతామహోపదేశ శంఖారావము దిక్కుల బిక్కటిల్లఁజేయుచుండెను. అవతార పరమాదర్శమే తలక్రిందులగుతరి, యిక గుంభనములేల? గూఢార్థములేల?

"సర్వధర్మాన్ పరిత్యజ్య
మామేకం శరణంవ్రజ

అహంత్వా సర్వపాపేభ్యో
మోక్ష్యయిష్యామి మాశుచ''

అని, సూటిగనే వివరించి చెప్పినాఁడు.

''కర్తాహంసర్వలోకానాం.''

అనవలసిన యవసర మేర్పడినది.

''అనన్యాశ్చింతయంతోమాం
యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం
యోగక్షేమం వహామ్యహమ్.''

అట్లనినఁగాని శిథిలమైయున్న పాండవమధ్యమునిచిత్తము చిగుర్పదని విశ్వసించిన శ్రీకృష్ణునియుపదేశము క్రమక్రమముగ నుజ్జ్వల స్థాయిని జేరుచుండెను. అచంచల దృష్టితో నాయాన శిరసావహించిన, సర్వమనుకూలముగ పరిణమింపఁగలదని బలమైన యాశగలిగించినాఁడు.

''నిమిత్తమాత్రం భవసవ్యసాచిన్.''

నీవునిమిత్తమాత్రుఁడవైయున్న జాలును. సర్వము నేనే నిర్వర్తింతునని ప్రోత్సహించినాఁడు.

ములుకులవంటి పలుకులతో మెత్తమెత్తగ నెత్తిపొడిచినాఁడు.

''మయ్యేవైతే నిహతాః పూర్వమేవ.''

పూర్వమే వీరు నాచేత చంపఁబడిరి. నీవు చంపితి వనెడి

గౌరవమును నీకు దక్కించుటకే యీ ప్రయత్నమంతయునని రహస్యమును విప్పిచెప్పి, సమరమునకు ప్రేరేపించినాడు.

'వీరభారత యుద్ధ యజ్ఞము నారంభించితిని. ప్రధాన హోతృత్వమై, యవబృధ మాచరించువఱకు గంకణమువిప్ప' నని బెదరించినాడు.

ధార్తరాష్ట్రులెల్లరు యజ్ఞపశువులై, యీ మహాగ్ని గుండమున మలమలమ్రగ్గి తీరవలసినదేయని ఖండితముగ వక్కాణించినాడు.

పార్థునిలో నింకుచున్న పౌరుషరసధార బలపడినది. పిల్లకాల్వయైనది. మహానదియై యుప్పొంగినది; గంభీరజలధియై గర్జించినది.

విజయభేరి పెళపెళ మ్రోగినది. ధణంధణ స్వన సంతానములు – పడుచుబిడ్డలనెల్లర వీరవిహారయాత్ర కాహ్వానించుచుండెను. ప్రళయ మహాస్మశాన నటరాజజటానట దభ్రవాహినిలో విలయతాండవమాడు పాండవ చంద్రహాసములు తళతళలాడినవి. భారతరాజ్యలక్ష్మి నయనసరోజములలో – గర్వకాంతులు మిలమిలలాడినవి. పార్థసారథి ప్రబోధించినాడు. పార్థుడు విక్రమించినాడు. నారాయణుడుపదేశించినాడు. నరుడుదీక్షగ నాచరింప సాహసించినాడు. శ్రీకృష్ణుడాచార్యుడైనాడు. శిష్యుడుగ పృథాపుత్రుడు స్థిరచిత్తమున నిల్చినాడు. జరిగినది గీతా

మహోపదేశము. సముత్పన్నమైనది, నిర్వ్యక్తపరాక్రమ రసావేశము. మోహ సందేహములు తొలగినవి. సాహస జయాభిలాషలు పెంపొందినవి. తిరుగులేదిక దీవ్యదఖండ మహోద్దండ సమరలక్ష్మీయథేచ్ఛా విహార విజృంభణలకు ఎదురులేదిక. పార్థధ్వజాగ్ర పరివేష్టిత పావనపావని ప్రవిమల నాట్యభంగిమలకు, దురాగత దురాచార దురావేశ దుశ్చర్యా పరుల దుష్ప్రభావ పరంపరలకు భరతవాక్యమే పాడగలరు. సముచిత సమతా సౌజన్య సహన సత్యచరిత్ర స్వచ్ఛంద సరళులకు నాందివాక్యమే యాలపింపఁగలరు. ధర్మమే జయింపఁగలదు. న్యాయమే వికసింపఁగలదు. సత్యమే విహరింపఁగలదు. సాధు సంకల్పమునకే సామ్రాజ్య సిద్ధి. వేదనినాదములకే విజయప్రీతి.

అహోహా! ఏమా యాధ్యాత్మిక తేజోవిలసనము! పార్థుని కోరికపై, పరమాత్మ – విశ్వరూప దర్శనభాగ్యము గల్గించినాఁడు. సకలలోక స్వరూప సత్యస్థితిని గుర్తించిన సవ్యసాచి దివ్యుఁడైనాఁడు. పరమాత్మని యనుగ్రహమునకు పాత్రులయినవారికి గొదువయేమి?

నరుని నిమిత్తముగ నిడుకొని నరలోకమునకే నారా యణుఁ డొసఁగిన మహోపదేశామృతము గీత. అది కురు క్షేత్రమునకే కాక, సర్వమానవ జీవితక్షేత్రములలోగూడ చైతన్యసుధల జిలికింపఁగలదు. ద్వాపరమనెడి కాలపరిణతికది కట్టువడక, పరిధులైలుఁగని రీతిలో – సర్వవేళల క్లిష్టపరిస్థితుల

దొలగించి దండి మనోబలమునుగూర్చెడి తత్త్వపీఠమై నిలిచి నది గీత. అది సకల మానవ వ్రాత మహాపాప విధూతగ- విశ్వ విఖ్యాతగ వెలుగులీనుచున్నది.

భూత భవిష్యద్వర్తమాన తారతమ్యపరిగణనకా దివ్యాధ్యాత్మిక గ్రంథమున తావులేదు. అది-నిన్న, నేడు, రేపు నొకవిధముగనే జనుల నలరింపఁగలదు; స్తుతులనంద గలదు. అట్టి దివ్యౌషధమును నాఁడు వాడవలసివచ్చినది. వేల్పువెజ్జగ నాఁడు శ్రీకృష్ణుఁడీ యౌషధమును పార్థుని ద్వారా లోకమునకు బ్రసాదించెను.

"పార్థాయప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్
అద్వైతామృత వర్షిణీం భగవతీం అష్టాదశాధ్యాయినీం
అమ్బ! త్వామనుసందధామి భగవద్గీతే! భవద్వేషిణీమ్."

అమృతవర్షిణియైన గీతామాత ప్రత్యక్షమైన పిమ్మటనే కురుక్షేత్రమున ఘూర్తదావానలజ్వాలలు చల్లారినవి. ద్వాపరమున శ్రీకృష్ణునివంటి దివ్యోపదేశకులు గాక, యెరులెవ్వరేని పరిస్థితులను జక్కదిద్దగలుగుదురా!

శ్రీరామావతారము నాటికన్న ఘనీభవించిపోయిన యధర్మమును గరగించి, క్రమముగ నిర్మూలించుట కెంతటి జతనము గావలసివచ్చెను. ద్వాపరమున శ్రీకృష్ణపరమాత్మ యొసగిన మహోపదేశసుధ-మానవకోటికి సర్వకాల సర్వావస్థలలో నుపకరించెడి దివ్యౌషధమే కాఁగల్గినది.

"సర్వోపనిషదో గావః
దోగ్ధా గోపాలనందనః
పార్థోవత్సః సుధీర్భోక్తా
దుగ్ధం గీతామృతం మహత్."

ఆ గీతామృతమే నాటికి_నేటికి రేపటికిగూడ, మానవ మనః కాలుష్య సంక్షాళనము గావించుచు, కర్తవ్యనిష్ఠను ఘటించుచు, కార్యదీక్షను బెంపొందించుచు, సర్వజన సంసేవ్యమై, సర్వఫలసంధాయకమై, సార్వకాలిక ధర్మ స్వరూపమై విరాజిల్లుచున్నది.

"సంసార సాగరం ఘోరం
తర్తు మిచ్ఛతి యో నరః
గీతానావం సమాసాద్య
పారం యాతి సుఖేన సః."

సిద్ధాంతమైపోయిన విషయమిది. భయంకరమైన సంసారసముద్రమును దాటనెంచినవాడు గీత యనెడి నౌక నాశ్రయింప వలయును. తదాశ్రయము లభ్యపడిననాడు - సుఖముగ సంసారసాగరపు టవ్వలిదొడ్డును జేరగలడు.

"గీతాయాః పుస్తకం యత్ర
యత్ర పాఠః ప్రవర్తతే
తత్ర సర్వాణి తీర్థాని
ప్రయాగాదీని తత్రవై."

గీతగలచోటనే ప్రయాగాది సర్వపుణ్యతీర్థము లుండుననెడి

ప్రగాఢ విశ్వాసము భారతీయుల హృదయాలయములలో శాశ్వతముగ హత్తుకొని పోయినది.

"గీతా సుగీతా కర్తవ్యా
కిమన్యైఃశాస్త్రవిస్తరైఃయా స్వయం పద్మనాభస్య
ముఖపద్మా ద్వినిస్సృతా."

శ్రీకృష్ణపరమాత్మ ముఖపద్మమునుండి వెలువడిన గీతను చక్కగ పారాయణ మొనర్పుము. బహువిధ శాస్త్రముల ప్రసక్తితో పనియుండదు. దృఢమైన భావనల్లిన్లు భావితరముల వారికి గలుగు పగిది, మంచి యుద్యోగోద్ధతులతో నాఁడు నరునకు నారాయణుఁ డీదివ్యోపదేశమును గావించెను.

పార్థుఁడుగూడ సులభముగ శ్రీకృష్ణుని వదలలేదు. వివిధ సందేహాములను ముందుబెట్టి, మందునివలె జేతులు కట్టుకొని నిల్చి, యెంతయో చెప్పించినాఁడు. భగవంతుని యునికిని గూర్చియు - జ్ఞానయోగ మహిమను గూర్చియు - కర్మయోగ మహిమనుగూర్చియు - నిష్కామకర్మానుష్ఠాన మును గూర్చియు - భక్తియోగమును గూర్చియు - పలు విషయములను గూర్చి పలుతెఱగుల, సామాన్యులకు గలి గెడి సందేహాములన్నియు విజయునకు జనించినవి. గోవిందుఁ డన్నింటికిని మిక్కిలి చతురతతో మనస్సునకు నచ్చినట్లు - వివరించి పార్థుడు మెచ్చునట్లు వినిపించినాఁడు.

"ద్రష్టు మిచ్ఛామి తే రూపం
ఐశ్వరం పురుషోత్తమ !

నీ స్వరూపమును దర్శింప నుత్కంఠ గలదు స్వామీ ! యనినా డర్జునుఁడు. విశ్వాసమొకవంక, యవిశ్వాసము మఱొ యొకవంక ధర్మాధర్మముల నడుమ క్రుమ్ములాడుకొనుచున్న కాలముగదా యది !

"మన్యసే యది తచ్ఛక్యం
మయా ద్రష్టు మితి ప్రభో!"

అని ప్రార్థించినాఁడు పార్థుఁడు. అనుగ్రహించినాఁడు శ్రీకృష్ణుఁడు.

"అనాది మధ్యాన్త మనన్తవీర్యం
అనన్త బాహుం శశిసూర్య నేత్రం
పశ్యామి త్వాం దీప్త హుతాశవక్త్రం
స్వతేజసా విశ్వమిదం తపన్తమ్."

విశ్వరూపవిభవ సందర్శనకాంక్ష యుండగనే సరియా ? అనంత కోటి సూర్యప్రభాభాసమానమై, బ్రహ్మాండ ప్రతిబింబమైన తత్తేజమును చర్మచక్షువులతో దిలకించి భరింపగలుగు టందరి కిని సాధ్యమా ?

"దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన!
ఇదానీమస్మి సంవృత్త స్సచేతాఃప్రకృతిం గతః."

'స్వామీ ! నీ రూపమును దర్శించి ధన్యుఁడనైతిని. కాని, భరింపజాలకున్నాను.' పార్థుని యంతటివాఁ డిట్లు మొఱవెట్టె నఁట ! ఇఁక నన్యులవిషయమై వివరింపనేల ? భగవానుఁడు ప్రసన్నుఁడైనాఁడు! సౌమ్యమానుషరూపమున మందహాసముల

జిలికించెడి యదునందనుఁడైనిచ్చె, యర్జును నాశీర్వదించి -

"సుదుర్దర్శ మిదంరూపం
దృష్టవానసి యన్మమ
దేవా అప్యస్య రూపస్య
నిత్యం దర్శన కాంక్షిణః."

అని యూరడించినాడు.

"యత్కరోషి యదశ్నాసి
యజ్జుహోషి దదాసియత్
యత్తపస్యసి కౌన్తేయ!
తత్కురష్వ మదర్పణమ్."

అనెడి పలుకుల నొకపరి గుర్తునకు దెచ్చినాఁడు.

"నష్టోమోహః స్మృతిర్లబ్ధా
త్వత్ప్రిసాదా న్మయాఽచ్యుత!
స్థితోఽస్మి గతసందేహః
కరిష్యే వచనం తవ."

అనెడి స్థాయికి విజయుఁడు చేరినాఁడు. ఆ స్థాయికెల్లరను జేర్చుటకే గీత లోకమున నిల్చినది.

"యత్ర యోగేశ్వరః కృష్ణః
యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీః విజయోభూతి
ర్ధ్రువానీతి ర్మతిర్మమ."

అనెడి సంజయవాక్యముతో గీత పూర్తియైనది. నేటికిని ఆ సంజయవాక్యమే భారతీయుల విశ్వాసమునకు మూలము.

ద్వాపరమున సర్వకాల ప్రజా సంక్షేమ నిమిత్తము భగవత్ప్రసాదముగ నావిష్కృతమైన గీత నాటి యాధ్యాత్మిక గ్రంథము. ఆ యాధ్యాత్మిక గ్రంథ స్మరణమాత్రమున మానవ జాతి ధన్యత గాంచుచున్నది. మోహమును దొలగించుకొని, కర్తవ్యపథమున నిలువగలుగుచున్నది. మనోవైక్లబ్య మును బోగొట్టుకొని చిత్తప్రశాంతిని ఘటించుకొనఁ గలుగుచున్నది. ఈరూపమున శ్రీకృష్ణ పరమాత్మ ద్వాపరయుగమున ధర్మ మునకు పట్టాభిషేకము గావింప - సర్వశక్తులు వినియోగించి, విశ్వరూప ప్రదర్శనాదులతో మోహవిభ్రాంతుల నంతరింపఁ జేసి, దివ్యావతార పురుషుఁడుగ ప్రస్తుతు లందుకొనినాఁడు.

మహాభారత యుద్ధము ముగిసినది. ధర్మమునకే విజ యము గల్గినది. న్యాయమే నెగ్గినది. అధార్మిక శక్తులు నిర్మూ లింపఁబడినవి. న్యాయతత్పరులు ప్రగతిపథమున బురోగమించి, లక్ష్యసిద్ధి నందిరి. అయిననేమి ? ఏమి జరిగినది ? సుఖపడిన దెవరు ? శాంతి నెవరనుభవించిరి ? మహానందమకరందము నెవరు గ్రోలగలిగిరి? గుండెలపై జేయినిడుకొని, గాఢ సుషుప్తి కెవరు నోచుకొనిరి ? వైభవోపేతముగ శుభకార్యములను పరంపరగ జేయుచు, ముదమున నెవరు వర్తించిరి ? విజయ రుచిరానుభూతి కెవరు మురిసిరి ?

ఎవ్వరికినిఁ జిత్త ప్రశాంతిలేదు. పలువురు కలత నిద్దురలో కలవరించుచు, గలలు గనువారే. సుఖ సుషుప్తిలో మునిగి యొడలు దెలియనిపగిది నిదురించుచున్న ప్రాణియొక్కటియును గనుపట్టదు. పాండవులుగెల్చిరి. కౌరవులోడిరి. చెప్పుకొనుటకుమాత్రమిది యుపయోగపడినది. కాని, యే మూల వినినను - ఘోరముగ గుండెలవియఁజేయు శోక ధ్వానములే. ప్రతివీధియందును దారుణముగ రోదించుచున్న స్త్రీ పురుషజన సమూహమే. అంతఃపురములలో నైన మానందరేఖ-లీలామాత్రముగనేనియుగన్పించుట లేదు. గెలిచి, బంధుమిత్ర సుత పరివారవియోగమున కొకరేడ్చుచుండ - పరాజితులై, సకల గురుజన సామంత సుత గణభట వర్గవియోగమున కొకరేడ్చు చుండిరి. హస్తినా పురమునకేమి మిగిలినది? అంతిమవిజయము ధర్మమునకే దక్కెననెడి యాదర్శసూక్తి మిగిలినది. నిష్కామ కర్మానుష్ఠాన పరులై, సర్వము భగవదర్పణ దృష్టితో - జీవితలీల సాగించుకొను ప్రజలకు - సర్వేశ్వరుఁడే కొండంత యండయై, కాపాడి సర్వ బాధ్యతలు స్వీకరించి, సంరక్షించుననెడి సిద్ధాంతము మిగిలినది. ఇవి హస్తినాపురవాసులకే మిగులలేదు. ద్వాపర యుగప్రజల సొంతసొత్తులు మాత్రమే గావివి. విశ్వ విశ్వాంతరాళ ప్రజలు సమానముగ పంచుకొని, యనుభవింపఁదగిన సమష్టి సంపదగ పరిగణింపఁదగినవి యై సూక్తులు.

ధర్మాధర్మములు సమబలముతో తారసిల్లి, సర్వనాశనమునకుపక్రమించుటవలన నంతిమ విజయము ధర్మమునకే దక్కినను, పరిస్థితులు తారుమారై, తరువాతవచ్చిన పాలకులకు సుఖశాంతులు కఱవైపోయినవి. భారత భాగవతాది ఇతిహాస పురాణనిర్మాతయైన వేదవ్యాసుఁడు, శ్రీమన్నారాయణావతారుఁడగు శ్రీకృష్ణుఁడు, పరమపావన మహోజ్జ్వలాధ్యాత్మిక గ్రంథరాజమగు భగవద్గీత ద్వాపరయుగ రత్నములుగ విరాజిల్లినను - చరమాంకమున సుఖశాంతులు లోపించుటకు ముఖ్యహేతువు - ధర్మాధర్మములు రెండును సర్వత్ర సాధరణములై తాండవించుటయే. వేదవ్యాస, శ్రీకృష్ణ, భగవద్గీతాదుల మహోద్ధుర శక్తి యుండుట వలననే యా కాలమున నంతమాత్రముగనైన ధర్మమునకు విజయము చేకూరినది.

శ్రీకృష్ణ నిర్యాణానంతరము మఱిల పరిస్థితులు తారుమారైనవి. యదువంశమునందే - మహోత్తర ప్రమాదకరములైన యంతఃకల్లోలములు ప్రబలి, భయంకరపరిస్థితులు సంఘటించినవి. అభేద్య దివ్యాయుధ సంపత్తిగల పాండవులశక్తియు మొక్కవోవ దొడగినది. బలీయమైన పర్యవేక్షణతో లోకమును సమవలోకనగావించుచు, సన్మార్గమున నడపించెడి మహానేతయున్నంతకాలమే జరుగవలసినరీతి జరుగును.

శ్రీకృష్ణనిర్యాణానంతరము బ్రాహ్మణులలో క్షత్రియులలో ధర్మచ్యుతి మరింతగ బెరుగసాగినది. దానితో వారి పత

నము మఱల ప్రారంభమైనది. ధర్మము నిలువలేక నిలువలేక నిలద్రొక్కుకొని నిలువఁగలిగిన పరిస్థితియేర్పడెను. ధర్మపరిశీలనగావించి, న్యాయభావనతో నడచుకొందమనెడి యూహాలు ప్రజలలో చాలవఱకు కొరవడినవి. బ్రాహ్మణక్షత్రియులు పతనావస్థకు గురియగుటతో – వైశ్యులు, శూద్రులు కొంత ప్రాబల్యమును గడించుకొనసాగిరి. వేదప్రశస్తి నౌదలదాల్చు వారరుదుగ గన్పట్టసాగిరి. యజ్ఞయాగాదిక్రియా కలాపములు మఱల పూర్తిగ నపమార్గమునబడినవి. ధర్మదేవతకు మూడవ పాదమూడెను. శోచనీయస్థితిలో–పాదైకమాత్రపరిమిత ధర్మ బలముతో కలియుగము సన్నిహితమగుచున్నది.

ద్వాపరయుగాంత్యమునఁ జూచిన విషాదపరిస్థితులకన్న నెన్నియో రెట్లధికముగ నీయుగపరిస్థితులు మనల గ్రుడ్లురిమి బెదరింపనున్నవి. అదొక మహాపాతకముల ప్రోవు. పైన, మణిమయ సింహాసనము. ప్రతివారద్దానినాక్రమింప దహ తహ. ఎల్లరిలోనొకేయొకధీమా. 'నేనుసర్వజ్ఞుఁడను, సర్వశక్తిమంతుఁడను, నన్నడ్డుకొనెడిశక్తి యిట నెవ్వరికినిలేదు, మణిమయ సింహాసనాక్రమణకు నేనే సర్వవిధార్హుడను. కాదన్నవారిని, కాలరాచివైతును. యోగ్యతాయోగ్యతలతో నిమిత్తములేదు, యుక్తాయుక్తము లనావశ్యములు.' ఇత్యాది దురహంకార పూరిత భావరాగాలాపనలు పీఠము వెనుకగల తెఱలలోనుండి వినిపించుచున్నవి. ఇది యీ యుగధర్మముగాబోలు! స్వార్థశక్తులు క్రమక్రమముగ బరివర్ధమానములగుచుఁ దుదకెట్టి

బలముతో పుంజుకొనగల్గినవో! మనమిఁక స్పష్టముగ దర్శింపఁగలము.

కలియుగ మహాంతర్నాటక మారంభముకానున్నది. పాదమొక్కటియే యగుటచే, నెటుగదలుటకేని యోపికలేక, సొమ్మసిల్లిన గోవువలె, భగవన్నామస్మరణ గావించుకొనుచు, ధర్మమొక మూలఁబడియున్నది. ఆమె రంగస్థలమునకురాదా? ఆమె పలుకవలసినపలుకు లీనాటకమునలేవా? కేవలము వేషమునుమాత్రమే కనిపింపఁజేసి, వెనుకకు మఱలి పోవునేమో! కానిండు. జరుగవలసినదెట్లో జరుగును. ఏమి జరుగునో వేచి చూతము!

పాపమాతల్లిమొర నెవరాలకించి, యీ యుగమున నామెను గొనయూపిరితోనైన నిలువఁజేయుదురో! ఆమెచే దీయతీయగ నెవరు మాటాడింపఁజేయుదురో! అట్టి శుభసమయమువచ్చునా? రాదని యనుకొననేల? వచ్చి తీరును. వచ్చితీరవలెను. యుగధర్మమదియేకదా! ఆ పుణ్యక్షణమెప్పుడొస్తేవరివలన వచ్చినదో నిరీక్షించి సమీక్షింతము. నీలి తెరలు జారుచున్నవి. కాలపురుషుని గజ్జెలమ్రోతగాఁబోలు – కర్కశముగ వినిపించుచున్నది. ఆ ధ్వనుల యంతరార్థమేమో పరికింతము.

భారతదేశము

'భారతదేశము'మంచిపేరు. భరతునిచే పాలింపఁబడినదేశ మగుటచే భారతదేశమను సార్థకనామముతోవిరాజిల్లుచున్నది. తద్దేశీయులే భారతీయులుగ బరిగణింపఁబడుచుండిరని వేరుగ జెప్పనేల! భా యనఁగా - కాంతి. రతాఃు అనఁగాఆసక్తిగల వారు అనియర్థము. కాంతిప్రియులుగనుక, భారతీయులైరని మఱియొక యర్థము. జ్ఞానతేజము నభిలషించుట అజ్ఞాన తిమిరమును నిరసించుట సజ్జనలక్షణముగదా! ఈనామము ద్వాపర యుగాంతము నుండియే వ్యాప్తికివచ్చినది. బ్రహ్మావర్తమార్యావర్తమై, యార్యావర్తమీవిధముగ భారతదేశమైనది. కలి యుగము వచ్చునాటికే భారతదేశమను పేరు ప్రచారమునకు వచ్చియుండెను.

కలియుగము

క్రీ.పూ. 3102 సంవత్సరములనాఁడు భారతయుద్ధము జరిగినది. తరువాత, సుమారొక ముప్పదియారేండ్లకు కలి యుగమారంభమైనది. క్రీ. పూ. 3138 సంవత్సరములనుండి కలియుగ లక్షణములు కానవచ్చుచుండెనని యెంచవచ్చును. రంగమునఁగనిపించుచున్నవారందఱును-శిఖా యజ్ఞోపవీతధారులైన బ్రాహ్మణోత్తములుగాబోలు! బాగుగనేయున్నది. కాని, రొకరినిఁజూచి రొకరు దూరదూరముగ దొలఁగుచున్నారే! పరస్పరాసహన వీక్షణములతో నొకరినొకరు కొఱకొఱఁజూచుకొనుచున్నారే!

వీరందఱొకటికావఁట! బ్రాహ్మణధర్మములలో విభిన్నతగలదఁట! శాఖలఁట! శాఖాంతరములఁట! పరస్పరసంబంధ బాంధవ్యములు పనికిరావట! తమ శాఖయే వేదానుగుణమైనదనియు-పరమప్రమాణమైనదనియు భావించుటొక గొప్పయట! ఇతరశాఖలశాస్త్రీయములని పరిహసించి తృణీకరించుట వివేకమట! దురహంకారులై దురుసుతనముతో నితరశాఖలపై కాలుద్రవ్వుట ఘనకార్యమట! ఈర్ష్యాసూయలతో, సంకుచిత భావములతో వ్యవహరించుటే చరమలక్ష్యమట!

పరస్పర సంబంధబాంధవ్యములు పనికిరావట్లు ! వైరు ధ్యములు స్పష్టముగనే వ్యక్తమగుచున్నవి. మఱియిట్టి భావ వికారస్థితి యింతకుబూర్వమిట్టిస్థాయిలో గన్పడదు. మొత్తము మీద నేదోరొకొక వైషమ్యము బ్రాహ్మణులయండే పరస్పర మలమకొని యున్నట్లుగ దోచుచున్నది. కలియుగప్రారంభము నుండియే యిట్టి వికృత పరిస్థితులారంభమైనవి.

మఱిరొకొక విషయము:-

క్షత్రియులెల్లరు-భారత భూభాగమున సార్వభౌమాధి కారము వహింపనెవరికివారే యత్నింపసాగిరి. ప్రతివారికి నేకచ్ఛత్రాధిపత్యమున మమతమెండాయెను. తాను గిరిగీచు కొన్న భూభాగమున తాను ప్రభువుగనుండి, సర్వాధికారమును సాగింపవలెననెడికాంక్ష ప్రతివారిలో పెరిగినది. క్రమముగనో, యక్రమముగనో పరులయధికారమును గబళించివేయవలయు ననెడి దురాశ పెంపొందసాగినది. దీనితో-భారతదేశమున క్షత్రి యులలో నైక్యముబొత్తిగసమసిపోయినది. చిన్న చిన్న రాజ్య ములకు దేశమునిలయమై, ఖండఖండములుగ విభజింపబడి యుండెను. భావములందేకత్వమున్నగాని, యఖండతవిస్తరిల్లదు గదా ! పుష్టిచేకూరదుగదా!

మఱొకవంక - వైశ్యులు వేదాధ్యయనాధికారమును సంపాదించుకొనిరి. కొందఱికి వేదాధ్యయనము నిషేధమనెడి వాదము ప్రబలముగ వ్యాప్తికివచ్చెను. గుణకర్మవిభాగము

వలన ద్వాపరమున స్పష్టముగ నిర్వచింపఁబడిన వర్ణపద్ధతి – పరమాశయమునకు విరుద్ధముగ – పరస్పర ద్వేషావిర్భూతికి నెలవుగ మారెను. శూద్రులకు వేదాధికారములేదనుటేకాక, స్త్రీలకూడ వేదాధ్యయమున కనర్హులనెడి దుష్టినతివచ్చెను. దురాచారము ప్రారంభమాయెను. యజ్ఞయాగాదులలో పాల్గొనెడి యధికారము శూద్రులకు, స్త్రీలకు నిషేధింపఁబడెను. ప్రాచీనయుగచరిత్రలో నెచ్చటను గన్పడని పంచమవర్ణ శబ్దము బయటికివచ్చెను. వీరికస్పృశ్యులని యొకవేరిడి, దూరదూర ముగనుంచుటప్రారంభమాయెను. లెక్కలేనన్నిశాఖలుబ్రాహ్మణులయందే యుత్పన్నముగాసాగెను. తత్ఫలితముగ బ్రాహ్మణులలో బ్రాహ్మణులకే విభేదములుప్పతిల్లి యాభ్యాద్వేషములుపెచ్చరిల్ల సాగెను.

భారతమును పంచమవేదముగ భజింప మొదలిడిరి. ఉపనిషత్తులు, గీత, బ్రహ్మసూత్రములనెడి ప్రస్థానత్రయమునకు మాత్రమే ప్రాధాన్యమమలునకువచ్చెను. అధర్మము గట్టిగ మూఁడుపాదములతో నిలువద్రొక్కుకొని, యథేచ్ఛగ విహరింపసాగెను. ధర్మమునకు ప్రత్యేకత నశించి, ధనమునకు ప్రాముఖ్యము వర్ధిల్లసాగెను. సంఘమున హెచ్చుతగ్గులవాదము సంకుల సంఘర్షణకు పునాదులు వేయుచుండెను. శాంతిక్రమముగ లుప్తమై, నిరంతర సంక్షోభమునకు దేశమాలవాలమాయెను. వృత్తులనే కులములుగ భావించుటతో కులముల సంఖ్యయు మితిమీరెను. కులములలో న్యూనాధిక భేదములు

సైతము విరివిగ పెరిగిపోయెను. దేశమునందాధ్యాత్మిక చైత న్యము శుష్కించినది. రాజకీయ వైదుష్యము కలుషభూయిష్ఠ మాయెను. సంఘము భిన్నభిన్న విరుద్ధశక్తులవశమై, కల్లోల వాతావరణముల మధ్య - కీలుబొమ్మవలె నెటు ద్రిప్పిన నటు తిరుగసాగెను. కాని, ఆర్థికముగమాత్రము దేశము సర్వవిధ సమున్నత స్థాయియందే యుండెను. ముక్కాఱు పంటలతో క్షేత్రరాజములు సస్యరాసుల సృష్టించుచుండ, గోవులు పుష్టిగ క్షీరముల గురిపించుచుండ, పాడిపంటలతో భారతదేశ మన్న పూర్ణాలయముగ విఖ్యాతి గడించెను. తిండికి మోమువాచి దీనులైనవారానాడరుదుగ నుండెడివారు. ఆర్థిక పరిపుష్టితో వర్ధిల్లుచున్న భారతప్రజానీకమునందానాఁడు మానసికముగ తృప్తియే వ్యక్తమగుచుండెడిది. మఱియొకసుగుణమునుఁగూడ మనము భారతమున నాఁడు స్పష్టముగ బరిశీలింపగలము. దేశ మున నెన్నియంతఃకలహములున్నను - స్వార్థభావనలున్నను- పరస్పరాసూయాది దుర్గుణములున్నను మన భారతీయులు బాహ్య శక్తులకు నాఁడు లొంగకుండుట కడుంగడు విశేషము. ఇది సంతసిందఁగిన విషయముగదా !

పరదేశీయులను, వారి క్రూర దండయాత్రలను గట్టిగ నెదిర్చినిల్చిరి. వారికిదేశమునఁ గాలూన నవకాశములేకుండుట కహర్నిశలు కృషిగావించిరి. ప్రగాఢదేశభక్తితో కట్టుగట్టి జట్టుగసంచరించిరి. పట్టుబట్టి గట్టిగ భారతపరిరక్షణగావించిరి. భారతాభ్యుదయమును ప్రబలించిరి. కలియుగ ప్రారంభకాల

మది. కావుననే, కొన్నిసుగుణములు దేశగౌరవమునకు హేతు భూతములుగ వర్ధిల్లినవి.

వాణిజ్య నైపుణ్యమునుఁ జూపుచు, పరదేశములకేగిన భారతీయులు-మన సంస్కృతిని విదేశములలోవ్యాప్తము గావించుటకు చక్కగ సహకరించిరి. తన్మూలమున, భారతీయుల సర్వతోముఖ ప్రతిభ-దేశదేశాంతరములలో ప్రశంసల నందుకొనుటకవకాశమేర్పడెను. ఏదియెట్లున్నను, దేశప్రగతి నిరోధకములైనకొన్ని యవాంఛనీయశక్తులు కలియుగమున పైత్తనముసల్పుటవలన, దేశాభ్యుదయము కుంటునడుటయే జరిగినదని చెప్పవలెను. ముఖ్యముగ, భారతయుద్ధానంతరము యజ్ఞములపేరుతో దారుణముగ జంతుబలులు, నరబలులు జరుగుట కడుంగడు విచారణీయాంశము.

మానవతనశించి, మతము భయంకరవ్రతముగ పరిణమించి, సహింపరాని హింసాకాండకు స్వాగతముపల్కుటయె గర్హింపఁదగిన విషయము. కులతత్త్వపు క్రమ్మ్మలాట-కొండంతగ దేశాభ్యుదయమున కడ్డువడెను. అంటరాని తన మాకసమువఱకుపెరిగి, గుండెలమీదరాజెడి కుంపటిగ తయారైనది.

జంతుబలులు, జాతరలు బాగుగ వ్యాప్తికివచ్చెను. సిగలు విరబోసికొని, యూగుచు-ద్రాగుచు-తందనాలాడుచు-జనులొడలుదెలియక ప్రేలుచు - విహరించుటొక సర్వజన

సామాన్యసంప్రదాయమైపోయినది. పరహింసా పరపీడనశక్తి పట్టపగ్గములులేని పిశాచమువలె పగలఁబడి నవ్వసాగెను.

దేశమున కాసమయమున దిక్కయి నిలిచిన మహనీయుఁడు బుద్ధభగవానుఁడు. శాక్యవంశాబ్ధి చంద్రుఁడుగ నుదయించిన యీ సిద్ధార్థుఁడు-పదుచుభార్యను, పసిబిడ్డను, పరిధులులేని సామ్రాజ్యవైభవమును తృణప్రాయముగ త్యజించి, సర్వమానవసముద్ధరణార్థము సన్యాసియైనాఁడు.

ఆమహనీయుఁడు-శుద్ధోదన ప్రభువునకేకైకపుత్రుఁడు. జగదేకసుందరియైన యశోధరామనోధవుఁడు. శాక్యసామ్రాజ్య సర్వాధికారి. సుగుణసంపత్తిచే, సకలసామంతరాజుల ప్రశంసాపరంపరలను నిర్బాధముగ నందజాలిన ప్రభువతంసుఁడు. లోకమునఁగల దారుణదృశ్యముల గన్నారగని, నిశీథమున వినిపించిన గగనవాణిని వీనులారవిని, తన మనుగడను జగత్కల్యాణార్థము వినియోగింప సన్నాహ్యమైన పుణ్యమూర్తి. ఆయన కరుణామయ వీక్షణ నికరములే ధరణికి మరల తపనఁ జల్లార్చినవి. ఆయతి చంద్రుని బోధలే వసుంధరకు మరల నవవసంతమునుఁ జూపినవి.

ఆయన మేడమెట్లు దిగినాఁడు. జగతీధర్మము నొకమెట్టు పైకెక్కించినాఁడు. ఆయన చీఁకటిలో మునిఁగినాఁడు. లోకమునకు వెలుఁగు గూర్చినాఁడు. ఆయన లోకమునఁగల యశాంతినిఁగని, యశ్రుబిందువులురాల్చి, ప్రజలను శాంతిఁగోదేర్చినాఁడు.

"ఇహాసనే శుష్యతు మే శరీరం
త్వగస్థిమాంసం ప్రళయంచ యాతు!
అప్రాప్యబోధిం బహుకల్ప దుర్లభాం
నైవాసనాత్కాయమతశ్చలిష్యతే."

యోగాసనమున స్థిర దీక్షలోనున్నతటి నాశరీర సర్వస్వము శుష్కించిన శుష్కించుగాక! చర్మ మాంసాస్థులు పూర్తిగ నశించిన నశించుగాక!! ఎన్నియో కల్పములు తపించి ననుసంలబ్ధముకాని బుద్ధత్వము నాకు ప్రాప్తింపవలసినదే. అంత దనుక, నేనీసమాధినుండి యీషణ్మాత్రమైన చలింపబోను.

కఠోరమైన యిట్టి యోగధర్మ ప్రవృత్తి యెందఱకు లభ్యమగును? శుద్ధోధనుని ముద్దులబిడ్డకొక్కనికే యీ మహా దీక్షకుదిరినది. ఆ పుణ్యమూర్తి యెక్కడే సుషుప్తులను ప్రబుద్ధులను గావింపజాలిన బుద్ధయతితిలకుడైనాడు. భోగమును, రాగమును కాలదన్ని త్యాగమునువలచినాడు. బంధుర మైన శారీరక ప్రేమబంధమునుచ్ఛేదించి, సర్వమానవప్రేమ సింధువు కాగలిగినాడు. పాశవికాలోచనలను గోసివైచి, పవిత్రభావములకు దోసిలొగ్గి నిలిచినాడు. తాను భిక్షుకుడై ప్రేమభిక్షును లోకమునకు బంచినాడు. నిర్ధనుడై జ్ఞానధనమును వెదజల్లినాడు. నరుడై నారాయణావతారుడుగ నరనారీగణ మనస్సుమాంజుల నందుకొన్నాడు.

ఎటువంటి యింద్రియ సుఖానుభూతులను ఆయన యభిలషింపలేదు. కాని! యాకాశవాణి వచనములువిని, కాంతార

వాసియై, శిష్యకోటినిజేర్చి, భోధివృక్షముక్రింద జ్ఞానధనము నార్జించి, బుద్ధుడై లోకమునకాయన కోట్లకొలది సుఖములను రుచిజూపిన మాటమాత్రము యథార్థము. ఆయనదివ్యభావ నకు భారతముప్పొంగినది. ఆయన భూతానుకంపకు భారతీ యులు పరవశులైరి.

బలిపీఠమునకు గొనిపోబడుచు- నడువలేక కుంటుచున్న మేకపిల్ల కన్నులనుండి గారెడి యశ్రుబిందువులగని, యీవేదన జెంది; కఱకు కత్తుల కెమరు నిచ్చి, కరుణను పండించినాడు. సత్యము, ధర్మము, అహింస సంఘ సౌష్ఠవమునకు శరణ్యము లని యెలుగెత్తి చాటినాడు.

"బహుజన సుఖాయ - బహుజన హితాయ"

అనెడి దయార్ద్రదృష్టితో నా మహనీయుని యుద్యమమారంభ మాయెను. త్యాగమూర్తిగ - సన్యాసిగ - భూతహిత రతుడుగ బుద్ధభగవానుడవతార పురుషుడై, యెల్లరి పూజల నందగల్గెను.

ప్రేమరాజ్యమును స్థాపించు టాయన దీక్ష. కారుణ్య గంగ - భూతలమున పొంగి, మానవుల యంతరంగములపై ప్రవహించుటాయన లక్ష్యము. త్యాగఫలము సర్వజనక్షేమా ర్థము వినియోగపడుటాయన సంకల్పము. ప్రజాకల్యాణము విస్తరిల్లి, సుఖశాంతులతో దేశము కళకళలాడుటాయన యభి మతము. వీనిలో నెవ్వి యుత్తమ లక్షణములు గావు? ఉత్తమ

లక్షణములు దైవాంశములుగదా! కావుననే బుద్ధుడు దైవము. కలియుగావతార పురుషుడు.

బుద్ధుని కారుణ్య సిద్ధాంతము లోకమున బహుళ వ్యాప్తికి వచ్చినది. సుకరముగ, సులభముగ సర్వజనామోద పాత్రమైనది. బుద్ధుడు ప్రవచించినది వేదధర్మములే. రూపము మారవచ్చును. బోధనా రీతి మారవచ్చును. సందేశము మాత్రము వేదసందేశమే. బుద్ధుని కొందఱు నాస్తికుడనిరి. వేదధర్మప్రచారముగావించి, వేదధర్మోద్ధరణకే నడుముగట్టిన బుద్ధుడు నాస్తికుడగుచో- నిక నాస్తికులు గానివారెవరు?

వేదము సత్యమును బలుకుమనుచున్నది. ధర్మము నాచరింపుమనుచున్నది. బుద్ధుడు ధర్మమే శరణ్యమనినాడు. సత్యమే సంఘజీవితలక్ష్యమనినాడు. ప్రేమ సర్వత్ర విస్తరిల్ల వలెననియు బుద్ధుడుద్ఘోషించినాడు.

"అహింసా పరమోధర్మః"

అనెడి వేదమంత్ర రహస్యమే బుద్ధుని ప్రబోధములలో ప్రథమస్థానావృత గడించినది. వేదధర్మములను తానుజ్జీర్ణించుకొని, యనుభూతికి దెచ్చుకొని, యాచరణమునందుంచి, సర్వులనాచరింపవలసినదనియు - తరింపవలసినదనియు ప్రబోధించినాడు.

హింసాపూరిత యజ్ఞకాండకాయనయే స్వస్తిచెప్పెను. జంతుబలులు, నరబలులు బౌద్ధమత ప్రభావమున నిరోధింప

బడినవనుటలో నెవ్వరికినిభిన్నాభిప్రాయములేదు. దైవానుగ్రహమునుగోరి, లోకకల్యాణమును సాధించి, జీవిత ఫలితమును గడించుటలో నెల్లరు సమానాధికారులేయని బుద్ధుడు వివరించినాడు. సంఘారామములలో – చైత్యములలో బౌద్ధసిద్ధాంతములు ప్రతిధ్వనించి, భారత భూభాగమునందేకాక, జావా – సుమిత్రా – బోర్నియో – చీనా – జపాన్ మున్నగు దూరదేశములలోగూడ ప్రతిధ్వనించినవి.

బౌద్ధ ధర్మమును స్వీకరించువారలు సంసారసుఖాభిలాషను పరిత్యజించి, శాంతికాముక దృష్టితో సంచరింపవలెననియు – ఈధర్మ స్వీకారమునకు స్త్రీ పురుషులందఱును అర్హులేయనియు బౌద్ధము సిద్ధాంతీకరించెను. విచక్షణారహితముగ సర్వులకీ యధికారము నిచ్చుటవలననే, భావికాలమున బౌద్ధమతసౌధము కూలిపోయెనని దుస్థితి యేర్పడెనని కొందఱు భావించిరి. ఏదియేమైనను – మానవహృదయ క్షేత్రములలో ప్రేమ బీజమునాటి, శాంతి ఫలములను పండించగల ఘనత బుద్ధునకే దక్కునదని చెప్పక తప్పదు.

మహోగ్ర తపస్సుతో దివ్యదీధితి నావిష్కరింపజేసి జీవ హింసను గర్హించి, జగతిని సంస్కరించి, యీ యుగమున బుద్ధుడు సర్వప్రజలకారాధ్యదైవమై నిల్చెను. ఆ మహనీయుని నిరుపమాన కృషిఫలముగనే, దేశమున మఱల సుఖశాంతులు వర్ధిల్లెననుట నిర్వివాదాంశము.

ఆధ్యాత్మికరంగమునందేకాక, భౌతికశాస్త్రములలో – లలితకళలలో – జ్యోతిషాయుర్వేదాది విద్యారంగములలోగూడ బౌద్ధులు సాగించిన కృషి యపారమైనది. భరతఖండ గౌరవ ప్రతిష్ఠలు – బర్మా, ఇండోనేషియా, టిబెట్, చైనా, జపాన్ మున్నగు పెక్కు దేశములలో దివ్యముగ వికసించుటకు, బౌద్ధమతప్రాభవమే ప్రబల సాధనమని యంగీకరించితీరవలెను.

బలీయములైన పునాదులలో విశ్వకల్యాణమే ధ్యేయముగ గొనసాగిన బౌద్ధమత ప్రభావమునకు నాటికాలమున పలువురు చక్రవర్తులు నతమస్తకులైరి. ఆ మతప్రచారమును దీక్షతో నిరంతరము సాగించిరి. అట్టివారిలో – అశోకచక్రవర్తి యగ్రగణ్యుడు. బుద్ధుని సిద్ధాంతములను పూర్తిగ నామోదించి, శిరసావహించి, విపులప్రచారమునకు బూనుకొనిన ప్రభువరేణ్యుడీయశోకుడు. పేదలకు సకలసౌకర్యములను సమకూర్చి, హీనులను – దీనులను ప్రేమతో గాపాడుటనెడి బౌద్ధ సిద్ధాంతము నమలుపఱచుటలో నితడు చూపిన శ్రద్ధాసక్తులనన్యసామాన్యములు. చిరస్మరణీయములు. ప్రశంసాపాత్రములు. మనుజులకేకాక, పశువులకు – పక్షులకుగూడ ఉచిత చికిత్సాలయముల నేర్పఱచి, భూతదయను వెల్లడించిన ధన్యాత్ముడీ యశోకుడు. అడుగడుగున జలాశయము లేర్పరచెను. దేశమును సస్యశ్యామలము గావించి, పాడిపంటలతో విలసిల్లఁ జేసెను. గ్రామగ్రామము నందన్నదాన సత్రములు నెలకొల్పెను.

ప్రజలలో పరస్పరప్రేమను పెంపొందించెను. దురాచారములను నిర్మూలింపఁ జేసెను. దురాలోచనాపరులకు తీవ్ర శిక్షలు నిర్ణయించెను. సర్వప్రాంతములందాహారపదార్థములు పుష్కలముగ లభ్యపడుటకు తగిన వసతి సౌకర్యములను గల్పించెను. సర్వకళలను సముచితస్థాయిలో పోషించి, భారతీయ సంస్కృతికి వన్నెలుచిన్నెలు తీర్చిదిద్దెను. సమస్త ప్రజలను సమదృష్టితో పాలించెను. మనదేశమునందేకాక, ఆసియాఖండ మంతటను బౌద్ధమతమును ప్రశాంతముగ ప్రచారమొనర్ప ప్రాజ్ఞులగు బౌద్ధభిక్షువులను బంపి – వారికి తగిన యేర్పాట్లు గావించెను. పలువురు సార్వభౌము లిట్లే బౌద్ధమతాను యాయులై, అందలి దివ్యభావపరంపరలకు లోకమునందఖండ వ్యాప్తి యేర్పడ – ఆదరాభిమానము లల్లుకొన-బహుముఖ ప్రయత్నములు గావించినను – వారందఱిలో నశోకుని కృషి విశేష ప్రాముఖ్యమును బడసి, చరిత్రలో సదా విరాజిల్లు చున్నది.

బౌద్ధయుగము స్వర్ణయుగముగ పేరెన్నికగనుటకు – బుద్ధుని యాత్మబలముతో బాటుగ నశోకుని శాసన బలము గూడ సమప్రాతినిధ్యము వహించెననుట వాస్తవము. భారతీయ ప్రభువులలో – అశోకచక్రవర్తి పాత్ర కడుంగడు విచిత్ర మైనది. భావికాలమున కాదర్శప్రాయమైనట్టిది. ప్రశంసనీయ మైనట్టిది. తొలుత అశోకుడు సర్వరిపుజన భయంకరుడు. హింసాపూరితరణపాండిత్య మండితుడు. చండశాసనుడు.

సామ్రాజ్యవిస్తరణదృష్టియే ప్రధానధ్యేయముగ సంచరించిన వాడు. రక్తనదుల నీదుటకు మోజుపడి ముందు కుఱికెడి ప్రమాదకరుడగు సాహసి. అట్టి చక్రవర్తిగుండెలలో దయా రసధారలను గురియించి, సంపూర్ణ పరివర్తన దెప్పించిన మహనీయుడు బుద్ధభగవానుడే గదా!

రణభేరీల మ్రోతలకు స్వస్తిచెప్పి- అనురాగవాక్యము లకు వీనులొగ్గెడి స్థితి యశోకునిలో కళింగయుద్ధానంతరము సముద్భవించినది. రక్తపాతముతో గుండెలవియ, యీర్ష్యా ద్వేషములకు తిలోదకములిచ్చి, క్రూరవిధానములను శాసన బద్ధముగ నిర్మూలించిన సహృదయచక్రవర్తిగ నశోకుడు పరి వర్తనజెందుట మానవచరిత్రయందే నిజముగ నొక మహోదయము. భీతిని గలిగింపని ప్రియదర్శియై-నీతిని వెలయించెడి నేతయై, శీలమును' బెంపొందించెడి పాలకుడై, అహింసా ప్రచార ప్రబోధదీక్షితుడై, అఖిలజన మనోరంజకుడై, అశో కుడై-అశోకు డీ కాలము నందనురాగపు పంటను బండించు టకుసంపూర్ణ ప్రభావమును జూపిన పుణ్యుడు. శాక్యకుల చూడామణి,సన్యాసిగణశిరోమణి,ప్రేమఖనియైనది,బుద్ధదేవుడే.

బౌద్ధ సిద్ధాంతము లెన్నియో శిలాఫలకములకెక్కి, స్తూపముల నలంకరించి, బౌద్ధమునకు ప్రాణప్రతిష్ఠ గావించి, యజరామరత్వమును ఘటించినవి. అశోకుని పుణ్యమునసే యిట్టి సత్కృషి - సర్వతోముఖముగ సాగినది. బౌద్ధసన్యా సులు పలువురు పలుప్రాంతములలో - పలు తెఱగుల కృషి

రొనర్చినను, ప్రభుత్వస్థాయిలో నశోకచక్రవర్తి గావించిన కృషియే సర్వకాలములలో ప్రశంసల నందుకొనుచు, చరిత్ర ప్రసిద్ధముగ నిలువగలిగినది.

బుద్ధుని యనంతరము - బౌద్ధమతమున సంచలనము సహజముగనే బయలుదేరెను. బౌద్ధసిద్ధాంతముల కాఠిన్యమును సడలింప నభిలషించువారొకవంక - వానికెట్టిసవరణలనేని గావింప నంగీకరింపనివారొకవంక - జేరి, ఘర్షణపడసాగిరి. బౌద్ధమున ద్వైవిధ్యమేర్పడినది. హీనయాన, మహాయానము లనెడి భాగములుగ బౌద్ధమతముచీలెను. తొలుత విచక్షణలేక, సర్వులకు బౌద్ధమత్ప్రవేశార్హత నిచ్చుటవలననే క్రమముగ కాలప్రభావమునన్నిట్టియాలోచనలేర్పడి, మతసిద్ధాంత శైథిల్యముత్పన్నమాయెనని పరిస్థితులు సమీక్షించిన విజ్ఞులు విశదీకరించిరి. ఎల్లరు సన్యాసులుగావలెనని కాంక్షించుటయు-సంఘారామములలో స్త్రీ పురుషులు కలిసిమెలిసి యుండుటయు బౌద్ధమత పతనమునకు ప్రబల కారణమని కొందఱు నిర్ధారణ జేసిరి. కాలక్రమమున, బౌద్ధులలోదృఢతమమైనయాత్మబలము లోపించుట - విధినిషేధములయెడ శ్రద్ధాశక్తులు సన్నగిల్లుటయును బౌద్ధము క్షీణదశకు వచ్చుటకు కారణములై యుండవచ్చును. మనోదౌర్బల్యము వృద్ధియైన కొలదీయు - మానవుఁడు పతనదశకుఁజేరుట జగద్విదితసత్యముగదా! ఏదియేమైనను బౌద్ధయుగమును స్వర్ణయుగముగనే సంభావించితీరవలయును.

బౌద్ధయుగమునకు కొలఁదికాలముముందు – జైనమత మొకటివ్యాప్తికి వచ్చినది. జినుఁడు యీ మతస్థులకారాధ్య దైవమాయెను. వీరికిఁగూడ నహింసయే పరమధర్మము. కాని ఉత్తుంగ తరంగములతో జగద్రంగము నాక్రమించిన బౌద్ధ ముముందు జైనమొక ఛాయాచిత్రముగ మాత్రమే నిలిచి పోయెను. బౌద్ధమతము మన దేశమున క్రమక్రముగ క్షీణించుచున్నను, ఖండాంతరములలో దాని ఖ్యాతి యినుమ డించుచునే యుండెను.

కాలప్రవాహమున వచ్చెడిమార్పులను కలుపుకొని, ముందునకుసాగుచున్న యుగస్రవంతి క్రొత్త నడకలు నడుచు టారంభమాయెను. కలియుగముగదా! ఏ నడకరీతి యెట్లుం డునో! ఎట్లుండబోవునో! ఎవ్వరు నిదమిత్థమని వివరింప జాలరైరి.

బుద్ధదేవునివంటి మహత్తర తపశ్శక్తి సంపన్నులుద యించి, దివ్యసందేశము నందించినను – తదుపరి కాలమున భారతదేశమున క్రమస్థాయిలో నొకవంక యాధ్యాత్మికభావ పతనము బరుగుచునే వచ్చుచున్నది. ధర్మద్వేషమేర్పడినచోట దైవద్వేషమేర్పడుటలో నాశ్చర్యమేమి? కాని, దేశభక్తి నశింపలేదు. సుసంఘటిత సైనికబలముతో పరుల నీగడ్డపై నడుగు బెట్టనీయమనెడి రాజుల దృఢసంకల్పము పటిమను గోల్పోవలేదు. ఆర్థికశక్తి ద్విగుణముగనో – త్రిగుణముగనో హెచ్చుచున్నది. భారత భాగోళికసంరక్షణశక్తి పురోగమించు

చునే యున్నది. భారతాధ్యాత్మిక చైతన్యసంరక్షణమాత్రము తిరోగమించుచున్నది. అశోకుని తరువాత భారత గౌరవమును గాపాడుటకై శాసనాత్మక సహకారము నందించినవారు గుప్త రాజులు. నాటికి క్షత్రియులలో నంతర్వైషమ్యములు లేక పోలేదు. కాని, విదేశీయులైన గ్రీకులనుతరిమికొట్టి, భారతీయ సంస్కృతికి నిలయములగు తక్షశిలాదులకు-వేయేల! భారత భూభాగగౌరవప్రతిపత్తులకు సర్వతోముఖముగ భద్రతగూర్చి సన్నద్ధులైనవారువీరే. విజయదుందుభిని మ్రోగించినవారును వీరే!

ఆకాలమునఁగల నందరాజులు - చాణక్యుఁడను మహా ప్రతిభావంతుని దారుణముగ పరిభవించుట, చరిత్రకే కళంక మునుగూర్చెడి యొక దుష్టసంఘటన. అది నాటిసామాజిక జీవితమును కొలఁదిగనో - గొప్పగనో యల్లకల్లోలముపాలే యొనర్చినది.

రాజనీతి కోవిదుఁడును - యుద్ధ తంత్రజ్ఞుఁడును - నిరుపమాన మేధాబల సంపన్నుఁడును - బ్రాహ్మణోత్తముఁడునగు చాణక్యుఁడు పగబట్టి, ప్రకోపించి, చంద్రగుప్తుని దరిఁజేరి, నందవంశమును సమూలముగ నిర్మూలించెను. చంద్ర గుప్తుని మహోన్నతస్థితికి సర్వశక్తులను ధారవోసి, విజయ పతాకలను వినువీథులకెగుర వైచెను. చంద్రగుప్తుఁడుగూడ, భారతరాజ్య యశోవల్లరిని దశదిశలకు అల్లువెట్టి, సురభిళ ప్రసూన పంక్తులు విరియింప నసాధారణ కృషి గావించెను.

మహాప్రజ్ఞానిధియైన చాణక్యుడు రాజకీయకార్యనిర్వహణ దక్షుడై, ఛిన్నభిన్నముగనున్న భారతభూభాగముల - నేకసూత్రబద్ధమొనర్ప శ్రమించి, సఫలుడాయెను. బుద్ధుని యనంతరము భారతదేశమీవిధముగ మేధానిధుల యండదండలతో మనగలుగుటారంభమాయెను.

కొంత ప్రశాంతపరిస్థితి కుదురుకొనియున్న భారతమును పిమ్మటనేలిన రాజులలో నగ్రేసరుడు విక్రమాదిత్యుడు. దేశమునందల్లకల్లోలముల గొడవ యుపశమించుటచే, సహజ సరళస్వభావుడును దైవభక్తితత్పరుడునగు విక్రమాదిత్యుడు తన సామ్రాజ్యమును మిక్కిలి యున్నతస్థాయికి గొనిపోవ, నిర్మాణాత్మక పథకములతో - నిస్తులమైన కృషియొనర్చెను. విక్రమాదిత్యునికాలమున భారతీయసంస్కృతి విశ్వరూపమున సాక్షాత్కరించెను. కళలు బలమును సంపాదించుకొని నిలువ సాగెను. శిల్పము చిత్రతేజమున చిద్విలాసముల నొలుక వోసెను. కవితాలక్ష్మి - కమనీయ గణనీయ రమణీయ భావ వైచిత్రితో నవనర్తన మారంభించెను. విక్రమాదిత్యుడు సహజసంస్కృతీ ప్రియుడగుటచే, నీతని పాలనము - చరిత్రలో పసిడి పండినకాలమైనది. కవి పండిత పోషకుడై, యీ మహా రాజుగావించిన సాహిత్యసేవ సాటిలేనిది. తదనంతరతరముల వారికి-వారికే యనగలవారికిని-భావితరముల వారికినిగూడ వలసినంత సాహిత్యసంపద నాడు పెంపొందింప బడ్డెను. నవరత్నములనదగిన కవిపండితులు విక్రమాదిత్యుని

యాస్థానమున కలంకార ప్రాయులై విరాజిల్లిరి. వీరిలోచిరస్మర ణీయుఁడు – గీర్వాణ కవికుల శిరోమణి – ప్రముఖకావ్య నాటక విధాత – కాళిదాసమహా కవి.

కృతయుగమున యాస్కు–నివలె, త్రేతలో వాల్మీకివలె, ద్వాపరమున వ్యాసునివలె–కలియుగమున మహోన్న సంస్కృతికి పట్టుగొమ్మగనిలిచి, మధురకావ్య ఫలరసములతో మానవుల మనస్సులను మంజులముగావింపనేర్చి, దేశగౌరవాభ్యున్నతికి తులలేని సేవగావించిన మహనీయుఁడు కాళిదాసు. ఈ కవివతంసుని రఘువంశము–రామకథా సుధా ప్రపూర్ణమై, ఇక్ష్వాకుల నిస్తులగుణసంపత్తికి దర్పణమై, భారతీయ సంస్కృతికి ప్రతిబింబమై ప్రకాశించినది.

సర్వ ప్రపంచ సాహిత్యమున మేటియనఁబరగిన నాటక రాజము కాళిదాసుని యభిజ్ఞాన శాకుంతలము. ఆశ్రమ ధర్మముల మహిమలు, ప్రశాంత ప్రసన్నతపోవన ప్రభావములు నాటక శిల్పముతో సమ్మిళితములై, నయనపర్వములై, యింప సొంపొత్కరించును. అభిజ్ఞాన శాకుంతలము వంటి నాటకము – విశ్వసాహిత్యమున నభూతోనభవిష్యతి.

అనల్ప కల్పనా శిల్పమోహనమైన శాకుంతల నాటక ప్రదర్శనవైభవమును దిలకించి, 'గెటే' యను జర్మనీదేశ సంస్కృతపండితుఁ డొడలుమఱచి పులకితుడై నృత్యమొనర్చె ననినచో – కళిదాస మహాకవి ప్రతిభకింతకన్న మిన్నయగు సాక్ష్యమింకొకటేల ?

"పురా కవీనాం గణనాప్రసంగే
కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసః
అద్యాపి తత్తుల్యకవేరభావాత్
అనామికా సార్థవతీ బభూవ."

మొదలయిన ప్రశంసాపరంపరల నందుకొనఁగల్గిన మహాకవి – కాళిదాసు.

"ఉపమా కాళిదాసస్య."

ఉపమాలంకారమును సముచిత స్థానమున, సహృదయహృదయహరణచణముగ సంఘటింపఁ గలిగినశక్తి – మహాకవి కాళిదాసున కొక్కనికేదక్కినది. ఈ మహనీయుఁడు కాళీమహోపాసనాబల సంవర్ధిత కవితాశక్తి సంపన్నుఁడై, మాళవికాగ్ని మిత్రము – విక్రమోర్వశీయము మున్నగునాటకములను, కుమారసంభవ మేఘసందేశాది కావ్యములను రచించి యశఃకాయుఁడైనాఁడు. మేఘ సందేశకావ్యసృష్టి – యీ కవివతంసుని ప్రతిభావిశేషమునకు నికషోపలము.

"ధూమజ్యోతిస్సలిలమరుతాం
సన్నిపాతః క్వమేఘః ?"

పొగ, నిప్పు, నీరు, గాలి మొదలగువాని సమష్టి స్వరూపమైన మేఘముద్వారా – వియోగ బాధానల తప్తమానసులైన భార్యాభర్తలమధ్య దౌత్యము నడుపుటకుకావ్యమారంభమై, సకల నదీనద పుణ్యక్షేత్ర ప్రముఖ నగర పరివృత భారత దేశ భౌతిక, సాంస్కృతిక వర్ణనలతో – మేఘసందేశము పరి

పూర్ణతను సంతరించుకొని, సందీప్తినందుచున్నది. నిజముగ నిట్టి యపూర్వసృష్టి - యనితర సాధ్యమగుటవలననే 'కవి కులగురుఃకాళిదాసః' అని, రసజ్ఞులెల్లనునేటికిని సంభావించుచున్నారు. తత్తుల్యులుగాకున్నను - తదనుయాయులుగనుండి కీర్తిగడించినవారానాఁడు పరువురుండిరి. ఇట్టిమహాకవుల కావ్యగాన పరంపరలతో మాగ్రోగిన విక్రమాదిత్య సామ్రాజ్యలక్ష్మీవిభవము - సర్వజన సంస్తుతిపాత్రమాయెను. లలితకళాలక్ష్మికి రమణీయ విశ్రాంతి మందిరముగ, సత్య న్యాయ ధర్మములకు సముచితాశ్రయముగ, నీతిప్రేమలకు నిలయముగ, భగవద్భక్తికి పట్టుగొమ్మగ-సకలశాస్త్రశారదా విహారభూమిగ విక్రమాదిత్య సామ్రాజ్యము విశ్వవిఖ్యాతిని గడించినది. విక్రమార్క-ప్రభువు, నిజముగ నొక శకపురుషుడు. విక్రమార్కుని కాలమంతయు, విక్రమార్క-శకావిర్భాతికనువైన స్థాయిలో సాగినది. ఒకచక్రవర్తిపేర నొకశకమేర్పడుట కాదివ్యుని జీవితమెన్నియో యుదాత్తలీలల కాలవాలమైయుండవలయును. సకలభౌతిక సంపదలతో వర్ధిల్లి, అన్నసత్రములతో విరాజిల్లి, పల్లెప్రజల జానపదగీతములతో విలసిల్లి, సహజ కవితా సౌందర్య శోభలతో తేజరిల్లిన విక్రమార్కుని సామ్రాజ్యమునూతనశకోదయమునకేనాంది గీతములనాలపించినది. ప్రజలెల్లరు భౌతికమునాధ్యాత్మికముతో పుటమువెట్టి దివ్యులై దీపించిరి. మహానందకరమధుర జీవితరసాస్వాదనగావించి, ముగ్ధులైమురిసిరి. విక్రమార్కుని శకపురుషునిగ వినుతించిరి. విక్రమాదిత్యునికాలమునఁగూడ కాళిదాసువంటి

యప్రతిమాన ప్రతిభాధురంధరుని శేషుషీగరిమకతనే భారతీయ గౌరవ ప్రగతి - మూఁడుపూవు లారుకాయలుగ ముగ్ధమోహనముగ విరాజిల్లెనని చెప్పనగును.

అనంతరము భారతదేశ ప్రముఖ భూభాగములు పెక్కింటిపై నాధిపత్యము వహించి, సంస్కృతిని సంరక్షించిన మహోదృష్టము మనయాంధ్రులకబ్బినది. వీరిలో ప్రముఖుఁడు శాలివాహనుఁడు. ఇతఁడు గొప్ప పరాక్రమశాలి. ప్రముఖ రాజకీయధర్మ మర్మవేత్త. దయాధర్మగుణ సంవిలసితుఁడు. త్యాగి. సకలప్రజారంజకముగ పరిపాలనము సాగింపనేర్చిన చతురుఁడగు చక్రవర్తి. ఆయనపేరనొకశకము వెలసినదనినచో నతడెట్లు ప్రజాభిమాన పాత్రుఁడై వర్ధిల్లెనో మనకర్థమగును. శాలివాహన శకమనునదినేటికిని భారతీయ పంచాగకర్తల కాలపరిగణనలో ప్రముఖస్థానము వహించుచున్నది. ఈయన కట్టుదిట్టముగ నేర్పఱచిన పునాదులపై, నస్తవ్యస్తస్థితులేర్పడ లేదు. కావుననే సుమారొక నాలుగు వందల యేండ్లకాలము శాలివాహనుల వంశీయులైన యాంధ్రులే యీ వసుంధరను శాసింపఁగలిగిరి. వారిలో ప్రముఖులు శాతవాహనులు.

భారతదేశమాధ్యాత్మికముగ పతనావస్థకు జేరుచున్న తరుణమది. బౌద్ధముగూడ రంగస్థలమునుండి క్రమముగ నిష్క్రమింపసాగెను. కాలము గడచినకొలఁది - బౌద్ధమత మయోగ్యులగువారి హస్తములలోఁబడి, పెడదారులుపట్టినది.

వైదికమతమునందును వేదములపై గౌరవప్రతిపత్తులు సన్న గిల్లినవి. వేదములన, మంత్రములే యనుభావము లుప్తము కాసాగెను. బ్రాహ్మణములు, ఆరణ్యకములు, మాత్రమే వేదములనఁబడెడి దుస్థితివచ్చెను. క్రమముగ-ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత, ప్రస్థానత్రయ నామమున ప్రాధాన్యమునకువచ్చెను. ఈ ప్రస్థానత్రయమునే పరమ ప్రమాణముగనెంచు టారంభమాయెను. బుద్ధుఁడు వేదధర్మములనే నవవిధానములతో వివరింప, దానికొక విచిత్ర వ్యాఖ్యానమును స్వార్థపరులుకల్పించి, జాతిజీవితమునుకల్లోల భూయిష్ఠమొనర్చిరి.

నయనారులు

ఆ కాలమున భారతదేశమున నలుమూలల నేదోయొక రూపమున ఆధ్యాత్మికశక్తి వెల్లువలుగ బ్రవహించుచునే యుండెను. అందు తమిళనాట భగవద్భక్తి భావములు-దివ్యావేశములు పరాకాష్ఠనందిన వనవచ్చును. ఇట భక్తితత్త్వము ద్వివిధములుగ వికసించి, వ్యాప్తినందినది. అందొకటి శైవము. రెండవది వైష్ణవము.

శైవమతవ్యాప్తికి నయనారులు మూలస్తంభములు. వీరు భక్త్యున్మత్తులు. సిద్ధులు. దివ్యావేశమూర్తులుగ-దివ్యగీతికలగాన మొనర్చుచుండెడివారు. ఈ గీతికలనే తేవారములు (దేవహారములు) అందురు. భావము దివ్యము. భాష మధురము. ఉత్సాహావేశ సమ్మోహితమై - పరవశులను గావించును.

సుందరమూర్తి, అప్పర్ మున్నగు నయనారులే తమిళనాట శివభక్తిని తాండవింపజేసిరి.

భక్తిరసరంజితహృదయులై పరమార్థజ్ఞానమును ప్రజలకు పంచిపెట్టిరి. వీరి తేవారముల గానముతో తమిళనాడు పులకించిపోయినదన్న నతిశయోక్తిగాదేమో !

ప్రజలలో భక్తిభావము, శివానురక్తి వెల్లివిరిసినవి. భక్తిభావావేశపరులై భగవదనుభూతిని బడసిన మహాత్ములు నయనారులు. మానవతకు మహనీయతను ఘటింప సంభావించిన నిరుపమచరితులు. భారతీయుల సహజసంపదయగు దివ్యతత్త్వప్రచారమునకు వెలుగునందించిన యీ నయనారులు ఆరాధనీయులు.

ఆళ్వారులు

ఈ విధముగనే, వైష్ణవభక్తులైన ఆళ్వారులును విష్ణుభక్తిని ప్రబోధింపసాగిరి. ఆళ్వారులు నిత్యసిద్ధులు. భగవదావేశోన్మాదచిత్తులు. దివ్యసూరులు. సహజకవితలో, వాడవాడల దివ్యగీతికలను–పాశురములను మధురకంఠములతో గాన మొనర్చుచుండెడివారు.

ఈ పాశురములను నేటికిని వైష్ణవులు నిత్యము పారాయణ మొనర్చుచున్నారు. అందు ముఖ్యముగ పర్వదినములలో – తమిళనాట ఉత్సవవేళల – తిరునాళ్ళ రోజులలో ప్రతి

యిట్టి భక్తిశ్రద్ధలతో పారాయణ మొనర్చుచుందురు. విష్ణు పద సేవానిరతులై, తులసీ దివ్యమాలా విభూషితులై, దివ్యోర్ధ్వపుండ్రధారణా తత్పరులై - మన మాతృదేశ దివ్య సంస్కృతిని - సనాతన ధర్మవైఖరిని సంరక్షింప సముచితముగ ప్రచార ప్రబోధములనుగావించిన పుణ్యజీవనులు ద్వాదశాళ్వారులు. వీరు కుల, మత, శాఖాది విభేదములను విస్మరించి, యెల్లరు విష్ణువు నారాధించి ముక్తినిబడయ సమానార్హులే యని యెలుగెత్తిచాటిన దివ్యమూర్తులు. పావన భారతమున సంప్రదాయసదాచార సంస్కృతుల సంరక్షణార్థము బహు ముఖ కృషినిగావించిన పెద్దల-మహాత్ముల కోవకుజెందినవారే యీ ఆళ్వారులు. నారాయణుడే పరంధాముడని ప్రబోధించి, యారాధించిన వైష్ణవ భక్తాగ్రగణ్యులు.

ఆళ్వారులలో పంచములును, యొక స్త్రీయునుగలరు. పరమేశ్వరుని నిశ్చలభక్తితో నారాధించి, వీరుపంచమత్వము నకు పంచత్వమునుగల్గించి, పసిడివలె భాసించిరి. జనుల ప్రశంసల నార్జించుకొనిరి. కులమత, శాఖాది విభేదములతో నిమిత్తములేని యొక సమత్వగుణ విశేషము, వీరి జీవితము లలో, పాశురముల కవితలో పదుగురేకలుగ నల్లుకొని పోయి నది. హిందూమతమునకు వీరొనర్చినసేవలు, దివ్యశోభ నందిం చినవి. ఆళ్వారులు పన్నిద్దరు. అందు పే, పొయ్గై, భూతా ళ్వారులు పంచములు. ఆండాలు స్త్రీ, కులశేఖరుడు రాజు. నమ్మాళ్వారు, విష్ణుచిత్తుడు మున్నగువారు అగ్రవర్ణులు. ఆళ్వా రులు భగవద్విషయాను భవనిరతులు. వారి హృదయముల

నుండి సదా స్రవించు భగవద్విషయమను మకరందమును అనుభవించుటే పరమ వ్రతముగాగలవారు.

తదనంతరకాలమున, వీరి పవిత్ర బోధనముల నుండియే, వేదాన్తదేశికులు, రామానుజాచార్యులు మున్నగు ఆచార్యులు, వైష్ణవభావముల నుద్దీపింపజేసికొని, కుల, మత, శాఖాది తారతమ్యతలను విస్మరించి, యెల్లరకును భగవద్భక్తిని, శరణాగతిని, విరివిగ ప్రచార ప్రబోధములకుదెచ్చి, ప్రజలమన్ననలకు పాత్రులైరి. చిరస్మరణీయులుగ వెలుగొందిరి.

శంకరాచార్యులు (క్రీ. శ. 788 – 820)

ప్రస్థానత్రయమునకు వ్యాఖ్యవ్రాసి, యాచార్య బిరుదమునందిన మహాపండితుఁడు శ్రీశంకరాచార్యులు. పతనదశయందున్న బౌద్ధమును సమూలముగ నిర్మూలింప సమకట్టిన ఆబాల్య సన్యాసి. కర్మకాండకు ప్రాధాన్యము నిచ్చెడి మీమాంసకుల నెదిర్చి, యోడించి, జ్ఞానకాండకగ్రపీఠమునొసంగి, వేదాంతడిండిమ బిరుదమును సార్థకము గావించుకొనఁ జాలిన మహామనీషి. ఆర్షసంప్రదాయములను, సంస్కృతిని పునరుద్ధరింప దీక్షాకంకణధారియై, యవిరళకృషి సాగించి, అద్వైతసిద్ధాంతమున కగ్రతాంబూలమును సాధింపఁ గలిగిన మేధానిధి; దివ్యజ్ఞానబలోపేతుఁడు.

ఈ మహనీయుఁడు కేరళ ప్రాంతమున గల కాలడి గ్రామమునందు జన్మించెను. పసితనమునుండియే ప్రజ్ఞావంతమైన

ప్రతిభను వెలార్చెను. బాల్యముననే సన్యాసదీక్షను బూని, భారతదేశపు నలుమూలల పెక్కు పర్యాయములు పర్యటించి, భారతీయ దివ్యతత్త్వమునకు పటిమను ఘటించెను. దక్షిణమున శృంగేరిలో శారదాపీఠమును, పడమర ద్వారకలో కాళికా మఠమును, తూర్పున జగన్నాథములో గోవర్ధన మఠమును, ఉత్తరమున బదరికావనములో జ్యోతిర్మఠమును శంకరాచార్యులవారుస్థాపించిరి. సురేశ్వరాచార్య, పద్మపాదాచార్య,తోటకాచార్య,హస్తామలకాచార్యలనెడిమహనీయుల పర్యవేక్షణక్రింద నొక్కొక్కమఠమున కొక్కొక్క వేదమును ప్రమాణముగ నిడి, ప్రచారప్రబోధములు సాగించినాడు. షణ్మతములను స్థాపించినాడు. అద్వైతవేదాంతమునకు పట్టము గట్టినాడు.

"బ్రహ్మసత్యం జగన్మిథ్యా
జీవో బ్రహ్మైవ నాపరః"

అనెడి మూలసిద్ధాంతమును వాడవాడల ప్రచారముచేసినాడు. ముప్పదిరెండు సంవత్సరముల స్వల్పవయస్సులో అనల్పమైన మహాసేవ యొనర్చి, వైదిక సంస్కృతిని కాపాడిన శేముషీ ఖనియై, జగద్గురువుగ ఖ్యాతిగాంచినాడు. ప్రస్థానత్రయముగ ప్రఖ్యాతిగాంచిన ఉపనిషత్తులకు, బ్రహ్మసూత్రములకు, భగవద్గీతకు నద్వైతపరముగ భాష్యము వ్రాసి, సాటిలేని తర్క పాండిత్యముతో బౌద్ధవాదమును ఖండించి, విజ్ఞానబలముతో కర్మకాండపరులను 'జితోఽస్మీయనిపించి, వారికి నిలువనీడ దొఱుకనిస్థితిని గలిగించినాడు. చండప్రచండతీక్ష్ణవిజ్ఞానభాస్కరుడై

మండనమిశ్రునివంటిమేటివిద్వద్వరేణ్యునిసైతమోడించి,సన్యాస దీక్షనిచ్చి, శిష్యునిగఁజేసికొనినాఁడు. సురేశ్వరాచార్య లను నామముతో నీయనయే శృంగేరీపీఠ ప్రథమాధిపతియయ్యెను. కాలక్రమమున మతములోకొంతమార్పుదెచ్చి, సంస్కరించి, యాచార్య శంకరులు సర్వులకు వందనీయులైరి. హిమాలయమునుండి కన్యాకుమారివరకు, అటకమునుండి కటకము దాక, భారతదేశపు నలుదెసల పెక్కు పర్యాయములు పర్యటించి మాతృదేశపు ఏకత్వకము నెలుగెత్తి చాటిన సాధుసత్తముడు, పవిత్రసంయమి, శంకర భగవత్పాదులు.

రామానుజాచార్యులు (క్రీ. శ. 1017_1137)

శంకరుని తదుపరి దక్షిణ భారతమున మహోజ్వల శక్తులతో, రామానుజు లుదయించి, శరవేగమున వైష్ణవ తత్త్వపీఠమునకు సర్వప్రజలను భక్తిశ్రద్ధలతో దాసులను గావింప - నూతనమైన పావనోద్యమము నారంభించెను. కుల, మత, వర్గ తారతమ్యములతో నిమిత్తము లేకయే, యెల్లరకు వైష్ణవమతము నిచ్చి, హైందవ సంప్రదాయములకు జీవకళా న్యాసమొనర్చెను. ఎన్నియో పుణ్యక్షేత్రములు సందర్శించి యట వైష్ణవమును బాదుకొల్పుటకు- తద్ద్వారా వైదిక ధర్మ పరతను పెంపొందించుటకు - దైవభక్తిని పునరుద్ధరించుటకు ప్రబలప్రయత్నములుగావించెను. ఆయన యపూర్వకృషివల ననే యువ్వెత్తుగ వైష్ణవమత వ్యాప్తియు, నారాయణ స్మరణ పరతయులోకమునతీవ్రముగవ్యాపించెననియొప్పుకొనకతప్పదు.

రామానుజులు గోపురోపరిభాగమున నిల్చి, ప్రజానీకము నుద్దేశించి గావించిన ప్రబోధమొక యమృతధారా తుల్యమనుట నిస్సంశయము. గోపురసందేశమనుపేర నీ ప్రబోధము నేటికిని వైష్ణవభక్తులలో, దివ్యభక్తిభావలతకాశ్రయమై, ప్రతిధ్వనించుచున్నది. ఓమ్ నమః నారాయణాయ – అను తిరుమంత్రమును ప్రబోధించెను.

ఆచార్య రామానుజులు కేవల ప్రబోధకుఁడు, మహా సంస్కర్త, మతప్రవక్తమాత్రమేకాడు. మహోద్ధండ పండితుఁడు. ప్రస్థానత్రయమునకు భాష్యములు వ్రాసిన మహనీయుఁడు. వానియందీ ధీశాలి గావించిన మేలి పరిశీలన హిందూమత ధర్మజిజ్ఞాసువుల పాలిటికి కల్పవృక్షసమమై భాసించినది.

భగవద్రామానుజులు మహాప్రాజ్ఞులు. తాను ప్రబోధించిన దివ్యభావముల నామూలముగ బరిశీలించి, తదనుభూతిని బడసిన పిమ్మటనే వానిని ప్రజలకందించిన మహనీయుడు. సత్యాన్వేషణ తత్పరుడు. విశాలవిశ్వమునగలవారికెల్లరకు వైష్ణవ మహిమలను విప్పిచెప్పుటయే యాయనపరమలక్ష్యము. అంటరానివారనిచెప్పబడువారికిగూడ, అరమరికలేని తెఱగున సరలముగ, సర్వమును వినిపించి, యనుష్ఠింపజేసి, తరింపజేయుటకే తనజీవితమును ధారబోసిన మహనీయుడు.

గోపురాగ్రమునుండి తిరుమంత్రమును యెలుగెత్తి యెల్లరకు చాటినాడుగదా!.

'నా యాజ్ఞనుల్లంఘించి, వైష్ణవము నెల్లరకందజేయుచున్న నీవు నరకమునకేగుదువని గురువు బెదిరింప, నిందరు

స్వర్గమున కేగ బాటనేర్పఱిచగలిగినపుడు, నేనెన్ని మారులు నరకమున కేగుటకైనను దిగులుపడన'ని, వెను కాడనని చిరునగ వున బలికెనట!

ఈ విశాలదృష్టి సర్వదాకొనియాడదగినది. ఆ మహనీయుని యపూర్వప్రతిభామయవ్యక్తిత్వ విశేషము, దక్షిణ భారతమున హైందవశక్తికి నవచైతన్యప్రదానముగావించెనను మాట తథ్యము.

మధ్వాచార్యులు (క్రీ. శ. 1238 – 1317)

పదమూడవ శతాబ్దమున భారతదేశమున వికృత పరిస్థితులెన్నియో విజృంభించినవి.వీనినిదొలగించి, యార్షసంస్కృతి నుద్ధరింప నెందరో మేధావులుద్భవించిరి. అట్టివారిలో నాడు రంగమునకు వచ్చిన మహనీయుడు మధ్వాచార్యులు.

భారతీయ ప్రభువులలో నాడైక్యము పెచ్చుపెరిగి యుండెను. పరస్పర కలహాములతో, కయ్యములతో జాతి జీవితమున కశ్మలతయేర్పడెను. మధ్వాచార్యులు శంకరాచార్యుని యద్వైత వాదమును తీవ్రముగ నెదిరించెను. రామానుజుని విశిష్టాద్వైతముగూడ మధ్వాచార్యులకు నచ్చలేదు. ఆయనపరిపూర్ణాద్వైతి. ద్వైతమతస్థాపనమే యాయన పరమలక్ష్యము, కావుననే, తనకన్న ముందుగ నీదేశమున మహోన్నతముగ తమతమ వాదములను స్థాపించి, విజయదుందుభులను నలుదెసలు మార్మ్రోగించిన యిరువురు మహోద్ధండులైన సిద్ధాంత పండితుల నతి సాహసమున

నెదిరించెను. మొదట దక్షిణభారతమున తన వాదమునకు విజయపతాకనెత్తి, తదుపరి కన్యాకుమారినుండి, శ్రీరంగము వరకు పర్యటించి, బౌద్ధులను, జైనులనోడించి, యద్వైతమును ఖండించుచు విహరించెను.

రెండుపర్యాయములు ఆసేతుహిమాచలము పర్యటించెను. ప్రస్థానత్రయమునకు భాష్యమును వ్రాసెను. తన నిశితమేధాబలముతో పెక్కురు పండితులను జితోస్మీయనిపించి, తనకు శిష్యులను గావించుకొనెను.

ఉడిపి గ్రామమున శ్రీకృష్ణ విగ్రహమును స్థాపించి యారాధించెను. అచటనే, తనమత ప్రచారమునకెనిమిది మఠములను స్థాపించెను. తనసోదరునితోబాటుగ నెనిమిదిమంది నామఠములకధిపతులగావించెను. వారందఱు నాబాల్యసన్యాసులుగనుండి తీరవలయుననుట విశేషనియమము.

పాండిత్యబల మెంతయో శరీరబలమంతగగల మహారోగ్యవంతుడు మధ్వాచార్యుడు. ఆయనసిద్ధాంతముగూడనంత బలముగనే దేశమున వ్యాప్తి గాంచినది. ఉడిపి మఠములలో సన్యాసదీక్షగైకొనినవారు, మధ్వాచార్యుల సిద్ధాంతములను, తమనిస్స్వార్థసేవలనునేటికిని లోకమునకందించుచునేయున్నారు. మనచరిత్రలో మధ్వమత మొక ప్రత్యేకస్థానమునే గడించి, రాణించినది.

మహమ్మదీయులపరిపాలనాకాలమున భారతీయసంస్కృతిని, సుప్రదాయములను సంరక్షించు నిమిత్తము దేశవ్యాప్తముగ మఠాధ్యమము సాగవలసివచ్చినది. దయా శూన్య

మైన దుష్టపాలనలో భారతీయుడు నామమాత్రా వశిష్టుడుగ నేని, నిలిచియుండుటకు, దేశపు నలుమూలల తీవ్రమైనకృషి యవసరమాయెను. సంస్కృతీసంపన్నులు, శాస్త్ర పాండిత్య నిధులు, దైవభక్తి తత్పరులు, సంస్కరణ జిజ్ఞాసువులు, సాధు భావనిరతులు, సంయమిచంద్రులు, సంకల్పసిద్ధులునగు మహా త్ములు పలువురు దేశమునందాయాప్రాంతములలో బ్రహ్మాండ మైన సంచలనమును గలిగించిరి.

ఆధ్యాత్మిక భావశిఖరమును, మహమ్మదీయుల దురా గ్రహదుష్టసంకల్ప ప్రకోపములకు సంచలింపనీయక చక్కగ కాపాడిరి. మహోద్ధురముగ విజృంభించి, స్వైరవిహారము గావించెడి అన్యమతశక్తి నరికట్టుటకు పలువురు మహాత్మ్ లాయాప్రాంతములందీపగిది విస్తృతి కృషిసాగించుట మన సంస్కృతి యదృష్టము. ఆ పరిశ్రమలో నహారహమునసమస్యల నెదుర్కొనుచు, భారతీయ ధర్మసముద్ధరణకు సాయపడిన పుణ్యాత్ములెందరోకలరు. ప్రతిప్రాంతమున వీరందఱు దివ్య దీప్తులను వెలిగించిరి.

వల్లభాచార్యులు (1479–1531)

అట్టి సాధకులలో వల్లభాచార్యులవారొకరు. ఈయన తన కృషినంతయు గుజరాతుప్రాంతమున వెలయించెను. గొప్ప కృష్ణభక్తుడు. సాకారపూజాతత్పరుడు. మహానైష్ఠికుడు. మధురహృదయుడు. భక్తిపారవశ్యమున మురళీధరుని గీర్తిం చుచు లోకమునే మఱచిపోయెడివాడు. గోవింద చరణారవింద

యుగళమకరందాస్వాదనము లోకమునందందరకు, సుఖ, శుభ సందేశముల నందజేయగలదని గాఢముగ విశ్వసించి, గట్టిగ ప్రబోధించిన మహాత్ముడు. వల్లభునిమతము పుష్టిమార్గము. అది సల్లలితమై, సకలభక్త హృదయారవిందములను పల్లవింప జేసినది. ఆయన వాణికి నాడు ఘనమైన విలువ యేర్పడినది. అన్యమత జంఝూమారుత మహోగ్రోద్వేగమున గొట్టుకొని పోనీయక, జనాళినిగాపాడి, శ్రీకృష్ణనామస్మరణ సుధతో నేదదీర్చి, యత్యుత్తమమైన యాత్మబలమును ప్రసాదించిన మహాభక్తి ప్రబోధకుడీ మహనీయుడు.

నరసింహమెహత (క్రీ. శ. 1414 _ 1481)

వల్లభునివలెనే యీ పరమభక్తశిఖామణియు శ్రీకృష్ణ భక్తుడు. భక్తిమహోద్యమమును ముందునకు నడపిన భగవద్భక్తుడు. వేదతనమును ధిక్కరించి, యాదవకుల శిరోమణి పాదతలమును నమ్మి, యెల్లరకు కనువిప్పు గలుగజేసిన యీ పరమభక్తుని వైఖరి, నాడు సర్వజనాదరణపాత్రమై, సంస్తవ నీయమాయెను.

ఇట్లే మరియొకవంక, నామదేవ (1269_1295) రామా నందులు (1299 _ 1410) దివ్యతత్త్వోపాసకులై ప్రజలలో భగవద్భక్తిని రేకెత్తించి, సమీచీన ప్రాచీన సంప్రదాయము లకు, సంస్కృతికి, వన్నెలుదిద్ది, సనాతన ధర్మమును శిరసావ హించి, చరితార్థులయిరి.

జ్ఞానేశ్వరుడు (1275 –)

జ్ఞానదేవుడు మహారాష్ట్రమున జన్మించెను. ఆర్ష సంస్కృతీ మహిమలను, తపశ్శక్తి సంపన్నుల ప్రతిభలను మరొక్కసారి, యీ యుగమున, కనులు జిగేలుమనునట్లు ప్రకటింప జాలిన యాధ్యాత్మిక దివ్యజ్యోతి జ్ఞానదేవుడు.

బ్రాహ్మణబ్రువులు కొందరు జ్ఞానదేవుని యాత్మశక్తిని గుర్తింపజాలక, వానిని కించపరుప నెన్నియోవిధముల యత్నించిరి. గుణమునకు, విద్వత్తునకు ప్రాధాన్యమునీయక, కులమును గురించి కుత్సితవిమర్శనముల నారంభించి, జ్ఞానదేవుని కుటుంబమును వెలివేసి, యవమానింపసాగిరి.

హీనకులమునకు జెందినవాడను నెపముతో, వేదాధ్యయనార్హతలేని వాడని జ్ఞానదేవుని బ్రాహ్మణ పండితులు ద్వేషించిరి. జ్ఞానదేవుడు, దివ్యజ్ఞానదేవుడని యవివేకులెట్లు గుర్తింపగలరు? నింపుకుండవంటివాడగు జ్ఞానదేవుడు చలింపలేదు; జంకలేదు. భగవదనుగ్రహమును పరిపూర్ణముగ బడయజాలిన యా మహనీయుని వారెట్లు పరిభవింపగలరు? తనను విమర్శించినవారిలో దాగియున్న దురహంకార పూర్ణమైన యజ్ఞాన తిమిరమును బటాపంచలుగావించి, కన్నులుదెరిపింప జ్ఞానదేవుడుద్యమించెను. తమ్ముని, సోదరునివెంట నిడుకొని యొక మట్టిగోడపై గూర్చుండి, దానిని నడిపించుకొనుచు బ్రాహ్మణపండితులు జరిపించుచున్న సమావేశమునకువచ్చెను. దానితో వారెల్లరు విస్తుపోయిరి. జ్ఞానదేవుని మహాశక్తి

కబ్బురపడిరి. కాని! వారిలోమరికొంత యహంకారమట్లేనిల్చి యున్నది. 'నీవు నిజముగ బ్రాహ్మణుడవేయైనచో, తపోబల సంపన్నుడవేయైనచో, దున్నపోతుచే వేదాధ్యయనముజేయింప గలవా?' యని వెట్టిగ ప్రశ్నించిరి.

వారి యజ్ఞానమున కాభక్తశిరోమణి నవ్వుకొని, వారి కోర్కెను వెంటనే తీర్చెనట! మహిషము నోట సుస్వరముగ వేదనాదములు వెలువడగనే కొమ్ములు దిరిగిన పండితులమను కొనుచున్న వారందరు శృంగభంగముపాలైరి. జ్ఞానదేవుని యనంతదివ్యశక్తికి తలలువంచిరి. నాటినుండి వారెల్లరాయన నొక మహాత్మునిగ స్తుతింపసాగిరి

ఆధ్యాత్మికశక్తి, సహనశీలములకుగల విలువ నీ రీతి ప్రచారముగావించుచు, జ్ఞానదేవుడు ప్రజావళిలో నఖండాభి మానసంపద నార్జించెను. ప్రబోధసంపదలతో మాత్రమేకాక, పలుతెఱగుల మహారాష్ట్రమున కాయన సలిపినసేవ యమూల్య మైనట్టిది.

పండితపామరుల సమలీలనలరించు తెఱగున, జ్ఞాన దేవుడు మహారాష్ట్రభాషలో భగవద్గీతపై వ్రాసిన వ్యాఖ్యా నము ఆ మహాపండితుని నిస్తుల వైదుష్యమునకు గీటురాయి. ఆ వ్యాఖ్యానబలమున గీతాహృదయమును సమగ్రముగ నవ గాహన గావించుకొన జాలిన మహారాష్ట్రులు జ్ఞానదేవుని మహోజ్జ్వలాధ్యాత్మికశక్తిని వేనోళ్ళ గొనియాడిరి. తన దివ్యోపదేశవిశేషములచే, తన నయశీలసంపత్తిచే నెల్లరను

రంజింపజేయుచు తరింపజేసిన జ్ఞానదేవుడు, మహారాష్ట్రమున దివ్యశక్తులను ప్రదీపింపజేసిన తేజోమూర్తియై విరాజిల్లినాడు.

ఏకనాథుడు (1533)

జ్ఞానదేవుని వలెనే మహారాష్ట్రమున, నంటరానితనమును, కుల, మతభేదములను లెక్కసేయక, దైవికశక్తులను ప్రదర్శించి, ప్రజలలో నాధ్యాత్మిక చైతన్యమును దీపింపజేసిన పుణ్యమూర్తి ఏకనాథుడు. మహాభక్త శిఖామణిగ, విశ్వరంజకుడుగ, విశాల హృదయుడుగ సమస్త ప్రజలచే సన్నుతులనందిన యేక నాథుడుగూడ మహారాష్ట్ర మాతృ గర్భశుక్తి ముక్తాఫలమనియే యెంచవలెను.

తుకారాము (1608 – 1649)

వీరితోబాటుగ సంకీర్తన పరుడైన తుకారాముగూడ సంస్తవనీయుడు. తుకారాము కృష్ణభక్తుడు. సర్వ ప్రజలను భక్తిపారవశ్యమున ముంచుపగిది కీర్తనలు పాడి, యాడి, తరించి, తన యనుయాయుల నందరను త్తరింపజేసిన దక్షుడు. ఈయన పండరిపుర విఠలదేవు నారాధించెడివాడు. తుకారామచే రచింపబడిన పాటలను మహారాష్ట్ర భాషలో అభంగములందురు. అభంగములద్వారా జాతినిసముత్తేజపఱచి, భారతీయ సదాచారసంపత్తిని, దైవభక్తిని సముజ్వలస్థాయిలో

ప్రబోధించి, మానవాళికి మహోపకారము గావించిన మాననీయుడు తుకారాము.

సక్కుబాయి

మహారాష్ట్రమున భక్తి ప్రచారోద్యమములలో స్త్రీలు సైతము వెనుకబడలేదనుటకు మహాభక్తురాండ్రెందరో కలరు.

అందు సాధ్వీతిలకమగు సక్కుబాయిమహాభక్తురాలు. ఈమె కృష్ణభక్తి యనన్యము. చిత్తశుద్ధితో, నిరంతరము కృష్ణ నామామృతపానముగావించి. శ్రీకృష్ణుని ప్రత్యక్షముగ గాంచిన దివ్యవనిత. ఆమె పిలుపులనాలించి, శ్రీకృష్ణుడు సదా ప్రత్యక్షమగుచుండెడివాడు. సక్కుబాయి కష్టములలో భాగస్వామియై వ్యవహరించెడివాడు. ఆమె విసరవలసిన పిండి నాయన విసరుచుండెడివాడు. ఆమెకు పడవలసిన తీవ్రాఘాతము లకు తనవీపునప్పగించెడివాడు. ఆమెయే తానుగ మాఱి, సక్కు బాయికి సర్వసౌఖ్యములను సమకూర్చెను. అత్త నిత్యము కఠోర ప్రవృత్తివహించి, కచ్చెబట్టి, కష్టముల పాల్సేయు చున్నను, కనలక, కన్నీరునిడక చిరునగవుతో శ్రీకృష్ణునే ప్రార్థించుచు కాలమును గడుపగలిగిన సహనసంపన్న సక్కు బాయి. అత్యుద్ధతితో, ఆడుపులివలె గాండ్రించుచు పైబడెడి యత్తనుగాని, అమాయికముగ - అమ్మనంటిపెట్టుకొని యాప్యాయనముగ నొక్కపలుకేని పలుకనిపతినిగాని, యొక్క మాటయుననక, నిక్కమగుభక్తినే, వారియెడ ప్రకటింప

జాలిన యా సాధ్వీమణి నిరుపమాన శక్తిసంపన్నయనుటకెట్టి విప్రతిపత్తియును లేదు. తుదకామెకు బద్ధశత్రువై, తొచిఱింప మునబెట్టిన యత్తగారికి, ప్రణయభావనమున సముపలాలనసలుపు చెరుగక సంచరించిన పతికి, జగత్పతియైన శ్రీకృష్ణ సౌందర్య పరిపూర్ణాకృతి దర్శనభాగ్యమును గలుగజేసిన భక్తురాలు. క్రౌర్యమును సహనముతోనెదిరించి, కష్టపరంపరలను భక్తి బలముతో నధిగమించి, యాదర్శనారీతిలకమై భక్తకోటికి మణిదీపముగ విరాజిల్లిన నారీరత్నము సక్కుబాయి.

ఇది యిట్లుండ–యూరపుఖండమునఁగూడ స్వార్థ భావ నతో క్రూరదండయాత్ర లారంభమైనవి. అరేబియా, ఈజిప్టు మున్నగుదేశములపై మహమ్మదీయులు దండయాత్రలు సాగించిరి. దురాక్రమణలు గావించిరి. ఆ యా దేశీయులను తమ మతములోనికి బలవంతముగ, నిర్బంధముగఁజేర్చి కొనిరి. తమ సరసన జీవించుచున్న స్వల్పసంఖ్యాకులగు అరబ్బులను, పారశీకులను బహువిధములుగ వేధింపసాగిరి. ఇట్టి మహమ్మదీయుల దుండగములకు పారశీకులనేకులు బలియైపోయిరి. మహమ్మదీయుల ధాటికి తట్టుకొనలేక, చిట్టచివఱకు పారశీకులు మతాంతరులు కావలసివచ్చెను. మహమ్మదీయులకు లొంగి, క్రుంగిపోవలసిన దుస్థితి సంభవించెను. కొందఱెవ్వరో యాత్మ గౌరవపరాయణులు మాత్రము తమ ప్రాణముల నరచేతనిడు కొని, భారతదేశమునకు వలసవచ్చిరి. భారతీయుల హృదయ పూర్వకమైన యతిథిసత్కార సదాచార ఫలితముగ వారి

సహనసఖ్య సమాదరణ ఫలితముగ సుఖముగ నిట జీవింప సాగిరి.

అరబ్బుల దౌష్ట్యము దుర్భరమాయెను. పశుబల ముతో నాడు మహమ్మదీయులు పరిసర రాజ్యములపైవిరుచు కొనిపడిరి. భయంకరపరిస్థితులను సృజించిరి. పలుప్రాంతముల వారిని తమకు బానిసలుగ లొంగదీసికొనిరి. వారిని బలవంత ముగ తమ మతమునఁ గలుపుకొనిరి.

ఈ దురంత దుర్భర భయానక సన్నివేశములతో నాయాదేశము లట్లల్లాడుచుండ, యూరపుఖండమున నొకరి శ్రేయము నొకరు గోరక, తీరని రాజ్యదాహముతో బద్ధ వైరములతో పాలకులు, కయ్యమునకు కాలుద్రవ్వుచుండిరి. ఇఁక మనదేశమో! సుభిక్షముగనుండి, సిరిసంపదలతో కళకళ లాడుచుండెను. కొంతగ పరస్పరాసూయాసహనములుపొడగట్టు చున్నను–పరదేశీయులను దరిజేరనీయక, తరిమికొట్టెడిపౌరుషము నాటి పరిపాలకులలో రాణించుచుండుట– భారతమాత యదృష్ట మనియే భావింపవలయును.

దేశపు సరిహద్దులవఱకే పరిమితమైయున్న కులతత్త్వాది ప్రగతి నిరోధకభావము నశింపలేదేయన్న విచారమున్నను – దేశ మార్థికముగ ముందంజవేయుచునే యుండెను. సస్యశ్యామలములై, మూఁడుకాలములలో పంటలు పండెడు క్షేత్ర రాజములీదేశ సౌభాగ్యమును వేనోళ్ళ చాటసాగెను. బంగారము, రత్నములు, పగడములు, ముత్యములు మున్నగు

నమూలాగ్ర భరణములతో భారతమాత తేజరిల్లు చుండెను. నలుదెసల, పుష్కలాహార పదార్థములు - భూరి సంపదలు కోకొల్లలుగ వెల్లివిరియుటచే, నీదేశమును రత్నగర్భయనియు- కనకగర్భయవియు - అన్నపూర్ణయనియు విదేశీయులు ప్రశంసింపసాగిరి.

ఇట్టి మహోజ్వల వైభవముతో కన్నుల పండువుగ నున్న భారతదేశ సమధికాభ్యుదయ సంపదపై, మహమ్మదీయుల క్రూర దృష్టిపడెను. మనసౌభాగ్యమును గాంచినంతనే వారి పండ్లు పులిసెను. మన యభ్యున్నతిని విన్నంతనే - వారి కన్నులు కుట్టెను. సహజ దురాక్రమణవాంఛా తత్పరులైన వారి యాలోచనలలో - మనభారతీయుల భాగ్యరాశినికబళింప వలెనన్నదుష్ట సమస్యయొకటి యుత్పన్నమైనది. ప్రపంచమునకే యందని భోగముల ననుభవింపవలెనన్న దురాశ - వారిలో నంకురించినది. భారతీయులను సర్వవిధముల భ్రష్టులనుగావించి, సార్వభౌమాధికారమును హస్తగత మొనర్చుకొని, వారి నెత్తిపైనెక్కి, పెత్తనము సాగింపవలెనను దుర్బుద్ధియు నా మహమ్మదీయుల కేర్పడినది. లక్ష్య సాధనకు వెంటనే మంత్రాంగములారంభించిరి. భారతీయులకు పరమపూజ్యము లైన భగవదాలయములను బట్టుకొనినచో-వలసినంత బంగారము, వెండి లభ్యమగుననియు, దేవాలయములను భ్రద్దలు గావించినచో-భారతీయులు మానసికముగ దౌర్బల్యమునకు గురియగుదురనియు, ఒక్కదెబ్బతో రెండు పిట్టల నిట్లు గొట్ట

వచ్చుననియు మహమ్మదీయులు కుట్రలు బన్నిరి. వారి వారి రాక్షస శక్తుల నన్నింటిని కేంద్రీకరించుకొని, పలుమారులు భారతభూభాగముపై భయంకరదండయాత్రలకు బాల్పడిరి. బందిపోటు దొంగలవలె ప్రజలను బాధించి, ధనధాన్యములను దోచుకొనసాగిరి. దేవతామందిరములను శిథిలమొనర్చి, యందందుఁగల రత్నములను, బంగారమును పలుమారులు దోచుకొని, వారి దేశములకుఁ జేరవైచుకొనిరి. ఈ దురాగతముల నెదుర్కొనుటకు పలువురు భారతీయులు ప్రచండమైన పోరాటములను సాగించినను-మనదురదృష్టమోయన మహమ్మదీయుల పాశవికశక్తిదే పైచేయియైనది. అంతియేకాదు-మన భారతీయులలోఁగల యనైక్యము వారి యుద్ధతికి కొంత దోహదముగ నిచ్చినది. మహమ్మదీయుల మూర్ఖపుపట్టుదల, మన యనైక్యము – రెండును మన భారతదేశము పాలిటికి శాపములుగ పరిణమించినవని యనుకొనవచ్చును.

హిందూదేశము

సింధునది కవ్వలియొడ్డున నున్న వారమగుటచే–మన దేశమునకు వలసవచ్చి, మనతో చెలిమిగలిపి, జీవించుచున్న పారశీకులు మనలను సింధువులని వ్యవహరింపసాగిరి. క్రమముగ పారశీకభాషలో నుచ్చారణవశమున 'స' కారము 'హ' కారముగ మారి, సింధుశబ్దము 'హిందు' శబ్దముగమారెను. తదాది మనదేశమునకు 'హిందూస్థాన' మనియు – మనకు 'హిందువు' లనియు క్రొత్తనామములు వ్యవహారమునకు వచ్చినవి. మహమ్మదీయుల దండయాత్ర లధికమగుకొలఁది–మనలో సమైక్యము చాలవఱకు శిథిలముగాఁజొచ్చెను.

స్వదేశ విదేశ వైషమ్యములు – స్వార్థభూయిష్ఠదురాక్రమణ వాంఛలు హిందూ మహమ్మదీయ కలహములుగ మారినవి. మహమ్మదీయమత దౌష్ట్యము దినదినాభివృద్ధిగాంచుటకతన – హిందూమత విశిష్టత మఱుగుపడనారంభించినది. కొనయూపిరితో పండ్లబిగువున పట్టుకొనెడి దుస్థితిని హిందువులే హిందుమతమునకు సంప్రాప్తింపఁజేసిరని చరిత్ర యుద్ఘోషింపక తప్పదాయెను. హిందువులు వ్యక్తిత్వమును గోల్పోవసాగిరి. సదాచారములతోబాటుగ నుత్తమాదర్శము లనుఁగూడ విస్మరించి, మహమ్మదీయుల ననుకరింపనారంభించిరి. స్వార్థపరులును – దేశద్రోహులునగు హిందువులే పెక్కురు మక్కువతో నా మహమ్మదీయుల మన్ననల నందుకొన

నుద్దేశించి, మతాంతరులై పోవుటకే సిద్ధపడిరి. కొందఱు చూచుచు, జూచుచు – పరమతమును నెత్తి కెత్తుకొని, పరమ పావనమైన వైదికమతము నేటఁ గలుపఁజాలక, మహమ్మదీయులతో కలహించి యెదిరించుటకు గడంగిరి. జయాపజయ ములమధ్య నట్టివారి సాహసకృత్యము లూగిసలాడసాగెను.

మహమ్మదీయుల దౌర్జన్యములు పెచ్చుపెరిగెను. హిందూస్త్రీల నెత్తుకొనిపోయి, బలాత్కారముగ వారిని చెఱచి, చెఱపట్టెడి ఘోర దుశ్చర్యలను వారు విరివిగ సలుపసాగిరి. ఉదాసీన భావముతో – తమకు సంబంధించిన విషయము కాదుగదా యని యుపేక్షించు హిందువులను, మతాంతరులను గావించెడి యుద్యమమును జోరుగ సాగించిరి. మనవారు చేతులు నలుపుకొనుచు, సమయము వచ్చినపుడు అట్టివారిని తిరిగి మనమతమున బ్రవేశపెట్టుటకు ప్రయత్నింపకపోగా–వారిని భిన్నకులములవారనియు, హీనులనియు, నీచులనియు జిత్రించి, యల్పదృష్టితోఁ జూడసాగిరి.

పృథ్వీరాజువంటి యోగ్యతములైన మహారాజులు హిందూధర్మ సంరక్షణార్థము కఠోరదీక్షనువహించినను, కట్టు దిట్టములతో కార్యములను కొనసాగించినను, జయచంద్రునివంటి దేశద్రోహులు, నీచాతినీచు లుండుటచే – హిందూ మత మహోద్యమము ముందునకు బాగుగ సాగలేకపోయినది. సత్ఫలితములను గడింపఁ జాలకపోయినది. పృథ్వీరాజు 1192 వ సంవత్సరమున షహబుద్దీన్ మహమ్మదుచే నోడింప

బడెను. ఇదియే మహమ్మదీయ పాలనమునకు నాంది. ఆర్య సంస్కృతిని, దేశభక్తిని వెన్నుపోటు బొడిచెడి నీచులు – ద్రోహులు చరిత్రలో సాటెవ్వరింపకున్నచో, మహమ్మదీయ ప్రభువుల యధికారదర్పము మనదేశమున బీభత్సమొనర్చుకొనఁ గ్లైడిది కాదేమో ! శోచనీయపరిస్థితు లుప్పతిల్లి, హృదయ విదారక స్త్రీ గౌరవభంగాదులు జరిగియుండెడివి గాదేమో ! గుంపులు గుంపులుగ హిందువులు మతభ్రష్టులయ్యెడివారు గారేమో! అది దురదృష్టమైన సమయము. హైందవసంస్కృతికి గ్రహణముపట్టిన కాలము. వైదికనాగరికత, గౌరవముభ్రష్టమై పోవుచున్న పాపిష్ఠివేళ. స్వదేశీయులే స్వజననీ గర్భనిర్భేదక వ్యాపారములను తృష్ణతో సాగించిన దుర్ముహూర్తము.

హైందవధర్మ సముద్ధరణ దీక్షాదక్షులెందరున్ననేమి ? జయచంద్రునివంటి ముష్కరుఁ డొక్కఁడుండినఁ జాలును. పథకములన్నియు తారుమారగును. హిందూసామ్రాజ్యగౌరవ ప్రాభవ వైభవ సౌధము బీటలువారి యూగిసలాడును.

మనలను సర్వభ్రష్టులను గావించిననూ మహమ్మదీయులకు తృప్తిగలుగలేదు. రాజ్యాధికార దావానలము చల్లార లేదు. వరుసవరుసగ క్రూర దండయాత్రలు సాగించుచు, మన దేశసంపదను కొల్లగొట్టసాగిరి. మన దేవాలయములను బ్రద్దలు గావించి, బంగారపు రాసులను భద్రగజములపై తమదేశము లకు తరలించుకొనిపోసాగిరి. మన గ్రంథాలయములను దగ్ధము గావించిరి. విద్యాలయములను ధ్వంసమొనర్చిరి. శిల్పసంపదను

శిథిలము చేసిరి. సంస్కృతిని సర్వనాశనముగావింప సమకట్టిరి. విశృంఖలముగ విలయతాండవము సలుపసాగిరి. మనసంస్కృతిని తిరస్కరించి, ఛిన్నభిన్నము గావించి వైచిరి. మన చరిత్రకు మచ్చలు వేసిరి. కాలక్రమమున మహమ్మదీయులలోఁ గూడ కొలఁదిమంది బుద్ధిమంతులైన ప్రభువు లధికారమునకు వచ్చిన పుడు, కొంత కల్లోలము వారింపబడినను - మొత్తముమీఁద, మహమ్మదీయుల పరిపాలనములో హిందువులు చిత్తశాంతిని గోల్పోయి, చావుబ్రతుకులమధ్య జీవించిరనుట తథ్యము.

అగ్బరుకాలమున కొంతమంది హిందువులు గౌరవ దృష్టితోఁ జూడబడిరి. అగ్బరు - హిందూ మహమ్మదీయ సమైక్యమునుగూర్చి, కొంతవరకు చతురతతో వ్యవహరించె నని చెప్పవచ్చును. పలువురు హిందూరాజులకు సముచిత స్థానముల నొసగి, సత్కరించెను. విశాలభారత సామ్రాజ్యాధిపత్యమును వహింప నభిలషించి, తదనుకూలపథకముల నెన్నింటినో సృజించి, యమలునకుఁ దెచ్చెను. భాషనుఁ గూడ సంస్కరించి కొన్ని పర్షియన్ పదములతో - సంస్కృతపదములతో - అరబిక్ పదములతో మిశ్రితమైన ఉర్దూభాష నొకదానిని ప్రత్యేకముగ గల్పించి, తద్ద్వారా - హిందూమహమ్మదీయ భావ సమ్మేళనమునకు యత్నించెను. ఇతడు గొప్ప పండితుఁడు - దేశభక్తుఁడుగూడ నగుటచే, మహమ్మదీయమత సహజమైన కఠోరవైఖరి యున్నను - మార్దవస్వభావముగూడ నగ్బరు వర్తనలో మనకు గన్పట్టును.

హిందూరాజులనందఱిని తన్ద్రందకు దెచ్చుకొనుటకై కృషిసల్పుటలో నీతఁడుగూడ నంతకుముందువచ్చిన మహమ్మదీయ రాజులకెవ్వరికిని దీసిపోలేదు. మాతృదేశారాధకుడైన రాణాప్రతాపునివంటి ప్రభువును తుదిక్షణమువఱకు నగ్నిపరీక్షలకు గురిగావించుచునేయుండెను. కాని రాణా – తన యాత్మగౌరవమునువిడనాడి, యక్బరునకు లొంగియుండఁజాలననియు, స్వలాభముకొఱకు దేశగౌరవమును మహమ్మదీయ ప్రభువుల పాదములచెంత తాకట్టు పెట్టననియు గట్టిగ సమాధానమిచ్చి, తనప్రతినను నెరవేర్చుకొన గల్గెను. ధీరోదాత్తముగ, పౌరుషవంతముగ, తన మానమును, మాతృదేశ గౌరవప్రతిష్ఠలను గట్టిగ నిలువబెట్టుకొనజాలెను.

మానసింహునివంటి హిందువులే కొందఱాయక్బరునకు బానిసలై పడియుండి, రాణాప్రతాపునివంటి వీరుని పరిహసించిరి. కాని, స్వాతంత్ర్య వాయువులు పీల్చుచు, రొట్టెలు భుజించుచు, స్వాతంత్ర్యదీక్షను నెగ్గించుకొనఁగలిగి, శిరము వంచక, జీవించినాఁడు – రాణాప్రతాపుఁడు. అట్టిహిందూవీరకిశోరములే దేశగౌరవలక్ష్మి కాభాజ్యతులు. మఱి పదిమంది రాణాప్రతాపులుండిన, మనదేశమాత – సకల గౌరవ సంపత్సమేతయై, సర్వవైభవసమేతయై ఉత్తమస్థాయిని వెలుగొందెడిదిగదా!

అక్బరు తరువాత హిందువులను కఠిన దండనలకు గురిగావించి, కాలకింకరునివలె కఠోర రాక్షస ప్రవృత్తితో

సంచరించిన యౌరంగజేబు – మనదేశ సౌభాగ్య వినాశము నకు మూలకారకుడై నిల్చినాఁడు. స్వాధికార ప్రమత్తచిత్త ప్రవృత్తితో – తల్లిదండ్రులను, సహోదరులను సైతము దారుణముగ పరిభవించి, హత్యగావించిన యా కిరాతుఁడు – మన సంస్కృతినెట్లు సహింపఁగలఁడు? మనమనఃప్రశాంతినెట్లు చెదరనీయక నిలుపగలఁడు? వాని కాలమొక మహాప్రమాద కరసమయము. హిందువులపైనతఁడు దారుణచర్యలనెన్నింటినో ప్రయోగించెను. జుట్టుపన్నువంటి దుష్టశాసనములనుగావించి, వానిని నిరంకుశముగ క్రూరముగ నమలుపరచుటకు గూడ వెనుకాడలేదు. మనసంస్కృతిని, మనసదాచార పరంపరలను భయంకరముగ జిత్రించి నిరసించెను వీనికాలమున మన దేశీయు లనుభవించినబాధలు వర్ణనాతీతములు. కాని, గత్యం తరమేమున్నది? నిష్కృతికి మార్గమేమి? ఏ పుణ్యపురుష మహోదయమో కావలయును. ఏ మహోజ్జ్వల కార్య దీక్షోపకుని యాత్మబలమో పెల్లుబుకవలెను. ఏ నిరుపమాన మేధానిధియో కొండంతయండగ నిలువవలెను. ఏమహాత్ముడో ప్రచుర ప్రబోధము గావింపవలెను మహోగ్రగ్రీష్మమున మలమలమాడిన లలితలతావితానములపై శీతలబిందుసందోహ ములు చిందఁబడునా? మందమందానిల మల్లనల్లన వీచునా? సుందరస్వరూపమున నాలతావితానము మఱలకళకళలాడునా? సురభిళ సుమపంక్తులను విరియించునా? తప్పక సర్వమట్లేజరిగి తీరవలయును. అది ప్రకృతి సహజము. ప్రకృతిశక్తులు నిత్య

పరిణామశీలములుగదా! కావుననే తిరిగి హైందవ సంస్కృతి వినూతన వికాస విశేషముతో నుద్దీపింపక తప్పదు. నైవేదిక ధర్మతత్వము పునరుత్తేజమునుపొంది, యెల్లదిక్కులు విభ్రాంతి నందునట్లు పునరుద్దీప్తముగాక తప్పదు. ఆపుణ్యక్షణమెప్పుడో నిరీక్షింపవలయును.

మహమ్మదీయుల యుద్ధతి క్రింద దేశము క్రూరముగ నణగద్రొక్కబడుచున్నను-మతాంతరీకరణ శక్తులు యథేచ్ఛా విహారము లొనర్చుచున్నను - హిమాలయోన్నత శిఖరసీమ పగిది మహోన్నతముగ పెరిగిన మన హైందవసంస్కృతి యొక్క పునాదులు మాత్రము పూర్తిగ శిథలము కాలేదు. పావనగంగాతరంగ భంగిమవలె, సర్వుల కాహ్లాదమును సంధిం చెడి మనవైదిక ధర్మస్రవంతి మాత్రము పూర్తిగ నింకలేదు. అటనట నాశాజ్యోతులు మెఱయుచునేయుండెను. దివ్యదీప్తులు తేజరిల్లుచునే యుండెను. ప్రాక్తనభవ్యసందేశమంజుల నినాదములు వినిపించుచునే యుండెను. పట్టుగొమ్మలుగనిల్చి, భారతీయ గౌరవప్రతిపత్తులను ప్రవిమలాధ్యాత్మికశక్తి సంపత్తులను పరిరక్షింప దక్షులైన మహనీయు లుదయించుచునే యుండిరి.

కబీరు (1440 – 1518)

కబీరు రామానందుని భక్తిప్రబోధనమునకు వశుడై ఆయనకు శిష్యుడాయెను. కబీరు ముస్లిముగ జన్మించినను, పెక్కువిషయములలో హిందూమత సిద్ధాంతముల నామో

దించెను. దేశమునందంతటను ఆధ్యాత్మికదృష్టిని, దివ్యత్వ
మును వ్యాప్తిగావించుటయే పరమధ్యేయముగ నిడుకొనెను.
పరస్పర ప్రేమతో మానవాళిమనుగడ గడపుటయే యేకైక
లక్ష్యము. హిందూమహమ్మదీయ మతముల సమన్వయించి,
వారి పరస్పర సహకార, సఖ్యతలకొఱకు కృషిని సాగించిన
పుణ్యాత్ముడు. ఈ మహాత్ముని కృషి యెంతయు కొనియాడ
దగినది.

గురునానక్ (1469 – 1538)

గురునానక్ పంజాబు ప్రాంతమున జన్మించిన హరి
భక్తుడు. శిక్కులకుగురువు. విశాలహృదయముతో మహా
జ్వలస్థాయిలో హిందూమహమ్మదీయ మతసమైక్యమునకుపాటు
బడిన మహాత్ముడు. నిరుపేద కుటుంబమునకు జెందినవాడు.
బాల్యమునుండియు భగవద్భక్తుడు. సాధుమూర్తి. సరలహృద
యుడు. విద్వేషములకు, విప్లవములకు, విలయములకు దూర
ముగనిల్చి, విశ్వమంగళమును ఘటింప పాటుబడిన మహా
నీయుడు. మాతృదేశగౌరవప్రతిష్ఠలు చిలిపికలతలవలన జీర్ణ
ములై, భారతీయ సంస్కృతిని సర్వనాశనము గావించెడి
దుస్థితిని తొలగించుటకే యీ మహానీయుడు దీక్షవహించెను.

కబీరు, నానక్కలిరువురును, భారతీయ సముద్ధరణా
ర్థము శ్రమించిన ధన్యజీవులు.

చరిత్రలో వీరిజతనము సంస్తవనీయమై సర్వదా వర్ధిల్ల
గలదు.

చైతన్యుడు (1485 – 1527)

తదుపరి – వంగరాష్ట్రమునందు నవద్వీపములో నవతరించిన చైతన్యస్వామి ప్రముఖస్థానము నలంకరించెను. ఈయన 1485 లో జన్మించెను. తనకుముందుగల మహనీయులు నడచిన బాటలలో నడచి సంస్కృతిని ధర్మమును సంరక్షింప దీక్ష బూనెను.

వైదవిశ్వాసములంతరించి, వైష్ణవ భక్తి సన్నగిల్లి, వేద ప్రమాణబుద్ధి పూర్తిగ లోపించిన యాతరుణమున నాధ్యాత్మిక మహిమలతో లోకమున వైదికవిశ్వాసమును రేకెత్తించిన పుణ్యమూర్తి చైతన్యస్వామి. కృష్ణభక్తి పారవశ్యమున వైష్ణవ సంప్రదాయ ధ్వజమును ప్రజలహృదయములలో రెపరెపలాడజేసిన మహాప్రవక్త. సాక్షాత్తుగ నా దివ్యుడు శ్రీకృష్ణుడేయని వంగరాష్ట్రవాసులు విశ్వసింపసాగిరి.

ఆయన తన మధురభక్తి ప్రబోధసుధలతో మతాంతరులగుచున్నవారినెల్ల హైందవమువంకకు మరల్పగల్గెను. మహమ్మదీయు లీనేలపై నడుగువెట్టి, దుశ్చర్యలాచరింప గడంగిన పిమ్మట నిట్టి మహాపరివర్తనకు నాందిగీతము లాలపింప సాహసించినవారే లేరయిరి. కావుననే, గుంపులు గుంపులుగ హైందవులు మహమ్మదీయుల క్రూరకృత్యములకు జంకి, గతిగానక, గడ్డములు పెంచి, నమాజుసల్పుటకు సంసిద్ధులయిరి. ఇట్టిపతనావస్థలోనున్న హైందవులందఱికిని శ్రీకృష్ణ చైతన్యస్వామి యాశాజ్యోతి యయ్యెను. తాను సన్యసించి, ప్రగాఢదీక్షతో

వైదిక ధర్మ్రస్రవంతి కడ్డుగనిల్చిన కట్టలనన్నింటిని పట్టుదలతో దొలిగింప గంగణము గట్టెను. మనవారిని మార్చుటొకగొప్ప కాదు. చైతన్య దివ్యసందేశ మధురగీతికల నాలకించిన పలు వురు మహమ్మదీయులుగూడ – గోపాలకృష్ణుని మురళీనినాద ముల నాలకించి పరవశతజెందిన గో గోపబాలబాలికలవలె నాడు చైతన్యుని గొలువసాగుట విచిత్రము.

చైతన్యుని భక్తులనందటిని, శిష్యులనందటిని దారుణ ముగపీడింప – మహమ్మదీయ పాశవికవికారశక్తి భీభత్సముగ వెల్లివిరిసెను. హిందువులనేకాక, మహమ్మదీయులను గూడ కృష్ణభక్తులనుగ మార్చుచున్న చైతన్యుని యుపదేశములను తమ యధికార సౌధపంక్తులపై వీచుచున్న పెనుగాలులనుగ వారు భావించిరి. ఎన్నియో కఠిన ప్రయోగములద్వారా చైతన్యుని యుద్యమమును నిరోధింప మహమ్మదీయులు యత్నించిరి. కాని, చైతన్యస్వామికొన్ని యపూర్వ దైవిక శక్తులను సాక్షాత్కరింపఁజేసి, తనశిష్యకోటిని, తన యను యాయవర్గమును మహమ్మదీయుల క్రూరచర్యల బారినుండి సంరక్షించుకొనుచు, హిందూధర్మ మజేయమైనదనియు – హిందువుల యాధ్యాత్మిక తపశ్శక్తులు మొక్కవోవవనియు నిరూపించినాఁడు.

సనాతన ధర్మ్రసుధను రుచిజూపినాడు. దేశమును ఛిన్నాభిన్నము గావించి, భారతీయ సంస్కృతిని పాడుచేయ, చుండుటకుతనమున మహమ్మదీయులు యత్నములు సాగించు

చున్న తరుణమున, రాజస్థానములో రాజపుత్రు లెందరో వీరోచితముగ మహమ్మదీయుల క్రూరదండయాత్రల నెదిర్చి ఖ్యాతిగాంచినవారెందరోగలరు. మన సంస్కృతిని సంరక్షించిన వారునుగలరు. కొందఱు స్త్రీలును ఆధ్యాత్మికతత్త్వరోచులతో భారతీయచరిత్రకు విలువగల వెలుగులను సంఘటింపజేసిరి.

మీరాబాయి (1500 – 1547)

అట్టివారిలో మీరాబాయి యగ్రేసరురాలు. ఈమె క్షాత్రమునకు వాసిగాంచిన రాజకుటుంబమున జననమందినది. దర్పమును తృణప్రాయముగ త్యజించిన, రాజమందిరభోగ ములకు స్వస్తిపలికిన సరలసాధుయోగిని మీరాబాయి.

భగవచ్చింతనమున మునిగి, నిత్యానందినిగ వెలుగొం దిన పవిత్ర నారీమతల్లి. వీణపై గోవిందుని గీర్తించుచు కృష్ణ భక్తిపారవశ్యమునమునిగినదివ్యసాధ్వి.మీరాబాయిదిమధుర భక్తి. ఆమె హృదయము మధురము. ఆమెపలుకు మధురము. ఆమె వైఖరి మధురము. తన జీవితసర్వస్వమును శ్రీకృష్ణపద చింతనలో మధురమధురముగ గడపగల్గిన కాంతారత్నము. ఆమెగళమెత్తి కృష్ణునిపై మధుర గీతముల నాలపించుతఱి, యెల్లరామెకు వశులై వివశులయ్యెడివారట.

ఆమెకు కృష్ణదేవుని యనుగ్రహ బలమున మధుర కవితాహృదయమబ్బినది. ఆమెవ్రాసినపాటలన్నియు భక్తిరస

మునకు గోటలు. తేనెల తేటలు. ముక్తికిబాటలు. పలువురామె నింటినుండి బయటి కరుగనీయక, క్షత్రియకాంతల గౌరవ సంప్రదాయములను గాపాడుమనికోరిరి. భర్తయు స్వేచ్ఛగ సంచరించుట కనుమతింపక శీలమును శంకించుటకే సిద్ధపడెను. కాని, ఎవ్వరినెట్లు తృప్తిపరచెడిదో! ఏమో! శ్రీకృష్ణదేవ సందర్శనమునకుగాని, శ్రీకృష్ణనామ సంస్మరణమునకుగాని యంతరాయమును గలుగనిచ్చెడిదికాదు. ఒకపరి యామె బృందావనమునకేగి, మహాభక్తుడైన రూపగోస్వామిని దర్శింప నభ్యర్థన సలుపగా, స్త్రీలకిట ప్రవేశములేదని యాస్వామి నిరాకరించిరట! దానితో భ్రాంతయై చిరునగవున 'పాపము! స్వామిఇప్పటికిని యాధ్యాత్మిక రంగమున ప్రాథమికదశయందే యున్నారే! పురుషోత్తముడైన శ్రీకృష్ణ భగవానుడొక్కడు తప్ప, యీలోకమున పురుషులెవ్వరున్నార'ని మరల సమాధానమునంపెనట. దానితో స్వామి కనులుదెఱచి, మీరాబాయిని దర్శించి, పలుతెఱగుల నభినందించెనట. కృష్ణభక్తి తత్పోపాసనములలో నామెయెదురొక్కన్న క్లిష్టసమస్యలెన్నియోకలవు. విషప్రయోగమున నామెను చంపుటకే యొకమారు యత్నము జరిగినది. కాని, శ్రీకృష్ణానుగ్రహమున నామెకావిష మమృతముగనేమారెను. ఇట్టిసంకటములనెన్నింటినో యామె యవలీలగ నధిగమించి, పుటముబెట్టిన పదునారువన్నె బంగారమువలె, రాజస్థానమును దివ్యతేజముతో తళతళలాడించెను.

తులసీదాసు (1532 - 1623)

వారణాసిప్రాంతమున కొందరు మహాభక్తులు ధర్మ సముద్ధరణ దీక్షువహించి, భక్తి తత్వ్వప్రచారమునకు బూను కొనిరి. వారివలన మనసంస్కృతికి సముచితమైన యుపకారమే జరిగినది. వారి సత్కృషియు స్తోత్ర పాత్రమే! వారిలో ప్రత్యేకించి యభినందింపదగినధన్యుడు మహాకవి తులసీదాసు.

తులసీదాసు కడు పేదకుటుంబమున జన్మించెను. బాల్యమునుండియు జ్ఞాన సంపత్తిని బెంపొందించుకొన నేర్చిన యోగ్యుడు. చదివినదికొలదియే! కాని, తులసీదాసులోయీవ నకాలమున మహాభక్తి సమావిర్భవించుట విచిత్రము. ఆదృష్ట వశమున తులసీదాసునకు మహాలావణ్యవతియైనభార్య లభించి నది. ఆమె సౌందర్య దిదృక్షలో తులసీదాసు లోకమునే మర చెడివాడు. ప్రపంచమునే ముంచివైచునంత కుంభవృష్టికతన ప్రళయ రూపమున వెల్లువలువచ్చినవేళ, తులసీదాసు పుట్టిం టగల భార్య కొఱకు పరుగులుదీయ సాహసించినాడు. తలుపులుమూసియున్నవి. వర్షధ్వనిలో తనగొంతు గృహమున గలవారికి వినిపింపలేదు. తులసీదాసు విలంబనమును సహింప లేనివాడై గోడపైప్రేలాడుచున్న త్రాడు నాధారముగగొని లోనికిదిగినాడు. తానుచేతపట్టినది మహాసర్పమనియు, చలికి సగము చచ్చియున్న యాపన్నగము తనపిడికిలిపట్టులో నూపి రాడక చచ్చినదనియు, దానిరక్తమే తనహస్తముల కరుణ వర్ణమును బులిమినదనియు, తులసీదాసు గోడకవ్వలివైపున

దిగినపిమ్మట మెఱుపు కాంతిలోగాని గుర్తింపలేకపోయినాడు. తనసాహసమునకు తానేనవ్వుకొనినాడు. లోపలికేగి, తనసతితో కథనంతయు బూసగ్రుచ్చినట్లు వివరించి చెప్పినాడు.

ఆమె చిరునవ్వు నవ్వినది. అందెంతయో నిర్లక్ష్య భావము తులసికి గొట్టవచ్చినట్లు గోచరించెను. ఆమెకన్నులలో తనయవివేకతను పరిహసించుచున్న రీతి నేదియో సూచితమగు చున్నది! 'హృదయేశ్వరా! ఈ మహాప్రళయ సమయమున నాపట్లమీరుచూపగలిగినమమత జగదీశ్వరునిపట్ల జూపజాల కైతిరిగదా! యని వగచుచున్నాను. హేయము, నశ్వరము నగు శారీరక సౌందర్యానుభూతి యెడగల మోజు, పరమ పావనము, సనాతనము, శాశ్వతమునగు పరమేశ్వరదివ్య పాద పద్మ సౌందర్యారాధన విషయమున మీరు వ్యక్తీకరింపగలిగి నచో కృతార్థులయ్యెడివారు. నేనును ధన్యనయ్యెడిదానను. నిశ్చలదృష్టి నిలుపవలసినది సర్వేశ్వరుని చరణ కమలముల యందే కాని సతీ వదన సరోజమునందు కాదని మీరింకను గుర్తింపజాలక పోయితిరేయని నేను వగచుచున్నాను. శాశ్వతా నందప్రదమైనభగవదారాధన మనకు చరమలక్ష్యముగావలెను. శారీరక సౌందర్యార్చన యొక్కటే ధ్యేయ మనుకొనెడి భావనలో నున్నంతకాలము మనము పరమార్థమునెట్లు సాధింప గలము!' అని యామెపలికెను. పిడుగులవంటి సతి వాక్కులతో తులసి నిర్విణ్ణుడైనాడు. నిలువున కంపించిపోయినాడు. మనస్సు సాంతముగ మార్పునకు గుఱియైనది. భ్రాంతిపటాపంచలైనది.

అంధకారబంధురమగనున్నజీవితమున తానింతవరకు వ్యాకుల చిత్తమున జరించితిననియు, దివ్యకాంతికొరకిక యన్వేషణ ప్రారంభింపవలెననియు నిర్ణయించుకొనినాడు. కనులదెఱపించిన కాంతయెడ గౌరవప్రతిపత్తులేర్పడినవి. కాముకదృష్టి యంతరించినది. శాంతిని సాధించి, జగన్నాథుని యనుగ్రహమును సముపార్జించు నిమిత్తము మరుక్షణమునసే దీక్ష గైకొనినాడు. రమాకాముడు రామభక్తుడైనాడు. నాటినుండి యాయన యొక మహాయోగి. తొలుత కాముకుడై మిసమిసలాడు యౌవనమున మోక్షకాముడుగ మారుటకెంతటి సమపదేశ బలము గావలెనో యోచింపుడు! అట్టి మహత్తర పరివర్తన మాకస్మికముగ వచ్చుటకు హేతుభూతమైన యా సతీతిలక మెంతటి సుకృతాత్మయో!

అన్నియు నట్లు కలసివచ్చినవి. వారణాసిపురవీథులలో భగవన్నామ సంకీర్తన గావించుకొనుచు పారవశ్యమున భక్తి తత్త్వమును ప్రచారమొనర్చెడి సాధుపుంగవుడైనాడు తులసీదాసు. దేవాలయమున జరిగెడి పురాణకాలక్షేపమున కేగుచు ముందు గూర్చుండెడి యొక వృద్ధుని హనుమదవతారముగ గుర్తించి, యొకనాడేకాంతమునందా మహనీయుని పాదము లపై వ్రాలి 'శ్రీరామప్రభువును నాకు జూపింపవా!' యని దీనాతిదీనముగ వేడుకొనెను. ఆ వ్యక్తి వివరములజోలికేగక 'చిత్రకూటమున కేగుము. శ్రీరాముని దర్శింపగలవు' అని మాత్రమే చెప్పి ముందునకేగినాడు.

తులసీదాసువెంటనేచిత్రకూటమునకేగి, గాఢభక్తితో శ్రీరాముని ధ్యానించుచు, సుకృతవిశేషమున చర్మచక్షువులతో శ్రీరామదివ్యలావణ్యవైభవమును దిలకింప గల్గినాడు. తులసీదాసు జీవితము దీనితో మరిరొకమంచి మలుపునకు దిరిగినది. సరస్వతీకృపప్రాప్తించినది. హిందీభాషలో మధురాతి మధుర శైలితో 'రామచరితమానస' యనుపేర రామాయణ గాథ వ్రాయ నుద్యమించినాడు.

పరమేశ్వరుని చిద్విలాసము లగణ్యములు. దైవికశక్తి పరిగణన కందనిది. అసాధ్యములను సుసాధములు గావించెడి మహిమ భగవచ్ఛక్తికి మాత్రమే కలదు. కావుననే–

మూకం కరోతి వాచాలం
పంగుం లంఘయతే గిరిమ్!
యత్కృపాతమహం వన్దే
పరమానంద మాధవమ్!!

అనెడు స్తుతి వచ్చినది.

కవితా సౌందర్యమునకు పరిధిగ, భక్తితత్త్వమునకు ప్రబల కేంద్రముగ, సంకీర్తనకు సౌందర్యనిధిగ 'రామచరిత మానస' సృష్టియైనది తులసీదాసు మహాభక్తుడేకాక మహా కవిగూడనైనాడు. ఉత్తరభారతమునగల మహాపండితులేకాక, జానపదులుసైతము, మహానురక్తితో, పరమభక్తితో, తులసీదాసమహాకవియందించిన రామాయణ కావ్యామృతపానమున బ్రహ్మానందభరితులయిరి. కాలక్రమమున నది పలుభాషలలో పరివర్తితమై సాటిలేని మేటికీర్తినందినది.

ఈ విధముగ తులసీదాసు మనదేశ ధర్మోద్ధరణకు తన సేవలనంకితము గావించి చరితార్థుడైనాడు.

సూరదాసు (1544 – 1603)

ఉత్తరభారతమున దివ్యజీవితమునుగడపి, సంస్కృతిని సముద్ధరింప సముచిత కృషిసాగించి, చరిత్రకెక్కిన పూజనీయులెందరోయున్నారు. వీరందరొకయెత్తు. సూరదాసొక్కడే యొకయెత్తు. సర్వావయపుష్టికలవారు సంకల్పించిన యుద్యమములు సఫలములగుట వింతగాదు. శారీరకముగ తీరనిలోపము లకు గుటిలైన వారొక లక్ష్యమును సాధించుటయే గొప్ప.

'సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్'

అని యొక సామెత గలదుగదా! ప్రధానేంద్రియము లనదగిన నేత్రములు పుట్టుకనుండియు లేని దురదృష్టవంతుడు సూరదాసు. 'పాపపంకిలమయిన లోకమునుగాంచవలసిన యవసరమేలేద'ని యీ పుణ్యాత్మునకు బాహ్యదృష్టిని దొలగించి, యంతర్దృష్టిని భగవంతుడే ప్రసాదించెనేమో!

బాల్యమునుండియు దేవదేవుని చరణ సేవకుడై, దివ్య భక్తితత్వమున దేలియాడుచు మధురగీతములనల్లి కృష్ణపరమాత్మ్నని గీర్తించిన పరమభక్తుడు సూరదాసు.

ఈయన సహజకవి. తన కవితకు కృష్ణ సంకీర్తనమే కలిమిని, బలిమిని గలిగింపగలదని విశ్వసించినవాడు. కలకంఠమున తన గీతముల తానేయాలపించి, యెల్లరిని దన్మయులగావిం

చెడివాడు. రామభక్తుడైన తులసీదాసువలె, కృష్ణభక్తుడైన సూరదాసుగూడ, భారతీయుల యాధ్యాత్మిక రంగమునకు ప్రముఖసేవగావించి, తరించిన భక్తశిఖామణి.

పావనచరితులు, పరమభాగవతులు, పవిత్రహృదయులు, మహాకవులు ఆంధ్రప్రాంతమునను జన్మింపకపోలేదు. మధురాతి మధురములును, భక్తిభావములతో పరవశులనుగావించు పాటలను రచియించి, సుశ్రావ్యముగ గానమొనర్చిన సంగీత సార్వభౌములును గలరు.

పోతరాజు

మహా కవులెందరో పద్యనైదవ దశాబ్దమున తమ గ్రంథ సంపదతో కనకాభిషేకములను, గజారోహణాది ఘనగౌరవములను సమార్జించుచుండ – కేవలము కర్షకజీవితము మీదనే యాధారపడి నిర్మమతతో నిశ్చలముగ, నిరాడంబరముగ జీవితమును సాగించిన భక్తకవి బమ్మెర పోతరాజు.

భగవద్దత్తమైన కవితాశక్తిని భగవద్గుణగణ గానమునకే వ్యయపరచ వలెననియు – కూటి కొఱకై కాంచనమున కాశించి కవితా సరస్వతిని విక్రయించుట తగదని కఠోర నియమమును బెట్టుకొని, కడవరకు దానిని నిర్వహించి, నెగ్గిన ధన్యుడు పోతన. శ్రీరాముని యనుజ్ఞతో శ్రీరాముని కృపా బలమున తాను భాగవతమును రచింపగలిగితిననియు, నిందు తన ప్రజ్ఞ లవలేశమేనియు లేదనియు వినీతుడై వివరింపజాలిన వినయవిధేయభావ సంపన్నుడు పోతరాజు.

భూపతిని నిరాకరించి, వ్యతిరేకించి శ్రీపతికే తన గ్రంథము నంకితమిచ్చిన ధీశాలి.

ఈయన ధరణీధవులకుగాక ధరణిజాధవునకుమాత్రమే తలవంచినాడు. కోటి యాటంకములడ్డుపడినను – సీతారామ చంద్రునకు (దాశరథికి) తనకృతినంకితమొనయజాలిన దివ్యతపస్వి. కావ్యనే యామహనీయునినామ మాంధ్రసారస్వతాకాశమున కలకాలము స్మరింపబడు చున్నది. భవ్య భక్త్యావేశముతో నా మహనీయుడు రచించిన భాగవతము తెలుగువారి సుకృత ఫలము.

ప్రహ్లాద గజేంద్రాంబరీష కుచేలాది పరమభాగవతుల దివ్యగాథలలో భగవన్మహిమలను మధురాతి మధురముగ వివరించి భారతీయుల పవిత్ర తపోబలమును ప్రత్యక్షీకరింప జాలిన కవికులతిలకుడు పోతరాజు.

ఈయన యాత్మశక్తిముందు సర్వజ్ఞసింగ భూపాలుని చక్రవర్తిత్వాధికారము – శ్రీనాథుని కవిసార్వభౌమాధికారము – తలలువంచి మ్రొక్కవలసివచ్చెను.

నిరుపమాన నిశ్చలభక్తికిప్రతీకగ కావ్యమాధుర్యులను మలచి – సర్వప్రజావళికి పంచిపెట్టి (పదునైదవ శతాబ్దమున) యాధ్యాత్మిక దివ్యజ్యోతి కళకళలాడునట్లు గావించిన కవి చూడామణి పోతన.

ఒకనాడు రాకాసుధాకరుడు, గగనభాగమున వెండి వెన్నెలలను వెలయించుచుండ సుస్నాతుడై గోదావరీతటమున స్రాంజలియై పోతన నిలిచియుండ – మెఱుపు చెంగటనున్న మేఘుంబు కైవడి సీత చెంగటనుండ చెలగువాడును – బలువిల్లు మూపున బరగువాడును నగు నీలమేఘశ్యాముడైన రాముడు సాక్షాత్కరించినాడు. అయన యదృష్టమట్టిది. ఆధ్యాత్మిక శక్తికి నికషోపలముగ నిలిచిన యిట్టి మహనీయు లెందరో యీ మహాంధ్రమునందార్ష సంస్కృతిని సర్వదా జ్వలింప జేయుచు సాక్షాత్కరించుచునే యుండిరి.

గోపరాజు

ఈ కాలమున గణనీయమైన యొక వ్యక్తి తన బృహత్కృషి ప్రభావమున తెలుగునాట – మహాంధ్రమున రామనామమును వ్యాప్తిగావించి చిరస్మరణీయుడైనాడు.

పలుమలుపులు తిరిగిన యీ మహాత్ముని జీవితము సాధకుల కాదర్శపథమును జూపజాలినది. ఆధ్యాత్మిక తత్త్వ వైభవమునకు మహోన్నత సాక్ష్యముగ వెలుగొందినది.

మతవైషమ్యముల కతీతమగు స్థాయిలో హైందవధర్మ దీపికలను వెలయించినది. ప్రశాంత ప్రవిమల భావనాబలము గల భక్తకోటికి పరమేశ్వరుడు నిత్యసన్నిహితుడుగ నిలిచియుండుననెడి నిజమును నిస్సందేహముగ నిర్వచించినది.

నెలకొండపల్లెలో జన్మించి పాల్వంచ తాలూకాకు తహసీల్దారుగ నియమింపబడి పావన గోదావరీ నదీతీరమున సీతారామచంద్రులకు సుందరమందిరములను నిర్మింప సర్వస్వ మును నిర్భయముగ ధారవోయసాహసించిన యీ ధన్యుని జీవితగాథ తెలుగునాట నొక ప్రత్యేకస్థానమును గడించుకొని మనగల్గినది.

ఆ సందర్భమున నా పుణ్యాత్ముడు కడుంగడుకష్టముల నెదుర్కొనవలసివచ్చినది. కారాగారమును జేరవలసివచ్చినది. కఠినశిక్షలననుభవింపవలసి వచ్చినది. కాని స్థిరచిత్తుడగు కత మున-దృఢదీక్షితుడగుటవలన - గాఢభక్తియుక్తుడై యుండుట చేత శ్రీరామప్రభువు స్వయముగ నా భక్తునకు దర్శనమీయ వలసి వచ్చినది. నిజమైన రామదాసుగ నాటినుండి యీ మహా నీయుని నామము లోకమున శాశ్వతత్వము నందుకొనజాలెను.

ఒకనాటి కంచర్ల గోపన్నయే యీ రామదాసు. తెలుగుగడ్డపై సీతారామలక్ష్మణుల చర్మచక్షువులతో దిలకింప గల్గెడి భాగ్యము తానీపా ప్రభువునకు గలుగజేసిన పుణ్యా త్ముడీయన.

దాశరథీ కరుణాపయోనిధీ! యని గోపన్న పిలిచిన పిలుపునకు రామదేవుడు సంతృప్తమనస్కుడై సాక్షాత్కరించి సంరక్షణబాధ్యత వహించినాడు.

మన యాధ్యాత్మికచరిత్రలో నిదియొక గణనీయమైన ఘట్టము. గోపన్న రచించిన దాశరథీశతకము పసిడి తునకల వంటి పద్యములతో మిసమిసలాడుచు-చెలికుగడవలె ప్రతిపద

మున సుధలజిలుకుచుండును. ఈయన పేర వ్యాప్తియందున్న పాటలు భక్తిరసభరితములై యాంధ్రుల జిహ్వాగ్రములయందు సర్వదా నర్తించుచుండెను.

త్యాగరాజు

క్రమముగ ధర్మము లోపించి నాస్తికత ప్రబలి యిహలోక భోగములకే ప్రాధాన్యమీయబడుచున్న యీ కాలమున సర్వజనుల మానసములపై సంగీతబలమున సర్వేశ్వర సంకీర్తనాసక్తిని వర్షింప సముచిత కృషిసాగించిన పూజ్యుడు త్యాగరాజు.

ఈయన నిరుపేదకుటుంబమున పుట్టినను – దుర్గుణ సంయుతుడైన సోదరుని ప్రోత్సాహమునకు గట్టుపడక శ్రీరామచంద్రునారాధించి – తరించి పలువుర తరించుటకు బాటజూపిన పరమభక్తశిఖామణి.

నారదమహర్షి యనుగ్రహ బలమున గణనీయమైన సంగీత పాండిత్యము నందుకొని జగత్ప్రసిద్ధములైన వేలకొలది కృతులను శ్రీరాముని గూర్చి పాడి – యాడి చరితార్థుడైన వాగ్గేయకారుడు.

భక్తులకు కష్టములు సర్వదా యభిముఖములుగనే యుండును. వానిని నింపుగుండెతో నిబ్బరముగ నెదిరించుటకు ధైర్యసాహసములను సుసాధనములయవసరమును గలిగియుండవలెను.

రాజాస్థానములలో గానసభలు గావింపుమని వచ్చిన యాహ్వానములను దృణప్రాయముగ విసర్జించి శ్రీరామ భూపాలుని కొలువునందే తన వాజ్మాధుర్యమునకు సార్థకతను సాధించుకొనజాలుట - నాటి సంఘమున కొక సాహసాత్మక వ్యవహారముగనే పరిగణింపబడెను.

బలవంతుడైన రాజుతో-సంకుచితభావుడైన సహృదరునితో కావలెనని సంబంధములను దెగద్రెంచుకొని దాశరథినినమ్మి జీవయాత్ర కొనసాగింపబూనిన పుణ్యశాలి త్యాగరాజు.

కోట్లకొలది రామనామమును జపించి, వేలకొలది రామాంకిత కృతులనురచించి, భక్తలోకమున-సారస్వత లోకమున ప్రసిద్ధమైన యశము నార్జించిన పరమపావనుడు త్యాగరాజు.

ఆంధ్రభాష గానమున కెట్లన్నివిధముల దగియుండునో దివ్యవేదాంత భావనలనిండెట్లందముగ నిర్వచింప వచ్చునో త్యాగరాజు కృతులు సోదాహరణముగ వివరించినవి.

మలయమారుతమువలె దేశమునలుమూలల తీవ్ర వేగమున ప్రసారములై భక్తుల మనోమందిరములనే నిజ నివాస సీమలుగ త్యాగరాజు కృతులు మార్చుకొన గల్గినవి.

కర్ణాటక సంగీత ప్రియులెల్లరు-భాషాంతరులగు దాక్షిణాత్యులు గూడ నీ కృతుల నాటికిని - నేటికిని రక్తితో

భక్తితో నాలాపించుచున్నారు. ఇకముందును నాలపింతురు. రామనామమహిమ లోకమునందద్భుతముగ వ్యాపింపజేసిన వారిలో త్యాగరాజు స్థానము ప్రత్యేకముగ గణనీయము. ఆయన కృతులబలమున–వానియందుగల సంగీత మంజులనాద విశేషముల బలమున నాధ్యాత్మికదృష్టి సామాజికులలోనాడు పెల్లుబికెడి సదవకాశ మేర్పడెననుట నిర్వివాద విషయము.

కవయిత్రి మొల్ల

ఈమె మహాభక్తురాలు. అగ్రవర్ణులమని చెప్పుకొను అల్పబుద్ధులగు బ్రాహ్మణులు కొంద ఱీమెను నీచురాలుగ భావించి, యీమెకు దేవాలయ ప్రవేశమును నిరాకరించిరి. హీనురాలుగ భావించి, బహిష్కరించిరి. కాని, యిట్టివారి బెదరింపులకు – క్రూరచర్యలకు నీమెలొంగక, పరమార్థమును సాధించి భగవంతుని ప్రత్యక్షమొనర్చుకొన్న భక్తురాలు. మరియు మధురాతి మధురముగ – పండితపామరుల నుత్సాహానందము లలో ముంచివైచు రీతిని – రామాయణ మహాకావ్యమును రచించిన కవయిత్రి. ఇట్లు యీ పావన నారీతిలకము– మహా కవిచూడామణిగ ప్రఖ్యాతిని గాంచెను. ఇట్లే – తరిగొండ వెంకమాంబాది భక్తురాండ్రిందరో ఆంధ్రదేశమున జన్మించి – ప్రజలను తనియింపజేసిరి.

నారాయణ గురువు కేరళ ప్రాంతమున జన్మించెను. సన్యానమును స్వీకరించి త్యాగమూర్తిగ ప్రజలకు తనసేవల

నందించెను. ముఖ్యముగ అగ్రవర్ణముల దురహంకార ఫలిత ముగ వెలివేయబడి అంటరానివారుగ నిరాదరింపబడుచున్న దీనులను, పేదలను ఉద్ధరించుటకు నిరంతరకృషిని బహాటముగ సాగించెను. హిందూమతములో వీరిని ఆత్మగౌరవముగలవారినిగ వర్ధిల్లజేసెను. వారికి వేదధర్మములను ప్రబోధించెను. ఎల్లర సమ దృష్టితోగాంచి ఏకత్వమును సాధించెను.

బసవేశ్వరుడు

బసవేశ్వరుడు వీరశైవమును స్థాపించెను. కుటిల కుల తత్వములను రూపుమాపెను. బ్రాహ్మణ ఔన్నత్యమును నిరాకరించి, సర్వ వర్ణములవారిని లింగాయత మతమునందు జేర్చుకొనెను. యజ్ఞములందు జంతుబలులను నిరాకరించెను. సర్వవర్ణములవారును దేవుని అర్చించుటకు సమానార్హులే యని ప్రబోధించెను. శివుడేయే కైక దైవమని ప్రచార మొనర్చెను. వీరశైవ మతస్థులందరును శాకాహారులు. శివుడే బసవేశ్వరుడుగ నవతరించెనని వీరి విశ్వాసము.

ఈ విధముగ సమగ్ర పరిశీలన మొనర్చిచో - మొత్తముమీద, మహమ్మదీయుల మతోద్ధతివలన దేశ మందు ధర్మచ్యుతి జరిగినను, సకాలములో నాపుకొనిన మహా నీయుల సంస్కారదృష్టికతన దేశము సంరక్షింపఁ బడుచు వచ్చినదనియే వ్యక్తమగును. కులమతవైషమ్యము లడంగినవి. అంటరానితనము విస్మృతిపథమునఁబడిపోయినది. స్వమతాభి

మాన వాతూలము వీవసాగినది. స్వధర్మపరత హెచ్చినది. స్వ సంస్కృతీ ప్రియత్వముతో జనులు వ్యవహరింపసాగిరి. సర్వేశ్వరశక్తిని సర్వులు కేంద్రీకరించుచు, సాధుభావములు సంతరించుకొనగల్గిరి. దేశము కల్లోల పరిస్థితులలోనున్నతఱి–సాంస్కృతికముగ నాధ్యాత్మికశక్తి నార్జించిన సాధుపుంగవుల సంపూర్ణ సత్కృషిప్రభావమే యీ పరిణామమని చెప్పకతప్పదు.

సాంస్కృతిక రంగమున, నాధ్యాత్మిక రంగమున దేశ పునరుద్ధరణ కొఱకు – ధర్మసంరక్షణ కొఱకు మహనీయులైన యాత్మశక్తి సంపన్నులిట్లొకవంక కృషి సలుపుచుండ, మఱొకవంక రాజకీయముగ దేశమును గౌరవస్థాయిలో నుంచుటకై దేశ స్వాతంత్ర్యమును సంపాదించుటకై – దేశ ప్రగతిని పెంపొందించుటకై కొందఱు ధీరోదాత్తులైన మహావీరులు తీవ్ర యత్నములు సాగింప దొడగిరి.

శివాజీ (1627 – 1680)

ఔరంగజేబు కాలమున హిందూసంస్కృతిని స్వాతంత్ర్యమును సంరక్షింపబూనిన వారిలో మహారాష్ట్రవీరుఁడు ఛత్రపతి శివాజీ ప్రముఖుఁడు. హైందవసంస్కృతీపరాయణుఁడు. భవానీ చరణసేవాపరతంత్రుఁడు. అగ్నిజ్వాలాసమశీల సంపన్నుఁడు. పర్వతోపమాన దివ్యాత్మాభిమాన నిరంతర సంరక్షణ దీక్షా ధురంధరుఁడు. బాల్యమునుండియే మహమ్మదీయుల పేరెత్తిన నీయన కొడలు మండుచుండెడిది.

తప్పనిసరియై, తండ్రి మహమ్మదీయులకు తలవంచి యుండుటగని, పసితనమున నున్నప్పుడే రుసరుసలాడిన దేశ భక్తుడితడు. జనకుని వెంట నొకపరి మహమ్మదీయ ప్రభు వుల సభకరిగియు – తలవంచి ముమ్మారు క్రొక్కెడి పరమ హేయమైన విధానమును బాటింపక. నిస్తులమైన స్వచ్ఛంద గౌరవమును గాపాడుకొనిన ధీశాలి, సాహసి, చతురుడు.

తల్లి జిజియాబాయి సుశిక్షణలో దినదినప్రవర్ధమా నుడై, మహమ్మదీయ సామ్రాజ్య సర్వస్వవిచ్ఛిత్తికి, మహా రాష్ట్ర భానూదయఫలమునకు నిద్రాహారములుమాని, నిరంత రము పరిశ్రమించిన గట్టిజెట్టి. ఈ వీరుని యాధిపత్యమునకు దట్టుకొనలేక, మహమ్మదీయ ప్రభువులు కకావికలైరి. ఈ శూరుని కొండయెలుక యనుపేర బిలుచుచు, శత్రువు లవహేళన సల్పిరి. కుట్రలతో – కుయుక్తులతో – మాయలతో పలు మారులు శివాజీని జయింపయత్నించి, మహమ్మదీయ ప్రభు వులు పరాజితులైపోయిరి. వారి పన్నుగడలన్నియు శివాజీ శేముషిముందు ఛిన్నాభిన్నములగుచుండెడివి.

హైందవసంస్కృతిని మూర్తీభవింపఁ జేసెడి దివ్య గంభీరాకృతితో – శ్వేతాశ్వము నధిరోహించి, సుదీర్ఘకరవాల మును గటిబద్ధమొనర్చి, నుదుట గుంకుమబొట్టు తరుణారుణ కాంతుల బొరలించుచుండ నరుగుదెంచెడి శివాజీ మహారాజు స్వరూపమును గన్నమాత్రమునననే శత్రులోకము గడగడ లాడె

డిది. ఆతని సింహగర్జన విన్నమాత్రమునచే, మహమ్మదీయ చమూసమూహాముల గుండెలవియుచుండెడివి.

శివాజీ ప్రూర్తిగ వైదిక ధర్మపరాయణుఁడు. సద్గురువును సంపాదించుకొనఁగల్గు టాయన యదృష్టము. తపోబల సంపన్నుఁడైన మహర్షి చంద్రుఁడు సమర్థ రామదాసస్వామి. (1608_1682) ఆ రామదాసస్వామియే శివాజీధార్మిక వీరజీవి తమునకు విలువలను బెంచిన పుణ్యాత్ముఁడు. ఆయన చలువ_ శివాజీప్రభువునకు శ్రీరామరక్షగ నుపకరించెను. మహా మునీంద్రుల యాజ్ఞల నౌదలవహించి, రాజ్యపాలన గావించుట మన ప్రాచీన ప్రభువరేణ్యుల పద్ధతి. ఇదియే వారి సత్సంప్ర దాయము. ఈ ధర్మమును శివాజీ యక్షరాక్షరముగ నమలు జరిపినాఁడు. మహారాష్ట్ర సామ్రాజ్యము నిత్యనూతన వికాస ముతో వర్ధిల్లుటకు సమర్థరామదాసస్వామివారి శుభాశీర్వాద బలమే నేపథ్యమునఁ గొండంత యండగ నిల్చినది. శివాజీ కలలు ఫలించుటకు, ఛత్రపతిబిరుద మాయనకు సిద్ధించుటకు, దేశము స్వాతంత్ర్యభావబల ప్రపూర్ణమగుటకు, మతేతరుల యాగడము లడగుటకు సమర్థ రామదాసస్వామివారి మహోపదేశములే యమృతవర్షధారలవలె నుపకరించిన వనుట సత్యము.

ఋషి సంకల్పబలమున నిర్వహింపఁబడిన రాజ్యాంగ ముల భద్రతకు లోటేమియుండును? రామదాసస్వామి మహా త్తరశక్తులకు కాణాచియైన మహర్షి. మహాప్రవక్త. మహో

ద్దండ పండితుఁడు. మహారాష్ట్ర భాషయందానందరామాయణ మువంటి మహోజ్జ్వల మధుర కావ్యఫలమును పండించిన దివ్యాధ్యాత్మిక సాహిత్యవ్యవసాయ దీక్షితుఁడు. కావునన్నే, మహారాష్ట్రమున స్వాతంత్ర్య సస్యములు కొల్లగ సముత్పత్తి యగుటకు – శివాజీతోబాటుగ – నిజమున కంతకన్నమిన్నగ కారకులెవరేని యుండిరన్న, వ్రేలుమడచి లెక్కింపదగిన పూజ్యుఁడాయనయే. ఆ పవిత్రసన్న్యాసియే.

మహారాష్ట్రమున మనదేశ గౌరవమిట్లు రక్షింప బడు చుండ – మనదేశ స్వాతంత్ర్యమిట్లు పెంపొందింపఁబడుచుండ– మన వైదిక ధర్మజ్యోతి యిట్లు దేదీప్యమాన మొనర్పఁబడు చుండ మహమ్మదీయమత ప్రాబల్యము క్రమక్రమముగక్షీణింప సాగెను. ఇట్లుండ, నుత్తరభారతమును కబళించి, దాహము చల్లారక, కోరలుసాచి, దురాశతో మహమ్మదీయ కాల వ్యాళము దక్షిణభారతముపై పడగవిప్పెను.

దక్షిణభారతమునగూడ మహమ్మదీయుల దండయాత్రల నీడలు పడని తెఱగున, పౌరుషజ్యోతులై కాకతీయ ప్రభువులు కాపాడిన ఘట్టములు చరిత్రకు గర్వకారణములు. ఏకశిలా నగరమును రాజధానిగజేసికొని ప్రజానురంజకముగ పాలన సాగించిన ప్రభువతంసుడు గణపతిదేవచక్రవర్తి.

ఈయన గొప్ప శివభక్తుడు. కవిపండితపోషకుడు. ఆధ్యాత్మిక, సాహిత్యరంగముల రెంటిని సమప్రేమతో, సమభివృద్ధి గావింప సత్కృషి సాగించిన చక్రవర్తి. ఈయన పెక్కు

గ్రంథములను వ్రాయించినాడు. వివిధదేవాలయములను నిర్మింప జేసినాడు. ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడినాడు. హద్దులెరుగని దాతృత్వముతో 'చేతికెముకలే'దన్న సామెతను సార్థకము గావించినాడు. సర్వతోముఖ కీర్తిని గడించినాడు. సత్సంప్రదాయముల నెన్నింటినో నెలకొల్పినాడు. సంస్కృతిని వర్ధిల్ల జేసినాడు ఇతడు శత్రువులకు గుండెలలో గాలము. మిత్రులకు కొంగుబంగారము. సర్వజన సంసేవ్యుడు. సకలమానవ ప్రణతుల నందుకొన్న మహనీయుడు.

ఈయనకు పుత్రసంతానము లేదు. పుత్రిక లిరువురు గలరు. పెద్దకుమార్తె రుద్రమదేవి. జనకునికి గారాబుబిడ్డ. ఈమె భర్త వీరభద్రేశ్వరుడు. తండ్రి యనంతరము రుద్రమదేవియే సింహాసనాసీనయై కాకతీయుల గౌరవమును గాపాడ కంకణము కట్టిన వీరనారి. తండ్రి జీవించియుండగనే యీమె సర్వవిద్యలలో సుశిక్షితయైనది. కాని, యీమె పరిపాలనగని యీర్ష్యలేనివారు కొందఱు 'స్త్రీ పాలనమున నుండరా'దని, దుర్బుద్ధితో కుట్రలుపన్ని రుద్రమదేవిని పదవీభ్రష్టురాలిని గావింప పలుతెఱగుల యత్నించిరి. కాని, వారియెత్తులన్నియు రుద్రమదేవి మేధాశక్తిముందు ఛిన్నాభిన్నములగుటతో వారెల్లరు సిగ్గుజెంది, మిన్నకుండిరి.

రుద్రమదేవి యపూర్వ సౌందర్యవతిమాత్రమేకాదు— అనన్యపరాక్రమ సంపన్న. సామ్రాజ్యపాలనములో దక్షతగల

మహారాజ్ఞి. కావుననే యాకాలమున యామెకన్నియు విజయ ములే చేకూరినవి.

గణపతిదేవునికుటుంబము మొత్తముమీద, దక్షిణభారత గౌరవప్రతిష్ఠలను భద్రపరచుటలో నపూర్వకృషిని సాగించె ననియే చెప్పుకొనవలెను. కళారంగమునగూడ నీకాలమున జరిగిన కృషి, సర్వప్రభులోకమున కాదర్శప్రాయమైనట్టిది. సాహిత్యకళతోపాటుగ సంగీత, శిల్పకళలుగూడ 'మూడు పూవు లారుకాయలుగ' వర్ధిల్లిన కాలమది.

ప్రకృతిశోభకాకరమైన సాంద్రారణ్య మధ్యమున మనోజ్ఞమైన మహాసరోవర తీరమున పాలంపేట గ్రామమున నాడు నిర్మితమైన రామప్ప దేవాలయము శిల్పకళా చరిత్రలో నొక యపూర్వఘట్టము. శిల్పకళాపండితు లెందరో, తమ నైపుణ్యమును వెల్లివిరియించి, యిచట శిలలకు జీవముబోసిరి. ఈ దేవాలయ ప్రాకార నిర్మాణమున కుపయోగపడిన యిటుక రాళ్ళు నీటిపై తేలునట! ఎట్టి శ్రద్ధ గైకొనబడి ఈయమరసృష్టి గావింపబడినదో యోచింపుడు! విదేశీయులు సైతము చూచి, ముగ్ధులై యాంధ్రశిల్పకళాలక్ష్మికి జోహారులు చేయుటకు మూలకారణములైన యీ రామప్ప దేవాలయము, హనుమ కొండలోని వేయిస్తంభముల మండపము, కాకతీయులకళాభి రుచులకు, శిల్పవిద్యాభక్తిపరతకు ప్రబల సాక్ష్యములు.

మొత్తముమీద కాకతీయుల కాలమున, సాంస్కృతిక సేవ, ప్రజాసేవ సమానస్థాయిలోనే జరిగెనని చెప్పవలయును.

కాకతీయ ప్రభువులలో గణనీయుడైన మరియొక ప్రభువు ప్రతాపరుద్రుడు. ఈయన గణపతిదేవునివలెనే దైవ భక్తుడు. విద్యాప్రియుడు. పరాక్రమశాలి. శత్రుకోటులను లెక్కసేయక, జన్మభూమిగౌరవమును గాపాడుటకై యనువు లర్పించుటకేని వెనుకాడని సాహసి.

ఈయనకాలమున తెలుగు కవులతోపాటుగ సంస్కృత కవులు, పండితులు సముచితముగ సమాదరింపబడిరి. సన్మా నితులయిరి. సంస్కృత విద్వద్వరేణ్యుడైన విద్యానాథుడు ప్రతాపరుద్రుని యాస్థానమున కలంకారప్రాయుడుగ వెలు గొందెను.

ఆస్థానపండితుడై, ఆంతరంగిక మిత్రుడై, సర్వవేళల ప్రభుక్షేమమును గాక్షించుచు సంచరించిన శీలసంపన్నుడు. 'ప్రతాపరుద్రీయమ'ను పేర మహోజ్వలమైన లక్షణ గ్రంథమును, సంస్కృతభాషలో రచియించి, యుదాహరణల రూపమున ప్రతాపరుద్రుని మహోదాత్త వీరజీవితము నంతయు నిందు రసవంతముగ జిత్రించినాడు. ప్రతాపరుద్రుని మహామంత్రియైన యుగంధరుడు దేశగౌరవ సంరక్షణలో ప్రభువునకు దీసిపోవని ఘటికుడు.

ప్రతాపరుద్రుని కాలమున మొత్తముమీద మహమ్మ దీయుల ప్రాభవము, కాలపరిస్థితులనుబట్టి కొంత పెరిగినదనియే చెప్పవలసివచ్చును. విధివశమున ప్రతాపరుద్రుడు మహమ్మ దీయులకు బంధితుడైనాడు. కారాగృహమున బెట్టబడినాడు.

అద్భుత ప్రతిభానిధియైన యుగంధరమంత్రి యుక్తి చాతుర్య ముచే ప్రతాపరుద్రుడు కారాగార విముక్తుడైనను కాకతీయ సామ్రాజ్యవినిర్మల గగనభాగమున మహమ్మదీయ కాల మేఘ ముల నడక ప్రారంభమైనదనియే యనవచ్చును. అయినను మహమ్మదీయులను సాహసముతో నెదిరించెడి ప్రయత్నములు మాత్రము స్తంభింపలేదు. ప్రతాపరుద్రుని యనంతరముగూడ నవి పెద్దయెత్తున సాగుచునే వచ్చినవి.

మహమ్మదీయుల చేతిలో యోటమికిగురియై తత్కాల మున దక్షిణభారత హైందవ సనాతనసంస్కృతీ పునస్సంరక్షణ దీక్షవహించిన యిరువురు సోదరులు మనకు చిరస్మరణీయులు. వీరిసాహసము మనదేశగౌరవభద్రతకు బెట్టనికోటయాయెను. వీరి పరాక్రమ తీక్ష్ణతేజోరేఖ – ముమ్మరముగ దక్షిణభారత మును ముంచివేయవచ్చిన మహమ్మదీయ సేనాజలధి నెండింప గల్గెను. వారిరువురాంధ్రులయ్యును – దక్షిణభారతమున కంత టికి నాప్తబంధువులైరి. వేయేల! హైందవ ధర్మదేవతకే గౌరవమును నిల్పిన యనుంగు బిడ్డలయిరి. హైందవసంస్కృతి నైేబడనున్న మచ్చను మధ్యలో మాయమొనర్చి, శాశ్వత తేజమున మన సంస్కృతి వికాసము నందుకొనుట కాధార భూతులైరి.

వారే హరిహరబుక్కరాయ సోదరులు. ప్రతాపరుద్ర ప్రభువు కాకతీయసామ్రాజ్యమునేలుతరి కోశాగారమున వీరు నియుక్తులైరి. కాకతీయసామ్రాజ్యలక్ష్మి నిత్యనూతనాభ్యుదయ

మునకు గుండెకాయయనఁదగు కోశ సంరక్షణ బాధ్యత, దానిని పెంపొందింపవలసినవిధి వీరిరువురిపై ప్రభువుంచినాడనిన వీరిశీల సంపత్తి యెంతగొప్పదో - వీరిదేశభక్తి యెంతనిర్మల మైనదో మనకవగాహనమగును.

దక్షిణభారతద్వారమునఁ గల వరంగల్లుకోట పట్టుబడ నిచో - మనము ముందునకు సాగిపోవలనుపడదని భావించిన మహమ్మదీయులు తొలిదెబ్బ వరంగల్లులో కాకతీయసామ్రాజ్య పీఠమునపైననే కొట్టిరి. ఆ ముష్కరుల ధర్మవిరుద్ధ దుశ్చర్యలకు కాకతీయాధికారము పతనమాయెను. వరాహ ముద్రాంకిత పతాకలవనతములై, నేలగూలినవి. చంద్రరేఖా చిహ్నిత ధ్వజములు వరంగల్లుకోటలపై నెగిరినవి.

నిస్సహాయమైన కాకతీయ రాజ్యలక్ష్మి - కనులనీరు గార్చుచు, నిర్భంధమున నిల్చినది. హైందవ సంస్కృతిని భ్రష్టము గావించి, మహమ్మదీయ ప్రభుత్వము స్వీయ సంప్రదాయముల బ్రోదిసేయ, జతనము లారంభించినది. హరిహర బుక్కరాయ సోదరుల గుండెలలో నగ్గికొండలు పెరిల్లున ప్రేలినవి. కచ్చెబట్టి, చిచ్చులపిడుగువలె రాజ్యమును వదిలివచ్చి, మహమ్మదీయ పౌరుషాగ్నిజ్వాలల నార్పుటకు యోచనలు సలుపనారంభించిరి. వారియావేదన నర్థము జేసి కొనువారెవ్వరు? మనజాతి పతనావస్థలో నున్నది. ఉత్తర భారతము ముస్లిముల దాస్యములో మునిగిపోయినది. మహమ్మదీయాధికారము సాగుచున్న నేలపై, హైందవ సంప్రదాయాం

కురములు మలమలమాడిపోక నిలుచునా? ఇంక దక్షిణభారత మునంగూడ నీవిపత్తు సాక్షాత్కరించినచో హిందూమతము నకు మనుగడ యెక్కడ? యుగయుగములనుండి పరివర్ధమాన మై, తరతరములనుండి తరుణతేజమునీనుచున్న హైందవ సంస్కృతి, శిల్పము, కళ, నాగరికత, కావ్యసంపద భ్రష్టము కావలసినదేనా? వైదిక ధర్మజ్యోతి కొడిగట్టవలసినదేనా? హిందూ పౌరుష ప్రాభవాగ్నిజ్వాల లాఱికతప్పదా? సర్వ భారతము స్వమతచైతన్య రహితమై, స్తబ్ధమై, సంక్షుభితమై నామమాత్రావశిష్టముగ నిలిచిపోవలసినదేనా? మార్గాంతరము లేదా? హరిహరసోదరులిరువురీపగిది వ్యధజెందిరి. తర్కవితర్కములగావించిరి. కృతనిశ్చయులై ముందునకుసాగిరి.

'విశాల భారత భూభాగమున్నది. వీరకోటిలేకపోలేదు. అంతటను పిరికిపందలే యుండరు. ఎల్లవేళల హిందువులకే పరాజయము ప్రాప్తింపదు. కలిసికట్టుగ నందఱమొక త్రాటిపై నడిచిపోరిన, విజయము సిద్ధించి తీరును. తరువాత ఈశ్వరేచ్ఛ' అని, దక్షిణదేశమున నలువంకలకు బరుగులెత్తిరి. ఆసన్న మహాప్రళయ పరిస్థితి ప్రభావమును విశదీకరించిరి. సమైక్యముతో సమరశంఖము నూదుదమనిరి. జయలక్ష్మిని సాధింతమనిరి.

గిరులుగీచుకొని, చిన్నచిన్న రాజ్యములుగ విభజించుకొని, దక్షిణభారతము నేలుకొనుచున్న చిన్నరాజు లందరిదివిని సెబాసనిరి. భళీబాపురేయనిరి. మంచిజతనమే సాగింపుఁ

డనిరి. కాని, సహకరించువారొక్కరు లేరయిరి. జాతిరక్త నాళములలో జీర్ణించుకొనిపోయిన స్వసంక్షేమమాత్మైక భావనల ప్రభావమది.

హరిహరసోదరులు నిరుత్సాహపడలేదు. కావలిరాజుల గదలించి, నెల్లూరు ప్రభువులతో సంప్రతించి, మధ్యగల వారందరితో మాటాడి, విసుగు విరామము లెరుగక, తిరిగి తిరిగి బళ్ళారి మండలమునకుఁ జేరిరి.

తుంగభద్రయొడ్డున వారికొక దివ్యతేజోమూర్తి సందర్శన భాగ్యము లభించెను. ఆయన మహర్షి. వేదవేదాంత విద్యాపారంగతుఁడు. సిద్ధవచస్కుఁడు. త్రికాలజ్ఞాన సంపన్నుఁడు. ధర్మకర్మానుష్ఠాన పరతంత్రుఁడు. పరోపకార దీక్షితుఁడు. దేశ గౌరవాభిలాషి. హంపీవిరూపాక్షస్వామి చరణకమల సమాసక్తచిత్తుఁడు. ఆ స్వామి సర్వస్వమునకు ప్రతినిధి.

సోదరులను గాంచినంతనే యామహర్షికి, మహర్షిని గాంచినంతనే సోదరులకు చిరకాలస్వప్నము లెవ్వియో రుచిర రూపమున నెట్ట యెదుట నిల్చినట్లాయెను. పరస్పర ప్రసంగము లారంభమైనవి. విషయమును సోదరులు విశదీకరించిరి. హిందూధర్మసముద్ధరణ-సంస్కృతీ సంరక్షణ యనెడి మాటలు చెవిని బడగనే, మహర్షి యొడలు పులకరించినది. దేశమున కేర్పడిన మహాపదకు కనుల నీరు నించినాఁడు. సోదరుల నయన చతుష్టయమును లోతుగ బరిశీలించి, నఖశిఖపర్యంత పరీక్షగావించి, విశ్వసించినాఁడు. వెంటనిడుకొని, యాశ్రమ

మునకు గొనిపోయి, బంగారపు కొట్టులఁదెఱచి, యేడుగడియ లలో-గ్రహింపఁ గలిగినంత సువర్ణమును స్వీకరించి, దేశభద్ర తకు వెచ్చించి, హిందూమత గౌరవమును సంరక్షింపుఁడని యాదేశించినాఁడు. కనకపు గుట్టలంగాంచిన సోదరులహృదయ కమలములు వికసించినవి. స్వతంత్రభారతగౌరవలక్ష్మి వారి యెదుట సాక్షాత్కరించినట్లయినది.

మహోద్యమ మారంభమైనది. వైదికసంరక్షణకు-హిందూగౌరవసంస్కృతీసంప్రదాయభద్రతకు నిట్టియపూర్వ సహకార మాచరించి చరిత్రను క్రొత్తమలుపునకు ద్రిప్పిన యా మహనీయుఁడెవ్వరు? విద్యారణ్య యతీశ్వరులు. హంపీ విరూపాక్షస్వామివారి యాలయముక్రింద మూఁడు పంటలు బండెడి వేలకొలది యెకరముల మాగాణిభూమిపై సర్వాధికారి యైన సన్యాసి.

తుంగభద్రాజలధారలతో ధాన్యలక్ష్మి తాండవమాడు చుండ, విరూపాక్షస్వామివారి నిత్యోత్సవ - మాసోత్సవ-బ్రహ్మోత్సవాది దివ్యకైంకర్యముల నన్నింటిని శాస్త్ర స్మృతముగ నిర్వహింపఁజేయుచు, స్వామిని నమ్మికొనియున్న ప్రాంతప్రజానీకమునకు భృతి గలిగించుచు, మిగిలిన ద్రవ్య మును కనకముగ మార్చి, కొట్లుగట్టిపోసి నిలువయుంచిన సర్వ సంగ పరిత్యాగి. సమయము వచ్చినపుడు స్వామిద్రవ్యముతో సంస్కృతిని, ధర్మమును సంరక్షింప సమకట్టి, హిందూవీరులు తలపెట్టిన మహోద్యమమునకు సర్వశక్తులను వెచ్చించి,

యాశీర్వదించిన దివ్యభావుకుఁడైన దేవాలయ ధర్మకర్త. దేవాదాయమును దేశధర్మమునకు, దేశీయ సంస్కృతీ సంప్రదాయ సంరక్షణకు, దేవభాషాధ్యయన పావన కార్యమునకు, దేవాలయ నిత్యకైంకర్యములకు, దేవపూజామహోత్సవములకు మాత్రమే వ్యయమొనర్పవలెనని శాసించి, ఆచరించిన దివ్యతపస్వి.

ఆయన పుణ్యముననే విరూపాక్షస్వామివారి సొత్తుతో దక్షిణ భారతమున అన్యమతస్థుల యుద్ధతి కడ్డుకట్ట కట్టబడినది. ఆయన సంకల్ప ప్రభావముననే సర్వభారతమున కాదర్శప్రాయమై, స్వధర్మ సంస్కృతీ సదాచార సంరక్షణల కాలవాలమైన హిందూ ప్రభుత్వ పీఠముగ – సర్వమత సామరస్యమును, సకలమానవ ప్రేమను వెలయించెడి సార్వభౌమాధికార నిలయముగ – సర్వకళాసాహిత్య శాస్త్ర సంగీతముల పుట్టినిల్లుగ విద్యానగరము వెలయఁ గలిగినది.

విద్యారణ్యుల దయవలన నార్థికపుష్టి యేర్పడినది. సైనికపుష్టి దీనివలన సాధ్యముగాగలదు. స్వాతంత్ర్యభావ పుష్టికొల్లగనే తమకున్నది. ఇఁక కొదువయేమి? విక్రమించి నారాసోదరు లిరువురు. తుంగభద్రానది యొడ్డున సుశిక్షితమైన సేనావాహిని బయలుదేరినది. నడుమనున్న చిన్న, చిన్న రాజ్యాధిపతు లందఱును చేతులు గలిపిరి. మహోగ్రోద్ధతితో వరంగల్లుపై దాడిసలిపి, మహమ్మదీయుల నుత్తర భూభాగపు సరిహద్దులవఱకు దరిమికొట్టి, వరంగల్లు కోటలపై మఱల

వరాహాముద్రాంచిత స్వర్ణపతాకలను హరిహరరాయ సోదరులు ప్రతిష్ఠించినారు. సర్వనాశమునకు సంసిద్ధముగనున్న తరుణమున, హరిహర బుక్కరాయసోదరుల రాజకీయశక్తిని-విద్యారణ్య మహర్షి యాత్మశక్తి ముందునకునడపి, మఱల దేశీయ గౌరవమునకు పుష్టిని, దేశీయ సాంస్కృతిక లక్ష్మికి తుష్టిని చేకూర్చుట జరిగెను. ఇట్లు మఱల ఋషిసత్తముఁడే దక్షిణభారతమున నాపదుద్ధారకుఁడై నిల్చినాడు. ఆత్మవిశ్వాసమును బెంపొందించినాడు. అద్భుతశక్తులను గలిగించినాడు. అఖండవిజయమును సమకూర్చి, హిందూమతమును గాపాడినాఁడు.

విద్యారణ్యుల దివ్యాశీర్వాదబలమున దేశమునసంకుల పరిస్థితులంతరించినవి. హరిహరసోదరులామహర్షి శాసనము నాదలదాల్చి, ధర్మబద్ధముగ వైదిక సంస్కృతిని బెంపొందించుచు, నిత్యనూతనరీతులతో రాజ్యపాలనమును గొనసాగించి, హిందూమత వైభవమునకు కృషిసల్పిరి. వారియభిమతములను సఫలముగావించుకొనిరి. ఋషి శాసనమును రాజులాచరణము నందుంచిరి. అధికారముద్రపై విరూపాక్షస్వామివారి నామము విరాజిల్లినది. అహాహా! ఎట్టి దివ్యాదర్శము! అట్టితరి, సంకల్పములు నిర్వికల్పముగ గొనసాగకుండునా?

తదనంతరమువచ్చిన హరిహరబుక్కరాయ సోదరుల వంశీయులుగూడ విద్యారణ్యస్వామివారి యడుగుజాడలయందే

పయనించి, దేశ గౌరవ సంరక్షణ దీక్షతోడనే ప్రజానురంజక ముగ రాజ్యపాలనము గావించిరి.

సాళువవంశము కొంతకాలము, తుళువంశము కొంత కాలము, అరవీటివంశము కొంతకాలము విద్యానగరసామ్రాజ్య లక్ష్మికిసేవ గావించెను. కాని, క్రమక్రమముగ - విద్యా రణ్యులవారి యొరవడులఁగొన్నింటి నాయాకాలములలో వచ్చిన పాలకులధిగమించుటచే, కొన్ని యొడుదొడుకులేర్పడెను.

సమరసభావమునుఁగోల్పోవక, స్వమతధర్మముల భద్ర తకు భంగము గలుగనీయక, సంస్కృతిని ప్రాణతుల్యముగ సం రక్షింపుచు, సర్వప్రజానురంజకముగ పరిపాలనము గావించిన విద్యానగర హిందూసార్వభౌములలో - చిరకాలము స్మరింప దగిన మహావ్యక్తి శ్రీకృష్ణదేవరాయలు.

శ్రీకృష్ణదేవరాయల ప్రతిభా ప్రశస్తికి - పెట్టనికోట వలె నిల్చిన మహామంత్రి తిమ్మరుసుగూడ నీకాలమున మన సంస్కృతికి,నిరుపమానసేవగావించినమహామేధావియగు మంత్రి సత్తముడని భావింపవలయును. బాల్యమునుండియు - రాయల వ్యక్తిత్వమును మహోన్నత స్థాయిలో తీర్చిదిద్దికొనుచు వచ్చిన సచ్చరిత్రుడు తిమ్మరుసు: రాజకీయరంగమున-సారస్వత రంగమున - సర్వవ్యవహార రంగమున తిమ్మరుసు పలుకు రాయలకు వేదవాక్కు. వారిరువురి యపూర్వ సమ్మేళనము - మన హిందూ సాహిత్య సంస్కృతుల మహావిజయమని యభి నందింపవచ్చును.

దండెత్తినచోటనెల్ల నఖండవిజయమును సంఘటింపజేసిన సచివోత్తముఁడు తిమ్మరుసు. అంతియకాదు - భువనవిజయ మహాసభల బెట్టించి, కవి పండితులను భూరిసత్కారములతో సంభావింపఁజేసినాఁడు. శిల్పసంగీత చిత్రకళావిశారదుల ప్రోత్స హించినాఁడు. రాయలయుగమును స్వర్ణయుగమనిస్వదేశీయులే కాక, విదేశీయులుగూడ ప్రశంసించు తెఱఁగున పరిపాలన జరిపించినాఁడు. తిమ్మరుసులేనిరాయలు దేవుఁడులేనికోవెల.

ఋషితుల్యుఁడై, సిద్ధసంకల్పుఁడై, ధర్మబద్ధుఁడై, వైదికధర్మతత్పరుఁడై యీ కాలమున తిమ్మరుసు వెనుక నిల్చి సహకరింపఁగా - సమర్థ రామదాసుచే నడిపింపఁబడిన శివాజీ వలె రాయలు ఘనవిజయపరంపరలఁ జూరగొని, మహత్తర వైదిక సంస్కృతికి మహోజ్వలస్థితిని ఘటించి, దేశీయ గౌరవ ప్రతిపత్తులను బెంబొందించినాఁడనుట నిర్వివాదము.

రాయలయుగ మొకేరొక జిగితో - బిగితో కడ చనినది. కాలచక్ర పరిభ్రమణమున కొంతమార్పురాసాగినది.

విద్యానగర రాజవీధులలో రత్నములు రాసులుగ బోసి విక్రయింపబడుచుండెడివి. విదేశీయులు వానిని బండ్లకెత్తించుకొని స్వదేశమున కోడలపై గొనిపోవుచుండెడి వారని కొనియాడఁబడిన విద్యానగర వైభవమునకు కొలఁదిలోటు వాటిల్లినది. విదేశీయులచేసైతము ప్రశంసలనందిన విద్యానగర పరిపాలనాక్రమమునసే మార్పు గోచరించినది.

రాయలశకము పూర్తియైనంతనే, యనివార్యములైన కొన్ని సంఘటనలు జరిగినవి. తరువాత వచ్చిన విద్యానగర ప్రభువులు – రాయలవంటి యుదాత్త భావ సమన్వితులు, శీశాలులు గాఁజాలరయిరి. కావుననే, నాటివఱకు రాయల యతిలోక ప్రతిభముందు తలయెత్తజాలని మహమ్మదీయప్రభుత్వము కొంచెము పించముపిప్పి, నర్తింపసాగెను. రామరాయలనెడి ప్రభువుకాలమున – తళ్ళికోటవద్ద జరిగిన యుద్ధములో ఘోరమైన మోసముగావించి, మహమ్మదీయులు తమదే పై చేయియని ప్రకటించుకొనిరి. తళ్ళికోట పతనముతో – దక్షిణ భారతమున హైందవసనాతన సంస్కృతీలక్ష్మికి మఱల నిరాశ్రయదశ ప్రారంభమాయెను.

అట్టి సమయమునందే – మధుర, తంజావూరు పట్టణ ప్రాంతములను పరిపాలించుచున్న నాయకరాజులు–సంస్కృతీ సంరక్షణకు, సంప్రదాయపరిరక్షణకు, భగవద్భక్తి ప్రచారమునకు తగిన శ్రద్ధవహించుటచే నపుడు తంజావూరు మన సంస్కృతికి కేంద్రముగ వర్ధిల్లుట ప్రారంభమైనది. విద్యానగర పతనముతో, నటగల ప్రతిభావంతులెల్లరు తంజావూరునకు వలసవచ్చి, కళాప్రియులైన తంజావూరు రాజుల యండ జేరిరి.

మధురలో తిరుమలనాయకుఁడను ప్రభువు పాలకుఁడై మన సంస్కృతిని కొంతవఱకుపోషించెను. తిరుమలనాయకుడు సరసహృదయుడు. కళాపిపాసి. పావన భగవదారాధనాతత్ప

రుడు. ప్రజలను కన్నబిడ్డలవలె ననురాగపూర్ణ దృష్టితో, పోషించి, రక్షించి, పాలించిన ప్రభువు. నిత్యము మధురనుండి శ్రీవిల్లి పుత్తూరునకేగి, ఆండాళు దేవాలయమున పూజలు గావించి, తిరిగివచ్చి మధురలో భుజించెడివాడట. నమ్మిన వైనమునారాధింపక పచ్చిగంగనైన ముట్టని కఠోరవ్రత పరాయణులైన ప్రభువులు కొందరున్నారు. తిరుమలనాయకుడు వారిశ్రేణికి జెందినవాడు.

రామేశ్వరమునగల దేవాలయ ప్రాకారములు, వాస్తు శాస్త్రసిద్ధాంతములకు చక్కని లక్ష్యములై, శిల్పశోభావైభవ ప్రాభవములకు ప్రబలసాక్ష్యములై విరాజిల్లుట తిరుమలనాయకుని యకుంఠిత కళాప్రియత్వమునకే మచ్చుతునుకగ బేర్కొన వచ్చును. శుచీంద్రమున గూడ తులలేని శిల్పకళా సౌందర్య ముట్టిపడ నొకదేవాలయమును నిర్మింపజేసెను. అచటి సంగీత స్తంభములగాథ శిల్పలక్ష్మి కలంకార స్రాయము.

తిరువనంతపురమునగూడ నీమహారాజు – అనంతపద్మ నాభ దేవాలయమును నిర్మాణమొనర్చెను. ఇవియన్నియు నొకయెత్తు. మధురయందే 'తిరుమలనాయక రాజభవనము' ను పేర నిర్మించిన సుందర మందిరమొక్కటే యొకయెత్తు. ఇట నొక పెద్దకోనేరును, ఆ రాజమందిరమును నేటికిని యాత్రికులు అనురక్తితో దర్శించి, యందలి మనోజ్ఞశిల్పశోభకు మురియు చుందురు.

తంజావూరును రాజధానిగ నొనర్చుకొని, పాలించినవారు మాత్రము పూర్ణ భక్తి విశ్వాసములతో హైందవ ధర్మ సంస్కృతులను సంరక్షించెడి మహోద్యమమును నడపిరి. వీరిలో రఘునాథరాయలు ప్రముఖుడు. తండ్రియుండగనే సుశిక్షితుడై, శత్రువులను గడగడలాడింపుచు తంజావూరు గౌరవాతిశయమును జాటెను.

మాట దప్పనివారు తంజావూరు రాజులు. శరణాగత రక్షణ వారి సహజగుణము. మడమ ద్రిప్పుటెఱుగని మహా యోధులు. రఘునాథరాయ లన్నింట మిన్నలై, వంశగౌరవమును గాపాడుచు, తలనెత్తిన పగవారినెల్ల దాసులనుగావించుకొనుచు, పరదేశీయుల యుద్ధతుల నడ్డుకొనుచు, రాష్ట్రమునగల యంతఃకల్లోలముల నిర్దాక్షిణ్యముగ నణచివైచుచు సంచరించెను. ప్రజానురంజకముగ పరిపాలనమును సాగించెను.

విజయనగర ప్రభువులకు సామంతుడై వారి పై శత్రువులు గావించిన దండయాత్రలను మహోద్ధతితో నెదుర్కొని విజయనగర ప్రభువులకు విజయమును జేకూర్చెను. తనపై దండెత్తివచ్చిన మహమ్మదీయులను – పోర్చుగీసువారిని చిత్తుగ నోడించి, తరిమికొట్టెను.

సార్వభౌమాధికారము సంక్రమించిన తొలిదినముల లోనే రఘునాథునకెన్నియో యగ్నిపరీక్షలెదురైనవి. ధైర్య స్థైర్య సాహసోపేతుడై, దరహాసములనడుమ వాని నన్నిం

టిని తృణప్రాయముగఁ జూచుచు, విజయపరంపరల నందు కొని, ఖ్యాతిగాంచెను. శత్రుభీతి రాజ్యమునకుఁ దొలఁగి పోయెనని భావింపఁగనే, చక్కని సాంస్కృతిక గోష్ఠుల నేర్పఱి చెను. కృష్ణదేవరాయలతోఁ బెక్కు పోలికలీయనకు గలవు. రాయలకువలెనే రఘునాథునకుఁగూడ వెనుక నొక మహాశక్తి యండగనుండెను అది మహామంత్రియైన గోవింద దీక్షితుని మేధాశక్తి.

తంజావూరు రాజులందఱును వైష్ణవభక్తులు. రాజ గోపాలస్వామివారికి దేవాలయ నిర్మాణముగావించి, నిత్య పూజలనేర్పాటుఁజేసిన పుణ్యాత్ములు. రాజగోపాలస్వామి చరణ కమల సందర్శనభాగ్యము తమ భవిష్యత్తునకు శుభం కరమని వారి విశ్వాసము. రాజగోపాలస్వామివారికి వార్షిక ముగ జరుగు బ్రహ్మోత్సవములు రాజ్యమున కంతటికిని పర్వదినములు. దేశీయసాంస్కృతిక వైభవమంతయు నా మహోత్సవముల సమయమున ప్రత్యక్షము గావలసినదే. రఘునాథునికాలమున నీ వైభవమంతయు మహోన్నతస్థాయి నందుకొనినది. అందులకు రఘునాథుఁడు కళా ప్రియుఁడైన మహా భక్తుఁడగుటయు-మంత్రియైన గోవిందదీక్షితుఁడు వైదిక ధర్మ తత్పరుఁడైన సంస్కృతీసంరక్షకుఁడగుటయు ప్రధానకారణములు.

రాయలవలె రఘునాథుఁడుగూడ కవిపండితపోషకుఁడు. గ్రంథకర్త. పండితుఁడు. సంగీతశాస్త్రకోవిదుఁడు. ఈయన 'రఘునాథమేళ' యనుపేర నొకసంగీత ప్రక్రియనునిర్మించెను.

రఘునాథుని కాలమునసే కృష్ణాజిల్లా కూచిపూడి వాస్తవ్యు
డును-కృష్ణభక్తుడును-పదకర్తయునగు క్షేత్రయ్య యను
మహాకవి-తంజావూరునకేగి, యాయనచే ఘనసత్కారము
నందెను. కాసుల పురుషోత్తమకవి, చెంగల్వ కాళకవిమున్నగు
వారీయన కాలపు పండితకవులే. విజయవిలాసమును రచించిన
మధుర ప్రబంధ నిర్మాణ ధురంధరుండైన చేమకూర వేంకట
కవి యీ కాలమున వాసిగాంచిన మహాకవి. రఘునాథమహా
ప్రభువుల పూర్ణానుగ్రహమునకు పాత్రుడైన పండితుడు.
రఘునాథరాయల కాలమున కవయిత్రులు - గానకళా వైదు
ష్యముగల కాంతలుగూడ గలరు. వారిలో-భద్రాంబ, మధుర
వాణి, రంగాజమ్మ, ముద్దుపళని యనువారు ప్రశస్తికెక్కిన
కవయిత్రులు. విదుషీమణులు. వీరకంపరాయని భార్యయగు
గంగాదేవి - సంస్కృతభాషలో గొప్ప కవయిత్రిగ విఖ్యాతి
గాంచెను. వీరిలో రంగాజమ్మ మిక్కిలిలావణ్యవతి. సరససంగీత
చాతురీ ధురీణ. రసవత్కావ్య నిర్మాణ ధురంధర. పెక్కు
గ్రంథములను రచించి, రఘునాథునకే యంకితమొసంగెను.

మొత్తముమీద - రఘునాథుని కాలమున సంస్కృతి
పెంపొందినదనవచ్చును. కళలకు మంచి యాదరణయే యున్న
దన వచ్చును. వైదిక ధర్మతత్పరతయునున్నది. సాహిత్యరంగ
మునఁగూడ, శృంగారరస సంభరితభక్తి తత్త్వమే పరిఢవిల్లెను.
లౌకిక భోగ పరంపరకే యధిక ప్రాధాన్య మొయఁబడినట్లు

గన్పట్టినను–సాంస్కృతిక రంగమున చక్కని కృషియే సాగిన దనవచ్చును. సరస్వతీమహాలనుపేర తన రాజదర్బారున రఘు నాథుడు నడపిన సభలు, కావించిన సత్కారములు కళా లక్ష్మికి వెలలేని హారములు కాగలిగినవి. నాడు వెలసిన సరస్వతీ మహాలనెడి బ్రహ్మాండమైన ప్రాచీన గ్రంథసంభరితమగు గ్రంథాలయము నేటికిని తంజావూరు రాజుల సాంస్కృతిక ప్రియత్వమునకు చెరగని చిహ్నమైనిలిచి, వెలుగులు వెదజల్లు చున్నది.

ఆ తరువాత వచ్చిన రాజులెల్లరును – దక్షిణభారత సంస్కృతికి సేవగావించి, ప్రాచీన ఘనగౌరవమును యథా శక్తి రక్షింప కృషిసల్పిరి. క్రమక్రమమున – నట–నట కొంత కొంతగ మన సనాతన ధర్మముపట్ల–సంస్కృతిపట్ల భక్తివిశ్వా సములు సన్నగిల్లుచున్నట్లు గనిపించినను, చెప్పుకొనదగిన గొప్పమార్పు లెవ్వియు లేవనియే యనవలెను.

ధర్మదృష్టి లోపించుటవలననో–భోగలాలసత పెరుగుట వలననో–సమైక్యము తగ్గుటవలననో–దూరాలోచన లోపించుట వలనో మొత్తమువీడ దేశసౌభాగ్యము క్షీణింపసాగినది. కొన్నిదురాచారములు తలయెత్తి, స్వైరవిహారము పెచ్చు పెరుగుటచే, తంజావూరు రాజ్యముగూడ క్షీణదశకు రా సాగెను. ప్రజల మనోభావములలో – పవిత్రత తగ్గుటవలననే యిట్టి పరిస్థితులు తటస్థించెనని యభిజ్ఞులు తలంచిరి.

ఇంతకు కొంతముందుగనే, పరదేశీయులగు పాశ్చాత్యులు మన దేశ సౌభాగ్యముపై గన్నువైచి, యిటజేరి, వారి పైత్తనములను-స్వార్థప్రయోజనములను నెగ్గించుకొనసాగిరి. అట్టివారిలో-పోర్చుగీసులు, డచ్చివారు, ఫ్రెంచివారు, ఆంగ్లేయులు ముఖ్యులు. వీరు మనదేశమున వ్యాపారములను విరివిగసాగించి, లాభముల నార్జింపవలెననెడి ధనాశతో మన దేశమున కేతెంచిరి. పాడిపంటలతో సమృద్ధిగనున్న - సకల సంపదలతో దులదూగుచున్న మనదేశము, కూటికి మాడుచున్న వీరందరికిని, మిక్కిలి యాశను గల్గించెను. కొండంత కోరికతో ప్రతివారు మనదేశమున ప్రవేశించి, వారి వారి ప్రభుకుదెరువునకు మార్గముల నన్వేషించుకొనసాగిరి.

ఈస్టిండియాకంపెనీ యనుపేర ఇంగ్లాండులో-వ్యాపారార్థము రిజిస్టరు కాబడిన యొకసంస్థ పక్షమున వచ్చినవారే యాంగ్లేయులు. వర్తకప్రవాంఛతో మనదేశమున మకాము పెట్టిన యాంగ్లేయులు - వారి దేశమునుండి దిగుమతిజేసిన సరకులను, మనదేశమునుండి యెగుమతి జేయవలసిన సరకులను నిల్వయుంచుటకై, సొంతగిడ్డంగుల నేర్పఱుచుకొని, వాని సంఖ్యను దేశమున నానాటికిపెంపొందింపసాగిరి. ఈరూపమున వారి యునికికి యీ దేశమున భద్రతగలిగించుకొనిరి. వారు చతురులు, మేధావులు నగుటవలన, పోర్చుగీసు-డచ్చి-ఫ్రెంచి దేశీయులకన్న త్వరితగతిని వారి వ్యాపారము పెంపొందునట్లు శ్రద్ధ వహించిరి. మనదేశీయులను పలువురను వశపఱుచు

కొనిరి. కుత్సిత విధానములతో – కుటిలబుద్ధులతో లంచము లిచ్చి, యెండటినో మనవారిని తొలుతనే తమవశ మొనర్చు కొనఁజాలిరి. మటికొంత ముందడుగువైచి, వీలున్న వారిని పలుతెఱఁగులఁ నాసబెట్టి, తమ మతమునఁగూడ జేర్చుకొన సాగిరి.

పోర్చుగీసు–డచ్చి–ఫ్రెంచివారింతగగాకున్నను, మొత్తము మీద నిదేపద్ధతితో – కుటిల తంత్రములఁ బన్ని, వ్యాపార దీక్షతో – వారి వారి స్థానములను సుస్థిరము గావించుకొను చుండిరి. వివిధ సంపదలను బెంపొందించుకొనుచుండిరి. శత్రు మంతులై మనదేశీయుల సామాజిక వ్యవహారములలోఁగూడ జోక్యములు గలిగించుకొనుటకు తమమాటకు విలువను బెంచు కొనుటకు ప్రారంభించిరి.

ఆంగ్లేయులింకొక విచిత్రమైన వ్యూహమును బన్నిరి. మా గిడ్డంగులను భద్రపఱుచుకొను నిమిత్తము మాదేశపు సైనికుల దెచ్చుకొందుమనియు – దయయుంచి యనుమతింప వలయుననియు ప్రార్థించి, స్వదేశరాజుల నెట్లో రొప్పించి, తమదేశమునుండి సైన్యములను దింపసాగిరి. విదేశములనుండి సైనికులీగడ్డపై నడుగుపెట్టిననాఁడే మనదేశ దౌర్భాగ్యమారంభ మైనది. స్వదేశప్రభువులు కనులుమూసికొని, వారు కోరిన కోరికలనెల్లనమ్మతించి, వారి యభ్యర్థనల నన్నింటిని మన్నించి, వారిపట్ల నపూర్వాదరణ జూపుటయే పెద్ద నేరమాయెను. మన పతనమునకు మూలకారణ మాయెను. ఆంగ్లేయులీ

యదను జూచుకొని, క్రమముగ పుంజుకొని, రెండుచేతులతో విరివిగ ధనమునార్జింపసాగిరి. అందఱు జూచుచుండగనే స్వదేశ సంపదను విదేశీయు లీ రీతిగ దోచుకొనుచుండిరి. ధనమును కుప్ప తిప్పలుగ కొల్లగొట్టి తమదేశమునకు పంపసాగిరి.

ఆర్జన పెరిగినకొలది యాంగ్లేయుల గిడ్డంగులు పెరిగినవి. గిడ్డంగులు పెరిగినకొలది సైనికసంఖ్య పెరిగినది. సైనికసంఖ్య పెరిగినకొలది యాంగ్లేయుల గుండెబలము పెరిగినది. అహంకారము పెరిగినది. నిర్లక్ష్యభావము పెరిగినది. విశృంఖల విహారము పెరిగినది. వీనితోబాటు మనదేశ దౌర్భాగ్యము కూడ పెరుగుచునే యున్నది.

పరిస్థితులిట్లుండ మఱొక ప్రమాదముగూడ వాటిల్లెను. మనదేశమునఁ జేరిన యాంగ్లేయ వ్యాపార ధురీణులు గుండె బలముతో_ మనల నెవరేమనఁగలరనెడి సాహసముతో_కాదనివారి నోరు మూయింపలేకపోదుమా యన్న ధీమాతో వారి మాతృభూమినుండి క్రైస్తవమత ప్రచారకుల నిటకు దింపిరి. వచ్చిన మతప్రచారకులు తొలుత ఆంగ్లేయుల గిడ్డంగుల వద్దనే ప్రార్థనలు ప్రారంభించిరి. మెల్లమెల్లగ వారు హిందువుల యిండ్లకు ప్రచారముకొఱకువెళ్లసాగిరి. లీలామాత్రముగ_ గనుమూసి తెరచునంతలో_ గాలివలె క్రైస్తవమతము మనదేశమున నల్లుకొన సాగెను. కాదనెడి వారొక్కరేని ముందునకు రారైరి. వచ్చి గొణుగుకొను వారెవ్వరైన గనిపించినను_ వారినెట్లో జోకొట్టి, సంతృప్తిపఱిచి, సాగనంపెడిచాకచక్యము

కంపెనీవారికి లేకపోలేదు. వీరి చాకచక్యప్రభావమున వచ్చిన వాడే యొక ప్రతినిధిగ తయారయి, క్రైస్తవమత ప్రశస్తిని గానము చేయుట కారంభించెను. విచిత్రముగ నీ విధమున మచ్చుజల్లిన పగిది – మాంత్రికుడభిమంత్రించిన తెఱగున క్రైస్తవమత ప్రచారకుల పలుకులను మనవారు చెవులొగ్గి వినసాగిరి.

ఆంగ్లేయులు వారి సైనికబలము నిటకు దింపుట ప్రథమ విజయము కాగా – క్రైస్తవ మత ప్రచారకులను రప్పించి, నిరాటంకముగ నిలుపగలుగుట వారిమేధా నిపుణతకు ద్వితీయ విజయముగనే భావింపవచ్చును.

ఇంతలో– స్వదేశ రాజులలో నంతర్గర్భితములుగ దాగి యున్న పరస్పరవిద్వేషాగ్నిజ్వాలలు రాజి–రాజి, భగ్గుమన్నవి. సమయముగని పెట్టి, కంపెనీవ్యాపారులు కుత్సితబుద్ధితో స్వదేశ రాజకీయములందు ప్రవేశించి, మనరాజులలో నొకరిపై నింకొకరి నుసిగొల్పి క్రమముగ ప్రముఖపాత్రవహింపజొచ్చిరి. మనరాజులు వారి జోక్యమున కెట్లొప్పుకొనిరో! వారి సూచనల నెట్లామోదించిరో! వారి పెత్తనముల కెట్లు 'చిత్త' మనగలిగిరో! స్వదేశరాజుల ప్రతిభా సామర్థ్యము లే గంగలో గలిసినవో! వారి బుట్టల నెవ్వరి కమ్ముకొనిరో! విచిత్రముగ నీ యాంగ్లేయుల వ్యూహములలోన జిక్కుకొని, కీలుబొమ్మలై, తలలాడించెడి దుస్థితికి వారు దిగజారిరి. కట్టుదిట్టముగ జట్టుగట్టి,

గట్టి కుట్రలు బన్నఁగలిగిన యాంగ్లేయుల ధీశక్తి కబ్బురమంద వలసినదే! వారిట్లెన్నియో యక్రమముల నవలీలగ సలుపసాగిరి. వీలుజూచుకొని యిరువురు స్వదేశరాజులు తన్నుకొని చచ్చుచుండ, గొంత వారి భూభాగమునే దురాక్రమణ చేయసాగిరి. వారి కట్టి సంకుల సంఘర్షణ కలుగనిచో – కలుగుటకు వలసిన జాగ్రత్తలన్నియు దీసికొనసుద్యమించిరి. వారాచరింపని దురాగతములులేవు. రాజ్యవిస్తరణకాంక్ష వారిలో నప్పటినుండియే బీజములు నాటుకొనసాగినదేమో! సుదూర భవిష్యత్తులో వారి కాంగ్లసామ్రాజ్యలక్ష్మి సాక్షాత్కరింపనున్నది కాబోలు!

ధర్మాధర్మవిచక్షణతో నిమిత్తములేక – సహనముతో నాదరించి, స్థానమిచ్చి, సహకరించిన నేలయే యనెడి భక్తి ప్రపత్తుల విచారణసలుపక, యథేచ్ఛగఁ దమ యాధిక్యమును నిలుపుకొనుటకు విశ్వప్రయత్నము లన్నియుఁ గావింప దొడగిరి. ఈ పరిస్థితు లిట్లుండ – మనదేశసంపదను కొల్లగొట్టుకొన వచ్చిన యితర విదేశీయులలోఁగూడ భాగములు కుదురక, తృష్ణతగ్గక, పొత్తునిలువక, వైషమ్యములు పెరుగసాగెను. 'యాచకో యాచకస్యశత్రుః' – అనెడి సామెత భారతమును దోచుకొనవచ్చిన శ్వేతజాతులపట్ల – అక్షరాక్షరముగ సార్థక మైనది.

భారతభూభాగములను కబళింప, పాశ్చాత్య లొకరి కన్న మిన్నగ మరొకరు పన్నాగములు పన్నసాగిరి. వ్యూహ

ములు విఫలమైనతరి, నొకరిపైనమరొకరు తీరని క్రౌర్యములు పెంచుకొనజొచ్చిరి. ఎవరికివారే తాము పరమ మిత్రులమని భారతీయులను నమ్మింప నెత్తులు వేయుట కుద్యమించిరి. వారి చారుణ దౌష్ట్యములు భారతీయులలో సహజముగనే రగులు కొనుచున్న యనైక్యమునకు సహకారమునై, దేశమునం దశాంతిని ప్రజ్వరిల్ల జేయుచుండెను. విదేశీయుల కుట్రలకు, కుయుక్తులకు, కూటరాజనీతికి, కుటిలోపాయ పరంపరకు భార తీయులు లోనై, మలమల మాడసాగిరి.

ముఖ్యముగ ఫ్రెంచివారికిని, ఆంగ్లేయులకును పచ్చి గడ్డివేసిన భగ్గుమనుచున్న రోజు లవి. పరుల సొత్తుపై పెత్తన ములు సాగింప నెత్తులువేయు లుబ్ధప్రాగ్రేసరులు నాడు పెద్ద మనుష్యులై, విశృంఖలముగ విహరించుచుండిరి. వీరిలో ముఖ్య ముగ ఫ్రెంచివారిమధ్య, నాంగ్లేయులమధ్య దినదిన ప్రవర్ధ మానమగుచున్న స్పర్ధయే మన దేశారిష్టమునకు హేతుభూత మాయెను. వారి యంతఃకలహానులే చివఱకు భారతీయుల యంతఃకలహాము లాయెను. వారికొఱకు – వారి పక్షమున మనవారే జుట్టు జుట్టు బట్టుకొనెడి ఘోర దుర్దశ యీ దేశ మునఁ దలయెత్తెను. మనవారే కొందఱొక పక్షమున, మఱి కొందఱు మఱొక పక్షమునఁజేరి, విదేశీయుల రాజ్య విస్తరణ కాంక్షకు దోహదమొనర్పబూనిరి. ఇట్టి శోచనీయ పరిస్థితు లలో నాఁడు దేశము మునిఁగియుండుట విచారణీయాంశము. విదేశీయుల ప్రాబల్యమిూరీతి–మన దేశమున క్రమముగ నీల

భూమముపలె ప్రాకసాగెను. ఫ్రెంచివారు – చంద్రనాగూరు – పుదుచ్చేరి – మాహే – యానాం మొదలగు ప్రాంతములలో తమ జయ పతాకల నెగురవైచి, తమ యధికారమునకు గట్టి పునాదులు నిర్మించుకొని, ఆ యా ప్రాంతీయ ప్రజలకు ప్రభువులయిరి. పోర్చుగీసువారు – డయ్యూ – డామన్ – గోవా ప్రాంతములలో తమ యధికారమునకు దీర్ఘాయువుబోసి, విశ్వరూపము నావిష్కరింపఁజేయ జతనములు సాగించి, ఆ యా ప్రాంతములకు ప్రభువులయిరి. భూరకిరాతులవలె నటగల ప్రజలను చిత్రహింసలకు గుఱిగావించుచు, నిరంతరము బాధించుచు బలవంతముగ వారినందఱను తమ క్రైస్తవ మతము లోనికి మార్చుకొనిరి.

మిగిలిన దేశము నందంతట నాంగ్లేయుల పలుకుబడి, ప్రాభవముమెండుగనుండెను. విచిత్రతరమైన వారి ప్రయుక్తికి-పాశవిక శక్తికి సర్వ దేశము పాదాక్రాంత మగునాయేమి ? విచ్చలవిడిగ విహరింపసాగిన యాంగ్లప్రభుత్వభూతవికృతాధికారమునకు తప్పనిసరిగ మనవారెల్లరు దాసులు గావలసివ దేనా? విదేశీయుల కర్కశపాదఘట్టనములకు సర్వభారత భూభాగము జంకవలసినదేనా? భారత భాగ్యభానుని మేలుకాంతి కిరణముల పటిమ యేమగునో! చూచుచుండగనే శరవేగమున నాంగ్లవణిక్ప్రముఖుల పలుకుబడి – ప్రాబల్యము దేశమునలుగడల తీవ్రముగ వ్యాపింప సాగెను. కనులు మిఱుమిట్లు గొలుపు తెఱఁగున దర్పమును బెంచుకొని, యధికారమును

క్రైవసమొనర్చుకొనుచున్న యాంగ్లేయులను దేశీపారజూడ, నాటివారెవ్వరికిని గుండెజాలదాయెను. భారతదేశమున ఆంగ్లేయులపాలనము క్రమక్రమముగ వ్యాపింపసాగెను. మహారాష్ట్రులు పరప్రభువులకు తలయొగ్గక, వీరులపగిది స్వతంత్ర పాలనమును ప్రజానురంజకముగ సాగింప మొదలిడిరి. పూనాలో పీష్వాల ప్రభుత్వము చక్కగ జరుగుచుండెను. పీష్వాలక్రింద (1741 1800) నానాఫర్నవీసు పనిచేయుచు వారికి సర్వవిధముల నండదండగనుండెను. నానా ఫర్నవీసు 1741 సంలో సతారాలో జన్మించెను. ఈయన మహామేధావి; పరాక్రమవంతుడు.

ఆంగ్లేయులు, మహారాష్ట్ర ప్రభువులపై 1761 వ. సంవత్సరమున పానిపట్టురెండ్ద యుద్ధమును గావించిరి. ఈ యుద్ధములో మహారాష్ట్రులు పరాజితులైరి. నానాఫర్నవీసుకూడ నీయుద్ధమున నోటమినిజెంది యెట్టులో తప్పించుకొని, పూనా చేరెను. ఆ సమయమున పీష్వాలలో విభేదములు చెలరేగెను. రెండుగ చీలి వారు ఒకరితో మరియొకరు పోరాడు చుండిరి. నానా, మైనరుగనున్న పీష్వాపక్షమునజేరి, వానిని సింహాసన మధిష్ఠింపజేసెను. ఇది 1774 వ సంవత్సరము నాటిగాథ. తదాదిగ మహారాష్ట్ర సామ్రాజ్యముద్వారా, నానా, భారతీయ రాజకీయరంగమును నేకచ్ఛత్రముగ నేలెననవచ్చును.

మొగలులు, ఆంగ్లేయులు, నిజాము, హైదరాలి, క్రైంచివారు నీ భారతవీరునిపై కత్తిగట్టి, తిమింగలములు

పగిది, మహారాష్ట్రసామ్రాజ్యనౌకను ఛిన్నాభిన్నముచేయుటకు నెన్నియో కుట్రలు పన్నిరి. ఎత్తుగడలు సాగించిరి. కాని ! ఈ మహనీయుని మహాప్రజ్ఞాపాటవముచే, నవి యన్నియును విచ్ఛిన్నములైనవి.

ఈయన మహారాష్ట్ర సామ్రాజ్య నౌకను సుదృఢముగ నిలువ బెట్టుటయేకాక మహారాష్ట్ర సామ్రాజ్యమును సుదూర దక్షిణభారతమునుండి ఆఫ్గనిస్థానమువఱకు, విస్తరింపజేసి, మధ్యందిన మార్తాండునివలె ప్రదీపించినాడు.

'భారతదేశములో నతనితో సమానుడైన ప్రజ్ఞానిధి యింతవరకు పుట్టలేదని నిస్సంశయముగ జెప్పవచ్చును'

—Asiatic Annual.

'నానావంటి స్థానిక పరిపాలనాదక్షులతో పోల్చిచూచినచో, భారతదేశ పరిపాలకులమైన మనము (ఆంగ్లేయులు) తొడిచెట్లముందు, ఈతమొక్కలుగ గన్పింతుము.

—సులివన్ (ఆంగ్లప్రముఖుడు)

'మచ్చునకైనను స్వార్థవాసన యెఱుగని అకళంక దేశభక్తుడు నానా. అతడుచేయు నేపనిలోగూడ కంచుకాగడాలు పెట్టివెదకినను స్వార్థగంధము లేశమైనను కన్పింపదు.'

పి. యన్. ఓక్ మహాశయులు.

ఇట్టి మహనీయుడు 1800 సంవత్సరము మార్చిలో మరణించెను. ఇది మనదేశ దురదృష్టము.

అప్పటినుండి ఆంగ్లేయులు మనదేశమున పుంజుకొని రాజ్యవిస్తరణమును నిరంకుశముగ గావింపసాగిరి. కాని దీనిని సహింపజాలని భారతవీరులు కొందరు దేశము నలుమూలలగల శక్తులను సమీకరించిరి. 1857 వ సంవత్సరమున ఆంగ్లేయులపై తిరుగుబాటును గావించిరి.

ఈ తిరుగుబాటునే ప్రథమ భారతస్వాతంత్ర్య యుద్ధ మని చెప్పనగును. ఇది భారతీయులు స్వాతంత్ర్యము కొఱకు సాగించిన యుద్ధముగాదనియు; సిపాయీల తిరుగుబాటనియు; నేవేవియో అల్పకారణములను వల్లెవేసి, నిజమును దాచి, యసత్యప్రచారమునకు ఆంగ్లప్రభువులు గడంగిరి. ఎవ్వరేమను కొన్నప్పటికి, నిది ముమ్మాటికి ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామమే.

పరపాలనపట్ల-పాశ్చాత్యుల దురహంకృతిపట్ల-కుట్రల పట్ల,కుత్సితచర్యలపట్ల ఈహ్యభావము పెరిగి-విసిగి, వేసారి-యాత్మగౌరవమును గాపాడుకొనుటకై తీవ్రస్వరూపమున భారతజనత విక్రమించిన తొలిసుముహూర్తమది. ఈ బహిరంగ సత్యమును బుద్ధిమంతులైన వారెవ్వరును గాదనరు.

అసలీ ప్రయత్నమంతయు నొక పథకము ప్రకారము నిర్ణీతసమయమున, దేశమందంతట నొకే యొకసారి జరుగవలసి యున్నది. అట్లేజరిగినచో నా ప్రథమస్వాతంత్ర్యప్రథనాగ్నిలో నాంగ్లేయశలభములసంఖ్యాకములుగ భస్మము లైయుండెడివే.

కాని! దైవము వేరొక విధముగ దలచెను. నాడు ఓర్పును వహింపలేని భారతీయులు కొందరు ముందుగనే యీ యగ్నిని భగ్గుమనిపించిరి. కనులు దెఱచి ఆంగ్లపాలకులు శ్రద్ధ వహించిరి. దేశమునలుమూలల పెచ్చరిల్లుచున్నస్వాతంత్ర్యాగ్ని జ్వాలలను చప్పగ జల్లార్చుటకు తగిన సదుపాయము లాలోచించిరి.కార్యరంగమునకు దిగిరి. తుదకు విజయమును బడసిరి.

ఈ విధముగ ప్రథమభారత స్వాతంత్ర్య సంగ్రామము విఫలమయినను–పాశ్చాత్యుల గుండెలనుకలవఱపరచిన భారతీయులు కొందరు చరిత్రలో ధ్రువతారలై నిలిచియేయుండిరి.

అట్టివారిలో తాంతియాతోపే అగ్రగణ్యుడు. విధి విరామముల నెఱుగక, భారతీయుల నెల్లర నొక్కతాటిపై నడిపించి ఆంగ్లపాలకులను పరాజితులనుగావింప నీ మహానాయకుడానాడు సల్పిన కృషి ప్రశంసనీయము. మహారాష్ట్రిభూభాగమున జన్మించిన యీమహావీరోధుడు – స్వాతంత్ర్యపిపాసతో సైన్యముల సమాయత్తపఱచి ఆంగ్లేయులను ధైర్యసాహసములతో నెదిరించినాడు.

మరియొకవంక ఆంగ్లపాలకుల దురాక్రమణ వాంఛకు తన రాజ్యము బలిగాబెట్టుట కంగీకరింపక–పరిపూర్ణ సాహసమును గావించిన రణచండికవలె దేశసంరక్షణకు సముద్యమించిన ఝాన్సీలక్ష్మీబాయియు ఆంగ్లేయుల పాలిటికి సింహస్వప్నముగనే విరాజిల్లినది.

"గొంతులో ప్రాణముండగ నా ఝాన్సీకోటపై శత్రు వడుగు పెట్టజాలడని" యామె యొనర్చిన భీషణ శపథమే నెగ్గినది. పంచకళ్యాణి గుట్టము నధిరోహించి, పాశ్చాత్యుల కన్నులకు మిఱుమిట్లు గొలుపు తెఱగున యుద్ధభూమియందం తట తానుగ సంచరించినదా మహావీర నారీమణి. పిరికికండలేని వీరభారత సాధ్వీరత్నమామె.

ఈ యుద్ధమునందామె విజయము నందజాలక వీర స్వర్గము నలంకరించినది. అయిననేమి? ఆమె ప్రదర్శించిన యవక్రపరాక్రమ జ్యోతి వెలుగులు భారత స్వాతంత్ర్యరణ లక్ష్మికి వీరతిలకములను దిద్దినవి.

ఓటమిని పరిగణింపకయున్న, వాస్తవము నాలోచించి నచో-ప్రథమ స్వాతంత్ర్యసమరవ్యవహారము జాతికిమహోపకారమునే చేసినట్లు మన కర్థమగును.

వందలకొలది యేండ్లు దాస్యమున మునిగియున్నజాతి, జాగరితమైనది. బానిస తనము జీర్ణించిపోయిన నరములలో స్వాతంత్ర్య కవోష్ణరుధిర ధారలు పొంగి పొరలినవి.

జాతియంతయు నొక్కటిగ నిలిచి విజాతీయుల పెత్తన మును గూలద్రోయవలయుననెడి నిర్ణయమునకు వచ్చినది.

స్వాతంత్ర్యపిపాస పరవళ్ళుద్రొక్క నారంభించినది. ఒకనా డొకరిపై నొకరు కత్తులునూరుకొనిన హిందూ మహమ్మదీయులుగూడ చేతులు చేతులు కలిపి 'భాయి భాయి'

యనుకొని 'జయహో! స్వతంత్ర భారత జననీ! యని గావు గుండెతో గర్జించిరి. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామము మనకీ బహిరంగ సత్యమును అసందిగ్ధముగ వెల్లడించినది. కాలము ముందునకురికినది.

ఇంగ్లీషువారి పాలన యీ గడ్డమీద బలపడినది. వ్యాపారార్థి మీ దేశమున నడుగువెట్టి, యీతపని గావించి, యిట్టి స్థితికిఁజేరిన యీస్టిండియాకంపెనీ పాలనమునుండి మన దేశమును ఆంగ్లప్రభువులు తమ హస్తగత మొనర్చుకొనిరి. ఘనతగడింపఁగలదైన యీ యధికారసంపద యంతయు విక్టోరియారాణి పరము గావింపబడెను. మనదేశాధికారమిట్లు మన దేశీయుల హస్తములనుండి జారి, యీస్టిండియాకంపెనీ వారి చేతికిజిక్కి, విశాలస్వరూపమునుదాల్చి, విక్టోరియా రాణికి కైవసమాయెను. దీనితో నాంగ్లప్రభువుల యధికారము మన దేశమున గట్టిగ వ్రేళ్ళుదన్నుకొని, నిలువగలిగినది.

విక్టోరియారాణి చతురతతో దనయధికారమును సుస్థిరమొనర్చుకొనుటకు దగిన శ్రద్ధ వహించెను. ఈమె పరిపాలనా కాలమున జల్లగ మనవారెల్లరు పాశ్చాత్య మాయా వాగురులలోఁ జిక్కుకొనుట తటస్థించెను. మనలను నోరెత్తనీయకుండుటకుగాను - వారు తొలుదొలుత విద్యారంగమున బ్రహ్మాండమైన మార్పులను దెచ్చిపెట్టిరి. మానవుని జ్ఞానశక్తిపై దెబ్బగొట్టినఁగాని, జాతి పతనదశకు గురిగాదనెడి రహస్యము వారికి బాగుగ నవగతమాయెను. కావుననే

యూంగ్లేయులు హిందూదేశమున నాంగ్లవిద్యను కావలెననియే ప్రవేశపెట్టిరి.

దేశీయభాషలకు ప్రాధాన్యము తగ్గెను. ఆంగ్లము నేర్చిన వారికే యుద్యోగము లిచ్చుటాచారమాయెను. ఇంగ్లీషు రానివాడు బృహస్పతి యైనను - వానికాంగ్లపాలనమున గౌరవ మర్యాదలు లేవు. దీనితో ప్రజలు వెఱ్ఱెత్తిన పగిది దేశీయభాషల నీసడించి, యాంగ్లభాష నభ్యసింపసాగిరి. ఆంగ్ల విద్యనేర్చిన భారతీయుల నందఱను తెలివిగ పాశ్చాత్యులు తమ కార్యాలయములలో గుమస్తాలుగ నియమించుకొని, బండ చాకిరి చేయించుకొనుచుండిరి. వ్రతముజెడినను ఫలము దక్క లేదు. మాతృభాషను మఱచి పరభాష నభ్యసించినను - ప్రముఖస్థానములలో నుద్యోగములు భారతీయులకు లభ్యపడ లేదు. పరిపాలనారంగమునందున్న తపదవులన్నియు ఇంగ్లీషు వారికే వశపడి యుండెను. గౌరవోద్యోగములు మనవారికి దక్కలేదు. కాని, యాంగ్లవిద్య దేశమున పొగవలె వ్యాపించి, యెల్లర నుక్కిరి బిక్కిరి చేసివైచినది. పరభాషపై మోజు, భ్రమపెరిగి, ప్రజలు పరవళ్ళు ద్రొక్కసాగిరి. ఆంగ్లమును జిహ్వాగ్రమున నాట్యమాడింపగలవారే నాడు దేవతా స్వరూపులైరి. పలుకఁదగిన భాష ఇంగ్లీషే యనెడి వ్యామోహము ప్రబలరూపమును దాల్చినది. స్వప్నములలోఁ గూడ హిందువు లాంగ్లమునఁనే కలవరింపసాగిరి. దేశీయ భాషలలో మాటాడుట గౌరవహీనముగ భావించెడి దుస్థితి సంభవించి

నది. మాతృభాష నుచ్చరించువానిని మందునిగ దలంపసాగిరి. ఆంగ్లభాషావ్యామోహమిట్లు దేశమునందంతటను పూర్తిగ గ్రమ్ము కొనుటవలనను, ప్రభుత్వమువారు దేశీయభాషల యభివృద్ధిపట్ల శ్రద్ధ వహింపక పోవుటవలనను ప్రాంతీయభాషలు క్రమముగ క్షీణింపసాగినవి. దేశదౌర్భాగ్యమున కిదియొక ప్రధానహేతువు. భాషతోఁ బాటుగ దేశీయ సంస్కృతియు సన్నగిల్లసాగినది. మన మాతృదేశమగు హిందూదేశమును ఇండియా యనియు, ఇందలి ప్రజలను ఇండియనులనియు పేరులుమార్చి పిలువ సాగిరి. సదాచారములయెడ విముఖత పెరిగెను. వేదధర్మము లవహేళనపాలయినవి. దైవముపై విశ్వాసము అంతరింపసాగెను. భావానుకరణము మెండాయెను. ప్రతివిషయమునందును ఆంగ్ల ప్రభువుల ప్రాభవమే ద్యోతకము గాసాగినది. మన శాస్త్ర ములకు గౌరవము నశించినది. మన కళల నభిమానించువారు గానరారయిరి. మనలను మనమే మఱచితిమి. ఆంగ్లేయులకు మనము భావదాసులముగ మారితిమి. అట్లు మారుటయే యొక గౌరవప్రదమైన యంశముగను, మారకుండుట యొక యవివేక లక్షణముగను దలంచెడి దుస్థితి యేర్పడినది. ఈ యుప్పెన కెదురొడ్డి, నిలిచి, యీదగలిగినవారు శ్రేష్ఠులైన లెక్కించుట కేనియు జాలరైరి. ఆంగ్లప్రభువుల చేతి కొరడా - సర్వరంగములలో మనపై పైత్తనమును చెలాయించుచున్న కాలమది.

తెలిసితెలిసి, యెటోగి యెటోగి యేమియుఁ దెలియని వారివలె, నేమియు నెఱుఁగనివారి పగిది వాణిజ్యార్థమువచ్చిన పరదేశీయుల యుక్కు కౌగిలిలో మనకు మనముగ-నైచ్ఛిక ముగ నిరుకుకొని యుంటిమి గదా! నాఁడు సలుపగలిగినదే ముంపును? కాదని వాదించి, యీదలనెత్తి చరింపగల యాత్మ బలము నాఁడెచ్చటనుండి మనకు వచ్చును? వారి యుద్ధతికి దాసోఽహ మనుటకన్న - భిన్నమగు పూర్ణమానాడు మన వారి కన్నులకుఁ గనఁబడని దాయెను. ఏ మహాపురుషుని యాత్మశక్తి మఱిల నీ సంఘమున నవచైతన్యసుధల బొరలించునో! ఏ దివ్యుని యుత్తమ సందేశ శంఖారావముతో మన వారు మేల్కొందురో! ఏ యఖండ జాతీయోద్యమధార మన దేశీయులకు విముక్తిని బ్రసాదించునో! వేచిచూచుటకన్న గత్యంతరమేమున్నది?

కాలము విలాసముగ ముందునకు సాగిపోవుచుండెను. ఆంగ్లేయులకు దాస్యమొనర్చుటకే మనవారు జీవితములను ధారవోయుచుండిరి ఆంగ్లేయుల నాగరికత మనవారిలో పెరిగి పోయినది. ఆహార విహారములలో వేషభాషలలో ఇంగ్లీషువారి ననుకరించుచు, ప్రాచీన సత్సంప్రదాయములను మనవారు విస్మరింపసాగిరి. మన దేశీయ సంపదలన్నియు ఆంగ్లప్రభువులు కొల్లగొట్టిరి. దుర్భర దారిద్ర్యము దేశమున తాండవింప దొడంగినది. అంగబలమును, అర్థబలమును కోల్పోయి, నిఱుపేదలై మనవారు కూటికి మలమలమాడెడి దుస్థితి వాటిల్లినది.

అన్నపూర్ణయని విశ్వవిఖ్యాతి గాంచిన మన 'దేశమునకు 'అన్నమో రామచంద్రా' యని యలమటించు దుర్భరస్థితి దాపురించినది. పెద్దలను గౌరవించెడి సంప్రదాయము మఱు గున బడినది. మాతృభాషపట్ల భక్తిశ్రద్ధలు సన్నగిల్లినవి.

19 వ శతాబ్దమువచ్చినది. మన భావసరళిలో సంచలన మేర్పడినది. నాఁడు మనదేశమున హఠాత్తుగవచ్చిన కొన్ని పరిణామములు_మన కన్నులు దెఱచుటకు కారణభూతములై నిల్చెను. జర్మనులు మన సంస్కృతభాష నభ్యసించి, అందు నైపుణ్యమును సంపాదించి, మన సనాతనసంస్కృతిప్రాశస్త్య మును వేనోళ్ళ చాటుటారంభించిరి.

మన సనాతన వేదధర్మము మనదేశీయులకుమాత్రమే పరిమితమైయుండలేదు. అది విశ్వజన సంక్షేమ సంధాయక శక్తి మంతము. సర్వజనాభిమాన పాత్రమైనట్టిది. సర్వమాన వులకు సంబంధించినట్టిది. సర్వభాషలకు మాతృభాషయనఁ దగు గీర్వాణముననే యీ సంస్కృతియు - గ్రంథసంపదయు నుండుటచే, విశ్వకల్యాణ జిజ్ఞాసువులగు జర్మనులు - విశాల దృష్టితో_విశ్వజనీనమైన మనదేవభాష నభ్యసించి, విజ్ఞతను బెంపొందించుకొన విస్తృత కృషిని సాగించిన పుణ్యకాలమది.

సకలభాషలకు సంస్కృతము మాతృభాషయని వారా నాడైనెత్తి చాటిరి. సంస్కృతమును సభక్తికముగ నధ్యయన మొనర్చిరి. మనసంస్కృతపండితులను గౌరవించి,యాదరించిరి. వీరినిగాంచి, ఫ్రెంచివారును-కొందఱాంగ్లేయులును సంస్కృత

భాషాధ్యయనము జేయనారంభించిరి. అందలి మధుర భావము లకు-మన ప్రజ్ఞానమునకు ముగ్ధులైరి. హిందువుల సహజ సరళ దయ-విశ్వకల్యాణదాయకము నయిన యాధ్యాత్మిక తత్త్వ మహిమను బాగుగ నవగాహన మొనర్చుకొనిరి. మనదేశీయు లకుగల భగవద్విశ్వాసమును ప్రశంసింపసాగిరి. తమ దేశము లలోగల కళాశాలలయందు-గీర్వాణభాషాపీఠములనుస్థాపించి, వారి విజ్ఞానమును సంస్కరించుకొనిరి. చక్కదిద్దుకొనిరి. సముచితోత్సాహమున సంస్కృత సరస్వతి చరణసేవ సాగించిరి. పరదేశీయులగువారే మన సంస్కృతమును, మన సంప్రదాయమును విశేషముగ గౌరవించుచున్నతీరు- మనకు కను విప్పు గలిగించెను. పాశ్చాత్యపాలనాఫలముగ మన భావాంబరములపై గ్రమ్ముకొనిన దాస్యమేఘములు క్రమముగ విచ్చిపోవుటకు నాడంకురారోపణము సూక్ష్మస్వరూపముగ జరిగెనని వక్కాణింపవచ్చును.

జర్మనులు మన సంస్కృతభాష నెంతగనో ప్రేమించిరి. తత్కారణముగనే భారతీయులను వారమితముగ నాదరించుట జరిగెను. ఈ యాదరణ మనవారికి పూర్వస్మృతినికొంత కల్గించిన దనవచ్చును. భారతీయులలో స్వదేశ భాషాగౌరవాభిమానములపట్ల క్రమముగ భక్తి పొడగట్ట దొడగెను.

బ్రిటీషువారి దుష్టపాలనా ఫలితముగ 1857 లో ఆంగ్లేయులపై మనదేశ నాయకులు తిరుగుబాటు గావించి రంటికిగదా ! క్రమశిక్షణారాహిత్యము, భారతీయులమైన

మనలో గూడుకట్టుకొనియున్న విదేశీ వ్యామోహ పరాయణతయు మన విజయమున కవరోధములై నిల్చినవి. నాటి పోరాటమున భారతీయులే పరాజితులైరి. ఆంగ్లప్రభువుల పతాక సగర్వముగ జెపజెప లాడసాగినది. వారి యుద్ధతి నిరంకుశముగ పెత్తనమును చెలాయించుచునేయుండెను. భారతీయు లెప్పటియట్లు బానిసలవలెనే జీవించు దుస్థితి తప్పలేదు. ప్రథమ స్వాతంత్ర్యసిద్ధి ప్రయత్న మిట్లు వ్యర్థ మాయెను. 19వ శతాబ్దపు మధ్యకాలమున సిపాయీల కలహాముపేరిట జరిగిన యీ స్వాతంత్ర్యపోరాటము నిరుపయోగకరమగుటచే, రాజకీయనాయకుల ప్రాబల్యము మఱి యిక ముందడుగువేయ లేకపోయినది. ఇట్టి పరిస్థితులలో దేశము సర్వనాశమున కున్ముఖమగుచుండ దానిని రక్షించి పోషింపవలసిన బాధ్యత రాజకీయనేతల భుజస్కంధములనుండి, యాధ్యాత్మికవేత్తలపై బడినది. ఆధ్యాత్మికము మనకు నైజసంపద. ప్రత్యేక విశిష్టత.

ఇట్టి పరిస్థితులు దేశమున నుప్పతిల్లినప్పుడెల్ల దేశభద్ర తను బెంపొందించుటకు మహాత్ము లవతరించుచునే యుండిరి. మన సనాతన ధర్మమును, సంస్కృతిని, మన యాధ్యాత్మిక విశిష్టతను పరిరక్షించుచునేయుండిరి. 19వ శతాబ్ది ప్రారంభమున కొందఱు మహాపురుషు లిట్టి ప్రయత్నమునకు గడంగి, దేశమున తిరిగి నవచైతన్యమును నెలకొల్ప నుద్యమించిరి.

రాజారామమోహనరాయలు (1774 – 1833)

వీరిలో రాజారామమోహనరాయ లొకరు. మన సంస్కృతిని విశ్వవ్యాప్తముగావించుటకు కొన్ని సంస్కరణముల నాతడు సూచించెను. ఈయన మహావక్త. దిట్టతనముగల పండితుఁడు. సంస్కారదృష్టిగల దేశసేవకుఁడు. సతీసహగమనమను నాటి దురాచారము నరికట్టుటకై – బ్రిటీషు పార్లమెంటు వఱకు నేగి, దానిని, నిర్మూలించు శాసనమును గావింపజేసిన మహనీయుడు. బ్రహ్మసమాజమును స్థాపించి, దివ్యప్రచారమును సాగించి, భారతీయులనుసేవించి, బహుముఖ ప్రజ్ఞాశాలియై రాణించిన రాజారామమోహానునికృషి నాఁడు దేశమాత పరివేదన దీర్చుటలో ప్రముఖపాత్రనే వహించెను. రామమోహానుని యపూర్వ ప్రతిభకు నాఁడు, ప్రాచ్య పాశ్చాత్య ఖండములు భక్తిప్రపత్తులతో నివాళులనెత్తెను. మన సనాతన సంస్కృతిని సమకాలిక పరిస్థితులకనుగుణముగ, సంస్కరించు కొననిచో–మనము విశాల విశ్వమునఁగల మానవాళిదృష్టిలో పరిహాసపాత్రులమగుదుమని యుదాత్త ప్రబోధమును గావించి నాఁడు రామమోహానుఁడు. కావునసే, కంకణముగట్టి, దారుణ దురాచారమగు నిర్బంధ సతీసహగమనమును చట్టబద్ధముగ దొలగించెను. మహర్షిగ ఖ్యాతిబడసెను. తన దృఢ తమ మనోబలమున భారతీయ సంస్కృతికి మహోపకారము గావించెను. శాశ్వతయశమునుగడించి, కీర్తిశేషుడయ్యెను.

రామమోహన నామముతో, భారతదేశమున పలు సంస్థలు వెలసినవి. ఆదర్శప్రాయమైన రామమోహనుని బహు ముఖ పరార్థకృషిపట్ల భారతీయులకుఁగల భక్తి గౌరవముల కవి ప్రత్యక్ష చిహ్నములుగ ప్రశంసల నందుచున్నవి.

రామమోహనుఁ డుపనిషత్తులకు ప్రత్యేక ప్రాధాన్య మొసగెను. ఈ మహనీయునికృషి, ప్రజలలో నచంచల దీక్షకు, నిరుపమాన ధీశక్తికి ప్రబల సాక్ష్యముగ నిల్చినది. ఈ పుణ్యమూర్తి కాలముననే, హిందూసంఘమునఁగల దురాచారములపై పెద్దయెత్తున తిరుగుబాటు ప్రారంభ మైనదన వచ్చును. మానవశక్తిని సంఘటితపఱచి, మహోద్యమము లను నడపు కార్యక్రమమారంభమైనది. హైందవులలో నణగి యున్న చైతన్యశక్తి తలయెత్తి, వికసింపసాగెను. పాశ్చిక ప్రకృతిగల పరరాజులపట్ల యేహ్యభావము క్రమముగవర్ధిల్ల నారంభించినది. స్వతంత్ర భావము విస్తృతి నందసాగినది.

దయానందుడు (1824–1883)

ఇక దయానంద సరస్వతియో! నిత్య స్మరణీయుఁడు. ఈయన యాబాల్య నిశ్చల నిస్తుల బ్రహ్మచారి. విరజానందుని ప్రియశిష్యకోటిలో నగ్రతముఁడు. ఋషి సత్తముఁడు. గురు దేవుల సన్నిధిలో వేదవిద్యల నామూలాగ్రముగ నధ్యయన మొనర్చి, వేదసరస్వతీ నిజస్వరూపమును గుర్తింపఁ జాలిన

మహామేధావి. గణనీయుఁడైన కర్మిష్ఠి. వేదములన – మంత్ర ములు, సంహితలే యని వేదముల నుండియే సక్రమమైన యాధారములను, ప్రబల నిదర్శనములను జూపెట్టిన మహా నీయుఁడు. వేదములే మన సనాతన ధర్మసౌధమునకు మూల స్తంభములని యాయన వక్కాణించెను. భారతీయ సంప్ర దాయ సంస్కృతుల సత్య స్వరూపమును నిర్భయముగ, సహేతుకముగ దేశమునఁ జాటెను.

వేదములలో – నాధ్యాత్మిక, యాధిభౌతిక, యాధి దైవిక విజ్ఞానము సమగ్రముగ నెలకొని యున్నదనియు – తద్రహస్యమును గుర్తించలేని భౌతికవాదులు వేదవిజ్ఞానము నసమగ్రమైనదానినిగ నభివర్ణించుచున్నారనియు నిర్వచించి, దయానందుఁ డట్టి భౌతికవాదులను నిరసించెను. భౌతికశాస్త్ర ముల విజ్ఞానమే సంపూర్ణ విజ్ఞానము కాఁజాలదనియు – భౌతిక శాస్త్రముల విజ్ఞానమునకును బీజములన్నియు వేదములందే గర్భితమై యున్నవనియు దయానందుడు నిష్కర్షగ నిర్వచించి పాశ్చాత్యులను నిరుత్తరుల గావించెను. విస్మితుల నొనర్చెను. దయానందుని యార్ష సిద్ధాంతబలమును– సనాతనధర్మ సందేశ వైభవమును విశ్వమున నెందఱో సభక్తికముగ నామోదించి యానందించిరి.

త్రికరణశుద్ధిగ సత్యము ననుష్ఠించుచు – సత్యమును ప్రబోధించుచు – సత్యసంధుఁడుగనే కీర్తిగడించుచు– 'సత్యార్థ ప్రకాశిక' యను మహాగ్రంథమును ప్రపంచమునకు ప్రసా

దించెను. సంకుచితభావులు – స్వల్ప విజ్ఞానులు నగువారెంద రెన్నివిధముల నెదిర్చినిల్చినను, దయానందుఁడు ధీరోదాత్తుడై, మోహరించి, సత్యమును స్థాపించి, విజయమును బడసెను. కల్లోల పరిస్థితులలో – దేశప్రగతికి సనాతన తపోబలముతో సాయపడ సంకల్పించిన సత్యమూర్తి దయానంద సరస్వతి. ఆంగ్లభాషతో బొత్తిగ పరిచయము లేకున్నను – సంస్కృత భాషాధ్యయన బలముతో, వేదవిజ్ఞానప్రజ్ఞతో నిత్య సత్యముల వెలయించి, పాశ్చాత్యులచేసైత మామోదింపఁజేసిన ప్రతిభాశాలి యీ మహనీయుడు.

దివ్యజ్ఞానసమాజమువారీ మహర్షినాకర్షింప యత్నింప, వారినే తాను నమ్మిన వేదములవంక కాకర్షించి, వారిచే వేదధర్మముల నామోదింపజేసెను. దేశ స్వాతంత్ర్యసిద్ధికి – దేశ సౌభాగ్య పరిపూర్ణ వికాసమునకు సనాతనధర్మ సమారాధనమే రాచబాటల జూపగలదని ముక్తకంఠమున దయానందుఁడుపదేశించెను. జాతీయతను సువిస్తృతము గావించి, యంటరానితనము నంతమొందించి భారతీయ సమైక్యమును సంరక్షించుకొనుడని ప్రజలను హెచ్చరించెను. వేదములు భారతమునకు భగవద్దత్తమైన విజ్ఞాననిధియని వివరించెను.

వేదవిజ్ఞానము సర్వమానవులకు జెందినదనియు – స్త్రీ పురుష తారతమ్యముగాని, ప్రాక్పశ్చిమ వైరుధ్యముగాని లేకయే యెల్లరు వేదముల నధ్యయనము గావింపవచ్చుననియు దయానందుఁడు నిర్దుష్టముగ నిరూపించెను. ఆర్యసమాజమును

స్థాపించి, దేశ గౌరవప్రగతికి సముచిత సహకారము నొన
ర్చెను. 'కృణ్వంతు విశ్వమార్యమ్' అను సంకల్పముతో -
సనాతన ధర్మ శంఖారావమును విశ్వమున పూరించెను. ఏ
తన్మంత్ర మహామహిమ వలననే సనాతన సంస్కృతిని, వేద
ధర్మపరతను బెంపొందించి, హిందువుల నుద్ధరించి, స్వచ్ఛంద
మైన యార్యసిద్ధాంతమునకు విధేయులనుగావింప ప్రబల కృషి
సలిపెను. వేదమున ప్రవచింపబడిన విధానమునకు భిన్నముగ
హిందూసమాజమునం దమలునందున్న యసహ్యకరము
అమానుషమునైన యస్పృశ్యతను తీవ్రముగ ఖండించెను.
దానిని సంపూర్ణముగ తుదముట్టింప దీక్షవహించెను. హిందూ
సంఘమున ద్వేష్యులాతుకొనియున్న మతికొన్ని దురాచార
ముల నంతమొందించి, సంస్కృతినికాపాడి, వేదప్రబోధ బల
ముతో కృతయుగ ధర్మావతరణకు పూర్ణకృషిగావించెను.
భారతదేశమున నాఁడేర్పడిన యుపప్లవములనడుమ - మహర్షి
దయానందునికృషి, దీక్ష, భారతజాతీయ గౌరవప్రతిపత్తులకు
బ్రహ్మాండమైన సహకారము నందించి, భారత దేశమునకు
మహోజ్వల ప్రతిష్ఠను సంఘటించెననుటలో నతిశయోక్తి
లవలేశమేనియులేదు.

ఒకవంక వంగప్రాంతీయుఁడైన రాజారామమోహనుని
యత్నము భారతీయులకఖండ మనోబలమును సంఘటింప -
మతియొకవంక మహర్షి దయానందుని మహోద్యమధార
ణైతికబలమును - సనాతన ధర్మమును - సంస్కృతిని ప్రబల

వాస్తవమొనర్చుటకును, సంరక్షించుటకును-సంపూర్ణసహకారమును గావించుచు దేశభక్తికి-స్వాతంత్ర్యసముపార్జనమునకు ప్రబలప్రోత్సాహము నొసంగుచుండెను.

మహర్షి దయానందుని వేదసుధ - రామమోహానుని ప్రబోధామృతము భారతీయులను జాగ్రదవస్థకు గొని తెచ్చినవి. దేశము పశుబలపు పెత్తనమును గాంక్షించుట లేదనియు - ప్రసన్న శాంతిని, స్వరాజ్యమును వాంఛించు చున్నదనియు సువ్యక్తముగావించు తరుణమది. మనోద్రష్టి మయు-నైతిక శక్తిసంపదయుగల యాధ్యాత్మిక శక్తిసంపన్నుల సుశిక్షణను, ప్రభోధమును జాతికోరుచున్నట్లు తేలిపోయినది. ధర్మభ్రంశము జరిగినతఱి, న్యాయమునకు వైకల్యమేర్పడిన దశలో ఋషియే మనజాతిని గాపాడుకొనుచువచ్చినట్లు మనకు చరిత్ర సాక్ష్యమిచ్చుచుండెను. పాశ్చాత్యుల యాజమాన్యమున దేశమున నుప్పతిల్లిన వికృత పరిస్థితులనుగూడ చక్కదిద్దుటలో - ఋషిశక్తియే విజయమును గడించినట్లు మనకు దయానందాదిమహర్షుల కృషి వ్యక్తమొనర్చును. ఈవిధముగ కలియుగమును సంరక్షించుటకు, కృతయుగపు తొలివెలుగును ప్రసరింపజేయుటకు మఱల ఋషిశక్తియే విజృంభించి, సంపూర్ణ బాధ్యతను వహింపవలసివచ్చినది.

తదుపరి యీదేశమున సారవంతములైన యాధ్యాత్మిక బీజములను నాటినమేటి - వంగదేశవాసుడైన గదాధరుడు

రామకృష్ణ పరమహంస (1836 – 1886)

వంగ ప్రాంతమున కామారిపుష్కరమను నొక చిన్న పల్లెలో నివసించుచున్న ఖుదీరామచటర్జీ, చంద్రమణీదేవులను వేదబ్రాహ్మణ దంపతుల తపఃఫలముగ – నోముల పంటగ నీ బాలుడు జన్మించెను. భగవంతుడగు గదాధరుడీపుణ్య దంపతులకు స్వప్నమున సాక్షాత్కరించి, వరమును ప్రసాదించుటచే గలిగిన నీ బిడ్డనికి తలిదండ్రులు గదాధరుడని పేరిడిరి. ఈ బాలుడు కొంతకాలము స్వగ్రామమునందే తన జీవితమును గడపెను. తదుపరి, కలకత్తాయందుపాధ్యాయుడుగనున్న తన యన్నగారికడ కరిగెను.

బాల్యమునుండియే గదాధరునిలో కొన్ని దివ్యలక్షణములు వ్యక్తములైనవి. దేవాలయముల కరుగుట, విగ్రహములను దీక్షగదిలకించుచు పరవశుడై మైమఱచుట, దివ్య సమాధి నిష్ఠుడగుట మున్నగునవి గదాధరునకు సహజములై పోయెను. నిరుపేదకుటుంబమున జన్మించినను, పేరాసలకాయన హృదయమేనాఁడునుతావీయలేదు. భోగములనెన్నడు నాయన కాంక్షింపలేదు. కలకత్తాలో తన యన్నగారి చెంతనుగూడ గదాధరునకు కాలునిలువలేదు. లౌకికవిద్యలనుజదివి, యందు తాను సాధింపవలసిన దేమియులేదని యనుకొని, యీ విషయము నన్నతో స్పష్టముగనే తేల్చిచెప్పి, చదువు విరమించినాఁడు. దైవమాయన కనతికాలముననే సముచిత స్థానమును జూపెను. దక్షిణేశ్వరమునగల కాళీమాత దేవాలయమున

గదాధరుడర్చకుడైనాడు. తుదకదియే గదాధరుని సాధన క్షేత్రమును, సిద్ధిక్షేత్రమునుగూడనై దివ్యక్షేత్రముగ ప్రసిద్ధి గాంచినది.

జగన్మాతయగు కాళికాదేవిపూజలో-చిత్తశుద్ధిని,సంకల్ప సిద్ధినిసాధించి, శ్రీరామకృష్ణపరమహంసయనుపేర నీయుగమున నీమహనీయుఁడే దైవాంశ సంభూతుడుగ ప్రజలపూజలనందు కొనెను. విద్యకు - పారమార్థిక జ్ఞానమునకు సంబంధము లేదనియు, నత్యద్భుత తపశ్శక్తితో నిరక్షరాస్యులు సైతము పరమేశ్వరుని ప్రత్యక్షమొనర్చుకొనవచ్చుననియు లోకమునకు జాటినదీమహర్షియే. అపూర్వములైన మహిమలెన్నింటినో ప్రదర్శించి, దైవవిశ్వాసమును మానవాళిలో నుజ్జీవింపఁజేసిన పుణ్యమూర్తియనకే దక్కినది. అఖండజ్యోతిగవెలిగి, ఆనంద స్వరూపునివలె సంచరించి, ఆధ్యాత్మికతత్త్వ ప్రతిభను లోక మున కందించి, నరులను తరింపఁజేయఁగలిగిన దక్షత యీ యుగమున రామకృష్ణునియందు ప్రత్యక్షముగ ప్రజలుగాంచ గలిగిరి. దేశదేశాంతరముల వారికేగాక, ఖండఖండాంతరముల వారికిగూడ, రామకృష్ణమహోదయము కనువిప్పుగావించెను. భగవంతుని స్వయముగ గాంచితిననియు, నితరులకుఁజూపఁగల ననియు నిస్సందేహముగ నిర్వచింపఁజాలిన దీమహర్షిసత్తముఁడే యనవలెను.

జీవితమునంతయు పరోపకారచింతనలో వ్యయపఱచి, పరమేశ్వర లీలావిలాసములను ప్రచురముగ ప్రచారము

గావించుటకే మనుగడనుదాత్తమొనర్పఁగలవారెవ్వరుందురు? ఎచ్చటెచ్చటనుండియో వచ్చినవారెల్లరు రామకృష్ణుని మహా మహిమలను కీర్తించి, యామహనీయుని దివ్యతేజోమయ స్వరూపమున కభివందనము లాచరింపఁబూనుట సామాన్య విషయమా?

మహత్తర దివ్యభావ పరిపూర్ణములైన పలుకులతో సర్వులను సమాకర్షించి, యఖండ సచ్చిదానందపరబ్రహ్మము వంకకు మానవకోటి నామహాత్మ్యఁ డవలీలగ నడపెను. హృదయ గర్భితములైన సుదేశ్రవంతులను వెలికురికించి, సకల ప్రజాహృదయ కాలుష్యసంక్షాళనము గావింపఁగల్గెను. భూతలమును పుణ్యధరా తలమొనర్చుటకు ప్రాక్తన సంస్కృతీ వైభవ ప్రాభవములను సముద్దీప్తము గావింప సాహసించి నిల్చెను. పారమార్థికాశయములతో-మహోత్తమ తపశ్చర్యలతో-ఆత్మసందర్శన శక్తిసామర్థ్యములతోఁ గూడిన ప్రాచీన భారతజాతీయ జీవనగంగా ప్రవాహమే శ్రీరామకృష్ణపరమహంస. అనిర్వచనీయ రామణీయకముతో నలౌకిక సౌరభములను వెదజల్లు శ్రీరామకృష్ణుని వచోమాధుర్యమును చవిజూచి యానందించెడి యవకాశ మీ యధునాతన కాలమునఁగల ప్రతిమనుష్యునకు సులభముగ దక్కును.

సూర్యోదయమైనది. భారతదేశమునకేకాక, ప్రపంచమున కంతటికినిఁగూడ దివ్యతేజో వికాసమును జూపించి, విస్మరింపఁజేసిన దినమది. పురాతన వేదాంతమతమున కొక

మహాప్రవక్త నాఁడు భారత భూభాగమునందవతరించెను. కామినీ కాంచన వాంఛాపరిపూర్ణ పరిత్యాగమే శ్రీరామ కృష్ణుని స్వరూపమునకు వన్నెచేకూర్చినది. ప్రతి కాంతను మాతృభావమునఁ దిలకించి యర్చించుటందఱకు సాధ్యమా ? తన సతిలో జగన్మాతృస్వరూపము నూహింపఁగలిగి, యారాధింప నేర్చిన వారెందరీయవనిపై మున్నుదయించిరి ? ధనము గనినంతనే ప్రలోభము విశ్వరూపమునెత్తి, ప్రతి వ్యక్తిని మురియించునుగదా ! మఱి ద్రవ్యమనుపేరు విన్న మాత్రమునననే హృదయకంపన మెందరిలో నుదయించును ? స్వార్థశయమును సమూలనిర్మూలన మొనర్చి, విషయ వాంఛలను జయించి, కాలుష్యమును గడిగివైచి, జీవితమును ధన్యమొనర్చుకొనఁ గలుగుటందఱకు సాధ్యమా ?

బుద్ధభగవానుని విశ్వజనీన ప్రేమభావనకు – శ్రీశంకర భగవత్పాదుల శాస్త్రవైదుష్యశక్తిని మేళవించి, జగదుద్ధరణ గావించుటకై, యొక సర్వజ్ఞమూర్తి గదాధరవర ప్రసాదియై, వంగప్రాంతమున జన్మించి, గదాధరనామమున పెరిగి, శ్రీరామకృష్ణ పరమహంసగ ప్రపంచవిఖ్యాతిగడించెను. వేయేల? సనాతనధర్మ తత్త్వమే శ్రీరామకృష్ణపరమహంస. సజీవాకృతినిదాల్చినదివ్యత్వమే యీమహనీయునివ్యక్తిత్వము. ఆయన తపస్సు పండినది. ఆయనవాణి దిగంతములవఱకు మార్మ్రోగినది. మనదేశపు కీర్తిప్రతిష్ఠలు, విశ్వవ్యాప్తములుగ వికసించినవి.

ఆయన శిష్యులు గురువునుమించిన ఘనతను గడించి, దేశయశమును బెంచిరి. వారిలో వివేకానందుఁడగ్రగణ్యుఁడు. నరేంద్రుఁడనుపేర బాల్యమునుండియు వర్ధమానుఁడై, కోవిదులగు తల్లిదండ్రుల సంరక్షణలో సంస్కృతిపట్ల భక్తిప్రత్తులు గలవాఁడై, భగవచ్చింతనతో జిజ్ఞాసాపరుఁడై, యీ యువకుఁడు చిరకాలము పరిశ్రమించెను.

వివేకానందుడు (1863–1902)

కలకత్తాపట్టణమున భువనేశ్వరీ, విశ్వనాథదత్తు దంపతులకు కాశీవిశ్వేశ్వరాను గ్రహమున గలిగిన ముద్దుబిడ్డ నరేంద్రుడు. విధినియమములతో నిత్యము రామాయణ మహాభారతములను పారాయణమును గావించెడి భువనేశ్వరీ మాతయే, నరేంద్రుని యాధ్యాత్మికశక్తి పెంపొందుటకు కారణభూతురాలు. ఉగ్గుబాలతో నాధ్యాత్మికతత్త్వమును గలిపి, నరేంద్రునిచే, కషాయపార ద్రాగించిన దీ కన్నతల్లియే. నరేంద్రుని దేశభక్తునిగ, వేదాన్తజిజ్ఞాసువుగ మలచ గలిగినది మాతృబోధామృతమే.

నరేంద్రుడు బాల్యమునుండియు, సన్యాసులనిన–వైరాగులనిన ముచ్చటబడుచుండెడివాడు. వారిజీవితములు ప్రశాంతికాకరములనియు, బ్రహ్మచర్యము నిస్తులమైన యాత్మశక్తిని ప్రసాదించుననియు, గాఢవిశ్వాసము నరేంద్రునకు బాల్యము

నందే కుదిరెను. సునిశిత మేధాశక్తి సంపన్నుడై - ప్రతిరంగమున ప్రతిభను బాల్యమునుండియే నరేంద్రుడు ప్రకటింప సాగెను.

ఆటలలో - పాటలలో, నాటక ప్రదర్శనములలో, వ్యాయామములలో, వక్తృత్వనైపుణ్యములో విద్యార్థిదశయందు నరేంద్రునిదే యగ్రతాంబూలము. పై, పై, మెఱుగులత్తో ప్రధానధ్యేయమైన విద్య కెన్నడు నాటంకము గలుగనిచ్చెడివాడుకాడు.

ప్రతిపరీక్షలో నరేంద్రుడు ప్రథముడుగ నుత్తీర్ణుడగుచుండు టొకవిశేషము. దీనికంతటికిని నరేంద్రుని యచంచలధ్యానబలమే ధారణాశక్తియే మూలము. నరేంద్రుని హృదయవికాసమునకు మాతృదేవత హేతుభూతురాలుకాగా-ఆయనధీవికాసమునకు తండ్రికారణభూతుడై నిలిచెను. నరేంద్రుని వ్యక్తిత్వమాపగిది యభ్యుదయము నందినది.

తత్త్వశాస్త్రమును-చరిత్రను-వేదవిద్యను క్షుణ్ణముగనభ్యసించి, విద్యార్థిదశయందే గురువుల మెప్పునందినాడు. చిఱుత ప్రాయమునుండియే ధ్యానయోగబలము నీయనపూర్తిగనర్థము గావించుకొనినాడు. చిత్తైకాగ్రతయే జీవితలక్ష్యములను సిద్ధింపజేయగల ప్రబలసాధనమని గాఢముగవిశ్వసించినధీరుడు. నిశ్చలకర్మయోగ పరాయణుడు.

వైవాహికజీవితముపట్ల వైముఖ్యమేలనో యాదినుండినీతని గుండెలో గూడుగట్టుకొనెను. కావుననే, విశ్వమున

కంతటికిని భారతీయుల యాధ్యాత్మికశక్తుల వెలుగులను జూప గల మహాయోగి పుంగవుడు భారతమునకు దక్కినాడు.

వైజ్ఞానికముగ నంతస్తు పెరిగినప్పటినుండియు – నరేం ద్రునిలో దైవసందర్శనాభిలాషమెండయినది. యోగివేషధారుల నందఱను నిలువదీసి, చర్చలకు దిగసాగినాడు. ప్రజ్ఞాధురీణు డైన యా బాలనరేంద్రుని వాగ్ధాటికి, పుంఖానుపుంఖముగ గురిజూచి వదలెడి ప్రశ్నల పరంపరలకు పలువురు పండిత ప్రకాండులే తట్టుకొనలేక తల్లడిల్లసాగిరి. మహాయోగులన బడెడి వారల నందరిని గలిసి, యహమహమికతో నెన్నియో ప్రశ్నలను గురియించి, యొక్కదానికేని తృప్తికరమైన సమా ధానము నందజాలక నిరుత్సాహియై, 'భగవంతుని జూచితిరా?' యని నిగ్గదీయుచు, నిష్పలుడై విసిగి వేసారిపోవుచుండెడివాడు నరేంద్రుడు. జిజ్ఞాసువైన యా నరేంద్రుని ధోరణి నర్థముజేసి కొనలేక, పలువురాయనను నాస్తికుడనసాగిరి. నరేంద్రుని వైఖరియు నప్పుడట్లే కన్పట్టుచుండెడిది.

నరేంద్రుని తపనను – వేదనను గుర్తింప గలవారే కరి వైరి. జీవితలక్ష్యమైన భగవద్దర్శనానుభూతికొఱకే నరేంద్రుని తాపత్రయము. తత్ప్రయోజనసిద్ధి కనువైన వాతావరణ మేర్పడవలెనని యే నరేంద్రుని మనోవేదన. తహతహను పసిగట్టి యెవడార్చెడువాడు కనబడనంతకాలము తపన తగ్గదు. వేదన చల్లారదు. నరేంద్రునిస్థితి నాడట్లయినది. రోగమును గమనించి, యౌషధము వాడినవారొకరేని కనబడకుండుటచే, తన

తాపత్రయమిచ్చే తనను కృశింపజేయగలదనియు – తన యంత
ర్వేదన యిచ్చే తనను చైతన్యరహితుని గావించుననియు నరేం
ద్రునిలో ననుమానము లనుక్షణము సంఘర్షణ పడసాగినవి.
ఈ భావవేగమునకు దట్టుకొని నిలువగలుగుట నరేంద్రునికి
కష్టసాధ్యమాయెను. ఆతని యన్వేషణ ప్రబలరూపము నంద
సాగినది.

నరేంద్రుడు కళాశాలలో విద్యాభ్యాసముచేయుచున్న
తరుణమది. 'హేస్టి' (Hastie) అను నాచార్యుడొకనాడు
నరేంద్రునున్నతరగతికిపాఠముజెప్పుచు,ఆపాఠములోని'సమాధి'
(Trance) యను పదమునకు సరియైనయర్థమును చెప్పఁజాలక,
తాత్పర్యమును వివరింపఁజాలక, దక్షిణేశ్వర కాళీదేవాలయ
మునందు రామకృష్ణపరమహంసను దర్శించినచో 'సమాధి'
యనుపదమునకు సముచితమైన యర్థము బోధపడగలదనియు–
ఆసమాధిస్థితిని ప్రత్యక్షముగ వీక్షింపవచ్చుననియు నరేంద్రుడు
మున్నగు విద్యార్థులకు సూచించెను. నాఁడాయాంగ్లగురువు
జాతి మత కుల విచక్షణల కతీతమైన యుజ్జ్వల భావపీఠమున
నిల్చి, శ్రీరామకృష్ణుని నిరుపమానశక్తి నిట్లుస్తుతించినాఁడు.
పాలకజాతికిఁజెందినవారైన యాంగ్లేయులలో నొకఁడానాడు
భారతీయ శేముషీసంపదను ప్రస్తుతించుటన్న వింతగనే
యుండును. కాని, శ్రీరామకృష్ణుని యాధ్యాత్మిక దివ్యజీవిత
మహిమలనుగూర్చి లోకమున విజ్ఞశ్రేణిలోనొక ప్రత్యేకభక్తి
ప్రపత్తి సహితమైనరీతి యానాటికే సర్వసామాన్యమగుటచే

నయ్యాంగ్లాచార్యుడు నరేంద్రాది విద్యార్థులకట్టి హితబోధ గావించెనన్నమాట.

ఇది యిట్లుండ, నరేంద్రుని మనోవేదననుఁ గాంచిన రామచంద్రదత్తు అనుబంధు వొకనాఁడు నరేంద్రుద్దేశించి— "బాబూ! పరమార్థమునే నీవపేక్షించుచున్నచో, బ్రహ్మ సమాజాది సంస్థలకు బోనేల? దక్షిణేశ్వరమునన్నున్న రామకృష్ణపరమహంస సన్నిధికేగుమ" ని ప్రబోధించెను. కళాశాలలో నాచార్యుఁడు నరేంద్రునికి వేసిన బీజము – బంధువు చేసిన దోహదమువలన, బలపడియంకురించెను. వెంటనే నరేంద్రుని యాలోచనములు రామకృష్ణపరమహంస వంకకు పరువు లెత్తినవి.

మిత్రునింట జరిగిన యొక భజనకాలక్షేప సందర్భమున తొలిసారిగ నా రామకృష్ణ సుయమీంద్రునితో నరేంద్రునకు పరిచయభాగ్య మేర్పడినది. నరేంద్రుఁడు బాల్యమునుండియు సకలకళలలో నారితేరినదిట్టి భగవద్దత్తమైన మధురగళ మాయన సహజసంపద. కమ్మని నరేంద్రుని కంఠమే, నాఁడు భజనకాలక్షేప సమయమున శ్రీరామకృష్ణపరమహంస నాకర్షించినది. ఈ రూపమున వారిరువురు కలిసికొన వలసిన యోగముండెనుగాబోలు! వారిరువురి యపూర్వసమ్మేళనముచే తత్కాలమున భారతీయాధ్యాత్మికరంగము సువర్ణ ఘట్టమై మెరసినది. హైందవజాతీయ జీవితరంగమునకు స్థాయిని, హాయిని సంఘటించినది. వేయేల? ప్రాక్తన సంస్కృతీ వైభవ

మునకు బట్టుగొమ్మలైనది. ఆర్షధర్మ పునరుద్ధీప్తికి కొండంత యండ కాగల్గినది. నాటినుండియే నరేంద్రుడు రామకృష్ణ పరమహంసకు శిష్యుడైనాడు. వారి గురు శిష్యసంబంధ ములు పరమపావనములై వర్ధిల్లినవి.

రామకృష్ణుని ప్రబోధములకు బ్రహ్మాండమైనవ్యాప్తి నరేంద్రునివంటి శిష్యచూడామణి లభ్యపడుటవలననే సాధ్య మైనదేమో! రామకృష్ణ పరమహంసవంటి మహాభక్తవరేణ్యులైన యోగిపుంగవులు చరిత్రలో నటనట దర్శనమిచ్చుచునే యుందురు. కాని, యకుంఠితదీక్ష - మేధాసంపత్తి - నిరుపమాన గురుభక్తి - సాహసాత్మక ప్రబోధచతురతయుఁగల మానసీయులు ప్రేళ్ళమీద లెక్కింపఁదగిన స్థితియందే కానవచ్చు చుందురు.

రామకృష్ణదేవుని సన్నిధిలో త్రికరణశుద్ధిగ వినయ విధేయతలతో శుశ్రూష గావించి, యాగురుచంద్రుని పరిపూర్ణ వాత్సల్యమును జూరగొని, యా మహనీయుని మహత్తరా ధ్యాత్మిక శక్తికి వారసత్వమును వహింపజాలిన ఘనుఁడు నరేంద్రుఁడొక్కఁడే యనవచ్చును.

'భగవంతుని మీరు జూచితిరా? నాకుజూపఁగలరా?' సూటిగ నిట్లుప్రశ్నించెడి శిష్యునకు - చిరునవ్వులు చిందించు సుప్రసన్న వదనముతో - 'నేనుభగవంతుని, సుస్పష్టముగఁ జూచుచున్నాను. నీవు నన్నుజూచుచున్నంత సుస్పష్టముగ,

నీకును భగవంతుని జూపగలను', అని సమాధానముచెప్పగల గురువర్య లెందరుందురు? నరేంద్రుడట్లడిగినాడు. రామకృష్ణుడిట్లు సమాధానముఁ జెప్పినాఁడు.

కాలముగడచినకొలఁది రామకృష్ణుని పరీక్షలలో నరేంద్రుఁడు తీర్ణుఁడై, యోగ్యతను గడింపసాగెను. గురుప్రబోధముతో శిష్యనియందు గుప్తములైయున్న శక్తులన్నియు జ్వలింపనారంభించినవి. జిజ్ఞాసపెరిగినది. చదివిన పాశ్చాత్య విద్యయందించిన సంస్కారమును - జన్మవలన లభ్ధమైన ప్రాక్తన సంస్కృతి మహిమను తులయందిడి, తూచి, మ్రొగ్గును గుర్తించి, నరేంద్రుఁడు ప్రవర్తింప సాగినాఁడు. రామకృష్ణపరమహంస నారాధ్య దైవముగ హృదయమున బ్రతిష్ఠించుకొనినాడు. గురుదేవుఁడు 1886 వ సంవత్సరమున తన సర్వదివ్యశక్తులను నరేంద్రున కప్పగించి, పరమపదించెను.

రామకృష్ణుని నిర్యాణానంతరము నరేంద్రుని బాధ్యతలు పెరిగినవి. నాఁటినుండియు నజ్ఞాన తిమిరావృతమైన మాతృభూమిపై వివేకసూర్యోదయము గావించుటకే నరేంద్రుఁడు కంకణముగట్టెను. గురుప్రసాదముగ తనకు సైవసమైన విజ్ఞానవాహిని-తనతోఁబాటుగ నింకిపోవుటాతని కభిమతము గాదు. శాశ్వతముగ నావెల్లువ తన జన్మభూమిపై బొరలు చుండవలెనని యాయన కాంక్షించెను. తనకలలు కలలుగ మాత్రమే నిలిచిపోరాదనియు-అవి నిజముగ జరిగి తీరవలెనని యు నతఁడు గాఢముగ దలచినాఁడు.

నిరుపేదలపట్లను, నారీమణులపట్లను ప్రత్యేకశ్రద్ధ వహించి, యట్టివారికి సేవజేయుటయే భగవత్సేవ కాగలదని పలికెను. దరిద్ర నారాయణుల సేవయే పరమార్థప్రదమని ప్రవచించెను. పతితుల సముద్ధరణమే యతీశ్వరుల జీవిత ధ్యేయముగ నుండవలెనని సంభావించెను. పట్టణములకు-పల్లెలకు - వాడవాడలకు రామకృష్ణుని సందేశమునందింప యాత్రలు సాగించెను. సన్యాసిగ మాతృదేశమున నలుమూలల పర్యటించుచు, పండితులతో - పామరులతో కలిసిమెలిసి జీవించుచు, పరహితచింతనతో కాలమును ప్రశాంతముగ గడుపసాగెను. వేదవేదాంత సందేశామృతమును బంచి, ప్రాచ్యపాశ్చాత్య ప్రపంచముల నుజ్జీవింపఁజేసిన యీ మహనీయుని లోకోత్తర చరిత్ర - సకల లోకాదర్శపాత్రము.

దేశపర్యటనలో పూర్వాచారపరాయణుల ఛాందసములను కొన్నింటిని బరిశీలించి, వానిని పూర్తిగ నిరసించెను. నవీన సంస్కర్తల సంకుచిత భావములను నిశితముగ విమర్శించెను. పాశ్చాత్య వ్యామోహపాశముల జిక్కిన వారి దుస్థితిని తీవ్రముగ నిరసించి, బాగుపడుఁడని ప్రబోధించెను. స్వదేశసంస్కృతిపై భక్తివిశ్వాసముల బెంపొందించుకొనుఁడని గట్టిగ మందలించెను. దేశీయులనుభవించుచున్న దారుణ దారిద్ర్యమునుగాంచి,కన్నీరుమున్నీరుగవిలపించెను. భయంకరమైన పేదరికమును నిర్మూలింపక, భారతీయత వికసింపఁ జాల

దని చింతించెను. ఉపాయముల నాలోచించి, పలుప్రయత్నము లకు బూనుకొనెను.

నామమాత్రావశిష్టమై, నిర్జీవమై, కాంతిహీనమైయున్న భారతీయత నుద్ధరింప బహుభంగుల యత్నించెను. కట్టులు, కార్పణ్యములు, కలహాములు మానవతకే కళంకములని యెలుగెత్తి చాటెను. నిరాడంబర జీవనము-శరీర సుఖ దుఃఖ ములపట్ల నిర్లక్ష్యభావము-నిశ్చలభక్తి - కేవల భగవదర్పిత మైన చిత్తవృత్తి-భిక్షాటనవలన లభించెడి యెట్టి యాహారము నైన భుజింపఁజాలు సంతృప్తి సాధువుల జీవిత ధ్యేయములై యుండవలెనని సంభావించెను. కన్యాకుమారినిఁజేరి, యటనొక కొండగుట్టపైఁ గూర్చుండి, నిశ్చల భావముద్రలో కర్తవ్య మును గుర్తించి, శ్రీరామకృష్ణగురుదేవుల యంతర్వాణి సూచించిన తెఱఁగున మఱల ప్రజారంగమునఁ బ్రవేశించెను.

చెన్నపట్టణమునఁగల పెద్దల ప్రోత్సాహముతో అమెరికాలోఁగల షికాగోమహానగరమున 1893 సం. సెప్టెం బరు 11వ తేదీన జరుగనున్న నానామతసభకేఁగ పయన మగుటతో - వివేకానందుని యుద్యమమున క్రొత్తయధ్యాయ మారంభమాయెను. అమెరికా ఖండమునకు వివేకానందుఁడు కుశలముగఁజేరినాఁడు. సభలో ప్రవేశముగలుగులోపల నెదు రైన సంఘటనలన్నియు భగవదనుగ్రహమున నాయనకు కూలముగనే మారినవి.

శ్రీస్వామి షికాగో మతమహాసభా రంగమువ బ్రవేశించినాఁడు. తరుణ భాస్కరకాంతి పుంజముల గేలిసేసెడి యరుణకాంతుల కాషాయాంబరములతో విశ్వమతపరిషద్వేదికాగ్రమున నిలువగనే, సర్వజనహృదయ సమ్మోహనమైన యా దివ్యమూర్తి వంకకే సకల సభాసదుల నయనములు మరల్పఁబడినవి. సరస్వతీదేవిని సంస్తుతించి, యాభారతీయ పరివ్రాజక శిరోమణి - 'అమెరికా సోదరసోదరీమణులారా!' యని సంబోధించినంతనే సభ్యుల హృదయపద్మములు బాగుగ వికసించినవి. మహోత్సాహ తరంగములు సభాసాగరము నుండిలేచి, మిన్నుముట్టినవి. ఆయానందజలధిఘోష-కరతాళధ్వనులతో గసిలి మారుమ్రోగినది.

శ్రీ వివేకానందస్వామి మహోపన్యాసము నారంభించినాఁడు. పలుమతములకు ప్రాతినిధ్యము వహించిన దిగ్గజములవంటి పండితులెందఱో యందున్నారు. వారి విస్మయమనిర్వచనీయము. ప్రాజ్ఞులైన స్త్రీ పురుషుల హృదయములు లుట్టూతలూగి పోవుచున్నవి. ప్రతి సభ్యునిహృదయమునాకట్టుకొని, తన మధుమయ వాక్సంతతులచే బంధించి, యపూర్వములయినవారి మన్ననలకు బాత్రుఁడయినదీమహాత్ముఁ డొక్కఁడే.

ఈ మహాత్ముఁడు పేరు ప్రతిష్ఠల నాకాంక్షింపలేదు. కాని, వివేకానందనామమూ యమెరికాఖండపుమాఱుమూలల గూడ మారుమ్రోగినది. షికాగో నగరవీథులలోఁగల కుడ్యములన్నియు-'శ్రీస్వామివారి నిలువెత్తు పటములతో నలంకరింప

బడినవి. సర్వాలా దివ్యమూర్తి చిత్రపటములచెంత నత మస్తకులై, జోహారు లర్పించిరి.

"భావైక్యత్వముచే నేమి-దివ్యమూర్తి మత్వముచే నేమి-మత మహాసభ కత్యంత ప్రీతిపాత్రుడై యొప్పినదాతడే. సభావేదికపై నాతడడుగిడినజాలును; సభ్యుల హర్షధ్వనులు మిన్నుముట్టెడివి."

"నిక్కముగ నా మహాపురుషుడు సరలహృదయుడు. విద్వదవతంసుడు. వివేకానందునితో మాపండితులెంతమాత్ర మును బోల్పడగరు."

—Boston Evening Transport Paper.

"మత మహాసభోద్దేశ్యమును – దాని లోతుపాతులను గూర్చి హిందూమతాచార్యునంతటి చక్కగ నుపన్యసించిన వక్త మటెయొకరు లేరు. ఆతడీశ్వరప్రేరిత మహావక్త. ధైర్య స్థైర్యములును, వివేకమును రూపొందిన యాతనివదనమును వదనమునకు మర్యాద నొసంగు నాతని కాషాయాంబరము లును మనోజ్ఞములై యొప్పినవి. మనఃపూర్వకముగ బ్రవ చింపబడిన యాతని మృదుమధురవాక్కులు – సభ్యులను దన్మయులగావించినవి. వ్రాతమూలకమైన యెట్టియాధారమును లేకయే – యఖండ చాతురితో – విశ్వ విశ్వసనీయమగు సద్భావముతో హృదయోత్తేజకమగు వచఃపాటవ పరిపూర్ణ సిద్ధాంత విశేషములను పుంఖానుపుంఖముగ నీ మహానీయుడు బ్రకటించును."

—New Yark Critique Paper.

పరదేశపత్రికలే యీ మహనీయుని శేముషి నిట్లు ప్రస్తుతించినవి. 'నరేంద్రుడు ప్రపంచము నుట్టూతలూపు మహాప్రవక్త కాగలఁ'డను గురుదేవుఁడగు రామకృష్ణపరమ హంస వాక్య మక్షరాక్షరసత్యమైనది. పాశ్చాత్యుల దురహం కార పూర్ణములైన ప్రల్లదముల కీ వివేకానందుని బోధనలు - గొడ్డలిపెట్టు లాయెననుట తథ్యము.

చికాగో విశ్వమత పరిషన్మహా సభావేదికాగ్రమున్పై భారతీయ వేదాంత విజయదుందుభి యీరీతి మ్రోగింపఁ బడినది. విశ్వమెల్లను విస్మయమునఁ దేలినది. భారతీయుల సంస్కృతికి మఱుల ప్రాణప్రతిష్ఠ జరిగినది. సంబోధించుట మొదలు కొని, ముగింపువఱకును గంగా ప్రవాహసదృశమైన వివేకా నందుని ప్రసంగములో-భారతీయుల వేదాంత ప్రతిభాపరంపర లన్నియు విపులీకరింపఁబడినవి. బ్రహ్మతేజోవిలసితుఁడైన వివేకానందుఁడు-సర్వమతములవారి నీరీతిగ నాకర్షించి, యట విజయపతాక నెగురవైచెను. నాఁడమెరికాఖండమున వివేకా నంద నామస్మరణమే తారకమంత్రమాయెను. పలువురు శిష్యు లను, శిష్యురాండ్రనుగూడ నీ మహనీయుఁడు సంపాదింపఁ గలైను. లక్షలకొలది ద్రవ్యమునుభారతదేశమునకుబంపి, రామ కృష్ణ గురుదేవునిపేరుతో విద్యాలయములను, చికిత్సాలయము లను నడపించుటకు హేతుభూతుఁడయ్యెను.

భౌతికవాదవహ్నికి బీటలు వారిన భూమి యమెరికా ఖండము. హిందూవేదాంతజలధిలో-వలసినంత నీటిని గ్రహించి,

పుష్టినార్జించిన వివేకానందనీలనీరదము రామకృష్ణగురుప్రబోధ తీవ్రపవనప్రకంపనబలమున నమెరికా ఖండము వఱకు సాగి పోయి, యచ్చట నాధ్యాత్మిక భావరసధారలతో కుంభవృష్టి గురిసినది. చక్కగ పదునైన నేలపై, భగవదనుగ్రహసిద్ధికి యోగ్యములైన భావాంకురములు మొలకలెత్తి, భగవద్భక్తి ఫలములు పండినవి. ఆయన చలువవలననే యమెరికావారికి భౌతిక దాహముతగ్గి, యాధ్యాత్మికతృష్ణ పెరుగసాగెను. 'మానుండి యాధ్యాత్మిక భిక్షనుగ్రహించి, మీ చిత్తములకు శాంతిని మీజీవితములకు కాంతినిసమకూర్చుకొనుఁ'డని వివేకానందుఁడు ప్రబోధించిన శంఖారావము చికాగో విశ్వమత పరిషత్తునఁ బాల్గొనినవారి కందఱికిని కనులను దెఱచినది.

అమెరికావాసు లనేకు లాయనకుశిష్యులై బ్రహ్మానంద భరితులయిరి. భారతీయుల వేదాంత సిద్ధాంతముల కంజలి ఘటించిరి. వేదవేదాంగపురాణ కావ్యప్రబంధములు హైందవ ధర్మదీపికల నెట్లు వెలిగించి భవ్యభావకాంతిపుంజముల విరి యించుచున్నవో గ్రహించి, పరవశించి, తత్ఫలరసము సాస్వాదింప నుద్భూత లూగసాగిరి.

అమెరికా, బ్రిటన్ దేశములలో – హిందూమతమును వ్యాపింపఁజేయుటకు వివేకానందుఁడు గావించిన కృషియనుప మానమైనట్టిది. ఆ విధముగ విదేశములలో వెదజల్లిన భారతీయ ధర్మబీజములు నిరంతరము ఫలించుచుండుటకు వలయు సాధనములనుగూడ నామహనీయుఁడు చక్కగనే సన్నద్ధపఱిచెను.

వివేకానందుని మహోద్యమమును నిత్యనూతనముగ వెలు గొందఁజేయు నిమిత్తము పలువుర మెరికా బ్రిటన్ దేశీయులే స్వామిశిష్యులుగ జేరిరి.

బలీయమునైన యట్టిపునాదులే నేటికిని హిందూధర్మ సంస్కృతులపట్ల విదేశీయులలో భక్తిప్రపత్తులను శాశ్వతముగ నిలిపియుంచగలిగినవి. నాఁడారూపమున వివేకానందస్వామి - దేశమహోపద్రవము నరికట్టుటకు బాసటగనిల్చి, హిందూమత సంరక్షణగావించి చిరస్మరణీయుఁడయ్యెను.

స్వామి దివ్యసందేశమునకు పరవశులైనవారు ఆయన ప్రబోధముల నత్యుత్సాహముతో, భక్తిశ్రద్ధలతో శిరసా వహించినవారు, వానిని చక్కగ జీర్ణించుకొని, తమజీవిత సర్వస్వమును సమర్పించి - ప్రియశిష్యులైనవారు అమెరికా ఖండమున పెక్కురుగలరు. అటవారాయనకండగనిలిచి, వారి మహోద్యమమునకు బలమును జేకూర్చిరి. వారిలో;

(1) **Mr. Leon Landsberg** (కృపానందస్వామి)

(2) **Meme Mar'e Louise** (అభయానందస్వామి)

(3) **Miss S. E. Waldo** (హరిదాసి)

అనువారు సన్యాసమును స్వీకరించి, భక్తిశ్రద్ధలతో స్వామిని పూజించిరి.

(4) **Miss Christine**- క్రిస్టైన్ కన్య యాధ్యాత్మిక చింతనా మగ్నురాలైతను మనో ధన సర్వస్వములను భారతదేశసేవలు

కర్పించి, స్వామివెంట మనమాతృ దేశమున కేతెంచెను. కలకత్తాలో స్త్రీలపాఠశాలలో పనిజేసి, పెక్కురు యువతులకు విద్యాదానమును గావించెను.

(5) Mrs Wilcoks విల్కాక్సు సతి, Mr. C.C. Everett. క్రైస్తవ మతాచార్యుడగు ఎవరెట్ మహాశయులు స్వామికి కుడిభుజములుగ నిల్చిరి. ఇక్లెందరో మహనీయులు స్వామి యుద్యమమునకు తోడ్పడిరి.

కొంతకాలమునకు వివేకానందస్వామి యమెరికాను వదలి లండనుపట్టణమున కేతెంచెను. ముందుగనే వివేకానందుని కీర్తినెటింగిన లండను నగరము వివేకానందుని మూర్తిని గని, భక్తిప్రపత్తులతో స్వాగతగీతికల నాలపించినది. స్వామియు తన దివ్యసందేశామృత రసధారలతో లండనుపౌరులదనియించి వారికి మహానందము నందించినాడు. ఇచ్చటను పలువురు శిష్యులీయనకు లభించిరి. వారిలో Miss Margret Noble—సోదరినివేదిత (1867 _ 1911) వివేకానంద స్వామికి ప్రియ శిష్యురాలై తన సర్వస్వమును స్వామికి సమర్పించినది. సన్యాసినియై భారతదేశమున కేతెంచెను. భారతదేశమునే మాతృదేశముగ నారాధించి, తన నిష్కామసేవల నందించి నది. వంగబాలికల నిమిత్తము కలకత్తాలో నొక కన్యావిద్యా లయమును స్థాపించి పెక్కురను సుశిక్షితలనుగ, విద్యావతు లనుగ గావించినది. వివేకానందుని జీవితానంతరముగూడ, నివేదిత స్వామి యడుగుజాడలయందే పయనించి, భారతీయ

సంస్కృతిని ప్రచురముగ ప్రచారమొనర్చుచు, బహుగ్రంథములను రచించినది. భారతదేశస్వాతంత్ర్యమును హృదయపూర్వకముగ వాంఛించి, సమర్థించి, దేశగౌరవప్రతిష్ఠలకు పాటుపడిన ధీశాలిని సోదరినివేదిత.

తదుపరి చెప్పదగిన మహనీయుడు గుడ్విన్. ఈమహాశయుడు స్వామియుపన్యాసముల కన్నింటికి చక్కగ సంక్షిప్త లేఖనమునుగావించి స్వామియుపదేశ పరంపరలకు భద్రతను ఘటించినాడు. వివేకానందుని దివ్యసందేశము నేటికిని వాడవాడల పఠింపబడెడి సదవకాశ మీమహాశయుని సంక్షిప్తలేఖన బలముననే లభ్యపడుచున్నది.

ఇక! సెవియర్ దంపతులుగూడ స్వామికి శిష్యులై, భారతదేశమున కేతెంచి, పలువిధముల సేవలొనర్చిరి.

స్వామివారి శిష్యపరంపర లోకమునందిట్లు వ్యాపించి, గురుదేవుని దివ్యభావనలకు దిగ్విజయమును జేకూర్చిరి.

లండను నగరమున స్వామి కలిసిన మహనీయులలో మ్యాక్సుముల్లరు ప్రధానమైనవ్యక్తి. ఈయన గొప్ప తాత్త్వికుడు. మహాపండితుడు. సంస్కృతభాషలో ప్రశంసనీయమైన పరిశ్రమగావించిన ప్రముఖుడు. సర్వభాషలకు సంస్కృతము మాతృభాషయని నిస్సంకోశముగ నిర్వచింపజాలిన విదేశీయ విద్వద్వరేణ్యుడు. సంస్కృతభాషపట్ల, భారతదేశముపట్ల, వేదసంస్కృతిపట్ల యీాయనకుగల భక్తి గౌరవములు ప్రశంస

నీయములు. భారతయోగి తిలకుడైన, శ్రీరామకృష్ణపరమ హంస జీవితచరిత్రను, ఆంగ్లమున భక్తిశ్రద్ధలతో మ్యాక్స్ ముల్లరు రచించు టొక విశేషము.

భారతదేశమున పెద్దపెద్ద యుద్యోగములు గావింప ఐ. సి. యస్. పరీక్షలకు చదువుచున్న ఆంగ్లవిద్యార్థులకు ఆకాల మున నీ మహానుభావుడు భారతీయ సంస్కృతిని, వేదమహిమలనుగూర్చి విపులముగ నుపన్యసించుచుండెడివాడు. ఆమహనీయుని విశాలదృష్టి కీయంశ మొక చక్కని తార్కాణము. ఒక పరి యట్టి విద్యార్థుల కిచ్చెడి యుపన్యాసమున భారత దేశమునుగూర్చి యీ మహనీయుడు పలికిన పలుకు లిట నుదహరించుట అప్రస్తుతము గానేరదు.

"ప్రకృతియొసగగల సంపద, శక్తి, సౌందర్యములతో భాగ్యవంతమగు దేశమును, కొన్నిప్రాంతములు భూలోకస్వర్గ ముగనున్న దేశమును, ప్రపంచమందలి అన్ని ప్రక్కలనన్వేషించి నేను భారతదేశమువంకకే ప్రేలెత్తి చూపుచున్నాను. మానవుని మానసిక వికాససమస్యలేయాకాశము క్రింద నభివ్వదిగాంచినవన్నను, తత్సమస్యల పరిష్కార మెందు జరిగినదన్నను, ప్లేటో, కాంటుల జదివిన వారి దృష్టి యెచ్చటి కాకర్షింపబడవలెనన్నను–నేను భారతదేశము వంకకే ప్రేలెత్తి చూపుచున్నాను. గ్రీకు, రోము, సెమిటిక్, యూదులభావములతో బోషింపబడిన ఐరోపీయుల మగు మనము మనబాహ్యాంతర జీవితములను ఇంకను నిర్దుష్టముగ –

సమగ్రముగ – సర్వతోముఖముగ వేయేల– ఇంకను స్వచ్ఛముగ, మానవోచితముగ సంస్కరించుకొని, శాశ్వత జీవితమును బడయుటకు వలయురసాయన మేదేశ సారస్వతమున లభించునాయని పరిశీలించితిని. పరిశీలించి, యిది లభించెడి చోటు భారత వర్షమేయని వ్రేలెత్తి చూపుచున్నాను.”

—మాక్సుముల్లరు ‘భారతదేశము మనకేమి నేర్పగలదు’. పుట ౯.

“మానవుని యేమానసికరంగమునైనను నీప్రత్యేక పఠనమునకు నీవుఎన్నుకొనవచ్చును; అదిభాషగాని, మతముగాని, కల్పితమైన కట్టుకథలుగాని, గాథలుగాని, తత్త్వశాస్త్రముగాని, శాసనములుగాని, ఆచారములుగాని, స్రాచీన కళలుగాని, శాస్త్రములుగాని, కావచ్చును. నీకిష్టమున్నను, లేకున్నను, అట్టిప్రతిరంగమునకును నీవుభారతదేశమున కేయేగవలెను. ఏలన; మానవచరిత్రలో, అమూల్యమునైన–మిక్కిలిగ ప్రబోధకమునైన సాధనములు భారతదేశమున మాత్రమే వెలుగొందుచున్నవి.”

—మ్యాక్సుముల్లరు

విదేశీయుడయ్యును భారతదేశముపట్ల నిట్టి దివ్యభావమును, సహృదయతను బ్రకటించినవాడు కావుననే వివేకానందస్వామి లండనులోనీమహనీయునిగలిసి, యీయనను ‘సాయణాచార్యులు’ అని పేరొక్కని, మాతృదేశమున కాహ్వానించెను. లండను నుండి స్వామి జర్మనీ దేశమున కేగెను. ‘కీల్’ విశ్వవిద్యాలయమున తత్త్వశాస్త్ర పండితుడుగనున్న

పాల్ డ్యూసేన్ (దేవసేను మహాశయుడు) స్వామినాహ్వానించి యాతిథ్యమొసగెను.

డ్యూసేను గొప్ప సంస్కృత పండితుడు. సంస్కృత భాషాపదముల నుచ్చరింపగనే, డ్యూసేను శ్రవణములకొక మధురానుభూతి కలుగుచుండెడిదట! ఉపనిషత్తులను పఠించి, యందలి భావౌన్నత్యముచే నాకర్షితుడై - వానినీమహనీయుడు విపులముగ ప్రచారమొనర్చెను. వేదాంతమే శాంతికి రాచ బాటయని యెలుగెత్తి యీవేదాన్తి యుద్ఘోషించెను. కావుననే స్వామియిట్టి భారతీయ భక్తుని యాహ్వానమును మన్నించి యాయనతో గోష్ఠిజరిపినాడు.

ప్రతి పట్టణమున - ప్రతిప్రాంతమున స్వామికి వైభవో పేతముగ స్వాగత సత్కారములందినవి. సర్వ దేశముల వారినిట్లాకర్షించి, సర్వప్రాంతములలో, సనాతన సంస్కృతీ మహిమల నెలుగెత్తిచాటి, సర్వమానవుల మనోభావములను భారతదేశమువంకకు మరల్చెను. శిష్యులు ప్రశంసాపరంపరల గురియించుచుండ, స్వామి విజయోత్సాహ సంరంభముతో స్వదేశమునకు పయనమాయెను.

అఖిల ప్రపంచమత మహాసభలో వివేకానందస్వామి గడించిన దిగ్విజయమును వార్తాపత్రికలవలన దెలిసికొని భారతీయులు బ్రహ్మానంద భరితులయిరి. వివేకానందుని నామమానాడు భారతభూభాగమున రామనామమువలె భక్తి శ్రద్ధలతో సంస్మరింపబడెను. ఆసేతు హిమాచలముగ

వివిధరాష్ట్రములలో నీవిజయోత్సాహ కోలాహలములు మిన్ను ముట్టినవి. సనాతన ధర్మసంస్కృతీ సంపన్నమైన యొకమహా జాతికి ప్రతినిధిగ, ఖండాంతరములకేగి, యఖండ కీర్తినార్జించి, మాతృదేశమున కేతెంచుచున్న పవిత్ర సన్యాసిపట్ల జాతి హృదయము గౌరవభావమును నింపుకొనదా! నివ్వాళ్ళులివ్వదా! బ్రహ్మరథము పట్టదా! నాటిభారతదేశ మహోత్సాహ కలకలమున కదియే ప్రధానకారణము.

స్వామి స్వదేశాగమనముతో భారతదేశ చరిత్రమున నూతనశకమారంభమైనది. భారతీయులలో నూతనోత్తేజము, నూతనోత్సాహము పొడసూపనారంభించిన సుముహూర్తమది. విదేశములలో భారతీయ వేదాన్తవిజయశంఖమును బూరించుచున్న వివేకానందస్వామిని దర్శింప భారతీయులలో తహతహ, యనురక్తి, భక్తి పెరుగసాగినవి.

ఒక పరమపావన సంధ్యాసమయమున సింహళద్వీపమునకు (లంకకు) ముఖ్యపట్టణమైన కొలంబోలో స్వామి యడుగిడినాడు. భాస్కర కిరణరోచులబోలిన యరుణ వర్ణాంచిత కాషాయాంబరము మేనిపై దివ్యదీప్తుల దేజరిల్లజేయుచుండ విశాలనేత్రములతో విదేశములనుండివచ్చి ప్రప్రథమమున మాతృభూమిపై కాలిడనున్న స్వామి దర్శనార్థము జనము బారులుదీరి, నిశ్చ, ప్రేమపూర్వక మహోత్సాహజయజయ ధ్వానములతో స్వాగతమొసర్చిరి. ప్రజాహృదయములనుండి

ప్రతిధ్వనించెడి యానందసూచకములైన కరతాళధ్వనులు సాగరగంభీర ఘోషను మ్రింగివైచినవి.

దివ్యతురంగ శకటము నధిరోహించి స్వామి స్వాగతా లంకారశోభితమగు వేదికవద్దకు వచ్చినాడు. స్వామిదివ్య మంగళ విగ్రహావలోకన తత్పరులై వేలకొది ప్రజలు నాటి సభలో రెప్పవాల్పక నిరీక్షించుచుండిరి.

"బిచ్చమెత్తుకొను సన్యాసికి – మహారాజోచితమైన యిట్టి ఘనస్వాగతమును భారతీయులిచ్చుట–వారి పారమార్థిక శీలమునే ప్రకటించుచున్నది :–"

వేదికపై నెక్కి– వివేకానందస్వామి పలికిన యీపలుకు లతో సర్వప్రజల హృదయములు భక్తిరస రంజితము లయినవి.

'పావన భారతవర్షము'ను గుఱించి, కొలంబో ప్రజ లకు స్వామి గంభీరోపన్యాసము నొసఁగెను.

స్వామి కొండి, జాఫ్నా మున్నగు నరగములలో నుపన్యసించి పాంబన్ పట్టణము జేరెను.

పాంబన్ నగరమున రామనాథ పురరాజగు భాస్కర సేతుపతి స్వామికి సపరివారముగ సాష్టాంగవందన మాచ రించి స్వాగతమిచ్చెను. స్వామి యధిష్ఠించిన శకటమునకు కట్టబడిన గుఱ్ఱములను దొలగించి, స్వయముగ తానే శకట మును లాగెను. 'యతిరాజుముందు మహారాజులశక్తి యెంత'

యని ప్రజలు విభ్రాంతులయిరి. భారతాధ్యాత్మిక శక్తిపట్ల యోగులపట్ల స్వదేశప్రభువులకుగల భక్తిశ్రద్ధల కది ప్రబలమైన తార్కాణమై చరిత్రలో నిల్చినది. మధుర, కుంభకోణము, తిరుచిరపల్లి మున్నగుపట్టణములలో స్వామి యఖండ గౌరవ స్వాగతముల నందుకొనుచు మధురకంఠముతో తన దివ్య సందేశము నందించెను. తదుపరి చెన్నపట్టణము చేరినాడు. చెన్ననగర వాస్తవ్యుల యానందమున కవధి లేదు. చెన్నపట్టణమునకు నాడు భగవంతుడే విచ్చేయు చున్నట్లు వారు మురిసిపోయిరి. ఏ మహారాజుపట్లగూడ నట్టి భక్తిప్రపత్తులను చెన్నపట్టణ ప్రజలు ప్రదర్శించి యుండరు. ఊహాతీతమైన మహోత్సాహ ప్రదర్శనమది. చెన్నపట్టణమున స్వామి తన కార్యక్రమమును ముగించు కొని తన జన్మస్థానమగు కలకత్తాకు పయనమైనాడు.

వివేకానందుడు వచ్చుచుండెనను వార్త చేరగనే వంగ ప్రాంతము సముత్తుంగ తరంగ సంశోభితమైన గంగాతరంగిణివలె యుత్సాహానంద తరంగములతో పొంగిపోయినది. తనబిడ్డ విశ్వ విఖ్యాత కీర్తినార్జించి, అద్వితీయప్రతిభాసముపేతుడై – అనంత కీర్తికాంతుల నవనీతలమున కంతటికి బంచిపెట్టి, స్వజాతి దివ్య వేద శంఖనినాదముల మ్రోగించి, మరలివచ్చుచున్న బిడ్డను గని యే జనని మురియదు ?

ఆనంద పారవశ్యమున కలకత్తా ప్రజలు గావించిన స్వాగతసత్కారములపూర్వములు. స్వామి యధిష్ఠించిన శకట

మును కలకత్తా విద్యార్థులు భక్తిశ్రద్ధలతో, బ్రహ్మానందమున తమ హస్తములతో లాగిరి. ప్రభాకరతేజుడై ప్రసన్న తపస్వియై, భారతీయ వేదాంతి లోకమునకు బ్రహ్మాండమైన యశస్సు నార్జించి, భారత వసుంధర కనుపమాన దివ్యదీప్తిని ఘటించిన వివేకానందస్వామి కలకత్తా ప్రజల సంపూర్ణ ప్రేమ గౌరవాదరముల నందుకొని, ప్రశాంతినిలయమగు బారా (వరాహ) నగరమున ప్రవేశించి, అట నొక మఠమును స్థాపించి, సోదర సన్యాసిబృందముతోగలిసి సంపూర్ణానందము ననుభవించుచుండెను. మఠమున సుశిక్షితులగు బ్రహ్మచారు లెందరో తయారుగాసాగిరి.. గురువర్యుని యాదర్శములను, జీవితసారములను లక్ష్యము నందిడుకొని మహోజ్వల సేవా భావమును శిష్య లలవఱచుకొనసాగిరి.

స్వామి తనగురుదేవుని నామముతో శ్రీరామకృష్ణ మఠమును శ్రీరామకృష్ణ సేవాశ్రమమును (సంఘమును) స్థాపించినాడు. ఈమఠ సేవాశ్రమ (సంఘ) ములకు భారత దేశమునందేకాక, విదేశములలోగూడ శాఖలేర్పడినవి. విస్తారముగ వ్యాపించుచున్న శ్రీరామకృష్ణ మఠములు, ఆశ్రమములు, నిర్దుష్టముగ, నిరుపమానముగ సర్వప్రజలకు తమ నిష్కామ సేవల నందించుచు, వారిమన్ననల గడించుచున్నవి.

విదేశములతో భారతదేశమునకు సన్నిహిత సంబంధ మేర్పడవలయును. నిరంతరముగ భారతీయ వేదాంతకాంతులు దిగంతములవరకు వ్యాప్తములగుచునే యుండవలయును. సనా

తనధర్మసందేశబలముతో, ప్రాచీన వేదాంతతత్త్వ దీప్తితో సమరసభావమును నిర్మలముగ - నిర్భయముగ ప్రచార ప్రబోధముల గావించుటకే యాశ్రమములు, (సంస్థలు) మఠములుమిక్కిలిశ్రద్ధతోస్థాపింపబడినవి. విదేశములలో నీ యుద్యమము వినూతనప్రభల వెల్లివిరియించునిమిత్తమై సుశిక్షితులైన పలువురు సన్యాసులీసంస్థలపక్షమున విదేశములకు పంపబడుచున్నారు. ఇట్టి యపూర్వ సేవలెన్నియో, యీ మఠముల పక్షమున నిర్వహింపబడుచునే యున్నవి. పలువురు బాల సన్యాసులీమఠములలో నేడును శిక్షణలనందుకొని ప్రతిభావంతులగుచునే యున్నారు.

క్రమశిక్షణ, దేశభక్తి, వేదభక్తి, సమాజసేవ, సాధుభావనలు పరమలక్ష్యములుగ ప్రచారముచేయుచు,వివేకానందుడు భారతీయ వేదాంతచరిత్రలో మహోజ్జ్వల శక పురుషుడై బ్రహ్మాండమైన యశము నార్జించెను. ఈ మహాయోగి పుంగవుని నామము భారతీయ వేదాంత ప్రతిభకు మారుపేరుగ ప్రతిధ్వనించినది.

ఈ త్యాగమూర్తికృషి సనాతన మునివరేణ్యుల విశ్వశ్రేయోభావనకు ప్రాతినిధ్యము వహించినది. ఈవిద్వద్గరేసరుని వాణి వేదధర్మములకు నిలయమైనది.

ఈ సన్యాసి భారతీయతకు సమగ్ర మూర్తియై, శాశ్వతత్వమును బడసి స్వల్పవయస్సునందే పరమపదించెను.

వివేకానంద భావజ్యోతి సర్వదా మనలను ముందునకు నడ
పుచు వెలుగులీనుచునే యున్నది.

రామతీర్థస్వామి (1873–1906)

కలకత్తానుండి వివేకానందుని మహోన్నతమువలన భారతీయధర్మమిట్లు రక్షింపబడుచుండ, మఱొకవంక పంజాబు నుండి మఱియొక దివ్యతేజము లోకమునఁగల తమఃపటలి నణచుట కావిర్భవించి, వ్యాప్తినందసాగెను. ఆ దివ్యతేజమే రామతీర్థస్వామి.

రామతీర్థ 1873 వ సం. అమావాస్య మరుసటి దినమున జన్మించెను. అమావాస్యదినమున – లోకమునబంధు రమైన యంధకారమున మునిగియున్న తరుణమున – నాచీకటి నంతయు తనలో లీనమొనర్చుకొని – దివ్యతేజము నావిష్క రించుచు, మరుసటి దినమున జన్మించెను. అమవాస్యనాటి గాఢాంధకారమును తనలో లీనమొనర్చుకొని, దివ్యతేజమును ప్రపంచమునకొసంగి, తిరిగి అమావాస్యనాడే పరమపదించిన పవిత్ర సన్యాసి.

ఆధ్యాత్మిక బలోపేతమైన హృదయశక్తితో – ప్రపంచ పర్యటనగావించి, యద్వైత సిద్ధాంతములను వాడవాడల ప్రచారము గావించిన మహనీయుఁడీ రామతీర్థస్వామి. ముప్పదేండ్ల వయస్సునందే పరిపూర్ణజ్ఞానియై, భారతయోగి

చంద్రులకు సరియైన వారసుఁడనెడి ఖ్యాతిని గడించెను. నిశిత మేధాసంపత్తితో వందలకొలది మహాపండితులు దశాబ్దముల కొలది జీవిత కాలమును సాగించినను సంపూర్తిగాని కృషిని తానొక్కఁడే యత్యల్పకాలమున మహత్తరముగ నిర్వహింప జాలిన మానికుల తిలకుఁడు. బహుభాషాకోవిదుఁడై, బహు శాస్త్రపరిశీలకుఁడై, మధురవచస్వియై, మహనీయ తపస్వియై రామతీర్థస్వామి భారతజాతిని గాఢసుషుప్తినుండి మేల్కొల్పి, యాధ్యాత్మిక జ్ఞానముద్రల నద్దుటకు విశేషమైన కృషి యొనర్చెను. ఆ మహనీయుని దివ్యసిద్ధాంతములు నేటికిని సజీవములై నిలిచియున్నవి.

అరవిందుడు (1871–1950)

అనంతర మీరంగమున స్మరింపఁదగిన మహనీయులు కొందఱున్నారు. బాల్యమునుండియు పాశ్చాత్యసంస్కృతిలో మునిగి తేలుచు, పాశ్చాత్యభాషలను మాత్రమే నేర్చి, మాతృ భాషను పూర్తిగమఱచి, కడకు జ్ఞానోదయముకాఁగా – భార తీయ సనాతనధర్మమువంకకు మరలినవారుగూడ మనదేశమున కొందఱుకలరు. అట్టివారిలో – అరవిందుడగ్రగణ్యుఁడు.

ఈయన ఆంగ్లము, లాటిన్, గ్రీకు భాషలను నేర్చి నాఁడు. మాతృభాషయైన బెంగాలీని మఱచిపోవునంతటి ప్రమతతో తొలుత నీయన పరభాషల నభ్యసించెను. ఐ. సి. యస్. పరీక్షకరుగునపుడు మాత్రము తప్పని సరియై,

కొలదిగ బెంగాలీభాషను నేర్చెనఁట. విద్యావంతుఁడగు కొలది, పాశ్చాత్యవైఖరిపట్ల నరవిందునిలో విముఖత పెరుగ సాగెను. మనదేశము నఱచేతిలోఁ బెట్టుకొని యాడించుచు, పశువులవలె వ్యవహరించుచున్న యింగ్లీషువారిని సహేతుక ముగ విమర్శించుటతో నరవిందుని వ్యతిరేకోద్యమ మారంభ మాయెను.

న్యాయదృష్టితో నధర్మము నెదిరించిన సాహసిగ – దేశభక్తుఁడుగనరవిందుఁడు నాఁడు పరిగణింపఁబడెను. కావుననే స్వల్పలోపము నెద్దానినోచూపి, బ్రిటిష్‌వారరవిందుని ఐ. సి. యస్. పరీక్షలోతప్పించివైచిరి. కాని,యరవిందుని ధైర్యమునకు– మేధాశక్తికి – వక్తృత్వనైపుణ్యమునకు – వ్యవహారదక్షతకు ముగ్ధుఁడైన బరోడా ప్రభువు – తన సంస్థానమున మంత్రీ న్నతపదవి నొసఁగి, యరవిందుని గౌరవించెను. వంగవిభజన సమయమున నరవిందుఁడొనరించిన కృషి – మిక్కిలి ప్రశంసా పాత్రమైనది.

న్యాయతత్పరుఁడుగ–దేశభక్తుఁడుగ జీవితమును కొన సాగించుచున్న యరవిందుఁడు, మహారాష్ట్రమునకుఁ జెందిన 'లేలే' యనెడి మహాయోగి పరిచయముతో దైవభక్తుఁడుగ మారెను. తదుపరి – స్వశక్తితో ధ్యానయోగాదులందారితేరి, సంస్కృతమునేర్చి, బహుగ్రంథ పరిశీలనతో పండితుఁడై, పరమభక్తుడాయెను. కృష్ణపరమాత్మయెడ నరవిందునకుఁగల

భక్తిభావమనుపమానమైనట్టిది. కృష్ణనామ స్మరణముతో పారవశ్యము ననుభవించుచుండెడివాఁడాయన.

అరవిందుడు తీవ్రవాదియగు దేశభక్తుఁడుకావున, దేశ స్వాతంత్ర్యసిద్ధికొఱకేర్పడినమహాసంస్థయగుకాంగ్రెసునుఁగూడ సమయము వచ్చినపుడు నిశితముగ విమర్శించుటకు వెనుకాడ లేదు. ప్రభుత్వముపాలిటి కాతడు సింహస్వప్నమైనాడు. ఇంగ్లీషువారరవిందుని ప్రతిభకు, ప్రభావమునకు, కృషికి చకితులైరి. బాంబులు తయారుచేయుచున్నాఁడనెడి నెపముతో నరవిందుని కారాగారమునకు ద్రోయువఱకు వారికి నిద్దుర పట్టలేదు.

నిర్బంధ మొక విధముగ నరవిందునకు మేలునే చేకూర్చినది. అలీపుర కారాగారమునలనే శ్రీకృష్ణపరమాత్మ దర్శన మరవిందునకు కలిగెను. 'నిన్ను నిర్బంధించినవారవివేకులు. వారియెత్తులు సాగవు. నీపైవచ్చిన యభియోగము నెగ్గదు. తదనుకూలమైన యత్నమారంభమైనది. ధైర్యము వహింపుము' అని యరవిందునకు శ్రీకృష్ణపరమాత్మ యుపదేశించెనఁట. దానితో నరవిందునకుఁ బ్రహ్మాండమైన యాత్మ వికాసము సిద్ధించినది.

చిత్తరంజనుని వాదబలమువలన నరవిందుఁడు కారాగారమునుండివిముక్తుఁడైనాఁడు. కాని, మరలమరలనెవ్వియో కారణములను జూపి, ప్రభుత్వ మరవిందుని బంధింప ప్రయత్నించెను. వారి ప్రయత్నములను వమ్ముజేసి, రహస్యముగ

నరవిందుఁడు పుదుచ్చేరిజేరెను. అచట నొక యాశ్రమమును స్థాపించుకొని, మహాయోగియై, యతీతమానసిక శక్తులను సాధించి, వేదమత ప్రచారమునకు బూనుకొనెను. ఇప్పటికి మేధావులచే కనిపెట్టబడిన భౌతికశాస్త్ర నియమములేకాక, భావికాలమున గనిపెట్టబడబోవు సకలభౌతికశాస్త్ర నిర్ణయ ములుగూడ వేదములలో బీజరూపమున నిక్షిప్తములైయున్న వనియు - జ్ఞానచక్షువును విప్పిననాఁడు మనము వానినిదర్శింపఁ గలమనియు నిస్సంకోచముగనే యరవిందుఁడు వక్కాణించెను. దయానందుని ధోరణికన్న నిది యింకొకయడుగు ముందునకే వైచిన వైఖరి యనవచ్చును. యోగియరవిందుఁడన్నట్లు ప్రత్యేక మునఁదన ప్రత్యేకవిశిష్టతను వ్యక్తీకరించుకొనుచు, పుదుచ్చేరి యాశ్రమమునుండి దివ్యవేదాంత జ్యోతిని నలుదెసలకు ప్రసారింపజేసెను.

సత్యమునకు పునాది బ్రహ్మతేజస్సు. బ్రహ్మతేజమును బెంపొందించుకొనుట మానవధ్యేయముగ నుండవలెను. సత్య స్ఫూర్తికి దాసోఽహమనని జీవితము - తావిలేనిపూవువంటిది. సత్యబలముననే జగమంతయు నిలిచియున్నది. కావున, బ్రహ్మ తేజస్సు నుద్ధరింపవలయునని యరవిందుఁడు బహుభంగుల వివరించుచుండెడివాఁడు.

యూరపుదేశములలోగల మతమునకుపవిత్రాదర్శములు లేవు. బ్రహ్మతేజస్సన్నిళితముగ ఆమతము విరాజిల్లలేదు. విరాజిల్లగలుగుట దానిశక్తికతీతము. మనమత ధర్మములు

పరమపావన సంకల్పముతో - సర్వదా తేజరిల్లుచుండును. మన మత ప్రవక్తలు మహర్షులు-సత్యసంకల్పులు. కావుననే మన మతాచారములు-మన మతలక్ష్యసాధనములు కేవలమ్ముయంత్ర తుల్యముగ నడుపఁబడెడి భౌతికాంశములుగావు. అవి నిత్య చైతన్యసందీప్తములైన యాధ్యాత్మిక సిద్ధాంతములు; భగవ ద్విశ్వాసపరిపూర్ణములు; దివ్యతత్త్వ విరాజితములు. కావుననే మనమతమునకు యూరపువారి మతమునకు హస్తిమశకాంతర మున్నదనవలయును.

భరతఖండమునేఁడొనర్పవలసినది భగవత్కార్యము. భగవదర్పణముగ భావించి, సర్వము నిర్వహించుట యీ దేశపు సనాతన సంప్రదాయము. ప్రపంచ కల్యాణ వాంఛ - మన మతసూత్రపంక్తులలో నంతటను నిండియున్నది. కావున, మనము దివ్యత్వమును గడించి, దివ్యభావనలతో సత్ఫలము సాధింపవలయును. మనకు సాధనముగనందుబాటులో నున్న దివ్యమతము సనాతన మతము. అది పవిత్రమతము. 'వైదికధర్మమే నిత్యసత్యమ'ని యరవిందుఁ డెలుగెత్తి చాటి, సకలమానవాళి నాకర్షించెను.

మొత్తముమీద నాఁటి రాజకీయపు దుమారములకు దూరముగనుండి, దివ్యనేత్రముతో మానవాళికి మంగళ మును ఘటించు మార్గమును దర్శించి, దేశభద్రతకు వలయు సేవాకార్యక్రమములను నిర్వహించి, పూర్ణయోగిగ మను గడ గడపి, జాతినుద్ధరించుటకు, సంస్కృతిని సంరక్షించుటకు

మహోజ్వలమైన జతనము నరవిందయోగి సాగించెననుట సత్యము.

రమణమహర్షి (1879 – 1950)

ఇంగ్లీషు విద్యనేర్చియు – గుమాస్తాగా నుండుట కిచ్చగింపక, యాత్మప్రబోధముతో నరుణాచలమునుఁజేరి, సుదీర్ఘ తపముగావించి, దివ్యశక్తిని గడించిన మహనీయుఁడు రమణ మహర్షి. ఈయనయును–మన సనాతన సంస్కృతిని, ధర్మమును సంరక్షింప చక్కని కృషినే సాగించినాఁడు. పెక్కురు ప్రాక్పశ్చిమదేశీయు లీ మహాత్ముని దివ్యతేజమునకు ముగ్ధులై, సమాకర్షితులైవచ్చి శిష్యులయిరి. తిరువణ్ణామలై యీయన యునికి కతన పుణ్యక్షేత్రముగ ప్రఖ్యాతిని బడసినది. భారతీయ జీవన పవిత్రతను పరిరక్షింప పరిశ్రమించినపరమయోగులలో రమణమహర్షియు స్మరణీయుఁడనుట సత్యము.

ఆనిబిసెంటు (1847–1933)

ఈ కాలమునసే మఱికొకవిచిత్రము జరిగినది. నిజముగ నిది చరిత్రకే గర్వకారణమైన విషయము. మన సంస్కృతికి మన సాహిత్యమునకుఁగల మహత్తరాకర్షణశక్తికి మహోజ్వల మహిమలకు నదిచెరగని చిహ్నము. కావునసే యీఘట్టమునుఁగూర్చి యింత ప్రత్యేకముగఁ జెప్పుకొనవలసి వచ్చెను. ఆనిబిసెంటు భారతభూభాగముపై నడుగుపెట్టుటతోసీ ఘట్ట మారంభమైనది.

బిసెంటుసతి పాశ్చాత్యయువతి. సంస్కారహృదయ ముగల విదుషీమణి. స్వార్థాసూయలకు తావులేని యామె గుండెలో భారతదేశముపట్ల నపారభక్తిప్రేమలు గుడిగట్టు కొనినవి. మనవేదసంస్కృతినర్థముగావించుకొని, మురిసి పోయినదా మహిళ. మనపావన వసుంధరాతలమున ప్రవహిం చెడిపవిత్రస్రవంతులయెడ నామె కెనలేనిభక్తి యేర్పడెను. మహోన్నతములైన మన హిమగిరి శిఖరములనుగూర్చి భావించుకొనినపుడెల్ల నామె యెడలు పులకరించియుండె నేమో! నైతికసంపత్తికి - భగవత్సేవకు - పరస్పర ప్రేమ భావనకు ప్రాధాన్యమునిచ్చుచు వ్యాప్తములైన మనమహా త్ముల ప్రబోధము లా యాంగ్లనారీశిరోమణి మానసము నెట్లాకర్షించెనో!

'సత్యంవద' 'ధర్మంచర' 'ఆత్మవత్సర్వభూతాని' యనెడి మనసనాతన దివ్యసూక్తి పరంపరలు వినగనే, యా శ్వేత జాతీయురాలి కెట్టియనుభూతి కలిగెనో! ఏమో! వేలకొలది మైళ్ళదూరమున నుండియే భారతీయ దివ్య సిద్ధాంత తేజఃపుంజముల నామె తిలకింపగలిగెను. భావమునకు జలధులడ్డగ నిలువగలవా? మనస్సుగలిగినచో - మార్గములకు గొఱతయుండునా?

బిసెంటు భావనలిట్లు భారతమువంకకు మ్రొగ్గినవి. మ్రొగ్గుట విచిత్రముగాదు. మ్రొగ్గునాటికి భారతదేశముపై ఆంగ్లపాలకుల కొరడా పూర్తిగ నాడుచుండుట కడువిచిత్రము.

పశుప్రవృత్తితో భారతీయులను పరమ నీచముగ పాలించు చున్న ఆంగ్లజాతికిఁ జెందిన యొక స్త్రీ – ఆంగ్లేయుల పరిపాలన విశృంఖలముగ సాగుచున్న రోజులలోనే – భారతదేశమును, భారతీయతత్త్వమును, భారతీయసంస్కృతిని సర్వోత్కృష్టమని నిర్భయముగ ప్రశంసించుట విచిత్రముగాదా ?

అల్లిబిల్లిగ జాజితీగవలె స్రాకిపోయిన బిసెంటు సతి భావనాలతలు బలపడినవి. అవి గట్టిగ నామెను బంధించినవి. భారత ధరిత్రివంకకు బలముగ సమాకర్షించినవి. ఆమె భారతదేశమునకు వచ్చినది. భారతీయపౌర శ్రేణిలో నొక వ్యక్తిగ కలిసి మెలిసి వ్యవహరింపఁ గడగినది.

"నేను బహుశః పూర్వజన్మమునందీ పుణ్యభూమికిఁ జెందినదానినై యుందును. నన్నీనేలనుండి వీచెడి పావన వాత పోతములు పరిశుద్ధురాలిని గావించినవి. ఈ గడ్డపై నుదయించిన జ్ఞాన భాస్కరుడే నా యజ్ఞాన తిమిరము నంతరింపఁ జేసినాఁడు. నాకీ కర్మ భూమినుండి వినిపించిన వేదవాణీ చరణ మంజుల మంజీరనాదములు హృదయశాంతిని ప్రసాదించినవి. ఈ నేలపై బొరలని తనువేల ? ఈ దేశపుగిరి శిఖరములనుండి యౌషధీతతుల నాశ్లేషించుచు, నిమ్నోన్నత ప్రదేశములకు మమతతో సమతను ఘటించుచు, సర్వకాల ముల ప్రవహించు జీవనదుల జలధారలగ్రోలని జిహ్వయేల ? పుణ్యమూర్తులైన యిందలి మానవాళిని సేవింపని చేతులేల ? స్తవనీయమైన యీ ధరణీభాగమున-స్వచ్ఛంద సంయమీంద్ర

బృందచరణ పరాగసంపర్క సంవిలసితమైన యీ సత్యనిలయ
మున వసింపని జన్మమేల? నన్ను మీసేవకురాలుగ నంగీకరిం
పుడు. పాలక జాతికి జెందినదాననని బహిష్కరింపకుడు. మీలో
నొకవ్యక్తిగ నన్ను పరిగ్రహింపుడు. తరించుటకవకాశమును
గలిగింపుడు."

బిసెంటుసతి మనదేశమున నడుగిడుచు - భారతీయుల
కీరితి విజ్ఞప్తి గావించినది.

దురహంకార పూర్ణభావనతో-దుష్టశక్తులతో భారతీ
యులను సర్వవిధముల పీల్చిపిప్పిజేయుటయే ప్రధానాశయ
ముగ బెట్టుకొనిన యింగ్లీష్‌జాతిలోపుట్టి, భారతదేశముపట్ల
నిట్టివినమ్రభావమునొక యాంగ్లయువతి ప్రకటించుటవిచిత్రము
గాదా? మంచిచెడుగులు సర్వత్ర మసలుననుట కిదియొక
ప్రబలసాక్ష్యము.

బిసెంటు వాక్పాటవముగల గొప్పవ్యక్తి. తన వాక్పా
టుర్యముతో నచిరకాలమునసే యామె భారతీయులకాప్తురాలు
కాగలిగెను. ఉన్నతములై, ఉదారములై, ఉదాత్తములై
వెలుగులీనెడు భావరత్నములతో నామె యెల్లరి మనస్సులలో
ప్రకాశించుచు నిలిచెను. భారతీయ సాంఘిక సాంస్కృతిక
రంగముల కామె సలిపినసేవ సర్వదా స్మరణీయము. దివ్యజ్ఞాన
సమాజ సంచాలకురాలై, దివ్యసిద్ధాంతప్రబోధకురాలై దివ్య
జీవనమును మన దివ్యభూమిపై గడపు భాగ్యము గలిగినందు
లకు గర్వించుచు, మనయాధ్యాత్మికదివ్యశక్తినికొనియాడుచు,

నెల్లరను దివ్యుల గావింప దివ్యకృషి యొనర్చి నిజమైన దివ్యురాలు కాఁగలిగినది.

ఎందరో మేధావు లామె మహౌదార్యమును మనో వాక్కాయ కర్మల ననుసరించి యభినందించిరి. మానసికముగ పతనదశయందున్న జాతికి బిసెంటు వాక్కులు చైతన్యమునుఁ గలిగించినవి. కర్తవ్య జ్ఞాన శూన్యులైన భారతీయుల కొక విధముగ నామె జవశక్తుల బెంచె ననవచ్చును. మహోద్ధుర ముగ భారతీయ సాంఘికశక్తి పునర్విజృంభమాణ దశనందుట కామె చేయూత, నాఁడు భారతీయుల కెంతగనో తోడ్పడెను. తరువాత కొంతకాలమున కామె భారత రాజకీయ వ్యవహారములలోఁగూడ జోక్యము గల్గించుకొనినది. గాంధీ మహాత్మునితో నీ సందర్భమునం దామెకు కొంత వైరుధ్య మేర్పడినను భారతీయుల స్వాతంత్ర్యప్రియత్వము నామె కాదనలేదు. కాని, సహాయ నిరాకరణ సత్యాగ్రహౌదార్య మాదు లామెకు గిట్టలేదు. నమ్మిన యంశమును నిర్భీతితో నిర్వచింపఁగల శక్తి సంపన్నురాలామె. కావుననే, సహాయ నిరాకరణోద్యమ స్రష్టయగు బాపుజీతో నామెకు వ్యక్తి రేకత తప్పనిసరియైనది. భిన్నరుచి ర్హి లోకః. అంతమాత్రమున బిసెంటుకుఁగల భారతదేశ భక్తిని శంకింపఁగలమా? భారతీ యుల సంపూర్ణ స్వరాజ్యవాంఛను సర్వతోముఖముగ బల పరచుటలో నామె యెన్నడును వెనుకబడలేదు. భారత సాంఘికసంక్షేమ సమభివృద్ధి కేవిధముగ బిసెంటు సతి యండగ

నిల్చి, యహర్నిశలు శ్రమించి యభ్యుదయమును సాధించెను. అయినను, పాలకుల ప్రభావము పాలితులపై ప్రతిఫలించుచుండుట సర్వసాధారణము. కావుననే, కర్మ భూమియని ఖ్యాతిగాంచి, జ్ఞానఖండమని వాసికెక్కి పుణ్యభూమి యని ప్రఖ్యాతినిబడసిన భారతసీమ – పాలకుల దమననీతికి దాసోహమనుచు పతనదశకు సన్నిహితముగాక తప్పలేదు.

ధర్మప్రబోధకులైన దయానంద రామకృష్ణ వివేకానంద రామతీర్థాదులు జన్మించుచు – సంస్కృతిని సంప్రదాయమును సంరక్షించుటవలన జాతి పునరుజ్జీవింపఁబడినది. కాకున్న, పాశ్చాత్యుల యుద్ధతికి – దుస్సహ దుర్భరపాలనా వైఖరికి భారతీయత యేనాఁడో సమూలముగ నిర్మూలమైయుండ వలసినది. హిందూజాతి సిద్ధాంతదుర్గము లభేద్యములు గనుక, మహాప్రళయ పరిణామములకవి కొంత సంచలించినను–ధర్మ బలప్రాభవమున మనఁగలిగినవి. సహజతేజమును గోల్పోవక, నిలువఁజాలినవి.

క్రమక్రమముగ మనదేశముపై సంపూర్ణాధికారమును సాధించి, మనపై సాగించిన యాంగ్లప్రభువుల ఘోరకృత్యములసంఖ్యాకములు. దుర్బుద్ధితో – కుట్రలతో– కుయుక్తులతో భారతీయులను వారెంతగ వంచింపవలెనో– యంతగ వంచించిరి. మనలను సర్వవిధముల శక్తిహీనుల గావించి, మనకనుల యెదుటనే మనసకల సంపదలను దోచికొనిరి. అన్నపూర్ణగ ఖ్యాతిగడించిన మనదేశమునకు భిక్షాపాత్ర నందించిరి. మనకు

పరంపరాగతమైన సనాతన ధర్మమును నిరసించి, మనదృష్టిని భౌతికవాదము వంకను మరలింపఁజేసిరి. తత్ఫలితముగ భారతీయుల యాచారసరళిలో – కట్టులో – జుట్టులో – బొట్టులో నాంగ్లేయుల తత్త్వమే ప్రతిబింబించెను. భారతీయులే తమ యుత్తమాదర్శములను, సంస్కృతిని అవహేళన మొనర్పసాగిరి. తమ్ము తామిట్లు గర్హించుకొనుట లజ్జాకర మనియు గ్రహింపఁజాలరైరి.

ఆంగ్లేయుల ధోరణినే యభివృద్ధి వికాసముగ విశ్వసించి, విశృంఖలముగ మన భారతీయులు విహరింపసాగిరి. భారతీయ జీవితవిధానమునందే ఘోరమైన పరివర్తనకలిగెను. శరవేగమున, గాలిమూరమువలె నలువంకల గ్రమ్ముకొనిన యీదుస్థితికి వగచువారిసంఖ్య కొలదిగనున్నను-వారిమాట చెల్లుబడికి వచ్చుటలేదు. దేశమునం దాంగ్లమానస పుత్రుల యాటగట్టుటకు మార్గమే కనిపింపదాయెను. ఇట్టి సంకటమయ పతనావస్థలోఁ జిక్కియున్న దేశ దౌర్భాగ్యమునుఁగాంచి, కొందఱు పెద్దలు వలవల వగచిరి. వారి కన్నీరు గడ్డకట్టెను. వారి గుండెలు బండబారెను. వారిలో కాలక్రమమున నొక విధమైన వినూతన శక్తి విజృంభించెను. స్వదేశ ధర్మమును, స్వదేశాచారమును, స్వసంస్కృతిని సంరక్షించుకొనవలెననియు – దేశస్వాతంత్ర్యమును సాధింపవలయుననియు నొక తీవ్రాకాంక్ష వారిని కలవరపఱుప సాగినది. స్వరాజ్యోద్యమము ప్రారంభమైనది. కాంగ్రెసు సంస్థయుదయించుట కీ భావా

వేశమే మూలకారణము. కాని, తొలిదినములలో స్వరాజ్య సాధనమునకుపాశ్చాత్యులదమనచర్యలనెదిరించుటకు కాంగ్రెసు సంస్థకు శక్తిచాలక పోయెను. బ్రిటిష్‌వారికి తమదుస్థితిని మొఱపెట్టుకొనుట – స్వాతంత్ర్యమును ప్రసాదింపవలసినదని యభ్యర్థించుట మొదలగు పనులకే నాటి కాంగ్రెసుసంస్థ కృషి పరిమితమాయెను.

రాజకీయముగ దేశసంస్కృతి సముద్ధరణమునకు, ధర్మ సంరక్షణకు నిది యొక మహాప్రయత్నమే. కాని, కడుపునిండ పచ్చినెత్తురు ద్రాగి, కన్నుమిన్నెఱుగక, గాండ్రించుచున్న యాంగ్లేయ ప్రభుసింహ సంహారమున కీ కృషి యెంతగ నుపకరించును ? లౌకిక భోగపరంపరల నడుమ నోడలు తెలియక తడబాటుబడుచున్న ప్రభువుల శ్రవణ కుహరములలో పాలితులు సల్పెడి యిట్టి యభ్యర్థనలు పడగలవా ? ఫలితము లభింపఁగలదా ?

కాలము గడచినకొలది – పాలితులలో స్వాతంత్ర్య కాంక్షయు ప్రబలముగాసాగినది. దేశమునందంతటను స్వాతంత్ర్య వాయువు జోరుగనే వీవసాగినది. మేధావులు – కార్యశూరులునగు వారితోఁబాటుగ, కాంగ్రెసు సంస్థలో త్యాగులు, దీక్షాదక్షులు, ధైర్యసాహస సమున్నతులుగూడ నధికసంఖ్యలోఁ జేరసాగిరి. నిర్భయముగ స్వరాజ్యవాంఛ నెలుగెత్తి, నలుమూలలకు వినిపించెడి యత్నము లారంభము లైనవి. పాడిపంటలకు నిలయమనివాసిగాంచిన, రత్నగర్భయని

పేరుగన్న స్వదేశమున తిష్ఠవైచి, పాలితుల కన్న వక్రమ్ములో దక్కనిస్థితినిఁ గలుగఁజేయుచు, దేశస్వరూపమును-దేశీయుల జీవనలీలలను తల్లక్రిందులు గావించుచున్న యాంగ్ల పరిపాలకులపట్ల, భారతీయ సామాన్య ప్రజలలో పెరిగియున్న యసంతృప్తి - కాంగ్రెసు సంస్థను నడుపు పెద్దల కృషికి కొండంతయండగ నిలిచెను. ప్రభువుల సహకారముతో బ్రతుకులను గడపుకొనుచు, పదవులయందున్న కొలదిమంది భారతీయులే యీ యుద్యమమును పెట్టివారి చర్యక్రిందలెక్క వైచిరి. కాని, కాంగ్రెసువారు మాత్రము తమదీక్షనువదలక, నిరుత్సాహమున గుములక, పట్టుదలతో స్వాతంత్ర్యసందేశమును దశదిశల వ్యాపింపఁజేసి, బహుళ ప్రజానీకపు మన్ననలకు పాత్రులయిరి. ఆంగ్లేయుల పాలనను తుదముట్టింపవలయుననుకాంక్ష ప్రబలమాయెను.

దురహంకార మెంతకాలము సింహాసనమున నిలువఁగలదు ? దుష్టశక్తి యెంతవఱకు కొరడాఝళిపింపఁగలదు ? దురాలోచన యెన్నిదినములు విజయశ్రీని వరింపఁ గలదు ? కాంగ్రెసుసంస్థయొక్క మహోద్యమ తీవ్రత - నానాటికి వృద్ధినందసాగెను. దేశగౌరవము, దేశసంస్కృతి, దేశధర్మము పునరుత్తేజమునందె, భారతప్రాచీన తేజోరేఖలు మఱల లోకమున వెల్లివిరియవలెనను దృష్టి - భారతీయులలో ప్రబలెను. దీనితో నాంగ్లేయులకు కన్నెఱ్ఱయైనది. ఎట్లేని భారతీయులలో రేగిన చైతన్యాగ్నిమీద నీరుజల్లవలయునని వారు ప్రయ

త్నింపసాగిరి. స్వాతంత్ర్యప్రియులైన భారతీయుల వైఖరిని జూచి, యోర్వజాలక, కుట్రలబన్నసారంభించిరి. భారతీయులు సంచలింపలేదు. స్వాతంత్ర్యమునభిలషించువారిని దారుణముగ హింసించుట కాంగ్లేయులు తలపడిరి. ఆంగ్లపాలనను స్తుతించు స్వార్థపరులును - దేశభక్తిరహితులునగు కొందఱు భారతీయులను ఆంగ్లపాలకులు అభిమానించుచు, నభినందించుచు వారిని ప్రోత్సహింపసాగిరి. స్వపరిపాలనకొఱకు పరితపించువారిని నానావిధ బాధలకు గురిగావించిరి. వారిపైపశు బలమును ప్రయోగించిరి. దమననీతి నమలుపఱచిరి. వందేమాతరమనుట మహాదోషముగ పరిగణింపఁబడెను. స్వదేశ సంస్కృతిని, ధర్మమును సంరక్షించుకొనబూనుట రాజద్రోహముక్రిందికి వచ్చెను. నిర్దాక్షిణ్యముగ భారతీయుల స్వాతంత్ర్యమహేచ్ఛావ్యమము నణగద్రొక్కుటకు కంకణము గట్టిరి. బ్రాహ్మణాబ్రాహ్మణ విభేదములను బెంచిరి. హిందూ మహమ్మదీయ కలహాములను ప్రజ్వలింపఁజేసిరి. ఇట్టి భేదోపాయములతో భారతీయులను విభజించి, పరిపాలనను కొన సాగింపఁబూనిరి. స్వాతంత్ర్యప్రియులైన కొందఱు భారతీయులు - పాశ్చాత్యులవలెనే పాశవికతత్త్వముతో, వారిపై ప్రతిహింసగావించి, దేశమునకు స్వాతంత్ర్యమును సాధింపవలయునని తీర్మానించుకొనిరి. పలువురుమాత్రము హింసాకాండకు సుముఖులుగాక, నయపద్ధతితో - సామరస్యముగ స్వాతంత్ర్యమును సంపాదింపవలెనని నిశ్చయించుకొనిరి.

మొత్తముమీాద, స్వాతంత్ర్యప్రియులగు భారతీయు లీరీతిగ రెండువర్గములుగచీలి, లక్ష్యసాధనకు పూనిక వహించుట- నాటి స్వాతంత్ర్యసమర చరిత్రలో నొక విచిత్రఘట్టమనియే చెప్ప నొప్పును.

భారతీయుల నెంతగపీడించి, సముద్ధతితో నణచుటకు యత్నించినను-'స్వాతంత్ర్యము నాజన్మహక్కు' అనెడిపలుకు భారతీయునినోట ప్రతిధ్వనించుటతో నాంగ్లేయులు నివ్వెఅ పోవసాగిరి. 'వందేమాతరమ్ - మందేరాజ్యమ్' అను గంభీర గళ గర్జనలతో దేశముమాఱుమ్రోగెను. బాలగంగాధరతిలక్, లాలాలజపతిరాయ్, చిత్తరంజన్ దాస్, మదన మోహన మాళవ్యా బిపినచంద్రపాలు మున్నగు మహనీయులీ దేశ స్వాతంత్ర్య కాంక్షను ప్రవృద్ధమొనర్చు - ప్రబోధములు సల్పిరి.

వినాయక దామోదర సావర్కార్. కామాసతి, భగత్సింగ్వంటి వీరయువకులు కొందఱు-పాశ్చాత్యులను మారణ యంత్రములతో హింసాకృత్యములతో మాత్రమే పాఱ ద్రోలగలమనెడి విశ్వాసముగలవారై, ఇంగ్లీష్వారిపై దారుణ మారణహో సాకాండనే ప్రయోగించిరి. ఈవిధానము సత్ఫలిత ముల నీయకున్నను-వీరిదేశభక్తి ప్రశంసార్హమేయనవచ్చును. వీరును త్యాగమూర్తుల శ్రేణికిఁ జెందినవారే. ధీమంతులే. పాశ్చాత్యులతో వీరు ముఖాముఖిగ పెక్కు సంఘర్షణలకు దిగి, యాంగ్లేయులక్రోధాగ్నికి శలభములగుటకే సాహసించిరి.

వీరియపూర్వత్యాగ జీవితలీల - స్వాతంత్ర్య చరిత్రలో సువర్ణాక్షరములతో లిఖింపఁదగిన ఘట్టము.

హింసాకాండను సమర్థింపనివారిలో కొందఱు - కారాగారములకేఁగి, కష్టముల ననుభవించుటకేని వెనుదీయరైరి. ఈస్థితిలో - జలియన్‌వాలాబాగ్‌లో - ముష్కర పాశ్చాత్య ప్రభువులు గావించిన కిరాతకృత్యములకు దేశమంతయు నట్టుడికినట్లుడికెను. వేలకొలది భారతీయులొక్క క్షణమునందే విగతప్రాణులైరి. ఇంగ్లీషువారి పైశాచిక ప్రవృత్తిపట్ల - జలియన్‌వాలాబాగ్‌లో జరిగిన రాక్షసకృత్యములపట్ల దేశమున తీవ్రనిరసన దృష్టి ప్రబలెను. సభ్యతాసంస్కారములుగల సాటి రాజ్యములన్నియు - పాశ్చాత్యుల ఘోర రాజ్యాధికార దాహమును గర్హించివైచినవి.

మహాత్మగాంధి (1869 - 1948)

దేశమునందిట్టి విషమ వికృత పరిస్థితులు తాండవించుచున్న తరుణమున-మోహనదాసు కరంచంద్ గాంధీ రాజకీయ రంగమున కాలిడెను. గాంధీనాయకత్వము భారతీయుల దాస్యాంధకార నివృత్తికి వేగుఁజుక్క యాయెననుమాట వాస్తవము.

1919-వ సంవత్సరమున గాంధి రాజకీయములలో ప్రవేశించెను. నాటినుండియు కాంగ్రెసు మహాసంస్థకు నాయ

కర్తవ్యమువహించి, రాజకీయమనెడి ఔద్యమ సఫలతకు భగవ దనుగ్రహము తోడ్పడవలయుననెడి పూర్ణవిశ్వాసమును ప్రజలలో పూరింప మొదలిడెను. రాజకీయ వ్యవహారము లతో నాధ్యాత్మిక శక్తిని మేళవింపవలయునని నిర్ద్వంద్వముగ నిర్వచించి, తదాచరణకు గడంగిన మహనీయుఁ డీయన.

హింసాకాండపట్ల గాంధికి విశ్వాస మేమాత్రముకూడ లేదు. శాంతియుత వాతావరణమే జాతికి మోక్షమును ప్రసా దింపఁగలదని యీయన సిద్ధాంతము. నయశీలములు జాతికి నయనములవంటివనియు – వానిని సంరక్షించుకొనబూననిజాతి యంధత్వమునఁ గూలుననియు నీయన ప్రబోధించెను. మాటకు బ్రాణము సత్యమనియు–సత్యబలముననే జాతి తేజో మయము కాఁగలదనియు గాంధి గట్టిగనమ్మి, సాధుమార్గము నవలంబించెను.

రాజకీయములకు శాంతిని, సత్యాహింసలను, నయశీల ములను పునాదులుగనిడి, స్వాతంత్ర్యసిద్ధికి నడుము గట్టిన గాంధిని – లోకము దైవాంశసంభూతునిగ సంభావించెను. మహాత్ముఁడని ప్రస్తుతించెను. బాపుజీయని యాప్యాయన ముగ బిలుచుకొనెను.

ప్రజలకు బాపుజీపలుకు వేదవాక్యమైనది. మహాత్ము డాదేశించినచో, భారతప్రజ యగ్నిగుండమున దుముకుటకేని సంసిద్ధమగుననినచో – గాంధిజీపట్ల దేశమునకుఁగల యఖండ భక్తిగౌరవము లెట్టివో సులభముగ వ్యక్తముకాగలవు.

రాజకీయములందచిరకాలమునసే యిట్టి యద్భుత కీర్తిని గడిం
చిన నాయకు లరుదుగనుందురు. ఆధ్యాత్మికచింతన జాతికి
తారకమనియెంచి, రాజకీయశక్తిని – రామభక్తిని మేళవించిన
మహనీయుఁడగుటవలననే గాంధిజీ మహాత్ముఁడై, బాపూజీయై,
జాతిపితయై స్వాతంత్ర్యభానూదయమును గావించి, శాశ్వత
కీర్తిని గడింపఁగల్గెను.

సర్వసంగపరిత్యాగముతో నిమిత్తము లేకయే – జన
గణములమధ్య నిల్చియే – ఘోరారణ్యముల కేగకయే తీరని
రాజకీయ సమస్యల నతి చాకచక్యముగ పరిష్కరించు యత్న
మందుండియే యెందఱుమహాత్ములు కాఁగలుగుదురు? వేదముల
యెడ – భగవంతునియెడ భక్తివిశ్వాసములను ప్రకటించు
చిత్తశుద్ధితోమనుగడను గడపుట నిజముగ నసిధారావ్రతము.

విదేశీయులుసైతము విస్తుపోయెడి యాత్మబలముతో –
మానవసేవలో మాధవసేవాఫలమును జూరగొని, యుపనిష
త్సారమును – గీతామహిమను –రామనామప్రభావమును–
రాజకీయతపఃపల సాధనకాధారముగగొని, భారత రాజకీయ
ములలో నపూర్వతేజమును వెల్లివిరియించిన గాంధిజీవంటి
మనీషివరేణ్యు లెందఱుందురు ?

బాపుజీ యీగడ్డపైజన్మించుట – భారతీయుల సుకృత
విశేషము. దక్షిణాఫ్రికా సత్యాగ్రహము, ఉప్పుసత్యా

గ్రహము, వ్యక్తిసత్యాగ్రహములవంటి యపూర్వ ప్రయోగములు–మహాత్ముని జీవితమున మరువరానిఘట్టములు.

మహాత్ముని యాశ్రమములో ఆయనసత్యాంగత్య బలముతో విజ్ఞానమునార్జించు యువతీయువకులకు, అనుభవములను గడించుకొను స్త్రీ పురుషులకు, సత్యాహింసలసాధనములతో పశుబలము నెదుర్చు సత్యాగ్రహులకు, లాఠీదెబ్బలు పుష్పతాడనములు. కారాగారములు కళ్యాణమంటపములు.

ఈ విధముగ వర్ణితమైన గాంధిజీ ప్రతిభ యక్షరాక్షర సత్యమైనట్టిది. లక్షలకొలది రూప్యముల నార్జించెడి న్యాయవాదులు, వైద్యులు, అధ్యాపకులు, ప్రభుత్వోద్యోగులు, వర్తకులు, కర్షకులు – తమతమ వృత్తులను తృణప్రాయముగ పరిత్యజించి, గాంధిజీ సంకల్పించిన సత్యాగ్రహ మహాయజ్ఞమును నిర్వహించుటకై ఋత్విక్కులుగఁజేరిరి. కర్మవీరులై కారాగారముల కరిగిరి. దుస్సహయాతనల నానంద ముతో ననుభవించిరి. సత్యాగ్రహౌదార్యమునందు దిట్టలై నిల్చిరి. తండ్రినివిడిచిబిడ్డ – బిడ్డనువిడిచితండ్రి – భార్యను వదలిభర్త – భర్తనువదలి భార్య – కుటుంబమును త్యజించి, అందరును మహాత్మునిపిలుపు నందుకొని, శాంతిసమర సేనానులై ముందునకుసాగిరి. వారి యద్భుత సహనశక్తికిపరదేశములన్నియు నివ్వెరవోయెను. ప్రజలలో నిట్టిచైతన్యమును ప్రజ్వలింపఁజేసిన మహానేతయు – భారతభాగ్యవిధాతయునగు గాంధిజీ కార్యనిర్వహణ దీక్షాదక్షతలకు ఆంగ్లప్రభువులు

హాడలిపోయిరి. అపూర్వమైన సహాయ నిరాకరణోద్యమపు వెల్లువనుఁగని, పాశ్చాత్యప్రభువులు బిత్తరవోయిరి.

పలుమారులు మహాత్ముఁడు సాగించిన నిరసనవ్రతము లకు ప్రభుత్వమునందలజడి రేగెను. గాంధిజీని కారాగార ములందు నిర్భందించి యుంచినచో నీవిప్లవాగ్ని చల్లారునేమో యనియెంచి, ఆయనను చెఱబెట్టిన యాంగ్లపాలకుల జతనము లన్నియు వ్యర్థములాయెను. రౌండుటేబిల్ సమావేశములలో సామాన్య జాతీయ దుస్తులతో పాల్గొని, మహాత్ముఁడు సల్పిన చర్చలు, ఆంగ్లప్రభువుల గుండెలలో బలమైన బ్లైమువలె పనిచేసెను. గాంధీజీ సూచనల నెప్పటికప్పు డామోదించు చున్నట్లు నటించుచు – భేదోపాయములను గల్పించుచు, మహోద్యమవ్రతీవ్రతను దట్టుకొనుచు కాలము గడపుటకన్న నప్పటిలో ఆంగ్లప్రభువులకు గత్యంతరము గన్పింపకపోయెను.

శారీరకముగ దుర్బలుడైన యిట్టివ్యక్తి – పాశవిక శక్తులముందు, వీరునివలె నిర్భయముగనిలిచి, సాధువువలె సకలకష్టములనుసహించి, నైతికవిజయమును సాధింపఁగలుగుట యపూర్వవిశేషమే.

దేశమున స్వాతంత్ర్యోద్యమముగూడబాగుగబలపడినది. బక్కచిక్కిన బాపూజీ యాధ్వర్యమున భారతజాతి బలీయ మైనదాయెను. కోట్లకొలది ప్రజలలో భయరాహిత్యమును, ధైర్యసాహసములను పాదుకొల్పి, నవభారతనిర్మాతగ గాంధీ మహాత్ముఁడు పేరుగాంచెను. "మట్టినుండి మహావీరులను

సృష్టించు శక్తిసంపన్నుడు గాంధీజీ" యని గోపాలకృష్ణ గోఖలే మిక్కిలిగ ప్రశంసించెను.

యీవనదశలోగాంధి - కామప్రవృత్తిగలిగి యుండెడి వాడట. అట్టికాముకుఁడు కాలక్రమమున విశ్వసంక్షేమకాముడుగ, సకల ప్రజా శ్రేయస్కాముఁడుగ దైవభక్తి ప్రపూర్ణ మానసుఁడుగ పరివర్తన చెందెను. భగవచ్ఛక్తి ననుభూతికిఁ దెచ్చుకొనెను. తన బంధనములను ద్రెంచుకొనెను. మాతృదేశ దాస్య బంధనముల విదళింపఁగల సుశిక్షితుఁడై నిలిచెను. నోరులేని దీనులను, నిఱుపేదలను మేల్కొల్పెను. సత్యాహింసలనెడి ప్రబలాస్త్రముల సహకారముతో-రవి యస్తమింపని బ్రిటీష్ సామ్రాజ్యమును కూకటి వ్రేళ్ళతో గూల్చివేయఁ గలవాఁడాయెను. హింసతో ప్రమేయములేని దివ్యోద్యమమును సాగించి, స్వాతంత్ర్యమునార్జింపసమకట్టిన యాదివ్యుని సంకల్పము దైవచింతనతో ధన్యతనుగడింప నర్హతను గనెను. ఆత్మవిశ్వాసమును సోదరభారతీయులలో పూర్తిగ నెలకొల్పి, సముత్తేజితుల గావింపయత్నించి, సఫలీకృత మనోరథుఁడాయెను. స్త్రీలలో నైతిక సంపద బెంపొందించినచో జాతి యంతయు మహోజ్జ్వలముగ, మాననీయముగ వెలుగొందఁగలదని విశ్వసించి, భారతమహిళల భావికి బంగారు బాటలు నిర్మించెను. స్వరాజ్యసాధన రంగమునఁగూడ వీరిని నిల్పి, భారతీయుల స్వాతంత్ర్యాభిరుచిని బాగుగ వ్యక్తీకరించెను.

గాంధిజీ యాధ్వర్యమున స్త్రీ పురుషులెల్లరు భోగములను త్యజించిరి. త్యాగములనువరించిరి. కోరికలను బహిష్కరించిరి. ఆదర్శముల నాశ్రయించిరి. త్యాగము మానసిక వికాసమును సంధించును. చిత్తశుద్ధిని ఘటించును. సాటి మానవులపట్ల ప్రేమను వెలయించు సత్సంప్రదాయమును నెలకొల్పును. దివ్యత్వము నుద్దీపింపఁ జేయును. గాంధీమహాత్ముని నాయకత్వమున భారతీయులెల్లరు త్యాగసమారాధకులై, ధర్మపరాయణులై, తత్త్వసాధకులై ధన్యులయిరి.

"ముప్పదేండ్లుగనేనందుకొన నుత్సహించినది భగవదనుభూతినే. నాజీవితలక్ష్యమదియే. రాజకీయములలో నాసర్వ ప్రయోగములు, ప్రయత్నములు తల్లక్ష్యసాధనకే."

గాంధీజీ హృదయమిది. సదా ముముక్షువుగనే – యోగిగనే – జీవితమును గడపిన యామహనీయుఁడు–పవిత్ర నిర్మలాశయముల సాధనకు సత్యాహింసలనే ప్రధానాధారములుగఁజేబట్టి, విజయమును సాధించెను.

కామినీ కాంచన పరతను నిర్జించెను. కఠోర బ్రహ్మచర్య వ్రతము నవలంబించెను. సత్యాహింసల ననుష్ఠించెను. సేవా త్యాగములనభ్యసించి యపూర్వఫలితములను గడించిన బాపుజీ రాజకీయములలో – సర్వత్ర యాధ్యాత్మికశక్తి పెనవైచుకొని యుండెననుట యతిశయోక్తి కానేరదు.

బిపిన్‌చంద్రపాల్, పట్టాభి, మోతిలాల్, జవహర్‌లాల్ మాళవ్యా, పటేలు సోదరులు, రాజేంద్రబాబు, లజపతిరాయి

విశ్వదాత కాశీనాథుని నాగేశ్వరరావు, అబ్దుల్ కలామజాద్, డాక్టరు అన్సారి, గఫార్ ఖాన్ సోదరులు, ప్రకాశముపంతులు, కాళేశ్వరరావు, కొండ వెంకటప్పయ్య మున్నగు మహా నాయకులు గాంధీజీకికుడిభుజములుగ నిల్చి, స్వాతంత్ర్య రథ మును ముందునకునడపిరి.

మహాత్ముని దివ్యశక్తిచే ప్రభావితమైన భారతజాతి - యనంతమైన యాత్మబలము నార్జించుకొనగలైను. శాంతి పూర్ణమైన సత్యాగ్రహాయుధముతో - సకల విజయ ములను సాధింపగలస్థాయి కచిరకాలమునసే చేరుకొనగలైను. మహాత్ముని సత్యసంధతకు, అహింసావ్రతదీక్షకు, చిత్తశుద్ధికి, సరలసాధుశీలమునకు ముగ్ధులై యనుయాయులైన వారిలో - మహిళలు సైత మెందఱోకలరు. తృణాంకురములను సైతము బ్రహ్మాస్త్రములుగ మార్పగలిగిన గాంధీజీ ప్రభావ మీ యుగమున నధికసంఖ్యాకులపై ప్రతిఫలించెననుట తథ్యము.

సరోజినీదేవి (1879 - 1949)

మహిళలలో గాంధీజీకి సర్వవిధముల ననుంగు శిష్యు రాలై, కాంగ్రెసు కార్యకలాపముల కపూర్వ జవసత్త్వముల ఘటించిన నారీశిరోమణి సరోజినీదేవి. ఈమె వంగ ప్రాంతపు కాంతారత్నము.ఆంగ్ల-వంగ భాషలలోపరిణతమైన కవితా ప్రజ్ఞ సంపాదించి, దిగంత యశస్సు నార్జించిన భారతపు స్త్రీ తిలకము.

మధురోపన్యాసధారతో – వేలకొలది ప్రజల నట్టె నిలువ బెట్టెడి దిట్ట. గాన పూర్ణమగు కవిత్రతో–లక్షలకొలది పాఠకుల హృదయ పీఠములపై నభిమాన ముద్రల నద్దజాలిన కావ్య కళాకోవిదురాలు.

భారతీయుల స్వాతంత్ర్యాభిరుచిని బహుభంగుల కవితా హృదయముతో వర్ణించుచు, సరోజినీదేవి కాంగ్రెసుమహోద్యమమును మూఁడుపూవు లారుకాయలుగ విలసిల్లఁజేసినది. ఆమెమాట–సమస్త మహిళాలోకమున కానాఁడు రాచబాట యాయెను. స్వాతంత్ర్యభావదీప్తిని – భారతీయ సంస్కృతీ వైభవమును – సనాతన ధర్మదీధితిని తన కవితలో కరగి పోసి, సువర్ణ కావ్య సంపుటములను నిర్మింపఁజాలిన యీ విదుషీమణిని – 'భారత కవి కోకిల' యని ప్రజావళి కొని యాడెను. ఇట్టివారెందఱు మహిళలో పూనిన మహోజ్జ్వల దీక్షయే నాఁడుదేశసౌభాగ్యమునకు శ్రీరామరక్ష యాయెను.

కుల మత వర్గవైషమ్యరహిత వాతావరణమున దేశ స్వాతంత్ర్యమునుసాధించుటయే ధ్యేయముగముందడుగువైచిన గాంధీమహత్ముఁడు – మహమ్మదీయ–హరిజన సోదరుల యభిమతములకొఱకెన్నియో యవాంఛనీయ పరిణామములకు తల యొగ్గెను. పాశ్చాత్యులీ యదనును గమనించి, హిందువులను మహమ్మదీయులను విడదీసి, దేశైక్యమును బలహీన పఱుచుటకెన్నియో పన్నాగములనుబన్నిరి. జిన్నాకు ఆంగ్లపాల కుల ప్రేరణము మెండగుట, అంబేద్కర్ నాయకత్వమున హరి

జనులుగూడ విడదీయఁబడుట మున్నగు దుష్టచర్యల కొఱకు గట్టి కృషి సాగింప బడినది. అట్టితరుణమున స్వదేశీయులకు కొంత మనోవ్యధకలిగినను - సమైక్యము విచ్ఛిన్నము గాకుండుటకై, గాంధీజీ బహుభంగుల శ్రమించి, యంతర్విభేదములు పెచ్చుపెరుగని తెఱగున కొన్నియసమంజసములగు విషమము లైనషరతులకు సైతము తలవంచి, భారతస్వాతంత్ర్యమును సాధింపవలసి వచ్చెను.

"నేను నా దేశీయులను ప్రేమించినట్లే, ప్రపంచమునఁ గల సర్వమానవులను ప్రేమించుచున్నాను. భగవంతుఁడందఱి హృదయములలోనున్నాఁడు. మానవసేవవలననే నేను భగవదనుభూతిని బడయ వాంఛింతును."

ఇట్టి నిర్ణయమునకు గట్టువడినవాఁడగుటవలననే గాంధీ మహాత్ముఁడఖండ భారతమును వాంఛించియు-పాకిస్తాను వేర్పాటునకు సమ్మతించిన పలువురు భారతీయనాయకుల యభిమతముల కడ్డునిలువక భారత స్వాతంత్ర్యమును గాంక్షించువాఁడాయెను.

1947 లో - భారతమునకు స్వాతంత్ర్యము సిద్ధించినది. కొలది కాలమునకే జిన్నా నాయకత్వమున మహమ్మదీయులు వేఱుపడి, కరాచీలో కాపురము పెట్టుట గమనార్హము. భారత దేశమునకు స్వాతంత్ర్యము సిద్ధించినదన్న యానందము వెనుక - దేశము రెండుముక్కలాయెనను వేదన ప్రజలలో

లేకపోలేదు. స్వాతంత్ర్యమును సంపాదించిన కాంగ్రెసుకార్య నిర్వాహక వర్గమున జీలికలేర్పడినవి. మహాత్మగాంధి-అజాద్ మున్నగువారు దేశవిభజనమును బాహాటముగ ఖండించిరి. కానీ జహ్వారిలాల్ నెహ్రూ, రాజాజీవంటివారు దేశవిభజనమును కావలెనని పట్టుపట్టిరి. జహ్వారులాల్ మహాత్మునిఒత్తిడిచేసి, యీవిషయమునతటస్థుడుగనుండునట్లుఒప్పించెను. అంతట పాకిస్తానము నేర్పఱుచుటకు ఆమోదించి - దానిని కొందఱు మహమ్మదీయులకు అప్పగించెను. భారతదేశమునకు జహ్వారిలాలు ప్రధాన మంత్రియయ్యెను.

మొత్తముమీద స్వరాజ్యము వచ్చినది. కాని, ప్రక్కలోనిబల్లెమువలె మహమ్మదీయ స్వతంత్రరాజ్యమొకటి పాకిస్తానురూపమున నావిర్భవించుటచే, అఖండ భరతఖండ స్వతంత్ర కాముకులగువారి కెల్లరికి తీరని యాశాభంగమే యయ్యెను. స్వాతంత్ర్యము సిద్ధించినను,భారతదేశసౌభాగ్యమునకు విచ్ఛిన్నతయేర్పడుట భారతప్రజా సంక్షేమమునకు గొడ్డలి పెట్టేయని, దూరదృష్టిగలవార నేకులనిరి.

భగవచ్చింతనతో విశిష్టసాధన సంపత్తిని సమకూర్చుకొని, తనజన్మభూమికి స్వాతంత్ర్యమును సిద్ధింపఁజేసిన మహాత్ముడు - మహర్షి కులతిలకుఁడుగ విరాజిల్లెను. కావున, ఇరువదవ శతాబ్దమున భారతదేశమున సనాతనధర్మరక్షణకు ఋషిశక్తియే తోడ్పడెననుట సత్యము. ప్రాచీనకాలము

నుండియు – పరంపరగవచ్చుచున్న రెండొకానొక దివ్యశక్తి బలమునను, భారతదేశము స్వాతంత్ర్యమును సాధించుకొని, తిరిగి యాత్మగౌరవోపేతముగ తలనెత్తగలిగినది. భగవదను భూతికొఱకు పరితపించుచున్నదివ్యభావుకులే యీ యుగమునఁ గూడ విజయసాధకులు కాఁగలిగిరనుట నిర్వివాదాంశము.

ధర్మాధర్మములకు సంఘర్షణ ప్రబలి, న్యాయము దెబ్బతిని, సనాతన సంప్రదాయము భగ్నమైపోవుచున్నతఱి–తద్రక్షణార్థముద్భవించి, సత్సంకల్పములను సాధించెడి సజ్జనుల కోవకుఁ జెందిన సాధుసత్తముఁడైన గాంధీ మహాత్ముఁడే యీ యుగవైక్లబ్యమును సరిదిద్దుటకు ప్రయత్నమును సాగించి జయించుట-సనాతన తపశ్శక్తి సంపత్తినే మరొకమారు బుజువుపఱచినది.

స్వరాజ్యము సిద్ధించినది. హస్తినాపుర విశాల సమున్నత రాజసౌధోపరిభాగమున త్రివర్ణపతాకము రెపరెపలాడినది. కాంగ్రెసు మహాసంస్థ కృషిఫలించినది. ఫలితము లభించినంతనే సంస్థ – ప్రజలలో సదభినపరంపరల బెంపొందించుటకే పరిమితమైపోయి, సేవాభావముల కంకితమగుట సాధువిధానమని మహాత్ముఁడాదేశించెను. కాని, కాంగ్రెసుసంస్థ-నేతృత్వమును వహించి, పరిపాలనాభారమును స్వీకరింప సిద్ధమయ్యెను. స్వాతంత్ర్య సముపార్జనమునకు–ప్రజాక్షేమమునకు సర్వత్యాగముగావించి శ్రమించిన జాతీయనాయకులు దేశమునకు పాలకులయిరి. ఆర్షధర్మములపట్ల – ప్రాచీన భార

తీయ నాగరికతపట్ల – దైవముపట్ల భక్తి విశ్వాసములులేని యాగర్భశ్రీమంతుఁడు – పాశ్చాత్యసంస్కృతీప్రియుఁడునగు పండిత జవహ్వారులాలునెహ్రూ ప్రధానమంత్రిపదవినధిష్ఠించెను. ఆజాద్, పటేలు, కిదాయ్ మున్నగు త్యాగధనులు మంత్రి వర్గమునఁ జేరిరి. అజాతశత్రువనియు-మహర్షి సత్తముఁడనియు మన్ననల గడించిన బాబురాజేంద్రప్రసాద్ 1950 సం. లో భారత సర్వతంత్రస్వతంత్రరాజ్యమునకు ప్రథమాధ్యక్షుఁడుగ నెన్నుకొనఁబడెను. కీడులోమేలుగ – మేలులోకీడుగ నేవేవియో వరుసవరుసగ జరిగిపోవసాగెను.

దక్షతగల మహానాయకుఁడగు సర్దార్ వల్లభభాయి పటేలు మహాశయుని సుదూరదృష్టిఫలితముగ, భారతమునకు తొలుదొలుత జరిగినమేలు–స్వదేశసంస్థాన విలీకరణము. వ్యర్థముగ దేశసంపదను విదేశములలో దుర్వినియోగము గావించుచు, ప్రజాక్షేమమును కాంక్షింపక, పాలకులుగనున్న స్వదేశ సంస్థానాధిపతుల నందఱిని తన యాత్మబలముతో దేశభక్తుల గావించి, భారతరాజ్యాంగమునకు బద్ధులఁజేసిన మహామేధావి వల్లభభాయిపటేల్. స్వదేశ సంస్థానాధిపతుల నందఱను దీక్షతో సంస్థాన విలీకరణ సమస్యకు సమ్మతింపజేసిన పటేలు మహాశయుని ధీశక్తికి, పరిపాలనా పాటవమునకు, దేశ భద్రతకు పటుత్వమును ఘటింపఁబూనిన దీక్షకు భారతీయులేకాక, పాశ్చాత్యులుసైత మనేకులు విస్మయచకితులయిరి.

సర్వసమర్థుడైన పాలకుడు జాతికి స్వర్ణఖండములనే యందింపఁగలడు. సకలక్షేమములను సమకూర్పగలఁడు.

రాజ్యాంగ 'చట్టము' నిర్మాణమైనది. అందు మత ప్రమేయములేని ప్రభుత్వ విధాన సూత్రము చేర్పబడినది.

మత ప్రమేయమనగా మత సహనమనియే భావింప నగును. కాని, ఇది నాస్తికము వంక కేదారిదీయుచున్నది.

ప్రజాస్వామ్య సూత్రములపై వయోజనుల సమ్మతులతో నేర్పడిన భారతపార్లమెంటులో – సంఖ్యాబలమును గడించిన కాంగ్రెసుసంస్థ దేశపరిపాలనా బాధ్యతనువహించెను.

రాష్ట్రములలో సైతము కాంగ్రెసు మంత్రిమండలికే యధికారము కైవసమాయెను. రాజ్యాంగనియమావళి కట్టు దిట్టముగనే సంఘటింపఁబడినది. దేశభక్తులైన కాంగ్రెసు నాయకులే దేశమును పాలించుచుండిరి. కాని, దురదృష్ట మేమో! భారతీయత మాత్రము పురిగట్టలేదు. సనాతన సంస్కృతికి మాత్రము సముచితస్థానము దక్కలేదు. ప్రభుత్వస్థాయిలో ప్రజల యభిరుచులను భారతీయ ధర్మ సిద్ధాంతమువంకకు మరల్చు ప్రయత్నము మాత్రము విపుల ముగ నారంభింపఁబడలేదు. శతాబ్దముల తరబడిగ నిటనవలం బింపఁ బడుచున్న యాంగ్లేయ భావములయం ధాను కరణ మున మాత్రము మార్పుగోచరింపలేదు. అది వెట్టి తలలు వైచి, వికారముగ–విచ్చల విడిగ విహరించుచునే యున్నది.

కార్యస్థానములలో మంత్రులు మారిరి. జెండాలుమారినవి. ముద్రలు మారినవి. కాని, మనస్సులు మారలేదు. మనుగడ తీఱుతెన్నులు మారలేదు. మంచిని మన్నించెడి తత్త్వము వ్యాప్తముకాలేదు. పరిపాలన–పాశ్చాత్యులయడుగుజాడలలోనే నడచుచుండెను. ముఖ్యముగ, జాతియొక్క భావసరళిలో బ్రహ్మాండమగు మార్పును గొనితెచ్చెడి విద్యావిధానమున లవలేశమేనియు పరివర్తన గోచరింపకుండుట, కలికమునకైన జాతీయత గన్పింపకుండుట కడుంగడు విచారణీయము.

నేడు స్వపరిపాలన జరుగుచున్నమాట వాస్తవమే. పంచవర్ష ప్రణాళిక లమలు జరుగుచుండుట సత్యమే. కాని, మనకేమి యొఱిగినది ? ఆంగ్లేయులను మరింతగ ననుకరించుచు బ్రతుకుచున్నాము. సంస్కృత విద్యపేరెత్తిన, నాయకాగ్రణులకే తలనొప్పివచ్చెడి స్థితి యేర్పడినది. భారతీయ ప్రాక్తనజీవితవైభవమును – సనాతన ధర్మప్రాభవమును సమవగాహన మొనర్చుకొని, సముచిత వర్తనమునజరించుట కనువగు సంస్కృత విద్యనే ప్రోత్సహింపనేరని మన స్వాతంత్ర్యమున కర్థమేమి ?

అయిదేండ్ల కొకమారు కోలాహలముగ నెన్నికల జాతర జరుగుచునేయున్నది. లక్షలతరబడి ద్రవ్యము వ్యక్తిగత ఫలితసాధనకు చిల్లపెంకులపగిది విచ్చలవిడిగ వెచ్చింపఁబడుచునే యున్నది. అభ్యుదయ ప్రణాళికలు కాగితములపై రూపరేఖల దిద్దుకొనుచునే యున్నవి. భారతీయ జనత–

యెప్పటియట్లు దారిద్ర్యబాధ ననుభవించుచునే యున్నది. విజ్ఞానపు వెల్లువ పొంగకున్నను – ప్రగతి శీలము ప్రబలము గాకున్నను సామాన్యుని జీవిత భద్రత కొడుదొడుకులు తట స్థించెడి స్థితియైనను సరిదిద్దబడకుండుట శోచనీయాంశము. తినుటకు తిండి, త్రాపుటకు నీరు, కట్టుటకు గుడ్డ మానవజీవిత నిర్వాహణమునకు ప్రాథమికావసరములని సర్వజనులెఱింగినదే. ఇట్టి నిత్యావసరములకే సామాన్య ప్రజలీ నవభారతమున, కాంగ్రెసు ప్రభుత్వమున మొగమువాచిరన, నిఁక నీ ప్రణాళిక వలనఁగలిగిన ప్రయోజనమెద్దియో బోధపడకున్నది. సాంఘికముగ మనము సాధించుకొనఁగలిగిన ప్రత్యేకత యెద్దియో వ్యక్తమగుటలేదు. ఆర్థికరంగమున మన ప్రగతియు నంతంతమాత్రముగనేయున్నది. వందలతరబడి కోట్లరూప్యములు విదేశప్రభుత్వములనుండి యప్పుదెచ్చుకొనుచున్నాము. వందలకోట్లసంఖ్య – వేలకోట్ల కెగబ్రాకుచున్నదనుచున్నారు. వైజ్ఞానికముగ మనయంతస్తు – సాటి రాజ్యములతోఁ బోల్చి చూచుకొని నపుడు, సమర్థనీయమనిపించుకొనదు.

మత రహిత ప్రభుత్వ స్థాపనమునకును, దేశమును సమైక్యపఱుచు సంస్కృతీ సంపదగల సంస్కృతమును దూరముగనెట్టి హిందీని జాతీయ భాషగ నిర్ణయింపజేయుటకును జవహర్‌లాల్‌గారి పలుకుబడి – మొక్కవోవని పట్టుదల హేతు భూతములుగనిచ్చి-నాడు-గెల్చినవి.

వీరి యిట్టి ఆలోచనలే – పరంపరానుగతముగ – అవిచ్ఛిన్నముగ – మనజాతీయ జీవిత కేదారములపై ప్రవహించుచు వచ్చుచున్న ఆర్ష సంస్కృతీ స్రవంతికి అడ్డుకట్టలైనవి.

కాదని వాదనకు కాలుద్రవ్వి-కంకణముగట్టి-హిందీని జాతీయభాషగావించి – గడించినదేమి ?

హిందీవ్యతిరేకోద్యమము పలుప్రాంతములలో తుపాను వలె చెలరేగినది. అల్లరులతో ఆకతాయిచేష్టలతో దేశముడికిపోయినది. ప్రభుత్వపుటాస్తులకు భద్రత శూన్యమైనది. ప్రజలు పెక్కు-కష్టములకు గురియయిరి. ఘోరనష్టములు కొరివి దయ్యములై విశృంఖల విహారమునకు గడంగినవి.

భాషాప్రయుక్త రాష్ట్రవిభజన వ్యవహారసమస్యకు సైతమీ దుస్థితియే దాపురించుట మిక్కిలి శోచనీయాంశము. ఇది సమష్టిభారతదేశ సమైక్యమునకు సజీవ చిహ్నము కాకపోగా – ప్రాంతీయ దురభిమానములకు ప్రబల ప్రతిబింబమై-చిన్నచిన్న స్వతంత్రప్రాంతీయ ప్రభుత్వములు తలయెత్తుటకు-కలతలు మెరుగెక్కుటకు కారావలంబనమైనది.

ప్రాంతీయ ప్రభుత్వములలో వ్యక్తిత్వమును నిలువ బెట్టుకొనుటయనెడి వంకతో వెట్టితలలువేసిన స్వార్థము, కాలు నిలువద్రొక్కుకొనుట కవకాశమేర్పడినది.

ఇవి జాతీయ జీవితసరళిపై చెరగని మచ్చలు కాగల వేమో! ఇవి జాతీయజీవిత ప్రగతిశీలముపై బలమైన యాఘా తములు కాగలవేమో!

అస్సామములో నేమిజరిగినది? ఫిజోనాయకుడైనాగ భూమి స్రాంతీయులచే స్వతంత్ర క్రైస్తవ సామ్రాజ్యస్థాప నార్థము భయంకరమైన తిరుగుబాటు చేయించినాడు.

కేంద్ర ప్రభుత్వము ఫిజో దాడులను ధైర్యముగ నెదిర్చెనా! సమర్థతతో నణచెనా! సవ్యముగ సరిదిద్దెనా! పైపెచ్చు రాజీమంతనములా! దేశసమైక్యభావమును సవాలు చేసిన వారితో సంప్రదింపులేమిటి? ఇది ముప్పునే తెచ్చిపెట్టి నది. నేటికిని నాగస్రాంతమున - విభజన ఆందోళనము-నిప్పుల కుంపటివలె బగ్గున మండుచునేయున్నది.

భారతదేశాంతర్భాగముగ విశ్వవిదితమైన కాశ్మీరము విషయమును పరికింపుడు!

ఉన్నసత్యమును సమ్మతించుచున్నట్లు నటించుచునే - ఆంగ్లపాలకులు పాకిస్తాన్‌చే మనగడ్డపై దురాక్రమణ చేయించి కాశ్మీరమున కొంతభాగమును కబళింప జేయించిరి. తెరవెనుక గల వారిమద్దత్తు చూచుకొని పాకిస్తాన్ పడుచున్న పాటును లోకమునందెరుగని వారెవ్వరునులేరు.

ఇంత నిస్సంశయాత్మకముగ - విస్పష్టముగ - తేట తెల్లమగుచున్న యీ కాశ్మీరు సమస్యను జవహర్‌లాల్ ఎవ్వరితోో చెప్పకయే త్వరపడి నానాదేశసమితి ముందుంచినాడు.

నిరుపయోగకరమైన యీ నిర్ణయమువలన సముత్పన్నములయ్యెడి దారుణ ఫలితములు భారతజనత పాలుగాక మరేమగును!

ఈ మహోద్రేకము - కాశ్మీరసమస్యను కించిత్తేని యుక్తియుక్తముగ బరిష్కరించినదా?

దశాబ్దములు దాటుచున్నవి. ఉభయ ప్రభుత్వముల పాలకులు మాఱుచున్నారు. కాని ! కాశ్మీర వ్యవహారమున మాత్రము నిర్దుష్టమైన కాంతిరేఖ పొడగట్టుటలేదు.

ప్రక్కలో బల్లెమై పాకిస్తాన్ మనపై ప్రతిక్షణము కాలు ద్రవ్వుటకు మాత్రమిది బాగుగ నుపయోగపడినది. అనాలోచితచర్య ఆరని అగ్నిజ్వాలలనే రగిలించును గాని అమృతమును వర్షించునా!

కర్మాన్నిష్టు చైనా చెలిమి యేమైనది? పంచశీల విధానమును మనము శిరసావహించితిమి. హిందూ - చైనా 'భాయిభాయి' అని ముక్తకంఠమున మన ప్రధానామాత్యుల వారు ఉద్ఘోషించిరి.

ఎవరిని మనము విశ్వసించితిమో-అచైనావారేమనపై కాలుద్రవ్వుటకు గడంగిరి. మెక్‌మోహన్ రేఖ-దారుణ యుద్ధ

కాండకు కారణభూతమాయెను. గౌరీశంకర శిఖరసీమలపై కబంధహస్తము చాచబడినది. ఈదౌష్ట్యమునెదుర్కొనుటకు వేలకొలది భారతీయ సైనికుల ప్రాణములు బలిగావెట్టవలసి వచ్చెను.

యుద్ధ బీభత్సమువలనను – ప్రకృతి యననుకూలము వలనను – పాలకుల నిర్లక్ష్యవైఖరివలనను ప్రజలలో నిరుత్సాహము, నిరాశ, నిస్పృహ జనించినవి. నిత్యావసర వస్తువులకే కటవేర్పడెను. ప్రజలపై ప్రభుత్వమునకు ప్రేమ తగ్గినది. ప్రభుత్వముపై ప్రజలకు విశ్వాసము క్షీణించుచున్నది. పరస్పర సంబంధము పాడైపోయినది.

కాంగ్రెసు నాయకత్వము మారినది. దేశమునకు స్వాతంత్ర్యము వచ్చిన పదునెనిమిదేండ్లకు నూతన ప్రధాని ప్రభుత్వ భాధ్యతలను స్వీకరించెను. మఱిలనంతలో మఱియొక దురదృష్టము గుండెలపై కుంపటివలె, చాలకాలమునుండి రాజుచున్న పాకిస్తాన్‌సమస్య–విషమస్వరూపమును దాల్చినది. పాకిస్తాన్ మనపై దండెత్తినది.

లాల్‌బహదూర్ శాస్త్రిగారి నాయకత్వమున జాతి యంతయు నొకకట్టుగనొకమాటపైనిలిచెను. పాక్ ప్రభుత్వము నెదిరించి విజయమును సాధించెను. తాష్కెంటులో జరుగు చర్చలకు హాజరైన శ్రీ శాస్త్రిగారి యాకస్మిక మరణము దేశముపాలిటి కశనిపాతమాయెను. పదునెనిమిదిదేండ్లకుగూడ పూర్తియగుటకువీలుగానియెన్నియో అభ్యుదయకార్యక్రమము

లను - పదునెనిమిది నెలలలోనే యొక కొలికికి దెచ్చిన యీ మహానాయకుడు-ఈ భారతసంస్కృతీ ప్రియుడు మఱిపదికాల ములపాటు మనజాతికి నేతగా లేకపోవుట-మన దురదృష్టమే.

మరల నాస్థానము మాత్రము .. నెహ్రూపండితుని ప్రియసుత ఇందిరాగాంధీచే స్వీకరింపఁబడినది.

రాష్ట్రము లన్నింట ముసరుకొనుచున్న యంతఃకల్లోల ములు బాగుగ ప్రజ్వలించి, బగ్గుమనెడి స్థాయికి చేరుకొన సాగినవి. తొలినుండియు కాంగ్రెసు మహాసంస్థయొక్క అభ్యు దయమునకు సర్వవేళల పట్టుగొమ్మగనిల్చిన రైతు క్షేమము-సామాన్య ప్రజలయభివృద్ధి - ప్రభుత్వముచే నిర్లక్ష్య మొనర్పఁబడుటచే - తీవ్రమైన యసంతృప్తి భారత ప్రజ లలో పరివర్ధమానదశ నందుకొనెను.

బహుసంస్థలు తలలె త్తినవి. ప్రధానసంస్థ తన యాశయ సాధనలో వైఫల్యమునందుటచే, ప్రతి-ఇతర సంస్థయు తన బలమునుజూచి, తానే యుబ్బిపోవసాగెను. బహునాయకత్వ మునకు ప్రాతిపదిక లేర్పడెను. పరస్పరద్వేషా సూయలు భారత నాయకులలో ప్రబల నారంభించినవి. మహాత్ముని యడుగు జాడలలో కొన్ని దశాబ్దములపాటు నడచిన భారతప్రజలకు - కాంగ్రెసు పాలకుల వైఖరి వెగటుగ దోచెను. సత్యధర్మసిద్ధాం తములకు దూరమైన ప్రభుత్వ విధానముపై, ప్రేమాభి మానము లెట్లుదయింపఁగలవు ? కరుణాస్వరూపుఁడై, కర్మయోగియై, భారత జనతా పరితాప నివారణకొఱకుఘోర

కష్టముల నెదుర్కొని, స్వాతంత్ర్యఫలమును పంచియిచ్చిన గాంధీజీ - క్రమక్రమముగ, భారతీయనాయకుల - కాంగ్రెసు ప్రభుత్వాధినేతల స్మృతిపథమునుండి మసకమసకగ జారి పోవుట-కడుంగడువిచారకరమైన విషయము. నెహ్రూపండితుని పాలనమున - దేశమును కలత పెట్టిన సమస్య లీమెకాలమున సమసిపోలేదు. పైపెచ్చు జాతి జీవితరంగముల కలవరపఱచు - అవాంఛనీయములగు పెక్కు విషయములు తలయెత్తినవి. 'దేశమున జనాభా పెరుగుచున్నది. ఆహారపుకొరత యేర్పడు చున్నది.' అను నెపముతో, పాశ్చాత్యులనుండి దిగుమతి యైన కుటుంబనియంత్రణ విధానము ఈమె పాలనమున ప్రబల ప్రచారమునకు దేబడినది. బిడ్డల గనకుండుటకు కృత్రిమ సాధనములైన 'లూపుల' వినియోగము పెచ్చు పెరుగుచున్నది. దీనికిగాను కోట్లకొలదిగ ధనము వెచ్చింప బడుచున్నది. స్త్రీలలో, స్త్రీలచేతనే యీ దిక్కు-మాలిన విధానమును ప్రబోధింపబడజేయుట విచారకరము. మహిళల చేతనే దీనిని ప్రచారముగావింపబడుచుండుటనుగాంచి, సత్సం ప్రదాయ సంపన్నులగు భారత యువతులు సిగ్గుతో తలవంచు కొని, విచారమును వెలిబుచ్చుచున్నారు.

'లూపుల' వాడకము ఆరోగ్యమునకు భంగకరమని అనుభవజ్ఞులగు వైద్యులు యెలుగెత్తి చాటుచున్నారు. అయినను ఇది బాహాటముగ ప్రచార మొనర్పబడుచుం డుటవిచారకరము.

ప్రజలు నియమ నిగ్రహములను పాటించుచు బ్రహ్మ చర్య వ్రతపాలనము నాచరణమునకు దేవలెనని గాంధీ మహాత్ముడు ప్రబోధించెను. ఇది జాతిని వీర్యవంతులుగ గావించును. ప్రజలను పుష్టిమంతులుగను - ఆరోగ్యవంతులు గను వర్ధిల్లజేయును. ధీశాలులుగ నొనర్చును. జాతికి శ్రేయో దాయకమగు నిట్టి విధానమును మన బాలబాలికలకు-విద్యా లయములలో బోధించుట నేడెంతయువాంఛనీయము. కుటుంబ జీవితమును నిర్వహించుచున్నవారికిని ఇది కరము ప్రయో జనకరము. సహజమును - సదాచారసంపన్నమును అగు నిట్టి యుత్తమ విధానమును ప్రచారమునకు దెచ్చుటకుమాఱుగ, అనారోగ్యకరములు-అరిష్టదాయకములునగు కృత్రిమ విధాన ములను ప్రచారమునకుదెచ్చు టేమిన్యాయము ?

రంగములన్నింట విద్యారంగము ప్రధానమైనది. ప్రభుత్వముచే నియమింపబడిన 'ఉన్నత పాఠశాలల విద్యా సంఘము' పాఠశాలలలో నీతులను నిర్బంధముగ బోధింప రాదని నిర్ణయించుట నేమనవలెను ? నీతికి ప్రాధాన్యములేని జాతికేమి విలువ ? అట్టి జాతి నేలెడివారి కేమివిలువ ?

నేడు కొన్ని చలనచిత్రములలో ప్రేక్షకులను రెచ్చ గొట్టు దృశ్యములను జూపెట్టుచుండుటనుగాంచి - సంఘములో పెద్దలు కలవరపాటును జెందుచున్నారు. ఇట్టిస్థితిలో - చలన చిత్రముల యోగ్యతలను నిర్ణయించి - వాని ప్రదర్శనములకు

ఆమోదమునొసంగు సంఘము – 'చలనచిత్రములలో ముద్దులు పెట్టుకొనుట–నగ్నదృశ్యములను ప్రదర్శించుట, తప్పేమియు లేదని తీర్మానించిరి. (31–8–69 – ఆంధ్రప్రభ) ఇట్టియావేశ పూరిత చిత్రములను తెరపైప్రదర్శించు సమయమున ప్రేక్షకు లెంతటి మనోవికారమునకు గుఱియగుదురో వేరుగజెప్పవలెనా? కామ (Sex) ప్రేరకములు, నేరములకు (Crime) కారకములు నగు ఉద్రేక భావములను ఇవి యావిర్భవింపజేయును. ఇట్టి యవాంఛనీయ చిత్రములను – పాశ్చాత్య దేశముల సినిమా నిర్మాతలనుండి దిగుమతి గావించుకొని వానిని మనదేశపు సినిమాలలో ప్రదర్శింపజేయుట మిక్కిలిగ గర్హ్యము.

పశ్చిమ బెంగాలులో – నక్సలైట్లు గావించుచున్న అరాజకచర్యలు, దౌర్జన్యములు ఇప్పటికిని, అరికట్టబడలేదు. ఇవి యితరప్రాంతములకుగూడ క్రమముగ వ్యాప్తములగు చున్నవి. ఏదోయొక స్వల్పమైన సాకును జూపెట్టి, పోలీసులు– పశ్చిమ బెంగాలు శాసనసభలు జరుగుచున్న సమయమున శాసనసభాభవనముపై దౌర్జన్యముగ దాడిసల్పిరి. అల్లరులు గావించిరి. ఇదిదేశమును కలవరపఱచినది. అరాజకమునకు దారినిజూపినది. (Indian Express 31-8-1969

ఇట్లే కేరళలోగూడ కమ్యూనిష్టుల అరాజకచర్యలు ప్రబలసాగినవి. ముఖ్యమంత్రిగనున్న నంబూద్రిపాద్ 'శాసన సభలలో ప్రవేశించి-రాజ్యాంగమును నిర్మూలించుటే, తమ పార్టీవిధానమ'ని బహిరంగముగ ప్రకటనమును గావించెను.

పశ్చిమబెంగాలులో – కేరళలో – కమ్యూనిష్టుల యాధిపత్యమున సంయుక్త పార్టీప్రభుత్వముల క్రింద జరుగు చున్న యిట్టి దారుణచర్యలను – అరికట్టుటకు కేంద్రప్ర భుత్వము గట్టిచర్యలను దీసికొనకపోగా – ప్రాంతీయ ప్రభుత్వ వ్యవహారములలో జోక్యముకలుగజేసికొన మను నెపమును చూపెట్టుచు తనదౌర్బల్యమును ప్రకటించుకొన్నది.

మరియొక విషయమునుగాంచుడు! ప్రత్యేక ముస్లిము రాజ్యముల సమావేశము రాబట్‌లో జఱుగనున్నప్పుడు – దానిలో పాల్గొనవలె ననెడి ఆతురతను భారత ప్రభుత్వము చూపెట్టెను. ఈ రాబట్ సభాసమావేశ నిర్వాహకులు మొదట మన ప్రభుత్వమునకు తమ ఆహ్వానమునుపంపలేదు. కాని, చివరకెట్లో ఆహ్వానమునుపంపిరి. అందుపై భారత ప్రభుత్వ ప్రతినిధులు – తగుదుమమ్మా! యని పనిగట్టు కొని, రాబట్ నగరమునకుచేరిరి. వారటకు చేరగనే, పాకి స్తాన్ ప్రభుత్వపు ప్రతినిధులు వారి నా సభకు హాజరు కానీయరాదని యడ్డుపెట్టిరి. అందుపై ఆ సభలో మన ప్రతి నిధులు పాల్గొనుటకు ప్రవేశము నిరాకరింపబడినది.

(Indian Express 26-9-69)

మనది సెక్యులరు స్టేటు అని చాటుకొనుచు – ముస్లిముల మత మహాసభకేగుటకై ఆహ్వానమును కోరితెచ్చు కొన్నందుల కిట్టి అవమానమునకు మన ప్రభుత్వము గుఱి యైనది. ఇది క్షమింపరాని తప్పుగాదా! కేంద్రప్రభుత్వమున

కిది తప్పుగ తోచకపోవచ్చునేమో ! కాని, భారతదేశ గౌరవ ప్రతిష్ఠలకు మాత్ర మిది భంగపాటు; చెఱుగనిమచ్చ. లోగడ భారత ప్రభుత్వ విదేశాంగమంత్రిగనున్న _ M. C. చాగ్లా వంటి మహానాయకుడును భారత ప్రభుత్వపు చర్యను తీవ్రముగ గర్హించుచు ప్రభుత్వమును గట్టిగ మందలించెను.

పాకిస్తాన్, చైనా ప్రభుత్వములు మన నెన్నియో పర్యాయములు అగౌరవముగ జూచినవి. నేటికిని, మనపై అనవసరముగ కాలు ద్రవ్వుచునే యున్నవి. కాని ! మన ప్రభుత్వమో! వారిని గట్టిగ మందలించుటలేదు. మన దేశ మును అగౌరవముగ జూచుచున్నవారి చర్యలకు, ధైర్యముగ ప్రతీకారచర్యల గావించుటయులేదు. పైపెచ్చు మేకపోతు గాంభీర్యముతో ఉత్తరకుమార ప్రజ్ఞలను పలుకుచున్నది.

తొలుతనుండియు ప్రజాబలము నంతయు సమీకరించి కాంగ్రెసు మహాసంస్థయేదురభ్యాసమును తొలగించుటకు తీవ్ర ముగ కృషినిగావించెనో-ఏదురభ్యాసము జాతికిచీడపురుగువంటి దని బాపుజీవిలపించి, దానిని నిర్మూలింప సమకట్టెనో - ఆ మద్యపాన పిశాచి నేడును జడలు విరబోసికొని, సముద్ధతితో తాండవమాడుచుదర్శనమిచ్చుచునేయున్నది. మద్యపాననిషేధ శాసనము బహిరంగముగనే యుల్లంఘింపబడుచున్నది.

మధ్యపాననిషేధమును వైదొలగించి, తిరిగి మద్యపాన శాలల నూరూర నెలకొల్పజేసి, ధనమునుగడించుకొనవలెనను దురాశ ప్రభుత్వమునకు గలిగినట్లున్నది.

చూడుడు! పూజ్యబాపుజీ శతజయంత్యుత్సవ సంవత్సరపు కానుకగ మద్యపాననిషేధ శాసనమును రద్దుపఱిచి – వాడవాడల మరల మద్యపాన మహాపిశాచి స్వైరవిహారము గావించుట కవకాశము కలిగించి, కల్లంగళ్ళను తెఱిపించుటలో, ఆంధ్రప్రాంత కాంగ్రెసు ప్రభుత్వము అగ్రతాంబూలమునందు కొన్నది.

దేశమునకు స్వాతంత్ర్యమును సముపార్జించుటకును ఆర్జించిన స్వరాజ్యమును త్యాగబుద్ధితో ప్రజాసేవకు-ప్రజాభ్యుదయమునకు వినియోగించుటకును స్థాపింప బడిన అఖిల భారత కాంగ్రెసు మహాసంస్థలో స్పర్ధలు చెలరేగినవి. అధికారముకొఱకో, స్వార్థముకొఱకో భాగములు కుదురక – సర్దుబాట్లు జరుగక ముఠాలేర్పడినవి. సిండికేటు (Syndicate) నామముతో నొకముఠా, ఇండికేటు-(Young Turks) నామముతో మరియొకముఠా కాంగ్రెసు మహాసంస్థలో నేర్పడినవి. కాంగ్రెసు మహాసంస్థ ప్రభుత్వముల నేర్పఱచుచున్నది. ఆ ప్రభుత్వములు సంస్థసూచనలపై నడుపబడుచున్నవి. విషయమిట్లుండ, కాంగ్రెసు మహాసంస్థకు అధ్యక్షులైన నిజలింగప్ప Syndycate ముఠానాయకుడుగను – కేంద్రములో కాంగ్రెసు ప్రభుత్వమునకు ప్రధానిగనున్న ఇందిరాగాంధి Indicate (Young Turks) ముఠాకు నాయకురాలుగను నుండి అంతఃకలహాముల బాహాటముగ సాగించుచుండుట విచారకరము.

ఈ ముఠాలకు నియమపాలన లేదు. సుశిక్షణము శూన్యము. దురహంకారముతో నొకరిపైనొకరు దుష్ప్రచారమును సాగింపబూనిరి. ఇరుతెగలవారును సహనసఖ్యములతో ఉదాత్తముగ సర్దుబాటును గావించుకొనక - మహాసంస్థను బజారులోబెట్టి యల్లరిపాలు గావించుటా! మాతృసంస్థను వెన్నుపోటు పొడుచుటా! సముచితస్థాయిలో చక్కని సంఖ్యాబలముతోవర్ధిల్లుచున్న కేంద్రప్రభుత్వమునకుగాని, మహోజ్జ్వల చరిత్రతో మహోద్భుతముగ వ్యాప్తినంది, మహోన్నత శిఖరమును దలపించు కాంగ్రెసు మహాసంస్థకుగాని - యిది గర్వకారణముకాదే? అవమానకరమేగదా! కాని, ఇరుతెగలవారందులకు తారసిల్లిరి. చూడుడు!

సకల భారతమునకు పూజనీయుడై - నానాదేశము లలో భారతదేశకీర్తినివ్యాపింపజేయగల మహావ్యక్తిరాష్ట్రపతి. అట్టి పరమ గౌరవార్హమైన స్థానమునకు జరిగిన ఎన్నికలో కాంగ్రెసు సంస్థలో లుకలుకలేర్పడుట యేపాటి మర్యాద? జాతిక్షేమమున కిదియేమి లాభదాయకము? వీరిలోవీరొకరిపై నొకరు ద్వేషాసూయల పెంచుకొని స్వార్థదృష్టికి దాసోహమ'ని సల్పినదేమి? మాతృదేశ గౌరవ ప్రతిష్ఠలను రచ్చకీడ్చినారు. గతమున కాంగ్రెసు గడించిన పేరుప్రతిష్ఠలను సొంతముగ నేలబెట్టి కాలరాచినారు. నాడు కౌరవ సభలో ద్రౌపదిని ఘోరపరాభవ మొనర్చినమాట నిజమో! అబద్ధమో! కాని, నేడు కాంగ్రెసును నడపుచున్న పెద్దలచే

భారతమాత రచ్చకీడ్వబడి, ఢిల్లీపట్టణమున దారుణముగ పరాభవింపబడినమాట మాత్రము వాస్తవము. ఈ దుశ్చర్యను విశ్వమెల్ల వేయికన్నులతో తిలకించినది.

సత్యధర్మములకు - నీతి నియములకు ప్రాధాన్యము నొసంగి బ్రదుకవలెనని యుద్బోధించిన గాంధీమహాత్ముని వారసులువీరేనా ? కఠినకారాగారముల, దారుణవ్యధల ననుభవించి, కృశించి - మరణించిన స్వాతంత్ర్యయోధుల కలలను పండించువారు వీరేనా ? ప్రాచీన భారతదేశ సంస్కృతీ సంపదలను భద్రపఱచి, తద్ద్వారా సకల ప్రజావాంఛితములను ఫలింపజేయగలవారు వీరేనా ?

ఈ విషయమున నీ రెండు ముఠాలలో ఎవరుముందైన నేమి ? ఎవరు వెనుకైననేమి ? ఎవరెవరితోో చేతులుకలిపిన నేమి ? ఈ స్థితి మనకేమి జూపెట్టుచున్నది ?

దేశమున కాత్మస్థైర్యము తగ్గినది. కాంగ్రెసు మహా సంస్థ పతనదశకు దిగజారినది. భారతప్రభుత్వము దుర్బలమైనది. కొట్టవచ్చినట్లుగ నీ విషయములు స్పష్టమగుటలేదా ! యాదవకులమున ముసలముపుట్టినది. ఇక దీని నడ్డు వారెవరు ? సుస్థిరములైన పునాదులమీద దశాబ్దములనుండి పురిబోసికొని బలపడిన - ఘనత్యాగములతో గణనీయ స్థాయిని గడించిన - కాంగ్రెసు సంస్థలో తీవ్రరూపములతో వైరుధ్యములు సాక్షాత్కరించుట జాతికి దురదృష్టకరమైన విషయము.

ఉభయపక్షములవారును గతమును విస్మరించి కలసి మెలసి కాంగ్రెసును నడపుదుమనెడి యొక ఆశారేఖను ఇట్టె జూపెట్టి అట్టె అంతరింపజేసిరి. మన ఆశలు నిరాశలైనవి. ఈ గృహకల్లోలము సమసిపోలేదు. ఇంటిపోరులో మంటలు తార సిల్లినవి. అడ్డుగోడలులేచినవి. వేరింటి కాపురము లేర్పడినవి. రెండు కుంపటులు విడివిడిగ రాజుకొన దొడగినవి.

ఎవరికివారే తమ యింటిని అన్నపూర్ణాలయముగ నభివర్ణించి చెప్పుకొనుచున్నారు. మా కుంపటియే మానవాళికి క్షుత్తును దొలంగించి మంగళమును ఘటింపగలదని యుద్ఘోషించు చున్నారు. వారి ధోరణి యంతటితో నాగక యెదుటి వారి కుంపటి, లోకమును భస్మపటలము గావించు మారణ యంత్రమను ప్రచారముగూడ సాగింపబూనిరి. ఎవరింటికి వారే - వేరు వేరుగ మంగళ తోరణములుగట్టి మరల గృహప్రవేశ మహోత్సవ సంరంభ విజృంభణముల నారంభించిరి. యజమాను లిద్దరై యొక యింటి పెత్తనము తమదే - తమదే-యని పొలికేకలతో గజిబిజి గల్పించిరి.

ఒకే కుటుంబమునకుజెందిన వారిలో కొందఱు-గృహ కళ్యాణకాములా? మరికొందరు భవన వైభవమునకు బద్ధ విరోధులా? ఎంత వింత? నలుగురు నవ్విపోదురని తలంపక - తలలు వంచుకొనవలసిన దయనీయస్థితితో బొమ్మలు విరుచు కొనుచు కుమ్మలాటలకు, కోలాహలములకు ఉభయపక్షముల వారు రంగముల నిర్ణయము గావించుకొన దొడగిరి.

ఒకరికి అహమ్మదాబాదు క్రీడారంగముకాగా - మరియొకరికి - బొంబాయి ఆటస్థలమైనది.

కాంగ్రెసుసంస్థ నిజలింగప్ప, జగజీవనరాముల నాయకత్వములక్రింద భారత ప్రధాననగరములలో మోహరించుటకు సాహసించి, సంసిద్ధమైనది. ఒకేసంస్థలో వెట్టితలలువేసిన వైషమ్య ప్రవృత్తికిది ప్రబలసాక్ష్యము.

ఏకైక భారత ప్రజాసంస్థ నేటికీవిధముగ రెండు పట్టణములలో రెండుసభలుపెట్టుకొని, యిరువురుపెద్దల నాయకత్వములో మాదే నిజమైన కాంగ్రెసుసంస్థయని చెప్పుకొనుటకు ప్రజానీకముముందు నిలువబడవలసి వచ్చినది.

పార్లమెంటులో పాలకపక్షము కాంగ్రెసుసంస్థదే. ప్రతిపక్షము కాంగ్రెసుసంస్థదే. విద్రూరములలో విద్రూరము. ప్రజాస్వామ్యమును ప్రబుద్ధులు తుదకీదుస్థినతికిదెచ్చిరి.

కలిసిమెలిసియున్న కాంగ్రెసు సోదరులు ప్రబలశత్రువులవలెవిడిపోయి బజారుకెక్కుట తిలకించి, కాంగ్రెసునకు అనాదిచిహ్నములయిన 'కాడి-జోడెద్దులు' కన్నీరిడుచుచు యేమనుకొనుచున్నవో?

లాఠీలు, మారణయంత్రములు - చెరసాలలు మొదలయిన భయంకర ఘట్టములమధ్య బాధలతో క్రుంగికృశించిన నాడు కాంగ్రెసుసంస్థకు సముచిత చిహ్నములుగ మెలగిన జోడెద్దులు - ఎట్టకోటపై స్వాతంత్ర్యపతాకము రెపరెపలాడినినాడు మూపురములెగురవైచి మురిసిపోయిన జోడెద్దులు -

వేరింటికాపురము లేర్పరచుకొని తీరిక గ దారుణకలహాములకు దిగిన కాంగ్రెసు సోదరుల శోచనీయ దుర్దశను పరిశీలించి యెట్లు పరితపించుచున్నవో!

మావే జోడెద్దులు – మావేజోడెద్దులని ఎలుగెత్తి నినాదములను గావించుచున్న వీరియవివేకమును గాంచి – యెట్లల్లాడుచున్నవో! భారతజాతీయమహాసంస్థకు సజీవశాశ్వత చిహ్నములుగ సహజశోభతో విరాజిల్లుచున్న హృదయము గల యీవృషభరాజముల మనోవేదనను పసిపట్టగల కాంగ్రెసు నాయకులేరి ? వీరి యంతరమున పెల్లుబుకుచున్న భయంకర దురాశా పరిపూర్ణ భావనకాగ్రహించి – యీ బసవన్నలు కాడితోకూడ కర్మవీరులున్న ధర్మక్షేత్రమునకు త్వరలో తరలి పోగలవు. ఉభయవర్గములవారు తదుపరి నిర్వేదనము ననుభవించుట నిష్ప్రయోజనకరము.

అఖండప్రజాసంస్థలో చైతన్యము నీపగిది స్తంభింపజేసి– స్వార్థాసూయలకు స్వాగతము పలుకుచు – వీరులవలె విక్రమించుచున్న వీరి వెట్టిని గుదుర్చుటకొఱకై 'జోడెద్దులు' – శీఘ్రకాలమున నే – యే ప్రసిద్ధ భారతీయ పరమేశ్వరునో ప్రార్థించి – బుజముల నెక్కించుకొని, అంకెలువేయుచు గొని రాగలవు. వానికి పట్టాభిషేకము నవియే కావింపగలవు.

ఉభయ గృహ యజమానులపుడు తెల్లమొగములు వైచి – మెల్లగ జారుకొనక తప్పదు. భారత సౌభాగ్యసదన

మొక్కటే. నాయకుడొక్కడే. ధర్మమొక్కటే. నాడే! దేశమునకు శ్రీరామరక్ష. నాడే! భారత సంస్కృతి సన్నిహిత భవిష్యత్తులో ఆర్షసంస్కృతిని ఆశ్రయించి - దివ్యదీప్తులు తేజరిల్లజేయగలదు.

ఇప్పటికైనను యీ సత్యమును గుర్తించి - ఉభయ పక్షములును తమ తప్పిదమును గ్రహించి - జాతి యభివృద్ధి వికాసములను దృష్టియందిడుకొని - దురభిమానమును సుదూర మొనర్చి - తాము ఏకమై - దేశసమైక్యమునకు పాటుబడి శ్రేయోరాజ్యమును సాధింతురుగాక! లేదా - శీల సంపన్నులు - త్యాగమూర్తులు - దేశభక్తి రతులు - అనుభవజ్ఞులునగు మంత్రులతో గూడిన నిర్దిష్టమైన జాతీయ ప్రభుత్వము పాలనాభారమును స్వీకరింపగలందులకు సక్రమకృషి నైన గావింతురుగాక!

నిర్ణయించుకొనవలసిన సమయమిదే!

ఇట్లొకవంక రాజకీయ నాయకులు-సంఘసంస్కర్తలు-ఆర్థికవేత్తలు-ఆంగ్లేయులనంధముగ ననుకరించుచు స్వార్థపరులై అంతఃకలహములతో దేశమును దౌర్భాగ్యస్థితికి దిగజార్చుచుండ; మరియొకవంక సనాతనమ్మన్యులు, పండితమ్మన్యులు దురతిశయమునకు లోనైరి. దురహంకారమునకు వశులైరి. అర్థరహిత మూఢాచార పరంపరకుదాసులైరి.

ఈ ప్రబుద్ధులు – సనాతనధర్మవిరుద్ధములు – అనైదిక ములు – అవినీతికరములునగు విధానములనుబట్టుకొని ప్రాకు లాడుచు వేదాంతశిఖరములనధిరోహింప గడంగుట కడుంగడు విచారము. పరమపావనప్రాచీన భారతజాతీయ జీవనవిధానలీల యొక్క యాంతర్యమును చిత్తశుద్ధితో గుర్తింపనేర్చినవారిట్టి పనికిబూనుకొనరు.

మన మాతృభూమికిగల ప్రత్యేకతయట్టిది. భారత వసుంధర సనాతనధర్మస్రవంతితోపులకరించినపుణ్యకేదారము. ఆధ్యాత్మికభావరత్నగర్భ. చరిత్రకందని పురాతనకాలము నుండి భగవదనుభూతి సుధలమధురిమలకొరకేపాటుపడుచున్న దివ్యక్షేత్రము. దివ్యతేజఃపుంజ లహరితో సకలప్రపంచము నకు కాంతిని శాంతిని ప్రసాదించిన పవిత్రసీమ.

భారతీయులకు వేదములే పరమ ప్రమాణములు. ఆర్షసూక్తులే తారకమంత్రములు.

పాడిపంటలు, నీతిశీలములు, దానధర్మములు, కొల్లలుగ వర్ధిల్లినదిచ్చటనే.

ఈ దివ్యత్వ స్ఫోరక నిత్యజీవిత వ్యవహారలీలకే హిందూమతమనెడి వ్యాప్తివచ్చినది. ఈ సత్సంప్రదాయ సమష్టిస్వరూపవైభవమే ఆర్షసంస్కృతిగా లోకమున – అభినం దనములందుకొన్నది.

మహర్షులు, యోగులు, సన్యాసులు, మహత్ములు భారతదేశమున బ్రహ్మవిద్యాబలముతో భగవత్సాక్షాత్కారమునంది దివ్యత్వ సిద్ధికి వలయు సాధన మార్గములను బలుతెఱగుల ప్రబోధించుటయే ధ్యేయముగ సంచరించిరి. భవసఫలతను సాధించిరి.

ఇది యొకనాటిమాట. నేడో! ఇట్టి పవిత్రభావప్రబోధమునకు స్వస్తిచెప్పి, సదాచార సమాచరణమును విరమించి, అవైదిక దురాచార దుర్భావ పంక్తిని శిరసావహించి సంచరించుట మిక్కిలి విచారింపదగిన విషయము.

పెక్కురు మఠాధిపతులు, పీఠాధిపతులు, సనాతన ధర్మ పరాయణులుగువారు త్యాగబుద్ధితో, సేవాదీక్షతో సన్యాసమును స్వీకరించుట ముదావహమే. కాని! వీరిలో కొందరు – వైదిక ధర్మములను వర్జించి – కుటిల కులమత రాజకీయముల నాశ్రయించి – అస్పృశ్యతను ఇప్పటికిని పాటించుటకు సంసిద్ధపడిరి. అవైదిక ప్రబోధమును కొనసాగింపబూనిరి. హిందూమతము పేరుతో కలుషిత స్వార్థ దుర్భావమును వ్యాపింపజేసి సనాతన ధర్మమును పతన దశకు గుఱిగావింప సమకట్టిరి. ఇది కరము విచారకరము. వీరు ప్రజలను లాలించి, బుజ్జగించి మచ్చిక చేసికొనవచ్చును. గట్టిగ ప్రజలకన్నులను మూయవచ్చును. కాని! భగవంతుడు వీరి కృత్యములను మెచ్చడు. సంస్కృతభాషాధ్యయనావసరమును – వైదిక సత్యసూక్తి సంపత్తిని –

ప్రజలకు వీరు ప్రబోధించుట మానివైచిరి. సంకుచిత దృష్టిని నింద్యమైన ఆడంబర ఘోరణిని ప్రదర్శించుచు వీరు పరిహాసము పాలగుచున్నారు.

నిజము నిలుకడమీద బహిర్గతమగును. వీరు కట్టుకొను చున్న యాశాసౌధము లప్పుడు గుప్పున కూలగలవు.

ఇట్టి అవైదికస్థితిని యీ మఠపీఠాధిపతులలో కొందరు కొనసాగించుచు ప్రజల నావంకకు మరలింప బూనుట హేయమైన విషయము. ఈ సత్యమును వారు గుర్తింపవలసిన యవసర మొకనాడు వచ్చితీరును.

స్త్రీ శూద్రాదులకు వేదాధ్యయనార్హత లేవని, వేద స్వరూప సౌభాగ్య పరిచయ శూన్యులు - ఆత్మోన్నత్తేజ వికాస రహితులు - సనాతనమ్మన్యులునగు డాంబిక యతిశిఖామణు లుద్ఘోషించుట వింతలలో వింత. ఇట్టి దుష్ప్రచారమును వీరెంతత్వరలో విరమించిన జాతి కంత త్వరలో శ్రేయము సిద్ధించును.

యతిరాజులమనియు - ధర్మస్వరూపులమనియు సాక్షా ద్దైవములమనియు బిల్బిగుసుకొని విల్బవీగుచున్న - యీ పెద్ద లికనైనను తమ దురతిశయమును, సంకుచిత దృష్టిని విడనాడి పావనవేద ధర్మప్రబోధమునకు జీవితముల నంకితము చేయ వలయును.

వీరు సంస్కృత భాషాభివృద్ధికి మనస్ఫూర్తిగ తమ సర్వ శక్తులను అర్పింపవలయును. తొము వేదము నర్థసహితముగ

నధ్యయన మొనర్చుచు, వేదధర్మమును నిర్దుష్టముగ నాచరించుచు, ఇక ముందయిన దేశము నౌన్నత్యదశకు గొనిపోవ యత్నింతురుగాక!! మహాగ్నిజ్వాలా మాలలవలె నిరుపమానమైన నైష్ఠికశక్తితో వీరు ప్రజ్వరిల్లుదురుగాక!! సదాచార సంపన్నులుగ వెలుగొందుదురుగాక !!!

ఆర్ష సంస్కృతీ వైభవమును - దివ్యతేజమును దశదిశల వెలార్చుకృషికి గడంగుదురుగాక !!!!

నేడు అన్నిరంగములలో - దేశమున పరిస్థితులు తారుమారైనవి. సహజ వికాసాభివృద్ధులజాడ కనుచూపుమేరలో కనుపించుటలేదు.

రాజకీయనాయకులు - ప్రధానముగ కాంగ్రెసువాదులు- కాంగ్రెసు ప్రభుత్వములు స్వరాజ్యము సిద్ధించిన పిమ్మట గాంధీమహాత్ముని స్వచ్ఛంద విధానములకు స్వస్తిచెప్పి - అన్ని రంగములలో దేశమును పతనావస్థకుదెచ్చినట్లే- హిందూ మతాధిపతులుగ - పీఠాధిపతులుగ వ్యవహరించెడి పెద్దలు సంస్కృతి రంగమును గూడ మలినపఱచి - జాతీయతకు - వైదిక ధర్మతేజమునకు ముప్పును సంఘటింపజేసినట్లు గుర్తించితిమి.

ముఖ్యముగ విద్యారంగమున జాతీయత సంపూర్ణముగ లోపించిపోయినది. శీలము మృగ్యమైనది. ప్రభుత్వస్థాయిలో మన సహజసంస్కృతి యీసడింపబడుచున్నది.

సేవాత్యాగములను గెంటివైచి - స్వార్థమును, భౌతిక భోగములను పాలకులాదర్శముగనిడుకొని సంచరించుచున్నారు. అవినీతి - లంచగొండితనము - గగనమున కెగబ్రాకుచున్నవి.

కుటిలబుద్ధుల కుత్సితమార్గములే ప్రభుత్వములకు శరణ్యములైనవి. సంకుచితభావములు, కులతత్త్వములు రాజకీయనాయకులకు కొండంతగ యండయినవి.

మాటలలో ఆదర్శములు, చేతలలో అనర్థకములు - సహజములైపోయినవి. ప్రగల్భములు, స్థిరపడినవి. భాషలో - సంస్కృతిలో పాశ్చాత్యానుకరణమే. సంస్కృత భాషకు స్థానములేదు. జాతీయ విద్యకు చోటులేదు. ప్రాచీనకాలపు సత్సంప్రదాయములతో సమ్మిళితమైన నడవడికి, వరవడికి, విధానములకు నిలువనీడలేదు దేశము అల్లకల్లోలవాతావరణమునకు నిలయమైనది. అల్లరిమూకల అనర్థదాయకచర్యలకు వశమైనది. దిక్కులేక - తెన్నుతోచక కొట్టుమిట్టాడుచున్నది.

రెండు దశాబ్దముల స్వతంత్ర కాంగ్రెసు పరిపాలన తరువాత, దేశీయులనుభవించుచున్న మహాభాగ్యమేమి? సమాధానమురాని ప్రశ్నయిది. మంత్రివర్గము లేర్పడుచున్నవి. మంత్రిమండలులుమారుచున్నవి. ఏవేవియో చట్టము లాకృతిని దాల్చుచున్నవి. ప్రజలలో నిస్పృహ నిర్మూలింపఁబడినదా? సామాన్య ప్రజల కనీసపుటవసరములు తీర్పఁబడినవా? మనజీవిత విధానమును చక్కదిద్దెడి జాతీయ విద్యావిధాన మమలునకు వచ్చినదా? మనుగడలకు భద్రత

యేర్పడినదా ? మత్సరములణగారినవా ? జడలు విరబోసికొని తాండవమాడెడి స్వార్థ పిశాచి కాలిగజ్జెల మ్రోత లంతరించినవా ?

'నరుని కోరికల కంతులేదు. వాని నన్నింటిని దీర్చుట లక్ష్మీనాథునకేని తరముగాదు.' అని యనవచ్చును. కాని, ప్రభుత్వస్థాయిలో నాశింపఁదగిన పరిణామము కొంతకలదు. పాలకులాపరిధులలో నయిన విధినిర్వహణ సల్పుచుండిరా ? నిఱుపేదలు మఱింత నిఱుపేదలుగ – ధనాఢ్యులు మఱింత ధనాఢ్యులుగ మారుచున్నారు. భారతీయుల జీవనాడులలో– ప్రాచీన కాలమునుండి యంతర్వాహినిగ ప్రవహించుచున్న ఆధ్యాత్మిక దివ్యశక్తి, నయశీలముల పాటవము, పరోపకార తత్పరత క్రమముగ నింకిపోవుచున్నవి. అవకాశము గల్పించు కొని, ప్రతిమానవుడును దోపిడి సలుపుట కాయత్త పడు చున్నాడు. ద్వైవద్వేషము మరల పరాకాష్ఠకుఁ జేరుకొన సాగినది. ద్రోహదృష్టి సర్వసాధారణాంశమాయెను. పాలితు లను పీడించుటలో – పాలకులు సమర్థత గలవారుగనే సంచ రించుచున్నారు. ధనమునకు పట్టముగట్టి, తదార్జనమునకు చేయరాని పనులు చేయుచున్నారు.

ఏదియో రొక పదవి నాక్రమించుటే ప్రముఖులకు ముఖ్యలక్ష్యమైనది. పదవికొఱకు జరిగెడి క్రుమ్మరిలాటలో స్వపరతారతమ్యములతో పని లేకయే స్పర్ధలతిశయించినవి. యోగ్యతను పరిగణించువారిసంఖ్య తగ్గిపోయినది. కుట్రలకు,

కుయుక్తులకు ప్రత్యేకత పెరిగినది. ఎత్తులకు పైయెత్తులు వేయుటలో నేర్పరితనముగలవారే, రాజకీయ సాంఘికజీవితరంగములందు ప్రముఖస్థానము నాక్రమింపగలుగుచుండిరి. నిర్దుష్టముగ – నిష్పక్షపాతముగ – నిస్వార్థముగ ప్రవర్తించువారికి సంఘమున నిలువనీడ దొరకని పరిస్థితి యేర్పడినది. సమాజమున వారికి గౌరవస్థానములేదు. వారి ప్రమేయము దేశప్రగతికి భంగకరమను భావము ప్రచారమునందతిశయించినది.

పెత్తనము స్వార్థపరాయణులగు నాయకమ్మన్యుల హస్తగతమైనది. బహుముఖములుగ ప్రజ్వలించుచున్న యసంతృప్తి–ప్రజాజీవితరంగమున సర్వత్ర గోచరింప సాగినది. నీతియు–సత్యసంధతయు క్రమముగ కర్పూర ఖండములపగిది హరించిపోవుచున్నవి. సత్యధర్మదృక్పథముగల వ్యక్తిని పరిభవించి, త్వరితగతిని గూలద్రోయు కుట్రా యనెడి దురాలోచనయే నాయకులనఁబడెడివారి బుఱ్ఱలలో నాట్యమాడసాగినది.

సమైక్యమునకు విచ్ఛిన్నత యేర్పడినది. విభజించి పాలించిన ఆంగ్లేయుల విధానమే కార్యనిర్వహణ సల్పువారికి శరణ్యమైనది. ముఠాలు కట్టగలిగిన చతురతలేనివారు – సర్వజ్ఞులైనను తిరోగమింపవలసినదుస్థితి దాపరించినది. ఆంగ్లేయుల పాలన పోయినదేకాని, ఆంగ్లేయ పాలనావిధానము మాత్రము మనదేశపు సరిహద్దులను దాటలేదు. దాస్య పాశ

ములు తెగినవనుకొనవలెనా ? స్వాతంత్ర్యమనుభవించుచుంటి మనుకొనవలెనా ?

'జాతీయభాషగనుండదగినదేది?' అనెడి యంశముపై బ్రహ్మాండమగు తర్జన భర్జన; దానిపై ప్రజాభిప్రాయసేకరణ; ప్రతిరాష్ట్రమువారును మా భాషనే జాతీయభాషగ జేయుడని కోరుట; హిందీని జాతీయభాషగ నిర్ణయింపఁ బూనిన యుత్తరాహుల భావనతో దాక్షిణాత్యులకు వైరుద్ధ్యము; హిందీని జాతీయభాషకానీయకుండుటకై కొన్ని రాష్ట్రములలో పెద్దయెత్తున వ్యతిరేకోద్యమము_గందరగోళము - కాల్పులు ప్రజలలో నంతర్వేదన.

పైగీతి పలుతెఱగుల జాతిలో భిన్నప్రవృత్తి సుస్పష్టముకాసాగినది. సర్వభాషలకు జననియగు సంస్కృతమును గుఱించి ప్రభుత్వస్థాయిలో సదాలోచనముతో పరిశీలనఁ గావించు వారి సంఖ్యయే కొఱవడినది. జాతీయభాషగ సంస్కృత మేలకారాదనెడి భావముగలవారు - కేవలము వెనుకబడిన మానవులుగ, సంస్కారహీనులుగ, సమాజమున శాస్త్రవిజ్ఞానబలముచే శరవేగముతోవచ్చెడి ప్రగతిని గమనింప జాలని యవివేకులుగ పరిగణింపఁబడి, పరిహసింపఁబడెడి దుస్థితి యేర్పడినది. అధికారపు నడకలో నాంగ్లమానస పుత్రులదే యగ్రస్థానమైనది. తక్కిన విషయము లెట్లున్నను- స్వాతంత్ర్యము సిద్ధించిన పిమ్మట జాతి కభిలషణీయమగు జాతీయ విద్యయు, సంస్కృతభాషయు, సంస్కృతియు - ధర్మ

దృష్టియు, వేదవిజ్ఞాన సంపత్తియు పునరుజ్జీవింపఁ బడకుండుట శోచనీయాంశముగనే తోచును.

ప్రాచీన వేదవిజ్ఞానము దశదిశావ్యాప్తమై, సామాజికుల భావమాలిన్యము సంక్షాళితమై, జాతీయ సనాతన గౌరవ ప్రతిపత్తి సంరక్షింపఁ బడవలెనన్నను - సర్వేశ్వర చరణ సేవానురక్తిపై పూర్ణవిశ్వాస మేర్పడవలెనన్నను సంస్కృత సరస్వతీ చరణారాధనకన్న మిన్నయగు మార్గాంతర మేమున్నది ? ఈ ముఖ్యాంశమునైతము నిర్లక్ష్యమొనర్పఁ బడుటచే-సనాతన సంస్కృతీ ప్రియులయందును - ప్రభుత్వ ముపై నభిమానము సన్నగిల్లినది. సాంఘికముగ-ఆర్థికముగ - రాజకీయముగ-ధార్మికముగ-వైజ్ఞానికముగ - భాషావిషయక ముగగూడ నీ చందమున దేశము వెనుకఁబడుచున్నది.

కడకు - దేవాదాయ ధర్మాదాయములైనను మన యార్షసంస్కృతిని సముద్ధరించునేమోయనెడి యాశైతము కృశించినది. వదాన్యులెవ్వరో తొలుత దేవునకు నిత్యార్చ నలు జరుపు నిమిత్తము - వేదవిద్యలను పెంపొందించు నిమి త్తము - సనాతన ధర్మ సిద్ధాంతములను ప్రబోధించు నిమి త్తము-గురుకుల వాస పద్ధతిలో బాలబాలికలకు విజ్ఞానమును, నీతిశీలములను, సదాచారములను గలిగించు నిమిత్తము సమ ర్పించిన భూములపై వచ్చెడి ద్రవ్యము-భక్తులు నిత్యము కానుకలుగ సమర్పించుచున్న ద్రవ్యముగూడ స్వతంత్ర

ప్రభుత్వములో భౌతిక విద్యల యభివృద్ధికై వెచ్చింపఁబడుట చింతింపఁ దగిన విషయము.

ఆంగ్లభాషా విద్యాలయములు నెలకొల్పుటకు_భౌతిక నాగరికతను పెంపొందించుటకు _ ధర్మదృష్టిలేని తత్త్వమును వ్యాప్తముగావించుటకు _ హింసాకృత్యముల కాకరములైన నవీన మారణాయుధముల నిర్మాణమునకు శాస్త్రపరిశోధనలు జరిపించుటకు దేవాదాయము వినియోగపడుట _ దాతల యాశయమునకే విఘాతమును గలిగించుట యగునుగదా ? ఇట్లగుట మిగుల విచారకరము. ఇందులకే కాబోలును ! తమది మతరాహిత్య ప్రభుత్వమని కులుకుచుండుట !

సనాతన ధర్మమును, ప్రాచీన సంస్కృతిని సర్వవిధముల విధ్వంసమొనరించుటకే జతనములు సాగినచో _ మన దేశ భవిష్యత్తునకు భద్రత యెట్లు లభించును ? మనయార్ష సంప్రదాయముల యభ్యుదయమునకు మార్గము లెట్లేర్పడును ? మన జాతి వికాసమునకు దోహదమెట్లు గలుగును ?

గాంధీమహాత్ముని యభిమత మొకటైనది. అనుయాయుల వ్రతము మఱియొకటైనది. అంటరానితనము సాంతముగ నంతమొందలేదు. నాయకాగ్రేసరులే హెచ్చులొచ్చుల భావనలతో _ కులతత్త్వములతో _ ప్రాంతీయ భేదములతో సంకుచితముగ వర్తించుచుండిరన, క్రుమ్ములాటలు సాగించుచుండిరన _ నిఁక _ నితరులనుగూర్చి వక్కాణింపవలసిన పనియేమున్నది ?

మహాత్ముని పగిది – రాజకీయశక్తిని, రామభక్తిని మేళవించి, ప్రచారము సాగించువైఖరి కాంగ్రెసు ప్రభుత్వ మున పూర్తిగ నడుగంటినది. రాజకీయములనుండి శ్రీరాముఁడు క్రమక్రమముగ దూరతీరములకు తరిమి వేయఁబడుచున్నాఁడు. సత్యదృష్టి లోపించినది. సాధుభావన యంతరించినది. స్వార్థమునకు పెద్దపీట లభించినది. సహనము, సద్భావము సమాజమునకు దూరమైపోవుచున్నవి. భోగలాల సత, మద్యపానము వీరవిహార మొనర్చుచున్నవి. మద్యపాన నిషేధశాసనము మాత్రమములునందే యుంచబడెను. కాని, అది సక్రమముగ నమలుపఱుపబడుటలేదు. జీవితావసరవస్తు వుల ప్రమాణములతో నుద్యోగులు నిత్యము ఘర్షణపడి, యోటమికి గురియగుచున్నారు. పాలకుల వేతనములు పెంచు నిమిత్తము – సౌకర్యము లభివృద్ధిగావించుకొను నిమిత్తము చట్టములు మఱిలమఱిల మార్పుచేయఁబడుచునే యున్నవి. కాని! తత్ఫలితముగ సామాన్య ప్రజలకు బాధలు పెరుగుచునే యున్నవి.

కాలము గడచినకొలది క్రమముగ కాంగ్రెసుసంస్థలో నైతికశక్తులు క్షీణించుచున్నవి. అధికారతృష్ణ, ధనవాంఛ, భోగదృష్టి యధికమగుచున్నవి. లక్ష్యశుద్ధి కొరతబడినది. స్వలాభసిద్ధికే మనసు పరుగులుదీయసాగుచున్నది. ధర్మాధర్మ ముల విచక్షణ లోపించినది. దేశముకొఱకు తామనెడి విశాల భావము జాతీయ నాయకులలో నశించి, తమకొఱకు దేశ మనెడి స్వార్థభావము ప్రబలిపోయినది.

తమ పదవుల భద్రత కడ్డువడెడి సర్వశక్తులను గూల
ద్రోయుపన్నాగములు సృష్టించుటయందే పగలు - జేయియు
నాయకుల కవలీలగ గడచిపోవుచున్నది. భగవచ్చింతనకు -
సనాతనధర్మసమారాధనకు సమయమేలభ్యపడనిస్థితి దేశము
నందేర్పడినది. దైవమునుగుఱించి యాలోచించుస్థితి కాంగ్రెసు
ప్రభుత్వమున శూన్యమైనది. దేశభక్తిని, దైవభక్తిని నేత్ర
ముల జంటగ భావించి, మానవసేవలో మాధవసేవా ఫల
మును సాధించి, భువిని దివిగ మార్చి, దాస్యాంధకారమున
స్వాతంత్ర్యజ్యోతులు వెలిగించిన పూర్ణపురుషుఁడగు గాంధీజీ
యెక్కడ ? ఈనాటి మహాత్ముని యనుయాయులనఁబడు
నాయకులెక్కడ ? గాంధీసిద్ధాంతవారసత్వమునకు వీరర్హులా?
వీరు ధరించుటచే, గాంధీటోపీకి నేఁడెట్టి యపప్రథవచ్చినదో
తెలియనగును. పరిహాసవాక్యములు వినఁజాలక, చెవులు
మూసికొనవలసి వచ్చుచున్నది.

ఖద్దరు వస్త్రములను ధరించుట చిరకాలమునుండి
యాచారముగ గలవారుగూడ, నేటిఖద్దరుధారులైన నాయకుల
శ్రేణిలో లెక్కింపఁబడి, యెట్లువమానింపఁ బడుచున్నారో
గమనించిన సిగ్గగును. ప్రతివిషయమునందును కాలుష్యమే.
ప్రతి నాయకమ్మన్యునియందును కుయుక్తి తత్త్వమే. ప్రతి
వ్యవహారమునందును పూర్ణకాపట్యమే. వినిర్మలతకు-సౌజన్య
మునకు సాధుశీలమునకు మారుపేరుగ రాణించిన మహాత్ముని

సమకాలికులై జీవించెడి భాగ్యమబ్బిన వారేనా యిట్లగుట ?
అహహా కాలమహిమ !

భగవంతునిఁగూడ నడ్డువెట్టుకొని, ధర్మముమీద సైతము స్వార్థమును సాధింప వ్యాపారమును సాగించువారు గాంధీతత్త్వసుధను గ్రోలినవారేయనుట వింతలలోవింతగాదా? కించిత్తేని జంకక, దైవమును సైతము వ్యవహారములలో నిరికించి, దైవద్రవ్యముతో సొంత పబ్బములు గడుపుకొన బూను పెద్దలవలన నార్షసంస్కృతికి మేలు సంఘటిల్లునా ? దేశమునకు శ్రేయస్సు సమకూరునా ? సనాతన హైందవమత ధర్మములు సముద్ధరింపఁ బడునా ? పూర్వకాలపు ప్రశాంత సాంఘిక జీవితవైభవము ప్రజానీకమునకు మరలలభ్ధమగునా? కనిన కలలు కలలుగాక, కమనీయాకృతులు దాల్చునా ? మానవసమాజమున నలముకొనిన స్తబ్ధత సమూలముగ నిర్మూలనమై, మరల చైతన్యరేఖలు వెల్లివిరియునా ? పావన భారతీయ మహర్షిగణ సూచితమైన శాస్త్రసంప్రదాయాను గుణ ప్రవృత్తి – సమాజమున మరల సాక్షాత్కరించునా ?

నేతృత్వమునందువచ్చిన వికృతస్థితియే ప్రజలలో నిట్టి నైరాశ్యమునకు కారణభూతమాయెను. కొన్ని రాష్ట్రములలో పగబట్టి, ప్రజలు కాంగ్రెసును పదవులనుండి పతనము గావించిరి. పెక్కు-ప్రాంతములలో-ప్రజల గుండెలలో నభిమానమును కాంగ్రెసు నిల్పుకొనలేకపోయెను.

పాప మింకను పండవలసియున్నది కాబోలు! దైవానుగ్రహమును కాంక్షింపక, దర్పముతో ప్రవర్తించెడి జాతి కేనాటికిని విముక్తిలేదు. కారణములన్నియు గలిసివచ్చిన వెంటనే, కాగల కార్యము గంధర్వులతో నిమిత్తములేకయే కాగలదు.

యుగ ధర్మపరంపర యీ సత్యమునే వేయి నోళ్ళతో చాటుచున్నది. గతచరిత్ర యీ యదార్థమునే బహుభంగుల నిరూపించుచున్నది. ప్రతియుగమున ధర్మబలముక్షీణించుటయు, తత్పరిరక్షణముకొఱకు కొందఱు మహామహు లుద్భవించి, సముద్ధరణము గావించుటయు సర్వసాధారణముగ జరుగుచున్న విషయమే. కలియుగమున నైతమట్టి విపరిణామములను చరిత్ర మనకు వివరించినది. శంకర రామానుజాచార్యాదుల మహా ప్రబోధ ప్రభావములతో జగతి యెట్లుద్ధరింపఁ బడినదియు గమనించినాము. రామకృష్ణపరమహంస, వివేకానందస్వామి, మహాత్మాగాంధీ మున్నగువారి మహత్తర దివ్యసందేశామృత ముతో లోకమేరీతి పునరుజ్జీవింపఁబడినదియు గుర్తించినాము. వారి సందేశస్రవంతులలో – మూలబలము భగవచ్చింతనమే యని గ్రహించితిమి. ఆధ్యాత్మిక శక్తియే యీ లోకమును సర్వవేళల సంరక్షించుకొనుచు వచ్చినట్లు తెలిసికొనఁగల్గితిమి. గాంధీయుగమున నైత మా యాధ్యాత్మికబలమే యండ దండగనుండి, దాస్యభారతమునకు తారకమై, స్వాతంత్ర్యమును ప్రసాదించినట్లవగత మొనరించుకొనఁ గలిగితిమి.

గాంధేయమార్గమునువదలి, స్వీయప్రయోజనములనే ధ్యేయముగ నిడుకొని, కాంగ్రెసు ప్రభుత్వములు గమనమును సాగించుటతో - విపత్కరపరిస్థితులు దేశమున సముత్పన్నము లైనట్లు స్పష్టముగ గ్రహించితిమి. ఇంక జరుగవలసినదేమి ? తిరిగి యే మహోద్భతవ్యక్తియో నేడు సమాజమునం దుదయించి, యీ యనివార్యపరిస్థితులను చక్కదిద్దవలెను. నాడేదేశమున మరల దివ్యదీప్తి సముద్దీప్తము కాగలదు.

బుద్ధునివంటి కారుణ్యదృష్టి - శంకరునివంటి వేదాంత విద్యాప్రాభవము - రామానుజునివంటి ప్రబోధప్రాగల్భ్యము - రామకృష్ణపరమహంసవంటి మహోపాసనాచతురత-వివేకానందునివంటి యాత్మవిశ్వాసపూర్ణమైన వక్తృత్వనైపుణ్యము-గాంధీజీవంటి సహనశక్తియుగల యే పుణ్యమూర్తియో యుద్భవించి, యనంత దివ్యతేజమును లోకమున ప్రసరింపఁ జేయవలయును. నిన్నమొన్నటి యరవింద రమణమహర్షులు జన్మించిన యీ నేలపై, అట్టి యపౌరుషేయ మహత్తర దివ్యవ్యక్తిత్వ సమావిష్కరణమున కాటంక మేమియుండును ?

తప్పక సర్వము సవ్యముగనే జరుగును. కలికలుషహరణ దక్షతగల యాదివ్య వ్యక్తిత్వముయొక్క సంపూర్ణసహకారముననే కృతయుగధర్మము మరల నీగడ్డపై సమారంభముకాగలదు. కలియుగము ముగిసినవెనుక, యుగచక్రపరిభ్రమణమున పునరావృత్తము గావసినదికృతయుగమేగదా! సత్యయుగమును సమాహ్వానించెడి సంధికాలమున మనమీ

విచిత్రముల నన్నిటిని దిలకించుచు, కలియుగమునకు భరతము పాడి, కృతయుగమునకు స్వాగతమాలపించెడి వైతాళికులమై నిల్చుట విశేషవిషయమే. ఆధ్యాత్మిక దివ్యశక్తితో సకల మానవసంక్షేమ సాధనకు పురోగమించు వర్గమునఁజేరగలుగుట యదృష్టమే.

కర్మభూమియైన భారతమునుగాంచి, దేవతలు సైతము మురియుచుందురని మనప్రాచీన గ్రంథములమూలమున విశద మగుచున్నది. సాధుభావసంపత్తికి, ఆతిథ్యనిరతికి, దానధర్మ ములకు, త్యాగప్రేమలకు నిలయముగ భారతభూమి యనంత ఖ్యాతిని బడసినట్లు మనచరిత్ర మనకు సాక్ష్యమిచ్చుచున్నది. జీవిత తరణోపాయముల నుపదేశించి – మహోన్నతాశయ ములవంకకు మానవాళిని యనాదిగ నడుపుచున్న భారతము నకు – పరదేశములన్నియు ఋణపడియున్నవని కోవిదులు విశదీకరించుచున్నారు.

"న కర్మణా న ప్రజయా న ధనేన
త్యాగే నైకే అమృతత్వ మానశుఃశు"

అనెడి దివ్యాదర్శము నటురాటురముగ పాటింపఁగలిగి నది భరతఖండమే యని ప్రపంచమంగీకరించుచున్నది. విశ్వ మానవ జీవిత నిర్దిష్టసరళికి వ్యాఖ్యానములనఁదగిన భగవ ద్దత్తములైన వేదములిచటనే తమ యునికిని, మనికిని సనాతన కాలమునుండి సాగించుచున్నవి. అపూర్వతపశ్శక్తిచే సర్వలోక క్షేమమును సంఘటింపఁజాలిన పరమయోగిశిఖామణు లవసర

మగునపుడెల్ల మహత్తర ప్రబోధసుధతో నీ పుణ్యభూమికి నూతన చైతన్యమును సఘటించుచునేయున్నారు. నీతిశీలము లను పరమసాధనములుగ నిడుకొని, భగవదనుభూతిని బడయు కృషికే సర్వజీవితమును ముడుపుగట్టిన త్యాగధనులు - సేవానిరతులునగు మహనీయులుదయించి, ప్రజాజీవిత భద్రతకు వలయుసౌకర్యముల నమర్చుచునేయున్నారు. విజ్ఞానపరిమళ ములతో శాస్త్రీయ రంగమునందత్యద్భుత ప్రయోజనములు సిద్ధించుచునేయున్నవి. తరుణ సందేశజ్వాలలతో ధరాతలమును సర్వదా జాగరిత మొనరింపగల దివ్యభవ్యగ్రంథ పరంపర సంఘటింపబడుచునే యున్నది. కాని, యేమిచిత్రమో! వినిర్మల శాంతి ప్రభలకు జాతి నోచుకొనలేకపోవుచున్నది. పావనాధ్యాత్మిక కాంతులు జగముపై బ్రసరింపకున్నవి. నిత్య వ్యవహారలీలలోస్థాయిలేదు. సర్వరంగముల కార్యనిర్వహణలో హాయిగన్పట్టకున్నది.

సనాతన ధర్మమువంకకు - పవిత్రతవంకకు-భగవదను భూతి వంకకు-వైదిక సిద్ధాంతసమారాధనమువంకకు-పాశ్చా త్యుల గుండెలను చైతము స్పందింపజేసి, కనువిప్పుగావింప గలిగిన ప్రాక్తన పవిత్రసందేశమువంకకు మానవాళి మనస్సు మ్రొగ్గుటలేదే! సర్వప్రపంచమునకు శాంతిభిక్షను ప్రసాదిం చిన భారతీయ విప్రలాధ్యాత్మిక తత్త్వము ప్రజాజీవిత రంగ మున నెగ్గుటలేదే! అంతర్వేదన లారుటలేదే! అసంతృప్తి లంతరించుటలేదే! అసూయాద్వేషముల యుద్ధతి మొక్క-

ఓపుటలేదే ! వైషమ్యములు – వైరములు– క్రౌర్యములు – కార్పణ్యములు కరగుటలేదే ! మానవోద్ధరణమునకు–విశ్వ శాంతికి రాచబాటలు కనఁబడుటలేదే ! ధనతృష్ణతో స్వార్థ పంకమున మానవుఁడీదుట మానలేదే ! సాంకేతిక విజ్ఞాన శక్తితో మారణయంత్ర నిర్మాణముగావించి, విశ్వమును కలుషిత వాతావరణమున కాశ్రయముగావించు యత్నములు ముగియలేదే ! అమానుషముగ సంచరించిన పాశ్చాత్యుల యంధానుకరణము స్వదేశమున పరిసమాప్తము గాలేదే ! మహనీయులు సమార్జించిన స్వాతంత్ర్యఫల మధురిమల రుచి మనస్సున కెక్కుటలేదే ! అతిథిసేవక గ్రపీఠమిడినచోట నన్నార్తుల కాహారము సమకూరుటలేదే ! మానవుల మధ్య పరస్పర ప్రేమభావము పరిమళించుటలేదే !

ఏమిటీవైచిత్రి? ఎక్కడనున్నదీ కీలకము? చల్లారు మొఱుఁగక, జ్వలించుచున్న యీయశాంతియనెడి యనలముపై దివ్యశీతల వర్షధారలేనాఁడు కురియునో! పట్టినమబ్బులు కురియక, పరుగులెత్తుట కర్థమేమో! బీటలువారిన భారత హృదయము లారామములుగ మారు అదృష్టమే నాటికి కలిసివచ్చునో! ఏయదృశ్యశక్తి యీదేశమునఁగల ప్రశాంత తను భగ్నమొనర్ప పగబట్టినదో! విశ్వవినాశనమునరికట్టి సాహసించిన విపులవేదాంత భావధార – విజయపతాకలు సర్వదా రెపరెపలాడింపకపోవుట కర్థమేమో! జరుగకూడని

యవాంఛనీయ పరిణామములు పరంపరగ తలలె త్తితాండవ మాడుచుండ, నీయుపేక్షాభావమిట్లెంతకాలము కొనసాగునో!

పరిశీలనాదృష్టితో బరికించిన యెడల, నొకసత్యము మాత్రమిన్ని సందిగ్ధాంశములలో నసిందిగ్ధముగఁగన్పట్టుచున్నది. మానవుని నైతిక సంపత్తికి సంబంధించిన యంశమది. నరుల యాధ్యాత్మిక భావపుష్టికి సంబంధించిన విషయమది.

పాలకులలో ధర్మపరత లుప్తమైపోయినది. నయశీలముల పటిమ తగ్గినది. భగవద్విశ్వాసము నశించినది. భోగప్రలోభ మధికమైనది. స్వార్థము పెచ్చుపెరిగినది. త్యాగము దిగ జాఱినది. సేవాదీక్షసమసిపోయినది.

జాతి సర్వరంగములలో భ్రష్టమగుటకీవి చాలవా? ప్రత్యంశమున వైఫల్యమే యెదురగుటకీ యపచారములు చాలవా? సంకల్పములన్నియు వికల్పములగుటకీయనుమానుష ప్రవృత్తి శక్తులు చాలవా ?

కావుననే, స్వయంకృషితో స్వారాజ్యమును సాధించు కొనఁజాలిన జాతి – సర్వవిధముల స్వాభిమతమును పండించు కొనుటలో పరాజయమునే యెదుర్కొనవలసి వచ్చినది. తత్పరిణామముల పరిపక్వదశకే నేఁడు సర్వభారతముగురియై, సత్యమతమగుచున్నది.

గగనమంతయెత్తున పెరిగిన దురాశ – పేరుకొని, గడ్డ కట్టి, ఘనీభవించిన కాలుష్యము–సరసతకు దూరమైన దురుసు తనము – పాశవికమైన యధికారదాహము – వర్ణనల కందని

వంచనా తత్త్వము నేడు భారతమున స్వైరవిహారము గావించుచున్నవి. మానవుని మనుగడకిక భద్రత యెట్లు లభ్ధమగును ? విచక్షణతో - దక్షతతో యోచించెడి శక్తి నశించినది. ఊహకందినదెల్ల నుత్తమ విధానమనియెంచి, యోగ్యుల యుపదేశములతో నిమిత్తములేని యుద్ధతిని ప్రదర్శించువారు- ప్రశాంత వాతావరణమున జనగణక్షేమము నెట్లు కాంక్షింపగలరు ? వారి కది యెట్లు సిద్ధించును ?

నేటి మానవుని బుద్ధి వికాసమచిరకాలమునన్నే, భూలోక నివాసయోగ్యముగాని దానినిగ సలుపగలదని విజ్ఞులనేకులు హెచ్చరించుచున్నారు. పట్టణములలో ముసరుకొనిన ప్రజాసమూహము - తిండిబోతుతనము - ధనతృష్ణ - సాంకేతిక విజ్ఞాన శక్తుల దుర్వినియోగస్థితి - భోగలాలసత - స్వార్థ చింతన తప్పక కొలదికాలమునకే విశ్వమును విలయదశకు గొనిపోవగలదనెడి నానాదేశముల సంస్థను నడపుచున్న యుథాంట్ మహాశయునివంటి విజ్ఞుల హెచ్చరిక - అక్షరాక్షరము సత్యమనుకొనవలయును.

పల్లెలనుండి పట్టణములకు ప్రజ లెగబడుట శోచనీయము. పల్లెలను నమ్ముకొనియుండువారికి వ్యవసాయవృత్తి యాశాజనక ఫలితముల నొసంగజాలనిదిగ మారుట విచారణీయము. పెద్దల దృష్టులు పల్లెల స్థాయిలో-బాధలను, వ్యధలను భరించుచున్నవారి వంకకు మరల్పబడకుండుట చింతింపదగిన విషయము.

సాంకేతిక విజ్ఞానము ప్రకృతిపై విజయమును గడించుటకు పరిమితముగాక, ప్రపంచప్రళయము నుద్దేశించి పరివర్ధమానమగుట యసురత్వమనిపించుకొనదా ? ఇట్టి వికృత పరిస్థితులుప్పతిల్లని తెఱగున నేఁడు శ్రద్ధ బూననిచో – ప్రపంచ మనతికాలముననే ప్రళయాగ్నిజ్వాలలో భస్మము కాఁగలదు. దీని నరికట్టఁగల దివ్యౌషధము, సంక్షోభావమునుగూర్చు పరమ రసాయనము, సాధుత్వమును, ప్రేమను పాదుకొల్పఁగల చైతన్యశక్తి – పరంపరాగతమైన యాధ్యాత్మిక చింతన వలననే జాతికి లభ్యమగును. అట్టి యాధ్యాత్మికశక్తినే చేబట్టి, గ్రామముల నుద్ధరింపుఁడని గాంధీమహాత్ముఁడుద్బోధించెను. మానవసేవలో–మాధవసేవగలదని వక్కాణించెను. ఈ యాధ్యాత్మిక శక్తి – ఈ గ్రామక్షేమము గాంధీజీయను యాయులమని చాటుకొనుపాలకులచే నిర్లక్ష్య మొనర్పఁబడుటయే నేటి కల్లోలమునకు మూలకారణము.

పరమపావనమైన భగవదనుభూతిని బడయు ప్రయత్నము ముదాత్తస్థాయిలో నేఁడు సమారంభము కావలసియున్నది. పల్లెప్రజల జీవన లీలకు భద్రతను ఘటించి, తన్మూలమున దేశకళ్యాణమునకు దీటుబూనవలసిన మహోద్యమము నేఁడు పునఃప్రారంభమైనగాని, యీ యశాంతి యంతముగాదు.

యుగయుగములుగ విశ్వమున కందింపఁబడుచున్న వైదిక – సనాతన ధర్మ సందేశమిదియే. తరతరములుగ – మహర్షులద్వారా, మహాప్రవక్తలద్వారా, మహాత్ములద్వారా

మనమాతృభూమి మనకు ప్రసాదించుచున్న ప్రశాంతజీవిత వైశిష్ట్యమిద్దియే. ఈ విశేషవిషయమును భారతదేశమెంత శీఘ్రముగ పునశ్చింతన సలుపఁగలిగిన నంతమేలు. విశ్వవినాశ మంతత్వరితముగ నివారింపఁబడును. దీనికి నేటిభారతీయులే దీక్షవహింపవలసియున్నది. నడుముగట్టి గట్టికృషినిసాగింపవలసి యున్నది.

ప్రతివ్యక్తియు - పరమపావనమైన యార్యావర్త సందేశహరుఁడుగ నిలువవలయును. సనాతనధర్మ శంఖారావ మును ప్రతిధ్వనింపజేయవలయును. భారతీయ పురావైభవ ప్రాభవములనుపునరుద్దీప్తముగావించి, పునర్నవ తేజోవిలసితము గావింపవలయును.

ఓ ఆర్యావర్తమా! నీవు దివ్యమాతవు. నీసనాతనధర్మ సందేశ స్రవంతి నేఁడు వెల్లువలై, లోకమును ముంచినగాని యీ అరాజక పరిస్థితులంతరింపవు. ఆధ్యాత్మికశక్తిని విశ్వ వ్యాప్తమొనర్చెడి యాత్మబలమును సమగ్రముగ మాకనుగ్ర హింపుము! నిశ్చలభక్తితో నిర్భయులమై నిలిచి, యాదర్శ సిద్ధికి సర్వస్వము వెచ్చించి, సత్ఫలములను గడించునట్లు మమ్మాశీర్వదింపుము!!

భారతీయ సోదరుడా! లెమ్ము! నిదురనదలుము. కరాళ కర్కశ కాలమహిమకు గట్టువడియున్న యీజాతి నుద్ధరించి, పావనధర్మసంస్కృతీ సంపన్నమొనర్చుట కుద్యుక్తుడవుగమ్ము. నిన్ను నీవే రక్షించుకొమ్ము. నినొ్నరులు రక్షింతురని నమ్మి

మోసపోకుము. ధీరునివలె దివ్యుడవై నిలువుము. పరమధర్మ సూత్రములను పరమప్రమాణములుగ భావించి, భక్తిశ్రద్ధలతో ననుసరింపుము. ప్రలోభములకు జిక్కక, పాశవికశక్తికి మ్రొక్కక, పవిత్రమైన యాత్మబలముతో నిన్ను నీవుద్ధరించుకొని, యితరుల నుద్ధరించుటకు జతనములు సాగింపుము. ప్రళయంకర పరిస్థితులను సృష్టించిన స్వార్థభూయిష్ఠ వైఖరి కేనాటికేని విజయము లభింపజాలదు. మానవజీవిత సఫలతకు భగవచ్చింతనయే రాచబాట. ఈమార్గమును దప్పినవా-రే-యే-యుగములనెక్కొట్లు పతనదశకు గురియయిరో పరిశీలింపుము. వారి నావిషవలయమునుండి రక్షింప-ఫాలాక్షున కేని సాధ్యము కాదని యెఱుంగుము!

సత్యవిస్ఫూర్తియే జయించును. త్యాగసౌశీల్యములే నెగ్గును. పరహితకాములకే గౌరవప్రతిపత్తి లభించును. వారే జాతికి జీవనజ్యోతులు. వారిసూచనలే సర్వకలుష విమోచన సాధనములు. వారిసిద్ధాంతములే జాతిక్షేమమునకు జీవగఱ్ఱలు.

అట్టివారునేఁడత్యవసరము. కనఁబడుచున్న కాలమేఘచ్ఛాయలు కరగిపోవకతప్పదు.

దుష్టభావనల వేడిగాలుల సంచలనము సమసిపోవు సమయమాసన్నమైనది. పిశాచనృత్యమునకు భరతవాక్యము పలుకఁబడుచున్నది. భగవద్గుణగానమునకు నాందీగీత మారం

భము గానున్నది. వాడిన కొమ్మలపై మరల పచ్చదనము ప్రభవింపనున్నది. మ్రోడులు మఱల చిగుర్ప నుంకించు చున్నవి.

దురాశా హతమానసులందఱు దూరదూరముగ తొలగిపోవలసినదే. ప్రసిద్ధ భారతీయ ధర్మప్రబోధకుల విశ్వం ఖల వీరవిహారమారంభము గావలసినదే. చిగురుటాకులు కళ కళ లాడుచున్నవి. మొగ్గలు దొడుగుచున్నవి. చూచుచుండ గనే యవి విచ్చుచున్నవి. కాయలుగ మారక తప్పదు. మధురఫలములు నీపరముగాక తప్పదు.

కలియుగమున మూడు కాళ్లులేని ధర్మదేవత_యెంతో కాలమిఁక నిలువఁజాలదు. సంపూర్ణ దివ్యతేజోభరితమై, దర్శనమాత్రమున సర్వజనహృదయాహ్లాదమును సంఘటింపఁ జాలిన ప్రాక్తన సత్యయుగ ప్రారంభమునకు సన్నాహము లన్నియు సంసిద్ధము కానున్నవి. కృతయుగమున ధర్మదేవత మరల నాలుగుపాదములతో నవతేజమును వెల్లివిరియింపఁ గలదు. నీవామహోజ్జ్వల మహోత్సవ సందర్శనానంద భాగ్యమునందగలవు.

భారతీయుల భాగ్య మొక కల్పవృక్షము. దాని కెన్న డును వేడిమి సోకదు. ఆకులు రాలవచ్చును. కొమ్మలు విరుగ వచ్చును. రెమ్మలు కూలవచ్చును. సమున్నతమైన యీ కల్ప వృక్ష నిత్యనూతన చైతన్యము నెవ్వరు నిరోధింపఁగలరు ?

సనాతన సంస్కృతీ సమారాధనతో, స్తవనీయ సద్భావముతో, మతాధిపతులు, రాజకీయనాయకులు సంచరింపనిచో - పరిణామములు ప్రళయదశకే పరివర్తింప గలవు. ఆ రీతిగ జరుగకుండునట్లు, మతాధిపతులకు, దేశనాయకులకు భగవంతుడు సద్బుద్ధిని ప్రసాదించునుగాక ! జాతి గౌరవము - దేశసౌభాగ్యము వర్ధిల్లునుగాక !! భారతక్ష్మాతలమున, నవ్య, దివ్య, భవ్య జీవన విధానము సుస్థిరముగ పాదుకొనునుగాక !!! ప్రశాంతికి నిలయమై, ప్రసన్నతల కాలయమై-పరమ పావన భావనలతో భారతము మరల కళకళలాడునుగాక !!!! ఈ సందర్భమున సనాతన ధర్మతేజోమూర్తియైన గాంధీమహాత్ముని వంటి మహర్షిపుంగవుడే మరల కరావలంబనము నొసంగి దేశమును కాపాడుగాక !

కృతయుగ పునరవతరణ శుభావసరము సన్నిహితమైనయీ తరుణమున మరల నిట్టి దివ్యమూర్తి, సత్యతేజస్వి, సనాతనధర్మదీక్షితుడు, కర్మయోగిఅయిన మహర్షికులతిలకుడు సాక్షాత్కరించి సముద్ధరింపగలడను పూర్ణవిశ్వాసము మాకున్నది. సంకల్పము సమీచీనదశయందున్న సందర్శనభాగ్యము సంలబ్ధము గాకుండునా ! ఆదెస ముసరుకొనుచున్న దివ్యదీప్తి పంక్తిని తిలకింపుడు ? పావనతరుణభారత మాని గణస్వచ్ఛంద కళామయ సాంస్కృతిక తేజోలహరిలో దేలియాడి పులకింపుడు ! ప్రక్కనున్న యీ దివ్యతేజస్వి యెవ్వరో దర్శింపుడు ! !

నిరంతరము సేవాజలధారలతో భారతీయ భాగ్య కల్పతరువును కళకళలాడించు ఋషిసత్తముఁడవా? మహాను భావా! నమస్కారములు. మహర్షీ! నీ యచంచల దీక్షయే మాజాతి యభ్యుదయమునకు పట్టుగొమ్మ. నీవు కొండంత యండగనుండ, మాజాతికేమికొదువ? యుగయుగాంతరముల నుండి భారతీయ కుటుంబమునకు మూలపురుషుడవై, సనా తనధర్మాలతను వాడనీయం, ప్రబోధసుమపరిమళములను వెల్లి విరి ఱించిననీకు భారతజాతి శాశ్వతముగ ఋణపడియున్న దయ్యా! మహాతపస్వీ! నీవు మూలపురుషుఁడవై నిలుచుటవల ననే – నీవినిర్మల తపశ్శక్తి మూలముననే – నీసమాధిగ్రస్త యోగదీక్షా బలముననే విశ్వమున భారతీయతకు ప్రథమ తాంబూలమబ్బినది. నీపర్యవేక్షణవలననే మాజీవిత సరళి నిత్యనూతన వికాసమునంది, నిలువఁగలిగినది. నీవులేనిభారత ధర్మమునకు విలువలేదు. నీప్రసక్తిలేని జాతీయ జీవితమున కరములేదు.

సమయము వచ్చినపుడెల్ల – సముజ్జ్వల శక్తితో విక్రమించి, నీవంశమును రక్షించుకొనుచున్న మహర్షీ! నేఁడు వాడబడియున్న భారతీయ భాగ్యకల్పతరువును ప్రసిద్ధ ప్రతిభా జలధారలతో నభిషేకించి, ప్రజ్వలితము గావించి, ఫలవంత మొసర్చి, భారతీయతను మరల కళకళలాడింపఁ గంకణము గట్టుకొన్నావా ?

శుభం భూయాత్ ! విజయీభవ !! నీ యడుగులలో నడుగులువైచి నడచి, విశ్వమే విస్తుపోవువిధమున మహోజ్జ్వల కృతయుగవైభవమునకు మరల భారతీయుడే స్వాగతము నాలపించునుగాక!

నీ యపూర్వ సందేశ సుధారస ధారలతో - సకల భారతము మరల నిష్కలుషమై, నిరుపమానమై, నిగమధర్మ నిలయమై వెలుగునీనుగాక !!

భారతమహోజ్జ్వల సనాతన వేదధర్మపతాక - గగన సీమల ననంత కాంతిపుంజములతో చిరస్థాయిగ ప్రదీపించును గాక !!!

తథాస్తు

ఓమ్ శాంతిః శాంతిః శాంతిః.



భారతీ ప్రెస్. తెనాలి.

B1

STUDENTS LITARARY ASSOCIATION,
No. 116
LIBRARY

ప్రతులకు:

కల్లూరి చంద్రమౌళి

చంద్రమౌళినగర్

గుంటూరు - 2